సెప్టెంబరు 2015

శ్రావణం-భాద్రపదం | శాలివాహన శకం 1937 ₹ 5

ఆంధ్రప్రదేశ్



సాయం చేయండి

ఆంధ్రప్రదేశ్‌ని అన్ని విధాలా ఆదుకోవాలని ప్రధాని నరేంద్రమోడిపై ఒత్తిడి తెచ్చిన ముఖ్యమంత్రి



టాటా గ్రూపు ఎమిరిటస్ చైర్మన్ రతన్ టాటా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో కలిసి విజయవాడలో ఒక రోజంతా గడిపారు. టాటా ట్రస్టుల తరఫున విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గ అభివృద్ధికి ఒప్పందం సందర్భంగా రతన్ టాటా విజయవాడ వచ్చారు. కొత్త రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌కి అన్ని విధాలా అండగా ఉంటానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. నవ్యాంధ్ర అభివృద్ధికి వ్యక్తిగతంగా కూడా తాను చేయగలిగినదంతా చేస్తానని ఆయన తెలిపారు. రాష్ట్రాభివృద్ధి కోసం చంద్రబాబు పడుతున్న తపన తనకు ప్రేరణ కలిగిస్తోందని రతన్ టాటా అభినందించారు.

ఈ సంచికలో...

16 ఆంధ్రను ఆదుకోండి ప్రధానిని కోరిన చంద్రబాబు



42 రాష్ట్రాభివృద్ధికి రతన్ టాటా చేయూత



22 మార్కెట్‌లోకి మేడిన్ ఆంధ్రా ఫోన్





12 ముఖ్యమంత్రి పంద్రాగష్టు పిలుపు

ఆంధ్రప్రదేశ్

తెలుగు, ఇంగ్లీషు భాషల్లో ప్రచురితం

సంపుటి 59 | సంచిక 2

శాలివాహన శకం 1937 | శ్రావణం-భాద్రపదం

పబ్లిషర్ ఇంచార్జి కమిషనర్
ముకేష్ కుమార్ మీనా, ఐఏఎస్

ప్రధాన సంపాదకుడు
కందుల రమేష్

సంపాదకుడు
నున్నా నరేష్

సహ సంపాదకులు
నీరుకొండ ప్రసాద్
జాస్తి గోపాల ప్రసాద్
డబ్బీరు రామకృష్ణ పట్నాయక్

ముఖచిత్రం
ప్రధానితో సిఎం చంద్రబాబు నాయుడు

రెండవ కవర్
రతన్ టాటాతో ముఖ్యమంత్రి

మూడవ కవర్
ముఖ్యమంత్రి కార్యక్రమాల చిత్రమాలిక

నాల్గవ కవర్
'చంద్రన్న విజయాలు' ప్రకటన

ప్రచురణ
సమాచార, పౌరసంబంధాల శాఖ
సమాచార భవన్, ఏ.సి.గార్డ్స్
హైదరాబాద్ - 500 028
ఫోన్: 040 - 23300258

రచయితలు వెలిబుచ్చిన అభిప్రాయాలు
తప్పనిసరిగా ప్రభుత్వానికి చెందినవి
కానక్కరలేదు.

రూపకల్పన
కార్తీక్ బీసు

ముద్రణ
కాక్స్టన్ ఆఫ్‌సెట్ ప్రైవేట్ లిమిటెడ్
హైదరాబాద్

www.andhrapradeshmagazine.org
Email: apchiefeditor@gmail.com
www.ipr.ap.nic.in



అభివృద్ధికి అడ్డుతగలవద్దు...

ఆంధ్రప్రదేశ్ కష్టాల్లో ఉంది. ఈ రాష్ట్రానికి ఒక రాజధాని కావాలి. అది అభివృద్ధికి ఆలంబన కావాలి. దాంతోపాటు, కేంద్రం సాయం చేయాలి.. ఇందుకోసం, ప్రత్యేకహోదా ద్వారానో మరొక రూపంలోనో అండగా నిలబడేందుకు ఢిల్లీ ముందుకు రావాలి. ఈ రెంటితో పాటు రాష్ట్రం తన కాళ్లమీద తాను నిలబడాలంటే పెద్ద ఎత్తున పెట్టుబడులు రావాలి. తద్వారా ఉపాధి అవకాశాలు పెరగాలి. ఈ అవగాహనతో ముఖ్యమంత్రి అహోరాత్రాలూ కష్టపడుతున్నారు. కళ్లముందు ఈ వాస్తవం కనబడుతున్నా, భూసేకరణ అంశంలో, ప్రత్యేకహోదా విషయంలో రాజకీయ ప్రయోజనాలే పరమార్థం అన్నట్టు కొందరి ప్రవర్తన ఉంటోంది. ఈ రాష్ట్రం ఏమైనా ఫరవాలేదు, మా పార్టీల స్వార్థమే మాకు ముఖ్యం అన్నట్టు ఇవాళ వాతావరణం కలుషితం అయింది.

అమరావతి నిర్మాణానికి 30 వేల ఎకరాలకు పైగా భూమిని రైతులు అప్పజెప్పారు. మరో 2 వేల ఎకరాలను సేకరించాల్సి ఉంది. మిగిలిన ఈ కొద్ది మంది రైతులనీ ఒప్పించి, భూసేకరణ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో యత్నిస్తోంది. అయినా, దింపుడుకళ్లెం ఆశలు చావవన్నట్టుగా, ఇప్పటికైనా ఈ అంశాన్ని ఏదోవిధంగా జటిలం చేయాలని, రాజధాని స్వప్నం సాకారం కాకూడదని కొన్ని వర్గాలు యధాశక్తి రెచ్చగొడుతున్నాయి. కొద్దిమంది రైతులను అడ్డం పెట్టుకొని, అమరావతికి అడ్డు పడుతున్నాయి. నిజానికి, వీళ్లకు రైతుల మీద ప్రేమ ఇసుమంత కూడా లేదు. ఉంటే, భూములిచ్చిన 90 శాతం మంది రైతులను తమ రాజకీయ క్రీడలో బలి చేయడానికి సిద్ధపడరు. ప్రత్యామ్నాయాలను సూచించకుండా, తాము పట్టిన కుందేలుకి మూడేకాళ్లని మొండివాదనకు దిగరు.

ప్రత్యేక హోదా విషయంలోనూ రాజకీయంగా ఏదో బావుకుందామనే వీళ్ల తపన అంతా. అధికారముండి కూడా ప్రత్యేక హోదాను చట్టబద్ధం చేయనివాళ్లూ, విభజన సమయంలో ఆ ప్రసక్తే పట్టని వాళ్లూ ఇప్పుడు ప్రభుత్వాన్ని తప్పుబట్టడానికి తయారుకావడం చోద్యం. ఇంకా విచిత్రమేమంటంటే, ప్రత్యేక హోదా విషయంలో కేంద్రం మీద ఒత్తిడి తీసుకురావడానికి బదులు, కేంద్రంతో తంపులు పెట్టాలని తెగ ఆరాటపడిపోవడం మరో దురదృష్టకర ధోరణి. ప్రభుత్వ నిర్ణయాల మంచిచెడ్డలను విమర్శించడం వేరు, ఒక రాష్ట్ర భవిష్యత్తుకు తూట్లు పొడవటం వేరు. ఈ సున్నితమైన, గంభీరమైన తేడాని గమనించకుండా, ఇప్పుడిప్పుడే ప్రగతిపథంలోకి మళ్లుతున్న రాష్ట్రాన్ని అధోగతి పాల్జేయాలన్న యత్నాన్ని పౌరసమాజం ఖండించాల్సిన సమయం ఆసన్నమైంది.

కందుల రమేష్
చీఫ్ ఎడిటర్

సముద్ర ఉత్పత్తుల ఎగుమతులు

నవ్యాంధ్ర తీరంలో జర్మన్ కెరటం

రూ.1300 కోట్లు పెట్టుబడికి లిండే గ్రూప్ ఆసక్తి



సుదీర్ఘమైన ఆంధ్రప్రదేశ్ సముద్రతీరం బంగారుగుడ్లు పెట్టే బాతు అని గ్రహించిన లిండే గ్రూప్ సముద్ర ఆహార ఉత్పత్తుల శీతలీకరణ విభాగంలో ఇక్కడ రూ.1300 కోట్లు (200 మిలియన్ డాలర్ల) పెట్టుబడి పెట్టడానికి ఆసక్తి చూపింది. దానితో పాటు, ఆహారశుద్ధి, గ్యాస్, పెట్రోకెమికల్ రంగాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి జర్మనీకి చెందిన ఆ సంస్థ ముందుకొచ్చింది. ఆ మేరకు, లిండే గ్రూప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) డా. ఉల్ఫ్ గ్యాంగ్ బుషెల్ నేతృత్వంలో లంబా గ్రూప్ కార్యనిర్వాహకమండలి సభ్యుడు సంజీవ్ లంబా, లిండే గ్యాసెస్ డివిజన్ దక్షిణాసియా అధిపతి మోలె బెనర్జీ, మార్కెటింగ్ వైస్‌ప్రెసిడెంట్ వినాయక్ కెంబానిలు ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని కలిశారు.

ఆహార ఉత్పత్తుల క్రియోజెనిక్ ఫ్రీజింగ్‌లో, అంతర్జాతీయ గ్యాస్ మార్కెట్‌లో, ఓలిఫిన్ ప్లాంట్లు, నేచురల్ గ్యాస్ ప్లాంట్లు, ఎయిర్ సెపరేషన్ ప్లాంట్లు, హైడ్రోజన్ మరియు సింథసిస్ ప్లాంట్లకు కావలసిన ఇంజనీరింగ్ నైపుణ్యంలో తమ సంస్థకున్న అనుభవం గురించి ముఖ్యమంత్రికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు డా. ఉల్ఫ్ గ్యాంగ్. ఇప్పటికే గుజరాత్‌ని తమ కార్యక్షేత్రం చేసుకున్న లిండే గ్రూప్ ఉన్నతాధికారి ఉల్ఫ్ గ్యాంగ్‌కు ఆంధ్రా తీరం మీద ఉన్న విశేష అవగాహనకి చంద్రబాబు ఆనందిస్తే, రాష్ట్రాన్ని ఆగ్నేయాసియాకు లాజిస్టిక్ హబ్ గా మార్చేందుకు చంద్రబాబు చేస్తున్న అవిశ్రాంత కృషికి లిండే ప్రతినిధులు ఆశ్చర్యపోయారు.


శీతలీకరణతో అదనపు విలువ

దేశంలో చేపల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉంది. ఇతర సముద్ర ఆహారపు ఉత్పత్తిలో కూడా ముందంజలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌తో కలిసి పనిచేయాలని ఆ సంస్థ నిర్ణయించడం విశేషం. సముద్ర ఆహార ఉత్పత్తుల్ని శీతలీకరించి, అదనపు విలువను జోడించి ఎగుమతి చేసేందుకు అవసరమైన మద్దతు ఇచ్చి, 200 మిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టడానికి లిండే ముందుకొచ్చింది. ఈ సందర్భంగా సంజీవ్ లంబా మాట్లాడుతూ పెట్రోలియం, రసాయనాలు, పెట్రో కెమికల్స్ (పీసీపీఐఆర్) లో, ఆటో కాంపోనెంట్స్ లో కూడా పెట్టుబడులు పెట్టాలనే ఆసక్తితో ఉన్నామన్నారు. ఆహారశుద్ధి పరిశ్రమలకు కావల్సిన నిపుణులకు శిక్షణ ఇచ్చేందుకు ఎయిర్ సర్కులేషన్ ప్లాంట్, ప్రయోగశాల, అకాడమీ నెలకొల్పేందుకు ముందుకొచ్చారు. వీరి ప్రతిపాదనలను ముఖ్యమంత్రి చంద్రబాబు స్వాగతించారు.

నవ్యాంధ్ర పురోగతిలో భాగస్వాములు కావడానికి వారు చూపుతున్న ఆసక్తికి ముగ్ధులైన ముఖ్యమంత్రి మాట్లాడుతూ, వ్యవసాయం, అనుబంధరంగాలలో వ్యాపార అవకాశాలను అధ్యయనం చేయాలని ఆ బృందానికి సూచించారు. సముద్ర ఉత్పత్తుల నిల్వ, శీతలీకరణతో పాటు, పండ్ల నిల్వ, శీతలీకరణ గురించి దశలవారీగా పనులు ప్రారంభించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాలలో 13 ఫుడ్ పార్క్ లను నెలకొల్పుతున్నామని, వాటి ఏర్పాటులో కలిసి పని చేద్దామన్నారు. మత్స్యపరిశ్రమ అభివృద్ధి సంస్థతో కలిసి ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించి 4 నెలలలో అందజేయాలన్నారు.

ఈ సమావేశంలో సీఎంఓ ముఖ్యకార్యదర్శి సతీష్‌చంద్ర, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి పీవీ రమేష్, మౌలికవసతులశాఖ కార్యదర్శి అజయ్‌జైన్, వెంకయ్య చౌదరి పాల్గొన్నారు.

❖



పొరబడిన సన్నిధానం వారు

ఆంధ్రప్రదేశ్ జూలై సంచికలో "ఇచ్చట పుట్టిన చివురుకొమ్మైనచేవ" ....శీర్షికన ప్రచురించిన శ్రీ సన్నిధానం నరసింహశర్మ గారి రచనలో సంపత్ రాఘవాచారిని ప్రస్తావించారు. సంపత్ రాఘవాచారి కర్నాటక రాష్ట్రంలో జన్మించారు. అనంతపురం ప్రభుత్వ కళాశాలలో చదివారు. అక్కడే స్థిరనివాసం ఏర్పర్చుకొని పరమపదించారు. రాజమండ్రి ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ గా పనిచేశారు. అయితే, తెలుగు సామెతల్ని సహజ సిద్ధంగా పద్య బద్ధంగా రచన చేసింది సంపత్ కాదు. అనంతపురం వాస్తవ్యులు వాఙ్మయ తపస్వి కళా ప్రపూర్ణ కీ.శే. డా. చిలుకూరి రామారావు గారిది సామెతల యజ్ఞం.

చిలుకూరి వారు వ్యయ ప్రయాసలకు లోనై అవిశ్రాంత కృషిచేసి 80 వేల సామెతలను సేకరించినవి 114 సంపుటాల్లో (ఒక్కొక్కటి 100 పుటలు) ఉన్నాయి. చిలుకూరి వారి సామెతలు (వచన, పద్య, శ్లోకాల) రూపంలో ఉన్నాయి. హైదరాబాదు వాస్తవ్యులు ప్రముఖ సాహిత్య వేత్త శ్రీ అక్కిరాజు రమాపతి గారు చిలుకూరి నారాయణరావు గారి సామెతలను పరిష్కరించి, ముద్రించి, వెలుగులోకి తేవడానికి పూర్తిగా బాధ్యత వహించడం శుభ పరిణామం. శ్లాఘనీయం విషయం. చిలుకూరి వారి సొంత గ్రంథాలయంలోనున్న తాళపత్ర ప్రతులను, రాగిరేకులను, శిలాశాసనాలను రాజమండ్రిలో ఏర్పడిన ఆంధ్ర చారిత్రక పరిశోధనా సంస్థలో వ్యవస్థాపకాధ్యక్షులుగా వున్న కాలంలో భద్రపరిచారు. చిలుకూరి వారి సేవ అమూల్యమైనది, అరుదైనది.

– అవధాని నాగరాజారావు, అనంతపురం

'దొడ్డమ్మ' గారి పేరు మల్లాజ్యోస్యుల శ్రీరామమూర్తి

గోదావరి మహాపుష్కరాలు సందర్భంగా ఆంధ్రప్రదేశ్ జూలై 15 సంచిక ఉన్నత ప్రమాణాలతో ముచ్చటగా ఉంది.

ఈ సందర్భంలో ఒక చిన్న మాట. రచయిత రాజా మ్యూజికాలజిస్ట్ తమ రచన "గలగల పారుతున్న గోదావరిలో...." వ్యాసంలో 'దొడ్డమ్మ' గారి అసలు పేరు తెలియదని రాశారు.

'దొడ్డమ్మ' గారి అసలు పేరు మల్లాజ్యోస్యుల శ్రీరామమూర్తిగారు. ప్రముఖ హరికథాభాగవతార్. విజయనగరం వాస్తవ్యులు. కవులు, గాయకులు. ఆదిభట్ల నారాయణదాసుగారి అంతేవాసి. ప్రముఖ హరికథాభాగవతారులు, చలనచిత్ర, రంగస్థలనటులు చొప్పల్లి సూర్యనారాయణ గారికి అనుంగుమిత్రులు. ఆరు దశాబ్దాల క్రితం ఆంధ్రదేశంలో "దొడ్డమ్మ" గారు హరికథ చెప్పని గ్రామం కాని, పట్టణం కాని లేదు. ఆశువుగా పాడేపాటలు, కథకు సంబంధిస్తూ చెప్పే హాస్యం కోసం ప్రజలు ఉవ్విళ్ళూరేవారు. ఆయన పాటలు విన్న హెచ్.ఎం.వి వారు ఎన్నో పాటల్ని పాడించి రికార్డు చేశారు. గ్రామఫోను రికార్డుల పాటలాలయం ఉన్న వి.ఏ.కే రంగారావు గారి వద్ద 'దొడ్డమ్మ'గారి పాటలు లభించవచ్చు. విజయనగరం పురపాలక సంఘంలో లార్డ్ వెన్‌లాక్ లైబ్రరీ ప్రబంధకునిగా ఉద్యోగం నిర్వహించారు. విజయనగరానికి కీర్తి అందించిన ప్రముఖులలో ఒకరు.

– ఏ. సీతారామారావు, విజయనగరం

ముద్రారాక్షసాలు! తస్మాత్ జాగ్రత్త!!

జూలై 2015 నెలలో ప్రచురితమైన ఆంధ్రప్రదేశ్ సంచిక ఎంతో అందంగా, మరెంతో విలువైన సమాచారంతో, చాలా చూడముచ్చటగా ఉంది. అయితే ఈ సంచికలో దొర్లిన కొన్ని అచ్చు తప్పులు, పొరపాట్లను మీ దృష్టికి ఈ లేఖ ద్వారా తీసుకోస్తున్నాను. శ్రీ యాదగిరి శ్రీరామ నరసింహరావు వ్రాసిన "ఆరు పుష్కరాల నా అనుభవాలు" అనే వ్యాసంలో పుష్కరాల సందర్భంగా వెన్నలకంటి సుబ్బారావు గారు రాజమహేంద్రవరం దర్శించిన సంవత్సరం 1937 గా అచ్చయింది. నిజంగా అది 1837 అని ఉండాలి. తర్వాత ఈ విషయం క్రిందనే కీ.శే కందుకూరి వీరేశలింగం పంతులు గారి ప్రస్తావనలో ఆయన ఇంటిపేరు 'కందుల' అని వ్రాశారు. బహుశా ఇవి డి.టి.పి లో లోపాలు కావచ్చు కాని కొత్తగా పరిచయమయ్యే పాఠకులకు తప్పు సమాచారం అందించిన వాళ్ళమవుతాం కదా! ఈ విషయం గ్రహించగలరు.

– అవిజ వెంకటేశ్వరరెడ్డి, కర్నూల్

అచ్చుతప్పులకు క్షంతవ్యులం. అవిజ వెంకటేశ్వరరెడ్డి గారికి కృతజ్ఞతలు. ముమ్ముందు ఇవి దొర్లకుండా జాగ్రత్త పడగలమని మనవి

– ప్రధాన సంపాదకుడు

అంశాలన్నీ చక్కగా ఉన్నాయి

జూలైలో ఆంధప్రదేశ్ మాసపత్రికలోని ప్రచురించిన అంశాలన్నీ నాకు బాగా నచ్చాయి. ప్రధానంగా గోదావరి నది, మహా పుష్కరాల చరిత్ర, ప్రాశస్త్యం, నిర్వహణా ఏర్పాట్లపై సమగ్రంగా ఇచ్చిన కథనాలతో పాటు ఫోటోలన్నీ నన్ను ఎంతో ఆకట్టుకున్నాయి. సమాజ వికాసానికి చెందిన మరిన్ని ఆసక్తికరమైన అంశాలను రానున్న పత్రికల్లో ఇవ్వగలిగితే మంచిది.

– నవీనవతి, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లా.

రచయితలకు గమనిక

'ఆంధ్రప్రదేశ్' పత్రికపై అభిమానంతో రచనలను పంపుతున్న రచయితలు రచనతోపాటు తమ బ్యాంకు అకౌంట్ పాస్ బుక్ మొదటి పేజీ ఫోటో కాపీ గానీ, బ్లాంక్ చెక్కు కొట్టేసి పంపితేనే, ప్రచురితమైన రచనలు పారితోషికం ఆయా అకౌంట్ లో జమ చేయడం జరుగుతుందని అకౌంట్స్ అధికారి తెలియజేస్తున్నారు. రచయితలూ, రచయిత్రులు దీని ప్రాధాన్యత గ్రహించి, మాతో సహకరించవలసిందిగా కోరుకుంటున్నాం.

– సంపాదకులు

'ఆంధ్రప్రదేశ్' పత్రికకు చందా ఇలా కట్టాలి

'ఆంధ్రప్రదేశ్' మాసపత్రికకు చందాదారులుగా చేరాలనుకుంటున్న వారు వార్షిక చందా నిమిత్తం 50 రూపాయల మనియార్డరును 'అకౌంట్స్ ఆఫీసర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, హైదరాబాద్' పేరిట పంపాలి. (మీరు డిమాండ్ డ్రాఫ్ట్ (డిడి) తీసుకునేట్లయితే, బ్యాంకు నిబంధనల ప్రకారం రూ. 60 కి డిడి పంపాలి.) తమ పూర్తి చిరునామాను, తాము 'ఆంధ్రప్రదేశ్ ' పత్రికను ఏ భాషలో కోరుకుంటున్నారో కూడా ఆ మనియార్డరులో రాయాలి. ఆ మనియార్డర్‌ను ఈ క్రింది చిరునామాకు పంపాలి.

అకౌంట్స్ ఆఫీసర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, సమాచార భవన్, ఏ.సి.గార్డ్స్, మాసాబ్ ట్యాంక్, హైదరాబాద్ – 500 028.

చందాదారులు తమ చిరునామా మార్పు, కాపీలు అందకపోవడం గురించి ఈ ఫోన్ నెంబరుకు కాల్ చేసి వివరాలు కనుక్కోవచ్చు 040 23399048 ఎక్స్‌టెన్షన్ 123

ఆంధ్రప్రదేశ్ పత్రికను పాఠకులు ఇంటర్నెట్‌లో
www.andhrapradeshmagazine.org
లో కూడా చదువుకోవచ్చు.

శ్రీ ఎన్ వి రమణారెడ్డికి వీడ్కోలు



ఆంధ్రప్రదేశ్ సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనర్‌గా శ్రీ ఎన్ వి రమణారెడ్డి పదవీబాధ్యతలు నుంచి వైదొలగారు. దాదాపు పది సంవత్సరాలకు పైగా రాష్ట్ర ప్రభుత్వంలో కీలక పదవులు నిర్వహించిన శ్రీ రమణారెడ్డి తమ సొంత శాఖ అయిన భారతీయ రైల్వేకు తిరిగి వెళ్లారు. విధి నిర్వహణలో నిగర్వి్గా, మృదు స్వభావిగా పేరుపొందిన శ్రీ రమణారెడ్డి కొత్త బాధ్యతలను కూడా విజయవంతంగా నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ పత్రిక అభిలషిస్తోంది. సమాచార పౌర సంబంధాల శాఖ ఇంచార్జి కమిషనర్‌గా శ్రీ ముకేష్ కుమార్ మీనా బాధ్యతలు స్వీకరించారు.

హేట్సాఫ్ టు చంద్రబాబు!

2014 సార్వత్రిక ఎన్నికలలో రాష్ట్ర విభజన పాపాన్ని చంద్రబాబునాయుడు గారిపై నెట్టే కుటిలయత్నం జరిగింది! అయినా, సవాలక్ష సమస్యలతో, రాజధాని లేకుండా ఏర్పడనున్న అవశేషాంధ్రప్రదేశ్, రాబోతున్న గోదావరి, కృష్ణానదీ పుష్కరాలు.... ఇవన్నింటిని దృష్టిలో ఉంచుకొని...సమర్ధ నాయకత్వం, కార్యదక్షత గల వారు ముఖ్యమంత్రిగా ఉండాలని భావించి నారా చంద్రబాబు నాయుడుని అఖండ మెజార్టీలో నిలిపారు ప్రజలు. దాని ఫలితాలు ఇప్పుడిప్పుడే అనుభవంలోకి వస్తున్నాయి.

ఆంధ్రప్రదేశ్ ఆగస్టు సంచిక విషయానికొస్తే, 'పుష్కర గోదారి సందర్శనం మా పాలిట మహాయోగం' అంటూ ఓ సామాన్య భక్తుడి అనుభవం చాలా బాగుంది. కాని అందులో కొన్ని అంశాలు ఇంకా ఉండాల్సి ఉంది. తొలిరోజు దుర్ఘటనలో సి.ఎం చంద్రబాబు...ఆందోళన, బాధను చాలా దగ్గరలో ప్రభుత్వ ఆసుపత్రి వద్ద స్వయంగా చూసిన నాలాంటి వాళ్లు చలించిపోయారు. అప్పటి నుండి 26 జూలై వరకు ఆయనకు కంటిపై కునుకులేదు. సమయానికి తిండిలేదన్నట్లు అహర్నిశలూ ప్రజల్లో మమేకం అయ్యారు. దేశ చరిత్రలో ఎన్నడూలేని విధంగా ఓ సి.ఎం కంట్రోల్ రూంలో ప్రతీ రోజు భక్తుల రద్దీని పరిశీలించి అప్రమత్తం చేసిన సందర్భం అపూర్వం. పుష్కరాల్లో సమస్యల్ని, పరిస్థితుల్ని నేరుగా సి.ఎం.కి పంపిన ఎన్నో సేవా సంస్థల సూచనల్ని పరిష్కరించే సందర్భాలు అనేకం. అదే విధంగా నూతన రాజధాని అమరావతిని ప్రపంచ ప్రఖ్యాతిగా నిలపాలని పనిచేస్తున్న తీరు ప్రశంసనీయం. 'నాయకత్వ పరీక్ష నెగ్గిన ముఖ్యమంత్రి' అంటూ చీఫ్ ఎడిటర్ గారు రాసిన సంపాదకీయం, 'ఎలా మర్చిపోగలం' అంటూ సమాచార కమిషనర్ రాసిన ముందుమాటలు చాలా బాగున్నాయి. కలాం గురించి చంద్రబాబు సంస్మరణ బాగుంది. మీ భూమి వెబ్ పోర్టల్ వివరాలు సామాన్యులకు సైతం అర్థం అవుతున్నాయి. ఇదిగో ఆంధ్రనగరి, అమరావతి చిత్ర మాలిక చాలా అద్భుతంగా ఉంది. రాజకీయానికి మీడియా ముసుగు, ప్రజాస్వామ్యానికే పెనుముప్పు అంటూ వ్రాసిన కథనం నూటికి నూరుపాళ్లు నిజం. ఆయుర్వేద పండితులు శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి గురించి డా.జి.వి పూర్ణచందు బాగా రాశారు. సర్ ఆర్థర్ కాటన్ గురించి సవివరంగా రాసి నేటి పాఠకులకు తెల్పారు. ఏది ఏమైనా ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక గతంలో కన్నా చాలా బాగుంది. గోదావరి నదీ పుష్కరాల విజయంపై ప్రతిపక్ష పార్టీ కార్యకర్తలు సైతం మెచ్చుకొనే విధంగా సి.ఎం. చంద్రబాబు నాయుడు విజయం సాధించారు.

– టి. సురేష్ కుమార్, సీనియర్ జర్నలిస్ట్, శ్రీకాకుళం.

'అమరావతి' మన అదృష్టం

ప్రజల సంక్షేమమే ధ్యేయంగా, పారదర్శక పాలనకు ప్రాముఖ్యతను ఇచ్చే పాలకులు మన ఆంధ్రప్రదేశ్‌కు ఉండటం గర్వించదగిన విషయం. ఆనాటి రాజులు రాజ్య రాజధానుల అభివృద్ధికి ప్రాముఖ్యతను ఇచ్చినట్లే, అదే వారసత్వంగా "అమరావతి"ని అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దటం తెలుగు ప్రజలు చేసుకున్న అదృష్టం. ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు అభినందనీయులు. ఆగష్టు 2015 ఆంధ్రప్రదేశ్ మాసపత్రికలో కవర్ స్టోరీ ప్రతి పాఠకుడికి ఉత్సాహాన్ని ఇచ్చింది.

– గుగ్గిలం శ్రీహరి – వేటపాలెం

సూచనలు ఆలకిస్తారా?

తెలుగు వారికి ఇంటి పేరు ప్రత్యేకం; ఆభరణం. సంస్కృతీ పరిచయకర్త రచయితలకు తమ ఇంటిపేరు, నామం ముందు అనివార్యంగా పూర్తిగా తెలుగులో ఉండాలి. ఇంగ్లీషు ముక్కలు T.H. అని B.R. అనవద్దు.

ప్రతినెలా ఒక జిల్లా, పట్నం, గ్రామం యొక్క చరిత్ర, విశేషాలు, ఆ జిల్లా మహనీయుల గురించి, జనాభా, పాఠశాలలూ, ఉన్నత విద్యాలయాలు, అక్షరాస్యత, పంటలూ, పరిశ్రమలు, దేవాలయాలు – ఇత్యాదుల గురించి, ఆ జిల్లా ముఖ్యకార్యాలయాలు, అధికారుల చిరునామాలు, టెలిఫోన్ నెంబర్లూ, ఈ–మెయిల్, ప్రచురిస్తే, పాఠకులకూ, ప్రజలకూ ఉపయోగపడుతుంది. ఆ జిల్లాకు సంబంధించిన చారిత్రకాంశాలూ సేకరించి ప్రచురించవచ్చు.

– డా. త్రిపురనేని హనుమాన్ చౌదరి, అధ్యక్షులు – ప్రజ్ఞాభారతి

విలువైన సూచనలు ఇచ్చిన డా త్రిపురనేని హనుమాన్ చౌదరి గారికి కృతజ్ఞతలు.

– ప్రధాన సంపాదకుడు

'ఆంధ్రప్రదేశ్' పత్రిక ఓ ప్రోగ్రెస్ రిపోర్ట్

'ఆంధ్రప్రదేశ్' మాస పత్రిక ప్రతినెల చాలా చక్కగా మమ్మల్ని అలరిస్తునే ఎన్నో విద్యా, వైజ్ఞానిక విషయాలను అందిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ విధివిధానాలతో మన రాష్ట్రం ఏవిధంగా అభివృద్ధి చెందుతుందో ప్రజలకు అందించడంలో ఈ పత్రిక ముందంజలో ఉంటుంది. రాష్ట్ర పురోగాభివృద్ధి గురించి తెలుసుకోవాలనుకున్న ప్రతి ఒక్కరూ ఈ మాసపత్రికను చదివితే సరిపోతుందని నేను భావిస్తున్నాను. అయితే, పత్రిక పాఠకులకు చేరడంలో జరుగుతున్న జాప్యాన్ని తగ్గించవల్సిందిగా మనవి.

– పెయ్యల శ్రీనివాస్, అలికాం

ఎంఆర్‌పి ధరల మోసాలపై ఎక్కుపెట్టండి

'ఆంధ్రప్రదేశ్' పత్రికను కేవలం ప్రభుత్వపు కరపత్రంగా తెస్తారన్న అభిప్రాయాన్ని సమూలంగా తుడిచి పెట్టేసే విధంగా అన్ని వర్గాల ప్రజలకు చేరువ చేయడం సంతోషదాయకం. సాహిత్యానికి పెద్ద పీటవేస్తూ, అలనాటి మేధావుల్నీ, దేశభక్తుల్నీ, త్యాగమూర్తుల్నీ పరిచయం చేస్తూ, పత్రికను బహుముఖంగా తీర్చి దిద్ది పాఠకుల్ని చైత్యనవంతుల్ని చేస్తున్నందుకు నా ధన్యవాదాలు. అయితే, నిత్యావసర వస్తువులు అన్నిటిపైనా నిజమైన గరిష్ట అమ్మకపు ధరలు (ఎంఆర్‌పి) ముద్రించకుండా, దొంగ వ్యాపారులు తమ ఇష్టానుసారంగా అధిక ధరలు ప్రింటు చేసేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ అంశంమీద "ఆంధ్రప్రదేశ్" పత్రిక దృష్టి సారించి ఒక విశ్లేషణాత్మక, పరిశోధనాత్మక కథనాన్ని ప్రచురించవల్సిందిగా విజ్ఞప్తి.

– బి.ఏ నారాయణరావు, విశాఖపట్టణం

'ఆంధ్రప్రదేశ్' సేవలు నిరుపమానం

ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలకు చెందిన సమాచారాన్ని అందించడంలో మీ మాస పత్రిక క్రియాశీలక పాత్ర పోషిస్తున్నందుకు సంతోషం. మీ పత్రిక ద్వారా అనేక ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలు సునాయాసంగా తెలుసుకోగలుగుతున్నారు. నిజానికి పత్రికల కన్నా మీ మాస పత్రిక అందిస్తున్న సేవలు నిరుపమానం.

– వి.జగదీష్ బాబు, మాజీ మున్సిపల్ చైర్మన్, ఏలూరు.

జాతికి 'పట్టిసీమ' అంకితం
ఫలించిన సిఎం సంకల్పబలం



పట్టిసీమ పనులు శరవేగంగా జరుగుతున్న తీరు - ఏరియల్ చిత్రం.

పాపికొండల మధ్య ఒంపుకి గోదారమ్మ సిద్ధమయ్యే ముందు ఓ చిన్న గ్రామం పట్టిసీమ లేదా పట్టిసం! పశ్చిమగోదావరి జిల్లాలోని పోలవరం మండలంలో దేవకూట పర్వతం మీద వెలసిన వీరభద్రస్వామి ఆలయమే ఇంతవరకూ పట్టిసీమ ఉనికికి మూలం. ఇప్పుడు, అదే పట్టిసీమలో హఠాత్తుగా మరో గుడి వెలిసింది. ఇది అలాంటిలాంటి ఆలయం కాదు; అదొక ఆధునిక దేవాలయం; అది – ఏడాది లోపే పూర్తి చేస్తామని ప్రకటించి, ఇది చేతల ప్రభుత్వమని నిరూపించిన ఓ కార్యశూరుడి సంకల్పం; ఎన్నో నిద్ర లేని రాత్రులకూ, గట్టు మీద నిద్రలకూ ప్రత్యక్ష సాక్ష్యం; సమయపాలనతో సాంకేతికతకి సావాసం కుదిరిన సందర్భం; ఇరు ప్రాంతాల ప్రజానీకానికీ ఉభయకుశలోపరిలాంటి ఉమ్మడి సంబరం–

– అదే పట్టిసీమ ఎత్తిపోతల పథకం – ఆధునిక దేవాలయం!

కోస్తా, రాయలసీమ రెండు ప్రాంతాలను సుభిక్షం చేసేందుకు సంకల్పించిన వవ్యాంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, నదుల అనుసంధానమనే ఆదర్శాన్ని ఆచరణలోకి తెచ్చారు, జాతికి ఒక సందేశంగా.

పట్టిసీమ ఎత్తిపోతల సాగునీటిపథకం ద్వారా కృష్ణాడెల్టా, రాయలసీమకు తాగు, సాగునీరందించి తద్వారా గోదావరి–కృష్ణా నదులను అనుసంధానం చేయాలన్న తపనతో ముఖ్యమంత్రి ఈ భగీరథుని అవతారమెత్తారు. నవ్యాంధ్రప్రదేశ్‌లో ప్రతీ ఏటా తీవ్ర స్థాయిలో నెలకొంటున్న దుర్భిక్ష పరిస్థితుల నుంచి రైతన్నలను శాశ్వతంగా విముక్తులను చేసి, మన రాష్ట్రాన్ని కరవు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని చంద్రబాబు ఈ సాహసానికి పూనుకున్నారు.

గోదావరి నీటిని పోలవరం కుడికాలువ ద్వారా బుడమేరు వద్ద కృష్ణా నదిలో కలపగలిగితే గోదావరి–కృష్ణా నదులను అనుసంధానం చేసినట్టే. ఈ లక్ష్యం పరిపూర్ణమైతే...దక్షిణాది రాష్ట్రాలలో నదులను తొలిసారిగా అనుసంధానం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుంది. కేవలం ఏడాది కాలపరిమితిలోనే ఈ ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలని చంద్రబాబు తొలుత సంకల్పించారు. తదనంతరం ప్రాజెక్టు తొలివిడత పనులను కేవలం ఆర్నెల్ల కాలపరిమితిలోనే పూర్తిచేయాలని నిర్దేశించారు.   గత మార్చి 29న పనులు ప్రారంభమయ్యాయి. ఈ ప్రాజెక్టు ద్వారా రాయలసీమకు ముందస్తుగా ఈ ఖరీఫ్ సీజన్‌లోనే కాస్తోకూస్తో సాగు నీరందించేందుకు చంద్రబాబు పరితపిస్తున్నారు.

ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా కొంతమేరకైనా సాగునీరందించాలని



పట్టిసీమ ప్రాజెక్టుపై రాజకీయ లబ్ధి కోసం ఎన్ని కువిమర్శలు చేసినా, ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ఎన్ని ప్రయత్నాలు జరిగినా ముఖ్యమంత్రి చలించలేదు. ఎన్ని అవాంతరాలు, అడ్డంకులు ఎదురైనా, రికార్డు సమయంలో ఈ ప్రాజెక్టును పూర్తి చేసి, రాయలసీమను ఆదుకోవాలని చంద్రబాబు దీక్షబూనారు. ప్రభుత్వ సంకల్పానికి నిదర్శనంగా పట్టిసీమ ప్రాజెక్టు చరిత్రలో నిలిచిపోతుంది.

చంద్రబాబు ప్రతిజ్ఞబూనారు. అయితే పనుల నిర్వహణలో కొన్ని సాంకేతిక పరమైన సమస్యలు ఎదురు కావడంవల్ల అనుకున్న రోజుకు సాగునీరు అందివ్వలేకపోయారు. అయినప్పటికీ ఈ ప్రాజెక్టును ఆగస్టు15నే ముఖ్యమంత్రి చంద్రబాబు, ముందుగా తాను సంకల్పించినట్టుగా పశ్చిమగోదావరి జిల్లా, పోలవరం మండలం, పట్టిసం గ్రామంలో లాంఛనంగా ప్రారంభించి, స్వాతంత్ర్యదినోత్సవ కానుకగా జాతికి అంకితం చేశారు. అరకొరగా మిగిలివున్న పనులను సెప్టెంబర్ మొదటి వారానికి పూర్తిచేసి, సాగునీటిని కాలువల నుంచి విడుదల చేయనున్నారు. ఇది జరిగితే ముఖ్యమంత్రి కల వాస్తవమైనట్టే. కాగా ఈ ప్రాజెక్టు 2016 జూన్ నాటికి పూర్తిస్థాయిలో వినియోగంలోకి వస్తుందని అంచనా.

కుయుక్తులను అధిగమిస్తూ...

పట్టిసీమ ప్రాజెక్టుపై రాజకీయ లబ్ధి కోసం ఎన్ని కువిమర్శలు చేసినా, ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ఎన్ని ప్రయత్నాలు జరిగినా ముఖ్యమంత్రి చలించలేదు. ఎన్ని అవాంతరాలు, అడ్డంకులు ఎదురైనా, రికార్డు సమయంలో ఈ ప్రాజెక్టును పూర్తి చేసి, రాయలసీమను ఆదుకోవాలని చంద్రబాబు దీక్షబూనారు.

శరవేగంతో సాగుతున్న పనులు

ముఖ్యమంత్రి చంద్రబాబు తన స్వీయ పర్యవేక్షణలో పట్టిసీమ పథకం నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టారు. పగలు-రాత్రి వ్యత్యాసం లేకుండా ప్రాజెక్టు పనులు అధునాతన యంత్ర పరిజ్ఞానంతో శరవేగంతో పరుగు పెడుతున్నాయి. దాదాపు మూడొందల ప్రొక్లైన్లు, క్రేన్లు, వేలాది టిప్పర్లు, ట్రాక్టర్లు....200మంది ఇంజినీర్లు, మరో 1200 మంది ఇతర సిబ్బంది, వేలాది మంది కార్మికులతో రోజుకు 20 గంటలకు పైచిలుకు పనిచేస్తున్నారు. ఈ పనులు జరిగే తీరును, కదలికలన్నీ పకడ్బందీగా తిలకించేందుకు వీలుగా సీసీ కెమేరాలను ఏర్పాటు చేశారు. అనునిత్యం సీసీ కెమేరాల ఆధారంగా ముఖ్యమంత్రి హైదరాబాద్ నుంచి కూడ పనులను పర్యవేక్షించారు.

పోలవరం కాలువ పనుల్లో మూడు ప్యాకేజీలకు సంబంధించి కేవలం నెలరోజుల్లోనే సుమారు కోటిన్నర క్యూబిక్ మీటర్ల మట్టిని తవ్వి సాగునీటి కాలువను నిర్మించగలిగారంటే ఈపనులు ఎంత శరవేగంతో చేపడుతున్నారో అర్థం అవుతుంది. పోలవరం భారీసాగునీటి పారుదల ప్రాజెక్టును పూర్తిచేయాలంటే అధికారుల అంచనా ప్రకారం 11 కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టిని తవ్వి తీయాల్సి ఉంది. అదే పట్టిసీమ ఎత్తిపోతల ప్రాజెక్టు విషయంలో కేవలం నెలరోజుల్లోనే కోటిన్నర క్యూబిక్ మీటర్ల మట్టిని తవ్వగలిగారంటే యంత్రాంగం ఎంత కష్టపడుతున్నదో తెలుస్తుంది.

40 మీటర్ల వెడల్పుతో ఐదు నుంచి ఏడు మీటర్ల లోతుతో ఈ కాలువను నిర్మిస్తున్నారు. మొత్తం 55 కిలోమీటర్ల పొడవున పనులు చేపట్టాల్సి ఉండగా, ఇంతవరకు దాదాపు 30 కిలోమీటర్ల మేరకు పూర్తిగా, మరో 12 కిలోమీటర్ల వరకు పాక్షికంగా పనులు జరిగాయి. మిగిలిన పనులకు సంబంధించి గతంలో తవ్వకాలు పూర్తిచేసిన కాలువలతో దీన్ని అనుసంధానం చేస్తున్నారు. ప్రస్తుతం పట్టిసీమ ప్రాజెక్టు వద్ద ప్లాట్‌ఫార్మ్ నిర్మాణం పనులు పూర్తయ్యాయి. మోటార్లు, పంపులు బిగించాక, అక్కడ పక్కా భవనం నిర్మాణం చేపడతారు. ఏకకాలంలో 24 పైపులైన్లతో ఒక్కొక్క పంపు 354 క్యూసెక్కుల సామర్థ్యంతో నీటిని తోడగలుగుతుంది. అయితే తొలిదశలో 240క్యూసెక్కుల నీటిని మళ్లించనున్నారు. 16 కి.మీ పొడవున పైపులైను వేయాల్సి ఉండగా 12 కి.మీ పూర్తి చేశారు. మిగతా 4 కి.మీ దూరంలో పనులు సెప్టెంబరు 10 నాటికి పూర్తిచేయాల్సి ఉంది. ఇందులో 8 పైపులైన్ల ద్వారా తొలిదశగా నీరు సరఫరా చేయడానికి చర్యలు చేపడుతున్నారు. కృష్ణాలో గోదావరి నీటిని కలుపుతారు. తత్ఫలితంగా శ్రీశైలం ప్రాజెక్టు నుంచి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా రాయలసీమకు సాగునీరందిస్తారు.

రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అనుదినం ఈపనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, పట్టిసీమ పనులన్నీ అనుకున్న సమయానికి పరిపూర్ణం చేయించడంలో ప్రధానభూమిక వహిస్తున్నారు.

'పట్టిసీమ' ప్రాజెక్టు లక్ష్యాలు

-గోదావరి నది నుంచి సముద్రంలోకి వృథాగా పోతున్న నీటిని సద్వినియోగం చేసుకోవడానికి పోలవరం కుడి ప్రధాన కాలువ ద్వారా గోదావరి-కృష్ణా నదులను అనుసంధానం చేయడం.

-నవ్యాంధ్రప్రదేశ్‌ను కరవు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడానికే పట్టిసీమ ఎత్తిపోతల పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మించడం.

-గోదావరి నుంచి 80టిఎంసిల నీటిని పోలవరం కుడి ప్రధాన కాలువ ద్వారా కృష్ణా నదికి మళ్ళించడం ద్వారా కృష్ణాజిల్లా అవసరాలు తీర్చడం.

-సముద్రంలోకి వృథాగా పోతున్న నీటిని ఆదా చేయడం, శ్రీశైలం ప్రాజెక్టు అక్కడ నుంచి రాయలసీమ ప్రాంతానికి సాగునీరు, త్రాగునీటిని అందించడం.

- కరవు పీడిత ప్రాంతాలైన రాయలసీమ జిల్లాలకు నీటిని సరఫరా చేయడం.

ఏడాది కాలపరిమితిని ఆరు నెలలకు కుదించి అఘమేగాలపై దీన్ని పూర్తి చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం అధికారులను పరుగులు



ఆగష్టు 15న పట్టిసీమ ఎత్తిపోతల పథకాన్ని జాతికి అంకితమిస్తున్న ముఖ్యమంత్రి, మంత్రులు

పెట్టిస్తోంది. వాతావరణం అనుకూలించకున్నా లెక్కచేయకుండా ముందుకు సాగుతున్నారు. కాంట్రాక్టు కంపెనీని ఉరుకులు, పరుగులు పెట్టించి, కృష్ణాడెల్టా, రాయలసీమలకు తాగు, సాగునీరు అందించడంతోపాటు అమరావతి నూతన రాజధాని నిర్మాణానికి అవసరమైన నీటిని కూడ అందించేందుకు కృషి జరుగుతోంది.

పోలవరం జాప్యంతోనే పట్టసీమ పుట్టింది

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యేసరికి కనీసం ఐదారు సంవత్సరాలు పట్టే అవకాశం ఉన్నది. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర పునర్విభజన చట్టంద్వారా ఈప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించినప్పటికీ, ఆశించిన రీతిలో నిధులను సమకూర్చకపోవడంవల్ల దీని పనులు ఇంకా జాప్యం జరిగే అవకాశం లేకపోలేదు. పోలవరం ప్రాజెక్టు పనులను మొత్తం ఏడు ప్యాకేజీలుగా విభజించారు. ఇందులో 1,3,4,7 ప్యాకేజీల పనులు పూర్తికాగా, మిగతా 2,5,6 ప్యాకేజీల పనులు కోర్టు వివాదాలు, ఇతరత్రా సమస్యలతో ప్రారంభం కాలేదు. ఈ ప్యాకేజీల కింద 1860 ఎకరాల భూమిని ఇంకా సేకరించాల్సిఉంది. ప్రస్తుతం ఈ వివాదాలన్నీ కోర్టులో తాజాగా పరిష్కారం అయ్యాయి. వీటి పనులు కూడ వెంటనే ప్రారంభించి, వేగవంతం చేయమని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

అయితే ఈ పరిస్థితులన్నీ అధ్యయనం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర బహుళ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పట్టిసీమ ఎత్తిపోతల పథకాన్ని తెరపైకి తెచ్చారు. సాధ్యంకాదన్న ఈ ప్రాజెక్టును తన సమర్ధమైన పరిపాలనాదక్షతతో సుసాధ్యం చేసి చూపించగలుగుతున్నారు.

'గోదావరి' జిల్లాలకు నష్టం వాటిల్లకుండా డిజైన్

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ఒకపక్క చేపడుతూనే, రాయలసీమ, కృష్ణా డెల్టా ప్రాంతాల తక్షణ అవసరాలను పరిగణనలోకి తీసుకుని పట్టిసీమ ప్రాజెక్టును డిజైన్ చేశారు. ఈ సందర్భంగా ఉభయగోదావరి జిల్లాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా దూరదృష్టితో జాగ్రత్త పడ్డారు. గోదావరి కనిష్ట నీటి మట్టం 13 మీటర్ల ఎత్తు నుంచి 14మీటర్లకు పెంచారు. ఆపైన చేరే వరదనీటిలో ఒక్క బొట్టుని కూడ సముద్రంలోకి వృధాగా పోకుండా, ఆ నీటిని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలన్న తపనతోనే ఈ ప్రాజెక్టును సృష్టించారు.

అన్నదాతలను కాపాడాలనే...

ఒకప్పుడు రతనాలసీమగా ఖ్యాతికెక్కిన రాయలసీమ, నేడు కరవు పరిస్థితులతో అల్లాడిపోతోంది. ఈ నేపథ్యంలోనే పట్టిసీమ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టి, రాయలసీమ, కృష్టాడెల్టా ప్రాంతాలను కాపాడుకునే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలూ కష్టపడుతున్నారు.

పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా తొలిదశలో 8500 కూసెక్కుల నీటిని విడుదల చేసి, గోదావరిని కృష్ణా నదితో అనుసంధానం చేసేందుకు పనులు చకచకా సాగుతున్నాయి. దీనిలో మొదటిది పోలవరం కుడి కాలువ పనులు, రెండవది ప్రాజెక్టు పనులు. ఆర్నెల్లలో పూర్తిచేయాలన్న లక్ష్యంతో 'మెయిల్ ఇంజనీరింగ్ కంపెనీకి పనుల బాధ్యతలను అప్పగించారు.

గోదావరి జలాలను వృథా కానివ్వం: చంద్రబాబు

'సముద్రంలోకి వృథాగా పోతున్న నదీ జలాలను అడ్డుకుని, ఆ నీటితో రాష్ట్ర ప్రజల దాహార్తిని, సాగునీటి అవసరాలను తీర్చడానికే నదులను అనుసంధానం చేస్తున్నాం. తొలిదశలో గోదావరి-కృష్ణానదులను అనుసంధానం చేసి, తద్వారా రాష్ట్రాన్ని కరవు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం. అందుకే పట్టిసీమ ఎత్తిపోతల పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టాం'అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పట్టిసీమ ప్రాజెక్టును జాతికి అంకితం చేసిన సందర్భంగా పునరుద్ఘాటించారు.

పట్టిసీమ పనులు అత్యంత వేగంగా జరుగుతున్నాయి. అయితే ఈ వేగం ప్రభావం పనుల నాణ్యతపై చూపకుండా ఉండేందుకే దీని నిర్మాణం గడువును మరో రెండు వారాలు పొడిగించాం' అన్నారు. సెప్టెంబరు మొదటి వారంలో గోదావరి నీటిని కృష్ణా నదికి తరలించి రెండు నదులను అనుసంధానం చేస్తున్నాం. కృష్ణాలో కలిసిన నీరు ప్రకాశం బ్యారేజీ ద్వారా కృష్ణా, గుంటూరు జిల్లాల ఆయకట్టుకు వెళ్తుంది. శ్రీశైలం ప్రాజెక్టువద్ద మిగులు జలాలను రాయలసీమలో తాగు, సాగు నీటికోసం మళ్లిస్తాం' అని చంద్రబాబు చెప్పారు. పోలవరం ప్రాజెక్టును కూడ 2018నాటికి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.



డబ్బీరు రామకృష్ణ పట్నాయక్

బౌద్ధ పర్యాటక కేంద్రంగా
రాజధాని అమరావతి



- మల్టీలేన్ రహదారులతో బౌద్ధ ఆరాధ్య స్థలాల ఏర్పాటు
- ఎకో టూరిజం కేంద్రంగా హోప్ ఐలెండ్
- పర్యాటక శాఖ సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

రాజధాని అమరావతిని బౌద్ధ పర్యాటక కేంద్రంగా మలచి, విదేశీయులు సందర్శించేందుకు వీలుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పించారు. పర్యాటక అభివృద్ధి ప్రణాళికలపై సీఎం టూరిజం అధికారులతో తరచూ చర్చించారు. రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించటం పూర్తయింది. ఇక కార్యాచరణకు దిగటమే తరువాయిగా మారింది.

విదేశీ బౌద్ధులు ఇక్కడికి వచ్చి ఆరాధనా కేంద్రాలు స్థాపించుకునేందుకు వీలుగా ఈ ప్రాజెక్టును రూపొందించనున్నారు కోరారు. యాత్రికుల సంపూర్ణ రక్షణ టూరిజం అభివృద్ధికి ఎంతో ప్రధానం. వారి భద్రత కోసం రక్షణ పద్ధతులను ఆధునీకరించనున్నారు.

ప్రకృతి అందాలకు నెలవైన గోదావరి జిల్లాలను ఆకర్షక పర్యాటక కేంద్రాలుగా తీర్చదిద్దాలన్నారు. సముద్ర తీరాన్ని మనోహరంగా రూపొందించటం, కోరింగ వన్యప్రాణి అభయారణ్య కేంద్రంలో సదుపాయాల కల్పన, జలక్రీడల అభివృద్ధి, డాల్ఫిన్స్ షో, వినోద, విహార కేంద్రాలు, ఫుడ్ కోర్టు, వ్యాక్స్ మ్యూజియం, ఎకో, హెలి టూరిజం ఏర్పాటు, సముద్ర విహారం లాంటి ఆకర్షణలతో హోప్ ఐలెండ్ ప్రాజెక్టును సిద్ధం చేయాలని సీయం కోరారు. పశ్చిమ బెంగాల్ లోని సుందర్బన్ తరహాలో కోరింగ వన్యప్రాణి అభయారణ్యాన్ని తీర్చి దిద్దాలన్నారు. దాదాపు 2 వేల హెక్టార్ల స్థలంలో ప్లాంటేషన్లు వున్నాయని సీఎం చెప్పారు. ఎకో టూరిజానికి కూడా ఇక్కడ మంచి అవకాశాలున్నాయని చెప్పారు.

హోప్ ఐలెండ్ ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దటానికి రూ.98 కోట్లు అవసరమని, మొదటి దశ కింద రూ.68.93 కోట్లు వెచ్చిస్తామని టూరిజం శాఖ ముఖ్యకార్యదర్శి నీరబ్ కుమార్ అన్నారు. కాకినాడలో సముద్రతీరంలో జెట్టీ ప్యాసింజర్ టెర్మినల్ ఏర్పాటు చేస్తామని ఆయన ముఖ్యమంత్రికి వివరించారు. ఈ నిర్మాణాలను పిపిపి పద్ధతిలో చేపట్టాలని సీఎం టూరిజం అధికారులకు సూచించారు.

సముద్రతీరంలో చిన్నా, పెద్దవి కలిపి 500 ఐలెండ్స్ వున్నాయని, వీటిలో 40 ఐలెండ్స్‌ను అభివృద్ధి చేసేందుకు ముందుకొచ్చే ప్రమోటర్స్, బిల్డర్స్‌కు ప్రోత్సాహకాలు కూడా ఇస్తామన్నారు. ఓడల రేవు, అద్దూరు, ఎస్.యానాం, చిరయానాం, కోటిపల్లిలను టూరిజం సర్క్యూట్‌లోకి తీసుకురావాలని సీఎం ఆదేశించారు. రాజమండ్రి ని టూరిజం హబ్ గా తీర్చిదిద్దాలని కోరారు.

నెల్లూరును 'కోస్టల్ టూరిజం హబ్'గా రూపొందించేందుకు 31.8 కోట్ల రూపాయలతో ప్రాజెక్టు రూపొందించామని, పులికాట్, నేలపట్టు పక్షి సంరక్షణ కేంద్రం, మైపాడు బీచ్, ఇసుకపల్లి బీచ్ తదితర ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించగా, చెన్నయ్-తిరుపతి మధ్యలో వున్న ఉప్పలమడుగును కూడా ఇందులో చేర్చాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

అమరావతిని యాత్రా, సాంస్కృతిక స్థలంగా రూపొందించేందుకు రూ. 110 కోట్లు వ్యయమవుతుందని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. అమరావతిలో ప్రపంచ బౌద్ధులకు ఆకర్షణగా కాలచక్ర ఆలయాన్ని నిర్మించాలని ముఖ్యమంత్రి కోరారు. మరో వైపు కూచిపూడిని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని, మంగినపూడి బీచ్‌ను అభివృద్ధి చేయాలని ఆదేశించారు. విశాలమైన మల్టీలేన్ రహదారులతో బౌద్ధవిహారాలు, ఆరాధ్య స్థలాలను కలుపుతూ ఏర్పాటు చేయాలని, విదేశాలు కూడా ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు వీలుగా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు.

విశాఖ పట్నం సర్క్యూట్, తిరుపతి సర్క్యూట్‌ల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. శ్రీశైలం టైగర్ పార్కు, కుప్పంలో ఎలిఫెంట్ పార్కు ల ఏర్పాటుకు ప్రణాళికలు తయారుచేయాలని కోరారు. హోటల్స్ వస్తే దాదాపు సగం టూరిజం అభివృద్ధి చెందినట్లేనని చెప్పారు.

స్థానిక వంటకాలు, సంస్కృతిని టూరిజం ప్రతిబింబించాలన్నారు. హస్తకళాఖండాలకు ప్రాచుర్యం కల్పించాలని, ప్రతి జిల్లాలో రూ.2 కోట్లతో స్థానికంగా పార్కులు, వినోద కేంద్రాలను ఏర్పాటుచేసి ఆహ్లాద వాతావరణాన్ని సృష్టించాలని ముఖ్యమంత్రి కోరారు. ❖

ముఖ్యమంత్రి పంద్రాగష్టు పిలుపు

ఇది ఒక యజ్ఞం, కలిసిముందుకు సాగుదాం



అందరికీ నమస్కారం

- రాష్ట్ర ప్రజలకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయులకు, తెలుగువారందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు.
- ఆసేతు హిమాచలం ఇవాళ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరుపుకుంటోంది.
- స్వాతంత్ర్య దినోత్సవం వస్తే ప్రతి భారతీయుడిలో దేశభక్తి పొంగుతుంది. త్రివర్ణ పతాకం చూస్తే ప్రతి భారతీయుడి శిరస్సు స్వేచ్ఛగా,సగర్వంగా పైకిలేస్తుంది.
- మన జాతీయగీతం వింటే ప్రతి భారతీయుడి శరీరం పులకరిస్తుంది.
- దేశ స్వాతంత్ర్యం కోసం తమ జీవితాలను త్యాగం చేసిన మహనీయులను ఈ సందర్భంగా గుర్తు చేసుకుందాం. వారికి శిరసువంచి నమస్కరిద్దాం. మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ వారి త్యాగాల ఫలమేనని మనం ఏనాడూ మరిచిపోకూడదు.
- ఆధునిక భారత సమాజ అభ్యున్నతికి కంకణధారులం అవుదాం.
- కొత్త రాష్ట్రం వచ్చాక తొలి వేడుక కర్నూలులో జరుపుకున్నాం. రెండో జెండా పండుగ ఇప్పుడు విశాఖనగరంలో చేసుకుంటున్నాం. నేను మీతో మాట్లాడిన తరువాత చెప్పినవాటిలో ఎన్ని అమలు చేశామో, ఎంత అభివృద్ధి సాధించామో కర్నూలులో సమీక్షించుకుందాం.
- మనం ఎంతదూరం ప్రయాణించామో, ఎంత ప్రగతి సాధించామో, ఎన్ని సమస్యలు పరిష్కరించుకున్నామో, ఇంకా ఎన్ని సవాళ్లు ముందున్నాయో సమీక్ష చేసుకునే సమయం ఇది.

అన్ని ప్రాంతాలకు సాగునీరు

- నదుల అనుసంధానంతో, జల సంరక్షణతో ఆంధ్రప్రదేశ్‌ను కరువు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం.
- సముద్రంలో వృథాగా పోతున్న 3 వేల టీఎంసీలను సద్వినియోగం చేసుకునేందుకు అనేక చర్యలు చేపట్టాం.
- 2014-15 బడ్జెట్‌లో జల వనరుల శాఖకు రూ.3210 కోట్లు కేటాయిస్తే, దానికి మించి రూ.3910 కోట్లు ఖర్చుచేశాం.
- ఈ ఏడాది ఇప్పటికే రూ.2,800 కోట్లు ఖర్చు చేశాం. ప్రాధాన్యతా క్రమంలో 7 ప్రాజెక్టులను పూర్తి చేస్తాం.

పోలవరం, పట్టిసీమ

- పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని 2019 నాటికి పూర్తిచేయాలనే సంకల్పంతో వున్నాం.
- రూ .1028 కోట్లు భూసేకరణకే ఖర్చు చేశాం.
- పట్టిసీమ ఎత్తిపోతల ద్వారా నాలుగేళ్ల ముందే పోలవరం ప్రయోజనాలు రైతులకు చేరువ చేస్తున్నాం.
- కేవలం 8 నెలల్లోనే పట్టిసీమ పనులు పూర్తి చేయడం దేశంలోనే ఒక రికార్డు.
- కొన్ని వందల ట్రాక్టర్లు, డజన్ల సంఖ్యలో ప్రొక్లెయిన్లతో రాత్రింబవళ్లు కాలువ గట్లపైనే మకాం వేసి పనులు పూర్తి చేసిన అధికారులు, సిబ్బందిని అభినందిస్తున్నాను.
- ఈ రోజే ఈ కార్యక్రమం తరువాత, పట్టిసీమ తొలిదశను జాతికి అంకితం చేస్తున్నాం. ఎంతో సంతోషంగా ఉంది.
- ఆంధ్రప్రదేశ్‌ను కరవు రహిత రాష్ట్రంగా రూపొందిస్తాం. రాయలసీమను హార్టీకల్చర్ హబ్‌గా చేస్తాం.
- గోదావరి వరద జలాలను ఇప్పటికే తవ్విన పోలవరం కుడికాలువకు మళ్లిస్తాం. ఆదా అయ్యే కృష్ణానది జలాలను రాయలసీమకు మళ్లిస్తాం. రాయలసీమలో మాత్రమే కాదు, రాష్ట్రంలో మరెక్కడా కరవు ఛాయలు కనిపించకూడదు.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేస్తాం

- మిగిలిన 7 ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో



విశాఖలో జరిగిన స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న దృశ్యం

పూర్తిచేస్తాం. ఏడాదిలో 12లక్షల ఎకరాలకు సాగునీరు ఇస్తాం.

- గాలేరు-నగరి పూర్తిచేసి గండికోటకు నీళ్లు ఇస్తే అక్కడ బంగారుపంటలు పండించవచ్చు.
- హంద్రీ-నీవా పూర్తయితే కర్నూలు, అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాల్లో 6 లక్షల ఎకరాలకు సాగునీరు,33 లక్షల జనాభాకు తాగునీరు అందించగలుగుతాం.
- తోటపల్లి పూర్తిచేసి విజయనగరం జిల్లాకు, వెలిగొండ పూర్తిచేసి ప్రకాశం జిల్లాకు సాగునీటి కొరత లేకుండా చేస్తాం.
- 'నీరు-చెట్టు' కార్యక్రమాన్ని ఉద్యమ స్ఫూర్తితో అమలు చేస్తున్నాం.

భూగర్భజలాలు పెంచేందుకు చర్యలు తీసుకున్నాం.

- ఏడాదికి ఒక్కొక్కరు 10 చెట్లను పెంచాలి. వచ్చే ఐదు, పదేళ్లలో గ్రీన్ కవర్ శాతాన్ని 33%కు పెంచాలి.
- డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్ ఇరిగేషన్ ద్వారా మెట్ట ప్రాంతాలలో లక్ష హెక్టార్ల భూమిలో సేద్యానికి అనువుగా అభివృద్ధి చేస్తున్నాం.

వర్షాభావ పరిస్థితులు – ప్రత్యామ్నాయ పంటలకు ప్రణాళికలు

- రాష్ట్రంలో ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు వున్నాయి. 8% మేర వర్షపాతం లోటు ఉంది. గత ఏడాదితో పోల్చితే 3.80 లక్షల హెక్టార్లలో సాగు తగ్గింది.
- రాష్ట్రవ్యాప్తంగా ఖరీఫ్‌లో మెట్ట పైరుల సాగు విస్తీర్ణం తగ్గింది.
- తీవ్ర వర్షాభావం ఉన్న 6 జిల్లాలలో 14 రకాల ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రణాళిక సిద్ధం చేశాం.
- 10లక్షల హెక్టార్లలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు విత్తనాలు సిద్ధం చేశాం. 1.39 లక్షల క్వింటాళ్ల విత్తనాలను 50% సబ్సిడీపై సరఫరా చేస్తాం.

'మేడ్ ఇన్ ఆంధ్రప్రదేశ్' విజయవంతం కావాలి

- భారత ప్రభుత్వ 'మేకిన్ ఇండియా'లో భాగంగా



స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో పోలీసు బలగాల కవాతు

'మేడ్ ఇన్ ఆంధ్రప్రదేశ్'కు పిలుపునిచ్చాం.

- మూడు రోజుల క్రితం ఇక్కడే దేశీయ స్మార్ట్ ఫోన్ 'రెడ్ మి 2 ప్రైమ్'ను మార్కెట్ లో విడుదల చేశాం. హార్డ్‌వేర్ హబ్‌గా ఆంధ్రప్రదేశ్‌ను రూపొందించేందుకు ఇదే నాంది.
- చిత్తూరు జిల్లా శ్రీసిటీలో చైనా కంపెనీ షౌమి తయారుచేసిన ఫోన్ మేడిన్ ఆంధ్రప్రదేశ్‌కే కాదు, మేకిన్ ఇండియాకే గర్వకారణం.
- గత పదేళ్లుగా పేరుకుపోయిన రూ. 2 వేల కోట్ల పరిశ్రమల ప్రోత్సాహక బకాయిలను పారిశ్రామిక సంస్థలకు విడుదల చేశాం. తద్వారా పరిశ్రమల విస్తరణకు తోడ్పడుతున్నాం.
- రూ. 19 వేల కోట్ల పెట్టుబడులతో 12,08,642 మందికి ఉపాధి కల్పించే 1,09,399 మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఓ.నా.ఓ.ఇ.)లను నెలకొల్పాలని లక్ష్యంగా నిర్ణయించాం.
- రూ. 82,706 కోట్లతో 4,24,408 మందికి ఉపాధినిచ్చే 1,757 భారీ పరిశ్రమల ఏర్పాటుకు రంగం సిద్ధం చేశాం.
- రూ. 25,286 కోట్లతో 36,085 మందికి ఉపాధి కల్పించే పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి 8 ప్రతిపాదనలను రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి ఆమోదించింది.
- బిర్లా గ్రూప్, రామ్ కో గ్రూప్, కెల్లాగ్స్, హీరో మోటోకార్ప్, అంబుజా ఎక్స్‌పోర్ట్స్, ఏసియన్ పెయింట్స్ తదితర భారీ మల్టీ నేషనల్ కంపెనీలు రానున్నాయి.
- 'పారిశ్రామిక మిషన్'ను ఏప్రిల్ 29న ప్రారంభించాం. కాకినాడ సెజ్‌లో 500 మిలియన్ డాలర్ల పెట్టుబడితో ఇండస్ట్రియల్ పార్క్ అభివృద్ధి చేస్తున్నాం.
- పెట్రో కెమికల్స్, ఎనర్జీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎలక్ట్రానిక్స్, మాన్యుఫాక్చరింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, టెక్స్ టైల్స్, ఆటోమొబైల్స్ రంగాలలో రూ. 35,745 కోట్ల పెట్టుబడులు రానున్నాయి. రూ. 17 వేల కోట్లతో హెచ్‌పీసీఎల్ రిఫైనరీ నెలకొల్పుతారు.
- విశాఖపట్నం ఉక్కు కర్మాగారం విస్తరణ త్వరలో మొదలుకానున్నది.
- చెంగ్డు, జిలిన్ ప్రావిన్సుల నుంచి ప్రతినిధి బృందాలు మన రాష్ట్రాన్ని సందర్శించాయి. ఫార్మా, ఐటీ, మాన్యుఫాక్చరింగ్ విభాగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు కంపెనీల ప్రతినిధులు ముందుకు వచ్చారు.
- కాకినాడ సెజ్‌లో 500 మిలియన్ డాలర్ల విలువైన హైటెక్ ఇంజనీరింగ్ పార్కు వస్తోంది.
- ఆహార శుద్ధి రంగం అభివృద్ధి చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుమిటోమో కార్పోరేషన్‌తో ఎంఓయూ చేసుకుంది.
- చిత్తూరు జిల్లా శ్రీసిటీ సెజ్‌లో రూ. 1200 కోట్లతో పెప్సికో బేవరేజి ప్లాంటుకు ఏప్రిల్‌లో శంకుస్థాపన చేశాం. రూ. 980 కోట్ల పెట్టుబడితో నిర్మాణం పూర్తయిన 11 యూనిట్లను ప్రారంభించాం. రూ. 1000 కోట్లతో మరో 11 యూనిట్లకు శంకుస్థాపన చేశాం.
- శ్రీసిటీ సెజ్‌లోనే రూ. 900 కోట్లతో ఇసుజు ఇండియా లిమిటెడ్ 18 అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకుంది. రూ. 2వేల కోట్లతో వీఈఎం టెక్నాలజీస్ ఏరోసిటీని ఏర్పాటుచేస్తోంది. రూ. 3 వేల కోట్లతో టీఎంటీ బార్స్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌ను జైరాజ్ ఇస్పాత్ లిమిటెడ్ నెలకొల్పనుంది.

13 జిల్లాల అభివృద్ధే లక్ష్యం

- శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు మన రాష్ట్రాన్ని అమూలాగ్రం అభివృద్ధి చేయాలన్నదే నా ధ్యేయం.
- ఏ ఒక్క ప్రాంతాన్నీ నిర్లక్ష్యం చేయకుండా ఏ జిల్లాకు ఏం చేయాలో గత సంవత్సరం ఆగస్టు వేడుకల్లో చెప్పాం. దానికి అనుగుణంగా అడుగులు వేస్తున్నాం. ఒక యజ్ఞంలా, రాష్ట్రాభివృద్ధి కోసం నేను చేస్తున్న కృషిలో మీ అందరూ భాగం పంచుకోవాలి. ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి.
- అందులో భాగంగానే జూన్ 2న 'నవ నిర్మాణ దీక్ష' తీసుకున్నాం. కొత్త ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా జూన్ 8న 'మహా సంకల్పం' చేశాం.
- ఈ స్ఫూర్తిలో భాగంగానే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణానికి మనమంతా కంకణధారులు అవుదాం.
- ఈ జన వాహిని చూస్తుంటే మహాత్మాగాంధీ జరిపిన 'దండి ఉప్పు సత్యాగ్రహం' గుర్తు వస్తోంది. సత్యాగ్రహ స్ఫూర్తితో నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణంలో భాగం పంచుకుందాం. రాజధాని నిర్మాణంలో ప్రతి ఒక్కరూ ఒక ఇటుకనైనా అందిద్దాం.

వట్టిమాటలు కట్టిపెట్టోయ్ గట్టి మేల్ తలపెట్టవోయ్
పాడిపంటలు పొంగిపొర్లేదారిలో నువు
పాటుపడవోయ్..'

- గురజాడ దేశభక్తి గేయంలోని ఈ పంక్తులు మనల్ని ఎప్పటికీ ఉత్తేజితుల్ని చేస్తాయి. మనకు ప్రేరణ ఇస్తాయి.
- పేదరికం లేని, ఆర్థిక అసమానతలు లేని, ఆనందదాయక, పరిశుభ్రమైన, ఆరోగ్యకర సమాజం ఏర్పడాలన్నదే మన ఆకాంక్ష.
- మన దేశం, మన రాష్ట్రం శాంతి సౌభాగ్యాలతో, సుఖసంపదలతో, సస్యశ్యామలంగా, నిత్యనూతనంగా, ప్రపంచానికే ఆదర్శంగా నిలవాలి.

జై జన్మభూమి.. జై హింద్

(విశాఖలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన ప్రసంగంలో కొన్ని భాగాలు)

❖

ఆంధ్రను ఆదుకోండి

ప్రధాని నరేంద్రమోడిని కోరిన చంద్రబాబు



> పొరుగు రాష్ట్రాలతో సమానంగా అభివృద్ధి సాధించేందుకు వీలుగా, ఆంధ్రప్రదేశ్‌కి కేంద్రం ఆర్థిక సహాయం అందించాలని ప్రధానితో గంటన్నర సేపు జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వాదించారు.

ఆంధ్రప్రదేశ్‌కి న్యాయం చేయాలని ప్రధాని నరేంద్ర మోదీని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గట్టిగా కోరారు. విభజన కారణంగా రాష్ట్రానికి జరిగిన అపార నష్టాన్ని పూడ్చాల్సిన బాధ్యత కేంద్రం మీద ఉన్నదని ఆయన స్పష్టం చేశారు. ఢిల్లీలో ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ, కేంద్ర అధికారులతో కలిసి చంద్రబాబు సమావేశం అయ్యారు.

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో ఇచ్చిన హామీలతో పాటు చట్టం బయట అపరిష్కృతంగా ఉన్న హామీలు కూడా నెరవేర్చాల్సిందేనని ప్రధాని నరేంద్ర మోదీకి ఏపీ సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ఏ పేరుతో సాయం చేసినా ఫర్వాలేదని అభివృద్ధిలో పొరుగు రాష్ట్రాల స్థాయిని సాధించే వరకు కేంద్రం చేయూత ఇవ్వాలని కోరారు. కనీసం 2 లక్షల కోట్ల రూపాయల సహాయాన్ని వచ్చే నాలుగేళ్లలో కేంద్రం అందించాలని ముఖ్యమంత్రి ఆశిస్తున్నారు.

కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ, రక్షణ మంత్రి మనోహర్ పారికర్, పట్టణాభివృద్ధి మంత్రి వెంకయ్య నాయుడులతోనూ వేర్వేరుగా సమావేశమయ్యారు. రాష్ట్ర సమస్యలు ప్రస్తావించి పరిష్కారం దిశగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. దాదాపుగా గంటన్నరపాటు జరిగిన సమావేశంలో, రాష్ట్రం ఎదుర్కొంటున్న సమస్యలన్నిటిని ప్రధాని ఎదుట సిఎం ఏకరవు పెట్టారు.

హిమాచల్ ప్రదేశ్‌కు ఇచ్చిన పన్ను ప్రోత్సాహకాలు సీఆర్‌డీఏ పరిధికి ఇవ్వాలని ముఖ్యమంత్రి కోరారు. కర్ణాటక, తమిళనాడు, తెలంగాణలతో సమానాభివృద్ధి సాధించే వరకు ఏపీకి కేంద్రం సాయం చేయాలని అడిగారు. కేంద్ర, గిరిజన, పెట్రోలియం విశ్వవిద్యాలయాలు రావాల్సి ఉందని మోదీ దృష్టికి తీసుకెళ్లారు. బుందేల్ ఖండ్ తరహాలో ప్యాకేజీ ఇస్తామని నాటి యూపీఏ ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తు చేస్తూ, బుందేల్‌ఖండ్ వెనకబడిన ప్రాంతాల్లో 1.2 కోట్ల జనాభా, ఉండగా ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన ప్రాంతాల్లో 2.38 కోట్లు ఉన్నారని తెలిపారు. బుందేల్‌ఖండ్‌కు రూ.7266 కోట్లు ఇచ్చారని, ఆ లెక్కన చూస్తే ఆంధ్రప్రదేశ్‌కు మరింత ఎక్కువ ఇవ్వాల్సి ఉందన్నారు. రాజధాని నిర్మాణం, రాజ్‌భవన్, సచివాలయం, శాసనసభ ఇలా అన్నీ

అన్ని విధాలా ఆదుకోవాలి

ప్రధాని మోదీకి చంద్రబాబు వినతిపత్రం

ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశం సందర్భంగా ఏపీ సీఎం చంద్రబాబు 13 పేజీల వినతిపత్రాన్ని అందజేశారు. లేఖలో ముఖ్యాంశాలు...

"విభజన వల్ల ఎదురయ్యే ఆర్థిక సామాజిక పరిణామాలు దృష్టిలో ఉంచుకొని చర్చల ద్వారా అందరిలోనూ విశ్వాసం నింపాలని నాడు యూపీఏ ప్రభుత్వాన్ని కోరా. విభజించే ముందు సరైన రక్షణ చర్యలు చేపట్టాలని కోరినా పట్టించుకోకుండా అప్రజాస్వామికంగా, అశాస్త్రీయంగా, రాజకీయ లబ్ధి కోసం ముందుకు వెళ్లింది. రాజధాని లేకపోవడం, షెడ్యూలు 9, 10ల్లో పేర్కొన్న సంస్థలు, నదీ జలాల పంపకాలు, ప్రభుత్వ ఉద్యోగుల కేటాయింపులు, శాఖాపరమైన యంత్రాంగం తరలింపు అంశాలు అపరిష్కృతంగా ఉన్న విషయం మీకు తెలుసు. ఈ సమస్యలన్నింటినీ తట్టుకుంటూ వేగంగా ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ప్రయత్నిస్తున్నాం. కొత్త రాష్ట్రానికి కావాల్సిన ఆర్థిక వనరులు, సంస్థలు లేక అచేతనంగా మారాం. పునర్ వ్యవస్థీకరణ చట్టంలో పేర్కొన్న హామీలు గౌరవించడం లేదని ప్రజలు అసంతృప్తితో ఉన్నారు. విభజనని ఎప్పుడూ కోరుకోని ఆంధ్రప్రదేశ్ ప్రజలు రాష్ట్రాభివృద్ధి జరిగేందుకు కేంద్రం సహకరించాలని ఏకగ్రీవంగా కోరుకుంటున్నారు. అభివృద్ధికి దోహద పడేలా స్థిరమైన ఆర్థిక ప్యాకేజీ కావాలని ఆశిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి అభివృద్ధి చేస్తాయన్న విశ్వాసంతోనే మనకు అనుకూల తీర్పు ఇచ్చారు. యూపీఏ చేసిన అన్యాయం సరి చేస్తామని వారు భావించారు. పొరుగు రాష్ట్రాలతో సమానాభివృద్ధి సాధిస్తామని, వేగవంతమైన రాష్ట్రాభివృద్ధికి అవకాశాలు కల్పిస్తామని ప్రజలు భావించారు. పునర్ వ్యవస్థీకరణ చట్టంలో పేర్కొన్న అంశాలు అన్నింటినీ అమలు చేస్తామంటూ... మీరు, మీ మంత్రులు గతంలో జరిగిన సమావేశాల్లో హామీ ఇచ్చారు. కావాల్సినంత సాయం అందడం లేదన్న అభిప్రాయం క్రమక్రమంగా కలుగుతోంది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రజలకు భరోసా ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందుకు గానూ కొన్ని అంశాలను మీ ముందుకు తీసుకొస్తున్నా

ప్రత్యేక హోదా: రాజ్యసభలో అప్పటి ప్రతిపక్ష నేత అరుణ్ జైట్లీ డిమాండు మేరకు నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రత్యేక హోదా 5 సంవత్సరాలు ఇస్తామని ప్రకటించారు. దాన్ని అమలు పరచాలంటూ మార్చి 2, 2014న కేంద్ర మంత్రివర్గం ప్రణాళికా సంఘాన్ని నిర్దేశించింది. 14వ ఆర్థిక సంఘం నివేదిక ప్రకారం చూసినా 2019-20 సంవత్సరంలోనూ ప్రత్యేక హోదా లేకుండా ఆర్థిక లోటు ఉండే రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమే.

వనరుల వ్యత్యాసం: పునర్వ్యవస్థీకరణ చట్టం సెక్షన్ 46(2) ప్రకారం రాష్ట్ర ఆర్థికలోటు పూడ్చడానికి తగిన గ్రాంట్లు సమకూర్చాలి. ఈ విషయంపై నాటి ప్రధాని మన్మోహన్ పార్లమెంటులో హామీ ఇచ్చారు.

రాయలసీమ, ఉత్తరకోస్తా జిల్లాల అభివృద్ధికి సాయం: సెక్షన్ 46(3) ప్రకారం రాయలసీమ, ఉత్తర కోస్తా అభివృద్ధికి ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ ఇవ్వాల్సి ఉంది. వెనకబడిన ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు కోరాపుట్-బొలంగీర్-కలహండి, బుందేల్‌ఖండ్ తరహాలో ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని ప్రధాని మన్మోహన్ హామీ ఇచ్చారు.

అమరావతి నిర్మాణానికి ఆర్థిక సాయం: సెక్షన్ 94(3) ప్రకారం నూతన రాజధాని నిర్మాణానికి ప్రత్యేక సాయం అందిస్తామన్నారు. రాజ్‌భవన్, హైకోర్టు, సచివాలయం, శాసనసభ, మండలి సహా ఇతర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కేంద్ర సాయం అందించాల్సి ఉంది. ఇప్పటి వరకు రూ.1500 కోట్లు విడుదల చేసినందుకు కృతజ్ఞతలు.

పరిశ్రమల అభివృద్ధికి రాయితీలు: పునర్ వ్యవస్థీకరణ చట్టం సెక్షన్ 94(1) ప్రకారం పరిశ్రమలను ప్రోత్సహించేందుకు పన్ను రాయితీలు సహా తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది. ముఖ్యంగా రాయల సీమ, ఉత్తర కోస్తా జిల్లాల్లో పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు పన్ను ప్రోత్సాహకాలు ఇవ్వాల్సి ఉంది.

ప్రగతి సంస్థలు, అభివృద్ధి (షెడ్యూలు 9): ఐఐటీ, ఐఐఎం, ట్రిపుల్‌ఐటీ, ఐఐఎస్ఈఆర్, ఎన్ఐటీ, ఎన్ఐడీఎం కల్పనకు ధన్యవాదాలు. గిరిజన, పెట్రోలియం, కేంద్రీయ విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేయాల్సి ఉంది.

శిక్షణ, పరిశోధన సంస్థలకు సాయం: సుమారు 100 పరిశోధన సంస్థలను ఆంధ్రప్రదేశ్ కోల్పోయింది. షెడ్యూలు 9లోని సుమారు 143 సంస్థల్లో 123 సంస్థలు హైదరాబాద్, శివారు ప్రాంతాల్లో ఉన్నాయి. దానికి అదనంగా కేంద్ర ప్రభుత్వ రంగం సంస్థలు బీహెచ్ఈఎల్, రక్షణ పరిశోధన, సీసీఎంబీ, డీఎన్ఏ వంటి లక్షల మందికి ఉపాధి కల్పించే సంస్థలు కోల్పోయాం. ఈ నష్టాన్ని భర్తీ చేసేందుకు సంవత్సరానికి రూ.1000 కోట్లు చొప్పున ఐదు సంవత్సరాలు ఇవ్వాలి.

పోలవరం ప్రాజెక్టు: సెక్షన్ 90 ప్రకారం పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా పేర్కొన్నారు. నాలుగేళ్లకు పైగా నిర్మాణంలోఉన్న ఈ ప్రాజెక్టుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రూ.4 వేల కోట్లు వెచ్చించింది. ప్రాజెక్టుకి ఇప్పటి వరకూ ఖర్చు పెట్టిన నిధులు తిరిగి ఇవ్వాలి. 2018 లోపు ప్రాజెక్టు పూర్తి చేసేందుకు కేంద్రం సంపూర్ణ సహకారం అందించాలి.

సామాజిక, ఆర్థికాభివృద్ధికి సహకారం: రాష్ట్ర విభజన ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధిపై తీవ్ర ప్రభావం చూపింది. పునర్ వ్యవస్థీకరణ చట్టంలో పేర్కొన్న దానికి మించి స్థిరమైన ఆర్థిక సాయం అందించాలని ప్రతిపాదనలు ఇప్పటికే ఇచ్చాం. మీరు సహకారమందిస్తే కేంద్రం ప్రవేశపెట్టిన మేకిన్ ఇండియా, స్కిల్ ఇండియా, స్మార్ట్ సిటీ వంటి పథకాలను ఆంధ్రప్రదేశ్ ముందుండి నడిపిస్తుంది. రాష్ట్రంలో సామాజిక, ఆర్థికాభివృద్ధికి సహకారం అందించండి.

సమన్వయం: విభజన జరిగి ఏడాదిపూర్తయినా అనేక సమస్యలు పరిష్కారం కాలేదు. రెండు రాష్ట్రాల మధ్య షెడ్యూలు 9, 10ల్లో పేర్కొన్న సంస్థల్లో ప్రవేశాల సమస్య రాష్ట్ర ప్రజలకు అసౌకర్యం కలిగిస్తోంది. శాసనసభ స్థానాలు పెంచేందుకు సెక్షన్ 26ను సవరించాలి. రూ.3 వేల కోట్లు నష్టం కలిగించే పన్ను బకాయిలు సంబంధించి సెక్షన్ 50, 51లను సవరించాల్సి ఉంది."



ప్రత్యేక హోదా వల్ల కేంద్ర, రాష్ట్ర వాటాలు 90:10గా ఉంటాయని, దాని వల్లే అన్నీ ఒనగూరుతాయని భావించకూడదని విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రి చెప్పారు. ప్రత్యేకహోదా ఇస్తే సంజీవనిలా అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని కొందరు తప్పుదోవ పట్టించే యత్నం చేశారన్నారు.

నిర్మిస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. హైదరాబాద్‌ను మించిన రాజధాని నిర్మిస్తామని యూపీఏ హామీ ఇచ్చిందని, అలాగైతే రూ.5 లక్షల కోట్లు అవసరమని తాను వ్యాఖ్యానించగా అంతకన్నా ఎక్కువే నిధులు ఇస్తామని యూపీఏ చెప్పిన విషయాన్ని కూడా వివరించారు.

ఆంధ్రప్రదేశ్‌కు అద్భుతమైన రాజధాని నిర్మిస్తామని తిరుపతి ఎన్నికల సభలో ప్రధాని మోదీ ఇచ్చిన హామీని గుర్తు చేశారు. పారిశ్రామిక రాయితీల ఇవ్వకపోతే రాష్ట్రానికి పరిశ్రమలు రావని, యువత ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సెక్షన్ 46(3) ప్రకారం రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక రాయితీలు ఇస్తామని హామీ ఇచ్చారని, ఆయా ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం సహకరించాలని కోరారు.

ప్రత్యేక హోదా వల్ల కేంద్ర, రాష్ట్ర వాటాలు 90:10గా ఉంటాయని, దాని వల్లే అన్నీ ఒనగూరుతాయని భావించకూడదని తర్వాత జరిగిన విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రి చెప్పారు. ప్రత్యేకహోదా ఇస్తే సంజీవనిలా అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని కొందరు తప్పుదోవ పట్టించే యత్నం చేశారన్నారు.

ప్రత్యేక హోదా ఇచ్చి పారిశ్రామిక రాయితీలు ఇవ్వకపోతే అభివృద్ధి కష్టమేనన్నారు. ఇప్పటికే కేంద్ర పథకాల్లో రాష్ట్రాల వాటా తగ్గిందని గుర్తు చేశారు. 14వ ఆర్థిక సంఘం అన్నింటినీ పరిష్కారం చూపుతుందని చెప్పారని, రాష్ట్రానికి ఇంకా రావాల్సింది చాలా ఉందని వ్యాఖ్యానించారు.

ప్రత్యేక హోదా కన్నా ఎక్కువే చేస్తామని అంటున్నారని, ఏదైనా పొరుగు రాష్ట్రాలతో సమానాభివృద్ధి జరిగే వరకు రాష్ట్రానికి కేంద్రం సహకరించాల్సిందేనని చెప్పారు.

"ప్రత్యేక హోదా వల్ల కేంద్ర ప్రాయోజిత పథకాలు, విదేశాల నుంచి ప్రాజెక్టులు (ఈఏపీ) మాత్రమే వస్తాయి. ఏదైనా సరే పొరుగు రాష్ట్రాలతో సమానాభివృద్ధి జరిగే వరకు కేంద్రం సహకరించాలన్నాం. హోదా కన్నా ఎక్కువే చేస్తామంటున్నారు. కోడలు మగబిడ్డను కంటానంటే అత్తగారు వద్దంటుందా" అని సీఎం చమత్కరించారు. ఇటు ప్రత్యేక హోదా, అటు రాయితీలు అన్నీ ఇవ్వాల్సిందేనని ప్రధానికి స్పష్టంగా చెప్పానన్నారు.


విభజన చట్టంలో అంశాలన్నీ దేశం ఇచ్చిన హామీలు: జైట్లీ

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పొందుపరిచిన కీలకాంశాల అమలుకు మార్గసూచి (రోడ్‌మ్యాప్) రూపొందనుందని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ వెల్లడించారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇచ్చే విషయంలో కేంద్రం తన కట్టుబాటు నుంచి వెనక్కి మళ్లిపోయే ప్రశ్నే లేదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తనతో సమావేశమైన తర్వాత జైట్లీ విలేకరులతో మాట్లాడారు. "ఏపీ విషయంలో ఎవరూ వెనక్కిపోయేది లేదు. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక హక్కుల గురించి మేం పార్లమెంటులో ఒత్తిడి తెచ్చాం. దానిపై పూర్తి కసరత్తు చేస్తున్నాం. పునర్విభజన చట్టంలో ఉన్న అన్ని అంశాల జాబితాను రూపొందించి, వాటి అమలుకు కాలపరిమితిని నిర్దేశించాల్సిందిగా నీతిఆయోగ్ ఉపాధ్యక్షుడు అరవింద్ పనగడియాను ప్రధాని ఆదేశించారు. రాష్ట్రానికి ఏయే అంశాల్లో సాయం కావాలో చూడాల్సిందిగా చెప్పారు. చట్టంలో పొందుపరిచిన అంశాలు, మునుపటి యూపీఏ ఇచ్చిన హామీలు, 14వ ఆర్థిక సంఘం సిఫార్సులు... ఈ మూడింటినీ నీతిఆయోగ్ క్రోడీకరిస్తుంది..." అని జైట్లీ వివరించారు. ఈ సమాచారాన్ని త్వరలోనే ప్రధానికి పనగడియా సమకూరుస్తారనీ, దానిపై మోదీ ఓ నిర్ణయం తీసుకుంటారని చెప్పారు.

ఆశించినదానికంటే ఎక్కువే లభిస్తుంది

పోలవరం ప్రాజెక్టు, ఆర్థిక సంఘం కేటాయింపులు, పన్ను రాయితీలు సహా వివిధ ఆర్థికాంశాలకు సంబంధించి చట్టంలో ఉన్న సెక్షన్ 46, 90, 94లపై రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించాల్సిందిగా పనగడియాను ప్రధాని ఆదేశించారని జైట్లీ తెలిపారు. విభజన చట్టంలో పేర్కొన్న అంశాలన్నీ ఏపీ అభివృద్ధికి యావద్దేశం ఇచ్చిన హామీలని పేర్కొన్నారు. ప్రత్యేక హోదాపై ఉన్న డిమాండ్ గురించి ప్రశ్నించగా– నిర్దుష్టంగా సమాధానం ఇవ్వలేదు. అలాంటి అంశాలన్నింటిపైనా చర్చించామనీ, ఆర్థిక సంఘం సిఫార్సుల నేపథ్యంలో వాటిపై మదింపు చేయడానికి అధికారులతో పనగడియా చర్చిస్తారని తెలిపారు. ఆ తర్వాతే తుది నిర్ణయాలు ఉంటాయన్నారు. చట్టంలో ఏముందో ఆ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వానికి సాయం అందాలనే స్పష్టమైన అభిప్రాయంతో ప్రధాని ఉన్నారని చెప్పారు. ప్రజలు భావిస్తున్నదానికంటే ఎక్కువే ఏపీకి లభిస్తుందని భరోసా ఇచ్చారు. రాష్ట్రానికి అదనపు నిధులు ఇవ్వడంపై ప్రత్యామ్నాయ విధానాల కోసం కేంద్రం చూస్తోందని చెప్పారు. ఆర్థిక సంఘం సిఫార్సులను పక్కన పెట్టకుండానే ప్రత్యేక సాయం కింద నష్టాలను భర్తీ చేసుకునేలా ఎక్కువ నిధులు వచ్చేటట్లు చేస్తామని వివరించారు. ఏపీ ప్రభుత్వాధికారులతోనూ నీతిఆయోగ్ చర్చలు జరుపుతుందని చెప్పారు. పారిశ్రామికీకరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, నూతన రాజధాని నిర్మాణానికి ఏ రూపంలో నిధుల్ని సమీకరించవచ్చనేదానిపై చర్చ జరిగిందని తెలిపారు. దీనిని నీతిఆయోగ్‌కు విడిచిపెట్టామని చెప్పారు. అయిదేళ్లపాటు లోటుభర్తీ చేసే చర్యలను ఆర్థిక సంఘం చూస్తుందని తెలిపారు. ఇప్పటి వరకు ఇచ్చిన రాయితీలు, నిధులపైనా సమీక్షించినట్లు చెప్పారు.

❖



'కోడ్ ఫర్ ఏపీ'

మేధోదానంతో నవ్యాంధ్రకి డిజిటల్ సాధికారత

వారంతా ప్రవాసాంధ్రులు. దేశదేశాల్లో, ముఖ్యంగా అగ్రరాజ్యం అమెరికాలో స్థిరపడిపోయిన వారు. ప్రపంచాన్ని మొత్తం ఒక కుగ్రామంగా మార్చేసిన డిజిటల్ విప్లవంలో కీలకమైన పాత్ర వహించిన వారు. ఎక్కడెక్కడ ఉంటున్నా, ఏఏ ఉన్నత శిఖరాలు అధిరోహించినా, వారి మనసుల్లో చెదరని భావన ఒక్కటే- 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ... (కన్నతల్లీ, మాతృభూమి స్వర్గంకన్నా ఉత్తమమయినవి)'. ఉడతాభక్తిగా సొంతగడ్డ ఋణం తీర్చుకొనే ప్రయత్నాలు కొందరు చేస్తూ ఉన్నా, అందరికీ అటువంటి అవకాశం కల్పించే మహత్తరమైన ఆలోచన - మేధోదానం! ఈ ఆలోచనకి రూపకర్తలు అమెరికాలో ఉంటున్న ప్రవాసాంధ్రులు శ్రీనివాస్ దేవెళ్ల, భాస్కర కృష్ణమూర్తి, హరిప్రసాద్. దాని ఫలితమే- 'కోడ్ ఫర్ ఏపీ' సంస్థ ఆవిష్కరణ. ఆ ప్రవాసాంధ్రులు రూపకల్పన చేసిన 'కోడ్ ఫర్ ఏపీ' స్వచ్ఛంద సంస్థ ద్వారా నవ్యాంధ్రలో ఈ-పాలనకు, ఆర్థిక, సాంఘిక అభివృద్ధి, ప్రజా సేవల విభాగం, ఆరోగ్య, గ్రామీణవిద్య, వ్యవసాయం వంటి అనేక రంగాలలో మెరుగైన సేవలు అందించేలా సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లను విరాళంగా అందిస్తారు.

నవ్యాంధ్రలో డిజిటల్ సాధికారత అనే ఘనమైన లక్ష్యాన్ని సాధించాలన్న ధ్యేయంతో 2015 జులై 4న ప్రారంభమైన ఈ సంస్థలో ఇప్పటి ఎవ్వరైనా వాలంటీర్లుగా చేరవచ్చు. ఇప్పటికే 30 ప్రభుత్వ విభాగాలలో పనితీరు సులభతరం చేసే విధంగా వీరు సాంకేతిక పరిజ్ఞానం అందించడానికి సిద్ధమయ్యారు. మరికొన్ని సాంకేతిక అంశాల రూపకల్పనపై కూడా దృష్టి పెట్టారు. మొదటిది "డైల్ ఆన్ ఎక్స్ పర్ట్". ఇది ప్రజలకు, ప్రభుత్వాధికారుల మధ్య వారధిగా ఉపయోగపడాలని ఉద్దేశించారు. రెండొవదైన "ఓపెన్ డైరెక్టరి" ద్వారా ప్రభుత్వ ఉద్యోగులందరి సంప్రదించు వివరాలతో డైరెక్టరీని రూపొందించడం జరుగుతుంది.

సాంకేతిక పరిజ్ఞాన సారథికి నిపుణుల చేదోడు

దేశంలోనే మొట్టమొదటిగా టెక్నోలజీని పాలనాసౌలభ్యం కోసం వాడిన నాయకుడిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేరుపొందిన విషయం తెలిసిందే. సాంకేతికతతో అభివృద్ధి మరింత వేగవంతమవుతుంది. పదేళ్ళ పురోగతి ఏడాదిలోనే సాధించవచ్చు. కాబట్టి, 2029 నాటికి ఆంధ్రప్రదేశ్ ను దేశంలో కెల్లా ప్రథమ స్థానంలో చూడాలనుకున్న ముఖ్యమంత్రి లక్ష్యానికి చేదోడువాదోడుగా నిలవాలనుకున్న సాంకేతిక నిపుణులకు 'కోడ్ ఫర్ ఏపీ' కార్యక్రమం ఒక మహదవకాశం.

ప్రపంచానికి సాంకేతిక రంగంలో ఘనమైన భాగస్వామ్యం అందించడానికి ఇంజనీర్లు సృష్టించడంలో తెలుగు రాష్ట్రం సముచిత పాత్ర పోషిస్తోంది. అమెరికా సాంకేతిక సౌధానికి మూలస్థంభాల్లో తెలుగు వారు ఒకరని తెలిసిందే. తాము నేర్చుకున్న విజ్ఞానం, సాంకేతిక నైపుణ్యాన్ని నవ్యాంధ్ర పునర్నిర్మాణంలో వినియోగించాలని వారు నడుం బిగించారు. అదీ విభజనతో అన్ని రకాల కష్టాలు, ఆర్థిక నష్టాలతో సతమతమవుతున్న రాష్ట్రం డిజిటల్ సాధికారత సాధించడంలో తోడ్పడాలని, దేశానికే ఆంధ్రప్రదేశ్ ‘విజ్ఞాన రాజధాని’గా విలసిల్లేలా చేయాలని తపన పడుతున్నారు. ఆ ప్రవాసాంధ్రులు విజ్ఞానాన్ని విరాళంగా ఇస్తే ఆ ఆధునిక పరిజ్ఞానంతో 2020కే ఆంధ్రప్రదేశ్ ని అగ్రస్థానంలో నిలుపవచ్చన్న నమ్మకం సర్వత్రా వ్యక్తమవుతోంది.

సాంకేతిక విప్లవానికి సహకరించే వృత్తి నిపుణులకు అవసరమైన సమాచారం ప్రభుత్వ అధికారులు ఇస్తారు. దానికనుగుణంగా దేశ, విదేశీ తెలుగు యువత సాంకేతిక నూతనావిష్కరణలతో రాష్ట్రాభివృద్ధికి సహకరించడానికి మార్గం సుగమమవుతుంది. రాష్ట్రానికి అవసరమైన టెక్నాలజీ గురించి ఆన్ లైన్ లో ఉంచనున్నారు. దాని ప్రకారం అవసరమైన సాఫ్ట్ వేర్ కోడ్ ను రూపొందించి ఇవ్వాల్సి ఉంటుంది. టెక్నాలజీ ద్వారా పాలనలో పారదర్శకత మొదలుకుని ఎన్నో మార్పులకు శ్రీకారం చుట్టనున్నారు. అడిగిన కొద్ది రోజుల్లోనే రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా మూడు సాఫ్ట్ వేర్ కోడ్ లను ఐటీ నిపుణులు రూపొందించారు.

- కేంద్ర నిధుల పర్యవేక్షణ పోర్టల్: కేంద్రం నుంచి రాష్ట్రానికి వివిధ పథకాలు, ఆయా ప్రభుత్వ విభాగాలకు రావాల్సిన నిధులపై వాస్తవ స్థితిపై ఒక పోర్టల్ రూపొందించారు. ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులకు ఎప్పటికప్పుడు ఈ సమాచారం కేంద్ర నిధులపై అవగాహన, సమీక్షల సమయంలో ఎంతో తోడ్పడుతాయి.
- సెక్రటేరియట్ ఎంట్రీ విధానం కోసం ఒక ప్రోగ్రామ్: వివిధ ప్రభుత్వ విభాగాల అధికారుల వద్దకు వెళ్ళే సందర్శకులు సచివాలయం ప్రవేశానికి అనుమతి పొందడానికి ఈ ట్యాబ్ ఆధారిత యాప్ పని చేస్తుంది. ముందుగానే ఈ యాప్ లో అనుమతి కోరుతూ సంబంధిత అధికారికి విజ్ఞాపన పంపవచ్చు. ఆ అధికారి సందర్శకులకు అనుమతి ఇవ్వవచ్చు, తిరస్కరించవచ్చు…ఈ విషయం ఆ అధికారి నిర్ణయం తర్వాత సచివాలయం గేట్ వద్ద ఉన్న సెక్యూరిటీ సిబ్బందికి ట్యాబ్ ద్వారా తెలుస్తుంది…అదే సమయంలో సచివాలయంలోకి వాహనాల రాకపోకలపై కూడా సెక్యూరిటీ విభాగం వద్దనున్న ట్యాబ్ లో సమాచారం నమోదవడం గమనార్హం.
- ట్యాబ్స్ వాడకాన్ని మానిటర్ చేసే మరో ప్రోగ్రామ్: రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై వివిధ ప్రాంతాల్లో పర్యటనల సందర్భంగా సేకరించే సమాచారాన్ని అక్కడికక్కడే నమోదు చేసి కేంద్ర సర్వర్ కు చేరేలా ఈ పోర్టల్ రూపొందించారు. ఉన్నతాధికారులు ఎక్కడి నుంచైనా ఆయా పథకాల సమాచారాన్ని తెలుసుకుని తదుపరి కార్యాచరణకు సిద్ధం కావచ్చు. క్షేత్ర స్థాయిలో కింది సిబ్బంది పనితీరు, పంపే నివేదికలు, విభాగాలవారీ, పథకాల వారీ పర్యవేక్షణపై సమీక్షలు నిర్వహించవచ్చు.
- న్యూస్ రూం: దేశంలోని తెలుగు, ఇంగ్లీష్ వార్తాపత్రికలన్నీ ఒకే ఆండ్రాయిడ్ తో ప్రపంచంలో ఎక్కడి వారైనా చదువుకునే వీలుగా అందుబాటులోకి తీసుకొచ్చారు.

టెక్నాలజీని విస్తృతంగా ఉపయోగించుకోవడం వలనే చైనా ప్రపంచంలో ఉన్న హైస్పీడు రైళ్ళలో దాదాపు 65 శాతం రైళ్ళను నడపగలుగుతోంది. కొత్తగా ఏర్పడిన ఏపీలో ప్రభుత్వానికి కనీసం కార్యాలయాలు కూడా పూర్తిస్థాయిలో లేవు. విదేశాల్లో ఉన్న సాఫ్ట్ వేర్ నిపుణులు ఇది గమనించి రాష్ట్రానికి టెక్నాలజీ విషయంలో పూర్తిస్థాయి లో సహకారం అందించనున్నారు. విభజనతో నష్టం జరిగిపోయింది. ఇప్పుడు మనం మనకున్నశక్తిని తెలుసుకుని దాన్ని సమర్థంగా ఉపయోగించుకోవాలని యువ ఇంజనీర్లు గ్రహించారు. మొబైల్ ఫోన్ల విప్లవం ప్రారంభమైంది. అందుకు అనుగుణంగా ఇంజనీర్లు యాప్ లు రూపొందిస్తున్నారు. అన్ని ప్రభుత్వ శాఖలను కంప్యూటరీకరణ చేయాల్సి ఉంది. టెక్నాలజీని ఉపయోగించడం వలన ఒక్క పౌర సరఫరా శాఖలోనే రూ. 1500 కోట్లు ఆదా అవుతోంది. సాంకేతిక నిపుణులు బృందాలుగా ఏర్పడి పని చేయడం వలన భావి ఇంజనీర్లకు ఆదర్శంగా ఉంటారు. తద్వారా రాష్ట్రంలో సాఫ్ట్ వేర్ సునామీ సృష్టించడం అసాధ్యమేమీకాదు. ❖

CODE FOR AP

టెక్నాలజీ సునామీ సృష్టిద్దాం

“ఏపీలో సాఫ్ట్ వేర్ సునామీ సృష్టించేందుకు ప్రపంచవ్యాప్తంగా సాఫ్ట్ వేర్ రంగంలో పని చేస్తున్న తెలుగు వారు సాయం చేయాలి. ఇందుకోసం రోజుకో గంట సమయం రాష్ట్రం కోసం కేటాయించాలి. యువతీ యువకులను చూస్తుంటే గర్వంగా వుంది. యువతీయువకులే ఈ రాష్ట్రానికి బలం. మీరంతా టెక్నాలజీ యుగంలో పుట్టారు. గోదావరి పుష్కరాల్లో ప్రజల సంతృప్తి కోసం సర్వేలు చేయించాం. దానికోసం టెక్నాలజీని వాడుకున్నాం. పుష్కరాల్లో 50 వేల మంది పనిచేశారు. వాళ్లల్లో వాళ్లే పోటీ పడి పనిచేశారు. 5 కోట్ల మంది అభినందించారు. ప్రభుత్వమే అన్ని పనులూ చేయలేదు. పుష్కరాల్లో ప్రజలే స్వచ్ఛందంగా ముందుకొచ్చి సేవలందించారు. క్రమశిక్షణగా ముందుకొస్తే ఎంతో చేయగలం. ప్రపంచంలో మనుషులందరూ ఒకటే. మైండ్ సెట్ మాత్రమే వేరు. నాలెడ్జ్ ఏ ఒక్కరి సొంతం కాదు, ఎంత ప్రాక్టీస్ చేస్తే అంత టాప్ పొజిషన్ లోకి వెళతారు. ప్రభుత్వానికి ఇన్నోవేటివ్ ఐడియాలివ్వండి. దానికి ‘కోడ్ ఫర్ ఏపీ’ ఒక ప్లాట్ ఫామ్ కావాలి. నాలెడ్జ్ హబ్‌గా ఏపీని రూపొందిస్తున్నాం. మనకు కావాల్సిన పని కోసం, మన అవసరాల కోసం మనమే సాఫ్ట్ వేర్ రూపొందించుకోవాలి. ఆ అవకాశం మీకు కల్పిస్తున్నాం. ‘కోడ్ ఫర్ ఏపీ’ వాలంటీర్లు మూడు ప్రోగ్రామ్స్ తయారుచేయడం హర్షణీయం. కోడ్ ఫర్ ఏపీ సభ్యులు రూపొందించిన అప్లికేషన్లు ప్రభుత్వ పాలనలో ఉపయోగపడటమే కాకుండా ప్రజలకు మెరుగైన సేవలందించడంలో నూతన ఆలోచనలతో ముందుకు రావాలి. ‘కోడ్ ఫర్ ఏపీ’ నిర్వాహకులు శ్రీనివాస్ దేవెళ్ల, భాస్కర కృష్ణమూర్తి, హరిప్రసాద్‌లు అభినందనీయులు.”

– ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

ఏపి ఇంటర్నెట్ ప్రాజెక్టుకు మైక్రోసాఫ్ట్ ఊతం

టీవీ వైట్ స్పేసెస్ ప్రాజెక్టులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో, అంతర్జాతీయ సాంకేతిక దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్ కలిసి పని చేయనుంది. నిరుపయోగంగా ఉన్న టీవీ స్పెక్ట్రాన్ని ఉపయోగించుకుని వినియోగదారులకు తక్కువ ధరకు అందించే సాంకేతిక పరిజ్ఞానమే ఈ ప్రాజెక్టు. మైక్రోసాఫ్ట్ (భారతదేశంలో పరిశోధన, అభివృద్ధి) ఎండీ అనిల్ భన్సాలీ, నేషనల్ టెక్నాలజీ ఆఫీసర్ ప్రశాంత్ శుక్లా, ఇతర అధికారులు, ఈ ప్రాజెక్టుపై చర్చించేందుకు విజయవాడ క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో భేటీ అయ్యారు. పైలెట్ ప్రాజెక్ట్ కింద, శ్రీకాకుళం జిల్లాలో గతంలో ఇంటర్నెట్ సదుపాయంలేని నాలుగు విద్యాసంస్థలకు అతి తక్కువ ధరకు బ్రాడ్ బ్యాండ్ ఇంటర్నెట్ కనెక్టివిటీ ఇచ్చేందుకు మైక్రోసాఫ్ట్ కేంద్రప్రభుత్వశాఖలు డాట్, డైటీ, ఎర్నెట్‌లతో పనిచేస్తోంది. వొప్పంగి జడ్పీ ఉన్నత పాఠశాల కేంద్రంగా, 10 కి.మీ.దూరంలో ఉన్న మూడు క్యాంపస్‌లకు అందజేస్తుంది.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ ప్రయోగాత్మకంగా ప్రజల వద్దకు సంక్షేమ కార్యక్రమాలను, ప్రభుత్వ సేవలను చేరువ చేసేందుకు శాస్త్రసాంకేతికతను వినియోగించడంలో తాను ఎప్పుడూ ముందుంటానన్నారు. కొత్త ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానం ద్వారా సమాజాన్ని సాంకేతికంగా ముందుకు తీసుకు వెళ్లడమే కాకుండా విజ్ఞానాధారిత ఆర్థిక వ్యవస్థను నెలకొల్పవచ్చని మైక్రోసాఫ్ట్ ఈ పైలెట్ ప్రాజెక్టుతో రుజువు చేసిందన్నారు. టీవీ స్పెక్ట్రంలో ఉపయోగించని టెక్నాలజీని వినియోగించుకుని మారుమూల ప్రాంతాలలో కూడా చౌకధరకు ఇంటర్నెట్ సదుపాయం కల్పించేందుకు టీవీ వైట్ స్పేసెస్ సాంకేతిక పరిజ్ఞానం దోహదపడుతుంది. రోజువారీ టీవీ ప్రసారాలకు ఏ విధమైన అంతరాయాలు లేకుండా నిరుపయోగంగా ఉన్న బ్యాండ్స్ ను ఇంటర్నెట్ బ్రాడ్ బ్యాండ్ ట్రాన్స్ మిషన్ కు కేటాయిస్తారు.

ఈవిధంగా ఇది విస్తృత కవరేజీకి, చౌకగా ప్రసారాలు అందించేందుకు తోడ్పడుతుంది. వైఫై లాగా 100 మీటర్ల వ్యాసార్ధానికే పరిమితం కాకుండా టీవీ వైట్ స్పేసెస్ 10 కి.మీ. పైబడిన వ్యాసార్ధానికి సిగ్నల్స్ ను పంపుతుంది.



విజయవాడ క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో జరిగిన భేటీలో మైక్రోసాఫ్ట్ (భారతదేశంలో పరిశోధన, అభివృద్ధి) ఎండీ అనిల్ భన్సాలీ

భారతదేశంలో మైక్రోసాఫ్ట్ ఛైర్మన్ భాస్కర్ ప్రమాణిక్ మాట్లాడుతూ భారతదేశంలో మారుమూల ప్రాంతాలకు కూడా ఇంటర్నెట్ కనెక్టివిటీ టీవీ వైట్ స్పేస్ టెక్నాలజీ ద్వారా కల్పించవచ్చని తాము ఖచ్చితంగా చెబుతామన్నారు. విపత్తులు, ఇతర అత్యవసర సమయాలలో కూడా ఈ సాంకేతిక పరిజ్ఞానం వినియోగ పడుతుందన్నారు. డిజిటల్ ఇండియా ఆవిష్కరణలో ప్రభుత్వానికి టీవీ వైట్ స్పేసెస్ లాంటి టెక్నాలజీ ఎంతగానో సహకరిస్తుందని, భారతదేశ అభివృద్ధికి తమ సంస్థ పూర్తిగా తోడ్పడుతుందన్నారు. ఘనా,బోట్స్ వానా, నమీబియా, టాంజానియా, దక్షిణ ఆఫ్రికా, కెన్యా , సింగపూర్ దేశాలలో పైలెట్ పద్ధతిలో ఈ ప్రాజెక్టును ఇప్పటికే అమలు చేశామన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు తన క్యాంపు కార్యాలయంనుంచి స్కైప్ ద్వారా వొప్పంగి, సింగుపురం, ఫరీదాపేట, సతివాడ లోని విద్యార్ధులతో ఇంటరాక్ట్ అయ్యారు.

ఆంధ్రప్రదేశ్ లో డ్రాపవుట్స్ విద్యార్ధులను గుర్తించేందుకు విద్యాశాఖకు మెషీన్ లెర్నింగ్ సొల్యూషన్ ను మైక్రోసాఫ్ట్ అందజేసింది. దీనిని చిత్తూరు జిల్లాలో బడి పిలుస్తోంది కార్యక్రమంలో అమలు చేయనున్నారు. ఏపీ ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమాలలో ఇది ఒకటి అంటూ దీనికి సహకరించడం మైక్రోసాఫ్ట్‌కు సంతోషదాయకమని మేనేజింగ్ డైరెక్టర్ అనిల్ బన్సాలీ అన్నారు. ఈ కార్యక్రమం ఉపాధ్యాయులకు, విద్యార్ధులకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. భవిష్యత్ భారత శ్రమశక్తి సామర్ధ్యాన్ని మెషీన్ లెర్నింగ్ టెక్నాలజీ పెంచుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

ఈ అనుభవంతో రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖలలో లోపాలను గుర్తించి చక్కదిద్దేందుకు మెషీన్ లెర్నింగ్ టెక్నాలజీ దోహద పడుతుందనే ఆకాంక్షను సీఎం చంద్రబాబు వ్యక్తంచేశారు. తద్వారా సుపరిపాలనకు, పారదర్శకతకు బాటలు వేస్తుందన్నారు.

క్రీడారంగానికి రాష్ట్రప్రభుత్వం కొత్త దన్ను



నూతనంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నప్పటికీ క్రీడలకు విశేష ప్రాధాన్యం ఇస్తోంది. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో క్రీడాశాఖను నిర్వహిస్తున్న మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు రాష్ట్రంలో క్రీడాసదుపాయాల కల్పన మీద శ్రద్ధ పెట్టారు.

క్రీడల విషయంలో కేంద్ర ప్రభుత్వం నుండి రావాల్సిన ప్రతి పైసాను రాబట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో కొత్తగా అంతర్జాతీయ స్థాయిలో స్టేడియాలు, స్పోర్ట్స్ ట్రాక్స్, స్పోర్ట్స్ అకాడమీలు నిర్మించేందుకు అవకాశం ఏర్పడింది. వివిధ క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు అందించే నగదు ప్రోత్సాహక బహుమతులను కూడా రెట్టింపు చేసి ప్రోత్సహిస్తున్నారు. నియోకవర్గాల వారీగా ప్రతి నియోజకవర్గంలో నిర్మాణంలో ఉన్న స్టేడియాల స్థితిగతులను పరిశీలిస్తున్నారు. కొత్తగా స్టేడియాల మంజూరు, వాటికి అవసరమైన నిధులు మంజూరు చేస్తున్నారు. జిల్లాల వారిగా ప్రము-ఖమైన క్రీడలు, వాటికి అవసరమైన కోచ్‌ల నియామకానికి తగు చర్యలు తీసుకుంటున్నారు. పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి కలిగించడంలో భాగంగా క్రీడలకు మార్కులు ఇచ్చే విధంగా చర్యలు తీసుకొంటున్నారు.

గుంటూరులో శిధిలావస్థలో ఉన్న కాసు బ్రహ్మానంద రెడ్డి స్టేడియాన్ని పీపీపీ పద్ధతిలో ఆధునికీకరణ చేపట్టనున్నారు. జిల్లా స్థాయి, అంతర పాఠశాలల క్రీడా పోటీల నిర్వహణపై శ్రద్ధ వహిస్తున్నారు. నెల్లూరు జిల్లాలో రూ. 200 కోట్లతో జాతీయ స్థాయి స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు, కడప స్పోర్ట్స్ స్కూల్‌ను పటిష్టపరుచుటం, విశాఖపట్నం జిల్లా సబ్బవరంలో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు, కొమ్మాది లో స్పోర్ట్స్ విలేజ్ ఏర్పాటుకు రూ. 10 కోట్లతో తగు చర్యలు తీసుకొనేందుకు మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రంగా కృషి చేసారు. శ్రీకాకుళం జిల్లాలోని కోడి రామ్మూర్తి స్టేడియం పునర్నిర్మాణానికి రూ. 15 కోట్లు నిధుల కేటాయింపు ద్వారా స్టేడియాన్ని అత్యాధునిక టెక్నాలజీ ద్వారా ఆధునిక హంగుతో తీర్చిదిద్దనున్నారు. 170 ఇండోర్ స్పోర్ట్స్ హాల్స్ నిర్మాణం కూడా ప్రభుత్వం తలపెట్టింది. దీనికి భారత ప్రభుత్వం రూ. 246 కోట్లు విడుదల చేసేందుకు సుముఖంగా ఉన్నది. ఈ నిధులు రాబట్టడంలో రాష్ట్రప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోంది. విశాఖలో స్పోర్ట్స్ అండ్ హెల్త్, మెడిసిన్ విభాగం ఏర్పాటు కోసం రూ. 10 కోట్లు, అనకాపల్లి, వైజాగ్‌లో రీజనల్ స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటుకు రూ. 43.32 కోట్ల నిధుల మంజూరుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సుముఖత వ్యక్తం చేశారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన రాజధాని అమరావతిలో అంతర్జాతీయ స్థాయిలో స్పోర్ట్స్ విలేజ్ ని నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విలేజ్‌లో మెడిటేషన్, యోగ సెంటర్ వంటి ఆధునిక సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నారు. హిందూపురం నియోజకవర్గ శాసనసభ్యుడు నందమూరి బాలకృష్ణ తన నియోజక వర్గం హిందూపురం పట్టణంలో ఆధునిక స్టేడియం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాల్సిందిగా చేసిన విజ్ఞప్తికి మంత్రి సానుకూలంగా స్పందించారు. అప్పటికప్పుడు అధికారులతో మాట్లాడి స్టేడియం నిర్మాణానికి అవసరమైన నిధులను కేటాయించేలా ఆదేశించారు.

శ్రీకాకుళం నుండి చిత్తూరు వరకు అవసరమైన మేరకు కొత్తగా స్టేడియాలను నిర్మించడంతో పాటు, పాతవాటిని కూడా ఆధునికీకరించడానికి క్రీడల శాఖ ప్రణాళికలు తయారు చేస్తోంది. శ్రీకాకుళంలో కరణం మల్లీశ్వరి స్పోర్ట్స్ అకాడమీకి రూ. 2 కోట్లు, పుల్లెల గోపీచంద్ అకాడమీకి రూ. 2 కోట్లు, సీతంపేటలో ఎస్టీ స్కూల్ ఏర్పాటుకు రూ. 1.75 కోట్లు కేటాయించారు. గోవాలో జరిగే జాతీయ క్రీడలకు రూ. 13 కోట్లు, మరో రూ. 2 కోట్లు జాతీయ క్రీడల నిర్వహణకు కేటాయించదలిచారు. క్రీడా కోచ్‌ల రెగ్యులరైజేషన్ కు రూ. 4 కోట్లు నిధులు కేటాయించారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను మరింత ప్రోత్సహించడానికి ప్రస్తుతం గోల్డ్ మెడల్ విన్నర్ కు రూ. 7 లక్షలు, సిల్వర్ బహుమతికి రూ. 5 లక్షలు, బ్రాంజ్ బహుమతికి రూ. 3 లక్షలు అందజేస్తున్నారు. గతంలో ఈ బహుమతులు రూ. 5,3,2 లక్షలు చొప్పున ఉండేవి.

కేంద్ర ప్రభుత్వ సహాయంతో ఈ క్రింది పథకాలు మంజూరు అయి, అమలులో ఉన్నాయి.

- రూ. 5 కోట్లతో ఆస్ట్రో టర్ఫ్ హాకీ ఫీల్డ్ విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య స్టేడియం అభివృద్ధి.
- విజయవాడ గాంధీ మునిసిపల్ కార్పోరేషన్‌లో సింథటిక్ అథ్లెటిక్ 400 మీ. ట్రాక్ – రూ. 5.50 కోట్లు.
- ఆస్ట్రో టర్ఫ్ హాకీ ఫీల్డ్ కాకినాడ – రూ. 5 కోట్లు
- అథ్లెటిక్ ట్రాక్ – 400 మీ. – డిస్ట్రిక్ స్పోర్ట్స్ అథారిటీ గ్రౌండ్స్, కాకినాడ –రూ. 5.50 కోట్లు.



బండారుపల్లి మురళి,
ఎం ఎల్ ఓ, యువజన క్రీడల మంత్రిత్వ శాఖ

మార్కెట్‌లోకి మేడిన్ ఆంధ్రా ఫోన్

రాష్ట్రంలో ఉత్పత్తి ప్రారంభించిన స్మార్ట్ ఫోన్ దిగ్గజం షామి



షామి స్మార్ట్ ఫోన్ విడుదల సందర్భంగా విశాఖలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

మేకిన్ ఇండియా నినాదానికి స్పందనగా ఎలక్ట్రానిక్స్ రంగంలో ఆంధ్రప్రదేశ్ తొలి అడుగు వేసింది. 2014 ఆర్థిక సంవత్సరానికి 46 బిలియన్ల డాలర్ల ఆదాయంతో చైనాలో అతిపెద్ద మొబైల్ ఫోన్ల కంపెనీ, చైనా దేశానికే యాపిల్ సంస్థగా ప్రఖ్యాతి చెందిన సెల్ ఫోన్ దిగ్గజం షామి సంస్థ ఆంధ్రప్రదేశ్ లో సెల్ ఫోన్ల ఉత్పత్తి ప్రారంభించింది. చైనాలో నంబర్ ఒన్ స్థానంలో వున్న ఈ కంపెనీ భారత్ లో తొలిసారిగా తన ప్లాంట్ ను ప్రారంభించింది. ఆంధ్రాలో ఉత్పత్తి అయిన రెడ్ మి–2 ప్రైమ్ స్మార్ట్ ఫోన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విశాఖపట్నంలో ఆవిష్కరించారు.

చిత్తూరు జిల్లాలోని శ్రీ సిటీలో తైవాన్‌కి చెందిన ప్రసిద్ధ సెల్ ఫోన్ల తయారీ సంస్థ ఫాక్స్ కాన్ శ్రీ సిటీ సెజ్‌లో ఫోన్ల తయారీ కర్మాగారాన్ని ఏర్పాటు చేయడం కూడా దానితో సంబంధం ఉన్న మరో కీలకమైన అంశమే. ఫాక్స్ కాన్ కంపెనీ కర్మాగారంలోనే షామి కంపెనీ తన ఫోన్లను తయారు చేస్తుంది. ప్రస్తుతం ఇక్కడ నెలకు 50 వేల ఫోన్లను తయారు చేస్తుండగా వచ్చే మార్చ్ నాటికి 50 లక్షల ఫోన్లను తయారు చేసే స్థాయికి కర్మాగారాన్ని విస్తరించాలని ఫాక్స్ కాన్ నిర్ణయించింది.

అనుకున్నది సాధించే కార్యసాధకుడు

అవశేషాంధ్రప్రదేశ్ పాలనాబాధ్యతలు స్వీకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎదురైన సవాళ్లు సవాలక్ష. ముఖ్యంగా, పారిశ్రామికంగా వెనకబడ్డ రాష్ట్రానికి దేశ విదేశ పరిశ్రమలు వెల్లువెత్తేలా చేయడంలో ఆయన కృషి నిరుపమానం. ఏడాదిలోనే ముఖ్యమంత్రి కొన్ని ముఖ్యమైన దేశాల్లో పర్యటించి వివిధ ప్రోత్సాహకాలు ప్రకటించి జాతీయ,అంతర్జాతీయ పారిశ్రామిక,వ్యాపార దిగ్గజాలను మెప్పించి, ఒప్పించడంలో సఫలం అయ్యారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పట్ల వివిధ సంస్థలు కనబరుస్తున్న ఆసక్తి, అందిస్తున్న ఆదరణ ప్రధాని నరేంద్ర మోడీనే ఆశ్చర్యపరచడం విశేషం.

శ్రీ సిటీలో ఫాక్స్ కాన్ ప్లాంట్

అగ్రగామి మొబైల్ ఫోన్ తయారీ సంస్థ ఫాక్స్ కాన్ ప్లాంట్ చిత్తూరు జిల్లా శ్రీ సిటీ ఆర్థిక మండలిలో. దాదాపు రూ.350 కోట్ల పెట్టుబడులతో ప్లాంట్ ప్రారంభమైంది. భారతదేశంలోనే సెల్ ఫోన్ తయారు చేసే మొట్టమొదటి కర్మాగారం ఆంధ్రప్రదేశ్‌కి రావడం విశేషం. ఇప్పటివరకు భారత్‌లో హార్డ్‌వేర్ తయారీ పరిశ్రమ లేదు. కొత్త రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఫాక్స్ కాన్ వచ్చి తన ప్లాంటును శ్రీ సిటీలో ఏర్పాటు చేసింది.

యాపిల్, నోకియా, సోనీ తదితర అంతర్జాతీయ బ్రాండ్లకు ఫోన్లు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు తయారుచేసే తైవాన్ సంస్థ అయిన ఫాక్స్‌కాన్ ఇటీవల మన దేశంలో కార్యకలాపాలు విస్తరించడంపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా రెండు మూడు చోట్ల తయారీ, పరిశోధనా కార్యకలాపాలు చేపట్టాలని నిర్ణయించింది. చెన్నైలో నోకియా ప్లాంట్‌ను నిర్వహించిన అనుభవం వున్నందున నౌకాశ్రయానికి సమీపంలో వున్న శ్రీ సిటీ ని తన తయారీ కార్యకలాపాలకు కేంద్ర స్థానంగా ఫాక్స్ కాన్ ఎన్నుకున్నది. దీనికి 25 ఎకరాల స్థలాన్ని, 2.5 లక్షల చదరపు అడుగుల భవనాన్ని ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఇప్పటికే తాత్కాలిక భవనంలో ప్రారంభమైన ఈ సంస్థ కార్యకలాపాలు వచ్చే 6 నెలల నుంచి ఏడాది వ్యవధిలో పెద్దఎత్తున విస్తరించనున్నాయి. ప్లగ్ అండ్ ప్లే పద్ధతిలో ఫాక్స్ కాన్ మొబైల్ తయారీ పనులు ప్రారంభించింది.

పపంచ ప్రసిద్ధి పొందిన ఐఫోన్లు కూడా ఫాక్స్‌సాన్ చైనా ప్లాంటులోనే తయారవుతాయి. భారత్‌లో ఫోన్ల తయారీ కోసం పలు

కంపెనీ పెట్టాక, మొబైల్ తయారై బయటకు రావడానికి రెండేళ్లు పడుతుందని ఆ మధ్య చంద్రబాబు చైనాలో పర్యటించిన సందర్భంగా వివరించాము. దానికి ఆయన అంగీకరించారు కూడా. అయితే ఆయన అందించిన ఎనలేని ప్రోత్సాహంతో ఆరు నెలల్లోనే ఉత్పత్తి పూర్తి చేయగలిగాం.

– షౌమి సంస్థ ఉపాధ్యక్షుడు హ్యూగో బర్రా



శ్రీసిటిలో ఫాక్స్‌కాన్ ప్లాంటులో తయారైన షౌమి స్మార్ట్ ఫోన్‌ను విశాఖలో షౌమి వైస్ ప్రెసిడెంట్ హ్యూగో బర్రాతో కలిసి విడుదల చేస్తున్న దృశ్యం

అంతర్జాతీయ మొబైల్ సంస్థలతో ఫాక్స్‌కాన్ చర్చలు జరుపుతోంది. ఎలక్ట్రానిక్స్ రంగంలో పేరున్న సోనీ సంస్థ దేశీయంగా తమ ఉత్పత్తుల తయారిని శ్రీ సిటిలోని ఫాక్స్ కాన్ ద్వారా చేపట్టే దిశగా చర్చలు నడుస్తున్నాయి. త్వరలో ఈ ఒప్పందం కుదిరే అవకాశం వున్నట్లు ప్రభుత్వం భావిస్తుంది. సోనీతో పాటు మరిన్ని అగ్రశ్రేణి మొబైల్ ఎలక్ట్రానిక్స్ పరికరాల తయారీ శ్రీ సిటీలోని ప్రారంభమయ్యే అవకాశాలు వున్నాయి. ఫాక్స్‌కాన్ రాకతో, భవిష్యత్తులో సెల్ ఫోన్లు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల తయారీలో నిమగ్నమైన ఇతర కంపెనీలు కూడా ఇక్కడికి రానున్నాయి. శ్రీ సిటీలో ఏర్పాటు అవుతున్న ఫాక్స్‌కాన్ కంపెనీ ఒక్కటే వచ్చే 3,4 ఏళ్లలో యువతకు 5,000 ఉద్యోగాలు కల్పించే అవకాశం వుంది.

మరో పక్క అనంతపురం, హిందూపురం మధ్య గల ప్రదేశంలో ఎలక్ట్రానిక్ పరిశ్రమను ఆకర్షించేందుకు ఏపీ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నది. బెంగుళూర్‌కి దగ్గరగా వుండటం స్థలం లభ్యత తదితర సానుకూలతలు అక్కడ వుండటంతో జపాన్, కొరియా, సింగపూర్ కంపెనీలను ఏర్పాటు చేయాల్సిందిగా ఏపీ సిఎం చంద్రబాబునాయుడు కోరినట్లు సమాచారం. అట్లాగే అమెరికాకు చెందిన ఇన్ ఫోకస్ భారత మార్కెట్‌లోకి డ్యూయల్ మోడ్ 4జి స్మార్ట్ ఫోన్లు, ట్యాబ్లెట్లు, అల్ట్రా హైడెఫినిషన్ (యుహెచ్ డి) టీవీలు విడుదల చేస్తోంది. సెప్టెంబర్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని ఫాక్స్‌కాన్ మ్యాన్యూఫాక్చరింగ్ సెంటర్లో స్మార్ట్ ఫోన్‌లను ఉత్పత్తి చేయనున్నట్లు ఇన్ ఫోకస్ ఇండియా హెడ్ సచిన్ థాపర్ వెల్లడించారు. ఈ కంపెనీకి చెందిన అన్ని స్మార్ట్ ఫోన్‌లను ఆంధ్రప్రదేశ్ లో ఉత్పత్తి చేయడమే కాకుండా ఎగుమతులను కూడా ఇక్కడి నుంచే చేపట్టనున్నారు. 2016 నాటి కల్లా భారత మార్కెట్ నుంచి 100 కోట్ల డాలర్ల రెవెన్యూ (6300 కోట్ల రూపాయల)ను రాబట్టుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు , ప్రస్తుత కంపెనీ వ్యాపారంలో స్మార్ట్ ఫోన్ వాటా 70 శాతం కాగా మిగిలిన వాటా టెలివిజన్లు, ఇతర ఉత్పత్తులది అని సచిన్ థాపర్ తెలిపారు.

సిఎం చైనా పర్యటన ఫలితం

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇటీవలి చైనా పర్యటన సందర్భంగా బీజింగ్ లో షౌమి అధ్యక్షుడు లిన్ బెన్, ఉపాధ్యక్షుడు హ్యూగో బర్రా, ఫాక్స్ కాన్ ప్రతినిధి మైక్ చాంగ్ తదితరులతో భేటీ అయ్యిన విషయం తెలిసిందే. ప్రతి ఏడాది 200 నుండి 300 బిలియన్ డాలర్ల విలువైన హార్డ్‌వేర్ ఉత్పత్తులను ఈ సంస్థల నుంచి భారత్ దిగుమతి చేసుకుంటుంది. దీనికి ప్రత్యామ్నాయంగా ఆంధ్రప్రదేశ్‌లో ఉత్పత్తి పరిశ్రమలు స్థాపించాలని చంద్రబాబు వారిని కోరారు. దాని ఫలితంగానే ఇప్పుడు, భారీ పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చాయి ఆ సంస్థలు.

"కంపెనీ పెట్టాక, మొబైల్ తయారై బయటకు రావడానికి రెండేళ్లు పడుతుందని ఆ మధ్య చంద్రబాబు చైనాలో పర్యటించిన సందర్భంగా వివరించాము. దానికి ఆయన అంగీకరించారు కూడా. అయితే ఆయన అందించిన ఎనలేని ప్రోత్సాహంతో ఆరు నెలల్లోనే ఉత్పత్తి పూర్తి చేయగలిగాం," అని షౌమి సంస్థ ఉపాధ్యక్షుడు హ్యూగో బర్ర ఈ సందర్భంగా చెప్పారు.

ఆంధ్రాలో ఉత్పత్తి అయిన రెడ్ మి-2 ప్రైమ్ స్మార్ట్ ఫోన్ ను విశాఖపట్నంలో ఆవిష్కరించిన సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, తయారీ రంగానికి భారతదేశం హబ్ గా మారబోతుందని, ఆంధ్రప్రదేశ్ ను కూడా అదే పంథాలో నడపడానికి తాను కృషి చేస్తున్నానని చెప్పారు.

భారత్ లో విక్రయించే ప్రతి షౌమి ఫోన్‌ను భారత్ లోనే తయారు చేస్తామని తక్కువ ధరలో ఎక్కువ సదుపాయాలు వున్న ఫోన్ ను అందించాలన్న ఉద్దేశంతో 2జిబి రామ్ 16 జిబి అంతర్గత మెమొరితో రెడ్ మి-2 ప్రైమ్ మోడల్ ను రూపొందించి రూ. 6,999 లకే విక్రయిస్తున్నామని హ్యూగో బర్రా చెప్పారు. భారత్ లో ఈ-కామర్స్ ప్రథమ స్థానంలో వున్న ఫ్లిప్‌కార్ట్‌తో షౌమి ఒప్పందం చేసుకుంటుందని, స్మార్ట్‌ఫోన్‌లను విక్రయించేందుకు ఎయిర్‌టెల్ వంటి మొబైల్ ఆపరేటర్లతో సంప్రదింపులు జరుపుతున్నామనీ ఆయన తెలిపారు.

ఏది ఏమైనా, మెరుగైన పారిశ్రామిక విధానానికి రూప కల్పన చేసి అనేక మంది దేశ, విదేశ పారిశ్రామిక వేత్తలు, వ్యాపార దిగ్గజాలు తరలి వచ్చేలా చేసి రాష్ట్ర పారిశ్రామిక వికాసానికి దారులు వేస్తున్నారు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు.



నీరుకొండ ప్రసాద్



చంద్రన్న బీసీ స్వయం ఉపాధి రుణమేళ బీసీ సంక్షేమంలో కొత్త అధ్యాయం

జనాభాలో అధిక భాగం ఉన్న వెనకబడిన కులాల (బిసిలు) సంక్షేమానికి సంబంధించి దేశంలోనే ప్రముఖంగా వినిపించే తొలి పేరు స్వర్గీయ ఎన్టీ రామారావు అయితే, మలి నేత నారా చంద్రబాబు నాయుడు. బీసీల సంక్షేమానికి ఈ ఇద్దరు ప్రజానాయకులు ప్రవేశపెట్టిన పథకాలు ఎన్నో. ఇటీవల బీసీల సంక్షేమం, బీసి కార్పొరేషన్ అనంతపురం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహించిన 'చంద్రన్న బీసీ స్వయం ఉపాధి రుణమేళ' ఒక అపూర్వమైన కార్యక్రమం, రాష్ట్ర స్థాయి ఉత్సవం.

బీసీలకు గొప్ప వరం వంటి ఈ కార్యక్రమాన్ని చంద్రన్న నిబద్ధ సహచరుడు, రాష్ట్ర బీసీ సంక్షేమ మంత్రి కొల్లు రవీంద్ర నేతృత్వం వహించి, విజయవంతం చేశారు.

అనంతపురంలో ఆరంభం

బీసీలు, చేనేతలు అధిక జనాభా ఉన్నందు వల్ల రాష్ట్ర స్థాయి బీసీ కార్పొరేషన్ రుణమేళా– 'చంద్రన్న బీసీ స్వయం ఉపాధి ఉత్సవాల 'ను అనంతపురం జిల్లా నుంచి ప్రారంభించింది రాష్ట్ర ప్రభుత్వం. రాష్ట్ర వ్యాప్తంగా 23,000 మంది బీసీ లబ్ధిదారులకు 50 శాతం సబ్సిడీపై రూ.126 కోట్ల రూపాయలు విడుదల కాగా, అనంతపురం జిల్లాలోని 3313 మంది బీసీ లబ్ధిదారులకు రూ. 9 కోట్లను పంపిణీ చేశారు.

గత పదేళ్లలో బీసీ కార్పొరేషన్ నిర్వీర్యమయింది. పసిగుడ్డుగా కళ్లు తెరిచిన నవ్యాంధ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమౌతునప్పటికీ, జనాభాలో అధిక భాగం ఉన్న బీసీ సంక్షేమానికి బడ్జెట్ లో రూ. 3212 కోట్లు కేటాయించింది చంద్రన్న ప్రభుత్వం. దానికి తోడు, బీసీల అభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని బీసీ సబ్ ప్లాన్ పేరిట 2015 – 2016 బడ్జెట్ లో రూ. 6640 కోట్లు కేటాయించింది. మొత్తం 21 శాఖల ద్వారా ఈ నిధులు వ్యయం చేయాలని సంకల్పించడం బీసీల పట్ల ప్రభుత్వానికున్న చిత్తశుద్ధికి తార్కాణం.

బీసీ కార్పొరేషన్ ద్వారా 50 శాతం సబ్సిడీతో రూ. 190 కోట్లు, బ్యాంకుల ద్వారా రూ. 190 కోట్లను మొత్తం రూ.380 కోట్ల ఆర్థిక సహాయంతో 70 వేల మంది బీ.సీల లబ్ధిదారులకు స్వయం ఉపాధి కింద ఆర్థిక లబ్ధిని చేకూర్చనున్నారు. ఆగష్టు నెలాఖరుకు 13 జిల్లాలో 23 వేల మంది బీ.సీల లబ్ధిదారులకు రూ. 126 కోట్ల ఆర్థిక లబ్ధి చేకూర్చారు. అంతేకాకుండా, ప్రతి రెండు నెలలకు ఒకసారి అర్హులైన లబ్ధిదారులను గుర్తించి రుణ మేళాద్వారా పారదర్శకంగా ప్రజలు, ప్రజాప్రతినిధుల మధ్యలో పంపిణీ చేస్తామని మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు.

బీసీ, ఐబీసీ విద్యార్థుల ఫీజుల చెల్లింపు

రాష్ట్రంలో దాదాపు 10 లక్షల మంది బీసీ, ఐబీసీ విద్యార్థులకు సంబంధించి రూ. 1660 కోట్ల ఫీజు రీయింబర్సుమెంటు కింద చెల్లించి ఒక్క రూపాయి బకాయి లేకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చర్యలు చేపట్టారని, ఈ ఏడాది అదనంగా రూ. 850 కోట్లను ఫీజు రీయింబర్సుమెంటు కింద సిద్ధంగా ఉంచినట్లు మంత్రి తెలిపారు. ఉద్యోగులు శిక్షణ నిమిత్తం 13 జిల్లాల్లో బీసీ సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని, 897 సంక్షేమ హాస్టల్స్‌కు ఉండగా ప్రభుత్వ భవనాలు లేని 397 హాస్టల్స్ కు ఒక్కొక్క హాస్టల్ కి రూ. 80 లక్షలతో హాస్టల్ భవనాలను నిర్మిస్తున్నామన్నారు. ఇందులో తొలి విడతగా 72 హాస్టల్స్ నిర్మాణం చేపట్టామని, అనంతపురం జిల్లాలో 3 హాస్టల్స్ భవనాలు ప్రారంభించామన్నారు మంత్రి. 897 బీసీ హాస్టల్స్ లో 95 వేల మంది విద్యార్థులకు బీసీ సబ్ ప్లాన్ ద్వారా దశల వారిగా మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి ముఖ్యమంత్రితో చర్చిస్తున్నామన్నారు. హాస్టల్స్ లో 93 శాతం, పదో తరగతి, ఫలితాలను, 32 రెసిడెన్షియల్ స్కూళ్లలో 99 శాతం ఉత్తీర్ణత సాధించామన్నారు. దశల వారిగా బీసీ సంక్షేమ హాస్టల్స్ ను రెసిడెన్షియల్ స్కూల్స్ గా కాలేజీలుగా మార్పు చేస్తామన్నారు.


చేనేతల సంక్షేమం కోసం త్వరలో 25 వేల మంది చేనేత కార్మికులకు సంబంధించిన రూ. 125 కోట్లు రుణాలను మాఫీ చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదుకోనున్నారని, 8600 మంది చేనేతలకు, నెలకు రూ. 1000 చొప్పున పెన్షన్లు అందిస్తున్నామని ఆయన చెప్పారు. బీసీలకు రూ. 2.75 లక్షలతో 270 చ అడుగుల ఇంటిని, చేనేతలకు అదనంగా రూ. 80 వేలతో వర్క్‌షెడ్ నిర్మించి ఇస్తామని మంత్రి చెప్పారు.

అనంతపురం జిల్లాలో 20.80 లక్షల మంది 54 శాతం బీసీలు ఉన్నారని రూ. 25 కోట్లతో 3,300 మందికి బీసీ కార్పొరేషన్ రుణాలలో 14,610 బీ.సీ విద్యార్థులకు రూ. 20 కోట్ల రూపాయల స్కాలర్ షిప్స్, 735 మంది బీసీ రైతులకు 7 కోట్లతో డ్రిప్, తుంపర సైద్యం యూనిట్లను అందించామన్నారు. 3.75 లక్షల బీసీ రైతులకు రుణమాఫీ చేశామని, 12,900 మంది బీసీ విద్యార్థులు హాస్టల్స్ లో ఉన్నారని ఈ సారి 100 శాతం ఉత్తీర్ణత సాధించడానికి చర్యలు చేపట్టామన్నారు. కాబట్టి, బీసీల సంక్షేమం, వారి అభివృద్ధి పట్ల ఎనలేని శ్రద్ధతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అందిస్తున్న 50 సబ్సిడి రుణాలను బీసీ సోదరులు స్వయం ఉపాధికి వినియోగించుకొని ఆర్థిక అభ్యున్నతి పొందాలని మంత్రి కొల్లు రవీంధ్ర విజ్ఞప్తి చేశారు.

❖

ఏపీ రాజధాని నిర్మాణంపై ప్రపంచమంతా ఎదురుచూస్తోంది

అడ్వయిజరీ కమిటీ భేటీ లో సీఎం చంద్రబాబు



ఆర్థిక కార్యకలాపాలకు అమరావతి నెలవు కావాలని, రాజధాని నిర్మాణంలో గొప్ప ప్రణాళిక వుండాలని, విద్య, వైద్యం, ప్రజారవాణా ఏవిధంగా వుండాలో తన ఆలోచనలను ముఖ్యమంత్రి సలహాసంఘంతో పంచుకున్నారు. నిధులు ఎంతకావాలి? అందులో రుణంగా ఎంత సమీకరించవచ్చు? అనే అంశాలపై కూలంకషంగా అధ్యయనం చేయాలన్నారు.

కొత్త రాజధాని నిర్మాణంలో భాగస్వాములయ్యేందుకు ప్రపంచ దేశాలన్నీ ఆసక్తిగా వున్నాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పారు. రాజధాని నిర్మాణ సలహాసంఘ సమావేశంలో మాట్లాడారు. సింగపూర్ ప్రభుత్వం మాస్టర్ ప్లాన్లను ఉచితంగా రూపొందించి అందజేసిందని, రాజధాని నిర్మాణంలో పాలుపంచుకునేందుకు జపాన్ ఆసక్తిగా వుందని, చైనా, మలేషియా కంపెనీలు కూడా ఉత్సాహంగా వున్నట్లు సీఎం వివరించారు. కొత్త రాజధానిని నిర్మించుకునే అవకాశం లభించటం ఒక అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. ప్రపంచంలో అద్భుత నగరం ఒకటి రాబోతోందనే ఊహలను దేశవ్యాప్తంగా చర్చకు సింగపూర్ ప్రభుత్వ మాస్టర్ ప్లాన్ నాంది పలికిందని అన్నారు.

రాజధానిలో ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం ఇవ్వాలని, అదేవిధంగా పెట్టుబడులు పెడుతున్న విదేశీ కంపెనీలకు సహకారం అందించాలని చెప్పారు. మాస్టర్ ప్లాన్, సీడ్ క్యాపిటల్, క్యాపిటల్ సిటీ, క్యాపిటల్ రీజియన్ లను అమూలాగ్రం అధ్యయనం చేయాలని అడ్వయిజరీ కమిటీ సభ్యులకు సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాజెక్టు ప్రపంచానికే గర్వకారణం కావాలని, ఇతర దేశాలకు ఒక నమూనాగా వుండాలని ఆకాంక్షించారు. రీఎనర్జీ స్మార్టు గ్రిడ్, విశాలమైన రహదారులు, డ్రెయిన్లు, పచ్చదనం, పరిశుభ్రత అభివృద్ధిలో ప్రపంచ స్థాయి విధానాలు అనుసరించాలన్నారు. పర్యాటకులను ఆకట్టుకునేలా నదీముఖ ద్వారాలను (వాటర్ ఫ్రంట్) తీర్చిదిద్దాలన్నారు. స్థానిక వనరులను, మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా ప్రణాళికలు తయారు చేయాలన్నారు.

ఆధునిక సాంకేతికాభివృద్ధి వల్లనే ఇస్తాంబుల్ నగరం ఏడేళ్లలోనే గణనీయమైన అభివృద్ధి సాధించిందన్నారు. ఎమిరేట్స్ ఎయిర్ లైన్స్ కన్నా టర్కీ ఎయిర్ లైన్స్ ముందంజలో వుందన్నారు. విమాన ప్రయాణీకుల సంఖ్య 3 మిలియన్ల నుంచి 24 మిలియన్లకు పెరిగిందని చంద్రబాబు తెలిపారు. రెండు కోట్ల జనాభా వున్న ఇస్తాంబుల్ లో తలసరి ఆదాయం 10 వేల డాలర్లు వుందని చెప్పారు. స్వల్పకాలంలో పర్యాటక రంగం గణనీయంగా అభివృద్ధి చెందిందని, తన టర్కీ పర్యటన అనుభవాలను వివరించారు.

ప్రధాని నరేంద్ర మోడీ గోదావరి పుష్కరాల సమయంలో తనకు ఫోన్ చేసి రష్యా పర్యటనలో తాను సందర్శించిన తజకిస్తాన్, తుర్కుమినిస్థాన్ , రాజధాని నగరాలు గొప్పగా వున్నాయంటూ వాటి నిర్మాణాన్ని అధ్యయనం చేయాలని, ప్రత్యేక బృందాన్ని పంపాలని చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు.

అక్టోబర్ 22న కొత్త రాజధానికి శంకుస్థాపన అనంతరం నిర్మాణ పనులు వేగం పుంజుకుంటాయన్నారు. రెండు ఇండస్ట్రియల్ టౌన్‌షిప్ ల మధ్య పోర్ట్ బేస్డ్ కేపిటల్ (రేవు ఆధారిత రాజధాని)లో అమరావతిని అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు.

ఇటీవల తన జపాన్ పర్యటనలో అక్కడి ప్రధాని, మంత్రులు, అధికారులతోపాటు జైకా, నెడో, మెటి ప్రతినిధులు వెలిబుచ్చిన అభిప్రాయాలను ఈ భేటీలో సీఎం ప్రస్తావించారు. గాంధినగర్, చండీగఢ్, నయారాయపూర్, నవీ ముంబయ్ నగరాల నిర్మాణం, వాటిలో లోపాలను గురించి ఈ సందర్భంగా చర్చించారు. కొత్త రాజధానిలో గ్రీన్ కవర్, కాలుష్యరహిత వ్యవస్థల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలను అధ్యయనం చేయాలని కోరారు.

ఆర్థిక కార్యకలాపాలకు అమరావతి నెలవు కావాలని, రాజధాని నిర్మాణంలో గొప్ప ప్రణాళిక వుండాలని, విద్య, వైద్యం, ప్రజారవాణా ఏవిధంగా వుండాలో తన ఆలోచనలను ముఖ్యమంత్రి వారితో పంచుకున్నారు. నిధులు ఎంతకావాలి? అందులో రుణంగా ఎంత సమీకరించవచ్చు? అనే అంశాలపై కూలంకషంగా అధ్యయనం చేయాలన్నారు.

కేంద్ర మంత్రి శ్రీ వైఎస్ చౌదరి, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డా.పి నారాయణ, ఎంపీ గల్లా జయదేవ్, ప్రభుత్వ సలహాదారు డా. పరకాల ప్రభాకర్, ప్రణాళికా శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎస్.పి టక్కర్, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శ్రీ సతీష్ చంద్ర, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి డా. పివి రమేష్, సిఆర్‌డిఏ కార్యదర్శి అజయ్‌జైన్, పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎస్.ఎస్ రావత్, సలహాసంఘ సభ్యులైన పారిశ్రామికవేత్తలు శ్రీనిరాజు, బొమ్మిడాల శ్రీనివాస్, నూజివీడు సీడ్స్ అధిపతి మండవ ప్రభాకరరావు, సంజయ్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ❖

రాలిపోతున్న విద్యాసుమాలు

ప్రక్షాళనకి పూనుకున్న ప్రభుత్వం



ర్యాగింగ్‌కి గురై ఆత్మహత్యకు పాల్పడ్డ నాగార్జున విశ్వవిద్యాలయం విద్యార్థి రిషితేశ్వరి పటానికి పూలమాల వేస్తున్న మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు

ఆంధ్రప్రదేశ్ లోని విశ్వవిద్యాలయాల్లో విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించే దిశగా చర్యలు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతోంది. విశ్వవిద్యాలయాల్లో సామరస్యపూర్వకమైన మంచి వాతావరణం నెలకొనే రీతిలో ప్రక్షాళనకు రాష్ట్ర విద్యాశాఖ కసరత్తు మొదలుపెట్టింది. ఇప్పటి వరకూ యూనివర్శిటీల్లో ఉన్న పాత వాటి స్థానే కొత్త నిబంధనల రూపకల్పనపై మానవ వనరుల అభివృద్ధి శాఖ పలువురు నిపుణులను సంప్రదిస్తోంది. నాగార్జున యూనివర్సిటీ బీఆర్క్ విద్యార్థిని రిషితేశ్వరి ఆత్మహత్య ఘటన నేపథ్యంలో యూనివర్సిటీల ప్రక్షాళనకు రాష్ట్రప్రభుత్వం నడుం బిగించింది.

రిషితేశ్వరి ఆత్మహత్య ఘటన విద్యార్థి లోకాన్ని, సభ్య సమాజాన్ని కదిలించింది. పెద్దఎత్తున విద్యార్థులు ఆందోళనకు దిగారు. రిషితేశ్వరికి న్యాయం జరగడంతోపాటు, ఇతరత్రా విద్యార్థులకు యూనివర్శిటీ పరిధిలో తగు రక్షణ కల్పించాలన్న డిమాండులు ఎదురయ్యాయి. ఈ ఘటనపై జులై 29న ప్రభుత్వం బాలసుబ్రహ్మణ్యం కమిటీని నియమించింది. విచారణ ప్రారంభించిన బాలసుబ్రహ్మణ్యం కమిటీ యూనివర్సిటీలోని సుమారు 170 మంది విద్యార్థులను, రిషితేశ్వరి తల్లిదండ్రులను, నిందితుల తల్లిదండ్రులను, యూనివర్సిటీ అధ్యాపకులు, అధికారులను కమిటీ విచారించింది. రిషితేశ్వరి ఆత్మహత్యకు పాల్పడిన గదిలో లభించిన ఆధారాలు, విచారణలో పలువురు తెలిపిన అభిప్రాయాలనుబట్టి ర్యాగింగ్ కారణంగానే రిషితేశ్వరి మృతి చెందినట్టు కమిటీ నిర్ధారించింది. సీనియర్ల ప్రవర్తనతో మానసిక, శారీరక ఒత్తిడికి గురై.. డిప్రెషన్‌తో ఆత్మహత్యకు పాల్పడినట్టు కమిటీ నివేదికలో పేర్కొంది. వ్యవస్థలోను, యూనివర్సిటీలో ఉన్న లోపాలు కూడా పరోక్షంగా ఇందుకు దారితీశాయని కమిటీ అభిప్రాయపడింది.

దర్యాప్తు బృందం యూనివర్సిటీలో ర్యాగింగ్‌కు దారితీసిన పరిస్థితులతోపాటు భవిష్యత్తులో అలాంటివి జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వానికి పలు సూచనలు చేసింది. నివేదికలోని అంశాలు, దానిపై తీసుకున్న చర్యలు తీసుకోవడంపై మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు దృష్టి పెట్టారు. ఈ నేపథ్యంలో రిషితేశ్వరి ఆత్మహత్య కేసులో తొలినుంచీ తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న బీఆర్క్ కాలేజీ ప్రిన్సిపాల్‌బాబూరావును ప్రభుత్వం డిస్మిస్ చేసింది. ఆయనపై ప్రాసిక్యూషన్‌కు సైతం ఆదేశించారు. రిషితేశ్వరి మృతి కేసులో నాగార్జున యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ సాంబశివరావును బదిలీ చేశారు. ఆయన స్థానంలో సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ బి.ఉదయలక్ష్మికి బాధ్యతలు అప్పగించారు. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురిని అరెస్టు చేశారు. మరికొంతమంది పాత్రపైనా విచారణ జరుగుతోంది. యూనివర్సిటీల ప్రక్షాళనలో భాగంగా వీసీలతో కలిసి రాత్రిపూట ఆకస్మిక తనిఖీలు నిర్వహించడానికి మంత్రి గంటా శ్రీనివాసరావు ఉపక్రమించారు. ర్యాగింగ్‌పై ఫిర్యాదు చేసేందుకు టోల్‌ఫ్రీ నంబర్ 425 5314ను ఏర్పాటు చేశారు.

కొన్నాళ్ళుగా యూనివర్సిటీలు అక్రమాలకు అడ్డాగా మారాయి. రాజకీయ జోక్యం, అధ్యాపకుల అలసత్వం, విద్యార్థి కుల, ఇతరత్రా రాజకీయాల ప్రమేయం యూనివర్శిటీల్లో ప్రశాంత వాతావరణం కరువయింది. సీనియర్ విద్యార్థులు చదువు పూర్తయినా యూనివర్శిటీ హాస్టళ్ళను వదిలి వెళ్ళకపోవడం, ర్యాగింగ్ వేళ్ళూనుకునిపోవడం వంటి దుర్లక్షణాలతో యూనివర్శిటీ విద్య మిథ్యగా, ఆకతాయిలకు ఆటపట్టుగా మారిందనడంలో అతిశయోక్తి కాదు...విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన, విజ్ఞాన సముపార్జన నేతిబీరకాయలో నేయి చందంగా మారింది. ఉన్నత విద్యాలయాల మాటే గానీ ఉన్నత వ్యక్తిత్వాలకు చోటు లేకుండా పోయిందన్న విమర్శలు తలెత్తుతున్నాయి. విశ్వవిద్యాలయాల్లో చదువు మినహా ఇతరత్రా వ్యవహారాల్లో విద్యార్థుల బిజీ కావడం విపరీత పోకడలకు దారితీస్తోంది. విద్యార్థి కులవర్గాల మధ్య పోటీతత్వం పెచ్చుమీరడం, హాస్టళ్ళలోనే ఏళ్ల తరబడి తిష్ట వేయడం, హాస్టళ్లు అనైతిక,అసాంఘిక కార్యకలాపాలకు నెలవులు కావడం వంటి దుశ్చర్యల మూలంగా యూనివర్శిటీల్లో అశాంతికి కారణమవుతోంది.

హాస్టల్‌లో ఏళ్ళ తరబడి తిష్ట

ఇటీవల అనంతపురంలోని ఒక యూనివర్సిటీని తనిఖీ చేయగా.. పదేళ్ల కిందట చదువు పూర్తిచేసిన ఒక వ్యక్తి ఇప్పటికీ హాస్టల్‌లో ఉంటూ, మూడు గదులను తన ఆధీనంలో ఉంచుకుని అసాంఘిక కార్యకలాపాలు జరుపుతున్న విషయం బయటపడింది. రాష్ట్రంలో ఏడు యూనివర్సిటీలకు వీసీలు లేనందున అదే తీరులో అరాచకవాదులు తిష్ట వేసినా నిమ్మకునీరెత్తుతున్న దుస్థితి

"రాష్ట్ర వ్యాప్తంగా ఏ ఒక్క కళాశాలలోనూ ఎలాంటి వేధింపులు జరుగుతున్నా ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదు. విద్యార్థులు వేధింపులపై ఫిర్యాదు చేసిన వెంటనే కఠిన చర్యలు తీసుకునేలా విశ్వవిద్యాలయ ఫిర్యాదుల వ్యవస్థల్ని కసరత్తు చేస్తున్నాం. విద్యార్థులు ధైర్యంగా ఫిర్యాదు చేసే పరిస్థితి తెస్తాం. ర్యాగింగ్ పేరెత్తడానికే భయపడేలా నిబంధనలు తీసుకొస్తాం.

– గంటా శ్రీనివాసరావు, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి.

చోటుచేసుకుంటోంది. ఇదే పరిస్థితి కొనసాగితే విద్యాబుద్ధులు నేర్పాల్సిన యూనివర్శిటీలు అరాచక శక్తుల ఉత్పత్తి కేంద్రాలుగా మారతాయనడంలో సందేహం లేదు. ఈ దుస్థితి నుంచి యూనివర్శిటీలను విముక్తి కలిగించాలన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి ఆదేశాల మేరకు ఉన్నత విద్యాశాఖాధికారులు నడుం బిగించారు. విద్యార్థుల్లో ఆందోళనకర వాతావరణం, సమర్థ నాయకత్వం కొరవడి ఆలనాపాలనా కరవైన స్థితిలో యూనివర్సిటీలకు పాలక మండళ్లను ఏర్పాటు చేసేందుకు ప్రస్తుత ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది.

ర్యాగింగ్ నిరోధానికి కమిటీ సిఫారసులు

a రిషితేశ్వరి మృతికి కారకులైన వారిపై ర్యాగింగ్ నిరోధక చట్టం, నిర్భయ చట్టంతోపాటు ప్రొహిబిషన్ ఆఫ్ సెక్సువల్ హెరాస్‌మెంట్ ఆఫ్ ఉమెన్ ఎట్ వర్క్ ప్లేస్ కింద కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలి.

a విచారణ పూర్తయ్యేంత వరకూ ప్రిన్సిపాల్ బాబూరావు విధులకు హాజరు కాకుండా నిషేధించాలి.

a కేసు విచారణను సత్వరమే ముగించేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాలి. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను నియమించాలి.

a సుప్రీం కోర్టు, యూజీసీ, రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను పాటించాలి.

a హాస్టళ్లలో రక్షణ చర్యలపై ఆరు నెలలకు ఒకసారి సమీక్ష నిర్వహించాలి.

a హాస్టళ్లలోకి బయటి వ్యక్తులు ప్రవేశించకుండా గుర్తింపు కార్డులు, బయోమెట్రిక్ విధానం అమలు చేయాలి.

a విద్యా సంస్థల్లో ర్యాగింగ్ పై బాధితులు ఫిర్యాదులు చేసేందుకు వీలుగా ప్రత్యేకంగా ఒక మొబైల్ యాప్ ను అభివృద్ధి చేయాలి.

a ముఖ్యమైన ప్రాంతాల్లో నిఘా కెమెరాలు ఏర్పాటు చేయాలి. బాలికల వసతి గృహంలో పటిష్ట భద్రతను ఏర్పాటు చేయాలి.

a వసతి గృహాల్లో ఉంటున్న బయటి వారిని పంపించేయాలి. వసతి గృహ విద్యార్థుల వివరాలను ప్రతి వసతిగృహం నోటీసు బోర్డులోనూ, విశ్వవిద్యాలయం వెబ్ సైట్ లోనూ ఉంచాలి.

a ర్యాగింగ్ కు పాల్పడే వారికి తగిన శిక్షలను అమలు చేయాలి.

a విద్యార్థుల్లో బృంద స్ఫూర్తిని పెంచేందుకు క్రీడలు, క్విజ్, ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తుండాలి.

a ర్యాగింగ్ నిరోధానికి రాష్ట్ర స్థాయి పర్యవేక్షణ విభాగం ఏర్పాటు చేయాలి.

a బాధితులు ఫిర్యాదు చేసేందుకు వీలుగా ప్రత్యేకంగా యాప్ ను అభివృద్ధి చేయాలి.

a మూడో పార్టీ చేత ప్రతి ఆరు నెలలకోసారి భద్రత ఆడిట్ నిర్వహించాలి.

a జీవన నైపుణ్యాలు, విలువలపై ఒక పత్రాన్ని ప్రవేశపెట్టాలి.

a యూజీసీ నిర్దేశాల మేరకు అధ్యాపకులకు ఒక నియమావళిని రూపొందించి దాన్ని అందరికీ పంచాలి.

a తరగతులకు హాజరు కానీయకుండా బహిష్కరించడం, బహిరంగ క్షమాణ చెప్పించి జరిమానా విధించడం, ఉపకార వేతనాలు, ఇతర ప్రయోజనాలను నిలిపి వేయడం, కళాశాలలో జరిగే ఏ కార్యక్రమంలోనూ పాల్గొనకుండా దూరంగా ఉంచడం.

a వసతి గృహం నుంచి బహిష్కరించడం వంటి చర్యలు తీసుకోవాలి.

a ఎక్కడైతే ర్యాగింగ్ జరుగుతుందో సంబంధిత సంస్థల విభాగాధిపతులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి.

a ప్రతి విద్యా సంస్థ మానసిక విశ్లేషకులను నియమించుకుని ర్యాగింగ్ పై అవగాహన కల్పించాలి.

a కళాశాల ప్రాంగణం బయట ఎలాంటి పార్టీలు, కార్యక్రమాలు నిర్వహించకూడదు.

a ర్యాగింగ్ పై జూనియర్లు ఫిర్యాదు చేసేందుకు వీలుగా టోల్ ఫ్రీ నెంబర్లు ఏర్పాటు చేసి దానికి విస్తృత ప్రచారం కల్పించాలి.

a విద్యాసంస్థల వసతి గృహాల్లో శాశ్వత ప్రాతిపదికన వార్డెన్ ను నియమించాలి. వారు అక్కడే నివాసం ఉండేలా చూడాలి. వసతి వార్డెన్ ఎప్పటికప్పుడు తల్లిదండ్రుల సమావేశం నిర్వహించాలి.

a అన్ని వసతి గృహాల్లోనూ బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేయాలి. గుర్తింపు కార్డులను జారీ చేయాలి.

a విద్యా సంస్థల ప్రాంగణాల్లో ర్యాగింగ్ నిరోధక సందేశాలను గోడ పత్రికలు, బ్యానర్ల రూపంలో ప్రదర్శించాలి.

a విద్యా సంస్థల కరపత్రాలు, ప్రవేశ దరఖాస్తులు తదితర వాటిల్లో ర్యాగింగ్ ను నిషేధించామని స్పష్టంగా పేర్కొనాలి.

a ర్యాగింగ్ జరిగితే ఎవరికి ఫిర్యాదు చేయాలి? ఎలా చెయాలి? వంటి అంశాలను వివరించేందుకు వీలుగా హెల్ప్ లైన్లు, కౌన్సిలింగ్ కేంద్రాల సమాచారం తదితర వివరాలతో కూడిన ప్రతులను విద్యార్థులకు వారి ప్రవేశాల సమయంలో అందించాలి.

a ఏదైనా నేరానికి పాల్పడి కేసుల్లో ఇరుక్కున్న విద్యార్థులను హాస్టళ్లలో చేర్చుకోరాదు.

a ఫ్రెషర్స్ డేను కళాశాలలు ప్రారంభమైన నెల రోజుల లోపు కళాశాల లేదా హాస్టల్ ఆవరణల్లోనే జరపాలి. వీలైనంత వేగంగా ముగించాలి.

యూనివర్శిటీల్లో క్రమశిక్షణ అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సత్వరం కొన్ని నిర్ణయాలను ఆచరణలోకి తీసుకొచ్చింది. విద్యార్థుల ఫిర్యాదులను స్వీకరించి తగిన చర్యలు తక్షణం తీసుకుని వారికి అండగా వుండేందుకు ప్రభుత్వం సంసిద్ధమైంది. ఆన్ లైన్ వ్యవస్థలు, ఈమెయిల్ చిరునామాలు ఏర్పాటు చేసి వాటి ద్వారా వచ్చే ఫిర్యాదులను విస్తృతంగా సమీక్షించి నిర్ణీత గడువులోనే చర్యలు తీసుకోవాలని యోచిస్తోంది. దీంతోపాటు వర్సిటీల్లో యువతుల రక్షణకు 'ఫిర్యాదుల పరిష్కార విభాగాలను ' ఏర్పాటు చేసి ఆ విభాగాలకి అందే ఫిర్యాదులపై చర్యలు తీకుంటున్నారా? లేదా? అన్న విషయాలని కూడా పరిశీలించనున్నారు.

విశ్వవిద్యాలయల్లో ఆచార్యుల నియామకం జరిగిన నాటి నుంచి ఉద్యోగ విరమణ చేసే వరకు ఒకే విశ్వవిద్యాలయంలో కొనసాగుతున్నారు. ఈ విధానాన్ని కూడా మార్చి విశ్వవిద్యాలయాల మధ్య బదిలీలు జరిపే అంశంపై కూడా నిపుణులతో మాట్లాడి ఒక నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ర్యాగింగ్ పై ఇప్పటి వరకూ విశ్వవిద్యాలయాల్లో కరపత్రాలు, గోడపత్రికలతో ప్రచారం చేస్తున్నారు. రాబోయే రోజుల్లో ప్రముఖులతో (సెలబ్రిటీలు) ప్రకటనలు ఇప్పించి విద్యార్థినీ, విద్యార్థులు ధైర్యంగా ఫిర్యాదు చేసే పరిస్థితి తీసుకు రావాలని ఉన్నత విద్యాశాఖ భావిస్తోంది. దీంతోపాటు మఫ్టీలో పోలీసుల్ని అన్ని కళాశాలలకు పంపి ఆకతాయిల్ని గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని కూడా యోచిస్తోంది.



జాస్తి గోపాల ప్రసాద్

కరువుసీమ కర్నూలుకు సమగ్రాభివృద్ధి

అల్ట్రామెగా ఫుడ్ పార్కు, మెగా ఇండస్ట్రియల్ హబ్ ప్రారంభం



"పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి ఎన్నో అవకాశాలు ఉన్న కర్నూలు జిల్లాను ఏడాది లోగా ప్రగతి బాట పట్టిస్తాం. దానివల్ల జిల్లా వాసులకు ఎక్కువ ఉపాధి అవకాశాలు లభిస్తాయి. జిల్లాలోని ప్రతి ఒక్క ఎకరానికి నీరు అందించడానికి ఎన్ని కోట్లు ఖర్చు చేయడానికైనా ప్రభుత్వ వెనకడుగు వేయదు. జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు నిరంతర శ్రామికుడిని అవుతాను. జిల్లాలో వ్యవసాయం, పరిశ్రమలను అభివృద్ధి చేసి, పిల్లలకు బంగారు భవిష్యత్ ను అందించే చర్యలకు మా ప్రభుత్వం నాంది పలికింది."

– ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

కర్నూలు జిల్లాలో ఎన్నో రకాల వనరులు ఉన్నా ఇన్నాళ్ళూ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. ఆ దుస్థితికి కారణాలు ఎంచుకుంటూ కాలయాపన చేయడం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి తత్వం కాదు. ఆయన నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ లో కొత్త ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి కర్నూలును అభివృద్ధి చేయడం మీదే దృష్టి పెట్టారు. కొత్త విమానాశ్రయం, సిమెంటు ఉత్పత్తుల హబ్, ట్రిపుల్ ఐటి మంజూరు, 1000 మెగావాట్ల సోలార్ హబ్, న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ తదితర పరిశ్రమలతో పారిశ్రామిక వాడగా తీర్చిదిద్ది, అన్ని రంగాల్లో అభివృద్ధి చేయ సంకల్పించారు.

ఇందులో భాగంగా రాళ్లురప్పలతో నిండిన ఓర్వకల్లు ప్రాంతాన్ని త్వరలో మెగా ఇండస్ట్రియల్ హబ్ గా రూపొందించడానికి ప్రభుత్వం నాంది పలికింది. ఓర్వకల్లు మండలం పూడిచెర్ల గ్రామంలో ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల మౌళిక సదుపాయాల కల్పన సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా ఇండస్ట్రియల్ హబ్ కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. రైల్వే వాగిన్ల మరమ్మత్తుల కర్మాగారం కోసం 115ఎకరాల భూసేకరణకు రూ.18 కోట్లు మంజూరు చేశారు. శ్రీశైలంలో టైగర్ ప్రాజెక్టు, బసవాసిలో పశువుల పరిశోధన కేంద్రం, నంద్యాలలో విత్తన ఉత్పత్తి కేంద్రం, డోన్ లో మైనింగ్ స్కూలు ఏర్పాటుతోపాటు జిల్లాను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతారు. జిల్లాకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చడానికి ప్రభుత్వం కృషి చేస్తోంది.

రాష్ట్రంలో 3,300 కోట్ల రూపాయలతో నెలకొల్పే నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాన్ని కర్నూలులో కూడా ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. సాగు నీటి ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యత నిచ్చి పనులు ముమ్మరంగా చేసుకుంటూ వెళు తున్నారు. ఈ ఏడాది హంద్రి నీవా కాలువ పనులు పూర్తి చేసి జిల్లాలో 85 వేల ఎకరాలకు సాగు నీరు యివ్వనున్నారు. ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకాన్ని డిసెంబర్ లోగా పూర్తి చేయడంతో పాటు సిద్దాపురం

ప్రాజెక్టు,గురురాఘవేంద్ర ప్రాజెక్టు పనులను కూడ వేగవంతంగా పూర్తి చేయనున్నారు. గోదావరి నీటిని కృష్ణాకు అనుసంధానం చేసే పనులు దాదాపు పూర్తయ్యాయి. రైతాంగానికి నీళ్లు ఇస్తే బంగారం పండిస్తారు. తక్కువ నీటితో అధిక దిగుబడి నిచ్చే పంటలకు ప్రాధాన్యత నిస్తూ ఉద్యాన పంటలు రైతులు వేసుకోవాలి. రాయలసీమ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్ గా తయారు చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించనున్నారు. వర్షపు నీటిని భూగర్భ జలాలుగా మార్చుకొని కరువు రహిత ప్రాంతంగా మలచుకోవాలని భావిస్తున్నారు. జిల్లాలో మెగాఫుడ్ పార్కు, గుజరాత్ అంబుజా తదితర పరిశ్రమల్లో వేల మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుంటోంది.

రాయలసీమ రత్నాలసీమ

రాబోయే 5 సంవత్సరాల్లో నాలెడ్జ్ హబ్ గా రూపొందించడంతో పాటు రూ. 200 కోట్లుతో ఇనికోబేసిస్ సెంటరు స్థాపించి ఇంజనీరింగు విద్యార్థులకు ప్రోత్సహించనున్నారు. సంవత్సరంలోగా కర్నూలు నగరాన్ని స్మార్ట్ సిటిగా చేసేందుకు ఒక రూపాన్ని తీసుకొస్తున్నారు. కర్నూలుకు రింగు రోడ్డు తయారు చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించనున్నారు. కర్నూలు నుండి అమరావతి వరకు ఫోర్ లైను రహదారి ఏర్పాటు చేయనున్నారు. ఓర్వకల్లులో 50 లక్షల రూపాయలతో సిసి రోడ్డు, డ్రైన్స్, అప్పర్ ప్రైమరి పాఠశాలలను ప్రాథమికోన్నత పాఠశాలలుగా మంజూరు చేయనున్నారు. ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్ లో 16 పరిశ్రమలు వస్తున్నాయి. ఈ ప్రాంతంలో అంతర్జాతీయ విమానాశ్రయం రావడం వంటి పలు అభివృద్ధి పనులతో రాయలసీమ రత్నాలసీమగా మారే పని ప్రారంభమయింది.

కర్నూలు జిల్లా జూపాడు బంగ్లా మండలం, తంగెడంచ గ్రామంలో ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల మౌలిక సదుపాయాల కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న కర్నూలు అల్ట్రామెగా ఫుడ్ పార్కు, ఓర్వకల్లులో ఓర్వకల్ మెగా ఇండస్ట్రియల్ హబ్ లకు ఆగష్టులో ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయడం మూలంగా కర్నూలు జిల్లా చరిత్ర సృష్టించబోతుంది. జిల్లా అభివృద్ధి చెందాలంటే వ్యవసాయం మొదటిగా అభివృద్ధి చెందాలి. తదుపరి పరిశ్రమలు అభివృద్ధి జరిగితే జిల్లా ఆర్థికంగా అభివృద్ధి చెందుతుంది. భారతదేశంలోనే అనంతపురం జిల్లా అత్యల్ప వర్షపాతం కలిగిన జిల్లా కాగా, కర్నూలు జిల్లా ఎక్కువగా వెనుకబడిన ప్రాంతంగా గుర్తింపు పొందింది. ఇవన్ని కూలంకషంగా ఆలోచించి గత ఏడాది స్వాతంత్రదినోత్సవ వేడుకల సందర్భంగా ముఖ్యమంత్రి నిర్థిష్టమైన హామీలు ఇచ్చారు. అవి నేటికి కార్యరూపం దాల్చాయి.

జిల్లా విత్తనాభివృద్ధిని కొనసాగిస్తూనే అల్ట్రా ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీని ప్రారంభించారు. ఇందుకోసం 3000 ఎకరాల భూ సేకరణ ప్రక్రయ చేపట్టారు. ప్రస్తుతం 850 ఎకరాల విస్తీర్ణానికి గాను 100 ఎకరాలను మెసర్స్ గుజరాత్ అంబుజా ఎక్స్ ఫర్ట్ లిమిడెడ్ వారికి కేటాయించగా వారు మొక్కజొన్న వంటి ఆధారిత ఉత్పత్తుల తయారి పరిశ్రమ నెలకొల్పుతున్నారు. 750 ఎకరాలు మెసర్స్ జైన్ ఇరిగేషన్ సిస్టమ్స్ లిమిటెడ్ వారికి కేటాయించగా వారు 350 కోట్ల రూపాయాల వ్యయంతో మెగా ఫుడ్ ప్రాసిసింగ్ యూనిట్ నెలకొల్పనున్నారు. అందులో 623 ఎకరాలలో టిష్యు కల్చర్ అరటి, మామిడి అరటి వంటి పళ్లరసాల యూనిట్లు ఏర్పాటు చేస్తారు. తద్వారా ఉపాధి అవకాశాలు మెండుగా రానున్నాయి. ఫలితంగా జిల్లా అభివృద్ధి సుసాధ్యం కానున్నది.

ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా రోడ్లు, నీళ్ల వసతి, విద్యుత్ తదితరాల కోసం రూ. 300కోట్ల దాకా వ్యయం చేయనున్నారు. దీని మూలంగా యువతకు 18 వేల వరకు ప్రత్యక్షంగా, 30 వేల మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. దాదాపు 3 వేల కోట్ల వరకు పెట్టుబడి నిధులు వస్తే ఈ ప్రాంతం పెద్ద ఎత్తున అభివృద్ధి జరుగుతుంది. జైన్ ఇరిగేషన్ సిస్టమ్స్ వారి సహకారంతో డ్రిప్, స్ప్రింక్లెర్స్ వంటి ఇండస్ట్రిస్ తీసుకురానున్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ వస్తే రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర వస్తుంది. తద్వారా పంటను అమ్ముకోవడంలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగిపోతాయి. విదేశాలకు పంట ఎగుమతితో పాటు వ్యవసాయ ఉత్పత్తుల తయారీకి అవకాశం ఏర్పడుతుంది. కర్నూలు జిల్లాలో అభివృద్ధికి అనేక వేల ఎకరాలు భూములు ఉన్నాయి.

కరువుపై జలయుద్ధం

కర్నూలు జిల్లాలో కరువును ప్రారదోలడానికి ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా నదుల అనుసంధానికి ప్రాధాన్యం ఇచ్చి ఆ దిశగా చర్యలు చేపట్టారు. గోరుకల్లు రిజర్వాయిలో 5 టియంసిల నీటి నిల్వకు ప్రాధాన్యతను ఇస్తున్నారు. ముచ్చుమర్రి పనులు శరవేగంగా పూర్తి చేయడం ద్వారా కెసి కెనాల్, హంద్రీ నీవాకు చాలా వరకు ఉపయోగపడుతుంది. డిసెంబర్ లోగా ఈ పనులు పూర్తి చేసి హంద్రీ నీవా ద్వారా 85 వేల ఎకరాలకు నీళ్లు ఇవ్వాలని ప్రభుత్వం గట్టి పట్టుదలతో ఉంది. సిద్ధాపురం ప్రాజెక్టు నుండి డిసెంబర్ నాటికి 25 వేల ఎకరాలకు నీళ్లు ఇవ్వడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.

గురురాఘవేంద్ర ప్రాజెక్టును త్వరలోనే పూర్తి చేసి 25 వేల ఎకరాలకు నీళ్లు అందించనున్నారు. పత్తికొండలోనే 35చెరువులకు, వేదవతి పూర్తి చేసి 85 ఎకరాలకు నీళ్లు ఇవ్వడానికి ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. గుండ్రేవుల ప్రాజెక్టును కూడా అతి త్వరలో పూర్తి చేయనున్నారు. వెలుగొండ పూర్తికి వ్యయం కాగల రూ. 12 కోట్లను ప్రభుత్వం విడుదల చేయనున్నది. తద్వారా 10 టియంసిల నీటిని నిల్వ చేసుకునే అవకాశం లభిస్తుంది.





జి విజయలక్ష్మి,
ఉప సంచాలకులు,
సమాచార పౌరసంబంధాల శాఖ, కర్నూలు



కుప్పం అభివృద్ధే సీఎం శ్వాస ధ్యాస

కుప్పం నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి ప్రజలతో ముఖ్యమంత్రి మమేకమయ్యారు. ఆయన పర్యటించినప్పుడు, పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసిన చోటల్లా ఆయనకు ప్రజలు నీరాజనాలు పలికారు.

సమస్యల వలయంలో చిక్కుకున్న రాష్ట్రాన్ని గాడిలో పెట్టడానికి శతవిధాలా ప్రయత్నిస్తూ రోజులో 18 గంటలు కష్టపడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని, చిత్తూరు జిల్లాలోని సొంత నియోజకవర్గం కుప్పం పరంగా చూస్తే ఒక సాధారణ ఎమ్మెల్యేనే. ఎన్నికల సమయంలో ఒకటి రెండు రోజులకు మించి కుప్పంలో పర్యటించడానికి ఆయనకు సమయం లేదు. అయినా, ఆయన మీద అక్కడి ప్రజల అభిమానం, నమ్మకం అచంచలం. అది ఆయన ఏనాడూ విస్మరించరు. అధికారం చేపట్టిన 15 నెలల్లో ఇప్పటి వరకు ఒకటి రెండు పర్యటనలు మాత్రమే జరిపినా, తాను ఎక్కడ ఉన్నప్పటికి కుప్పం నియోజకవర్గ అభివృద్ధి ఆయన ప్రధాన అజండాల్లో ఒకటి. ఆ విషయంలో సొంత యంత్రాంగానికి అనేక సూచనలు, సలహాలను ఇస్తూ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయిస్తుంటారు.

కాగా, ఆగష్టు 18, 19 తేదీల్లో కుప్పం నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి ప్రజలతో మమేకమయ్యారు. ఆయన పర్యటించినప్పుడు, పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసిన చోటల్లా ఆయనకు ప్రజలు నీరాజనాలు పలికారు. కుప్పం నియోజకవర్గంలో పర్యటన జరిపినప్పటికీ కుటుంబ పెద్దగా ఆప్యాయంగా, ఆత్మీయంగా కనపడిన వారందరినీ పలకరించడం ప్రజలకు మరువరాని మధుర స్మృతి.

సంక్షేమంపై ముఖ్యమంత్రి ధ్యాస

రాష్ట్ర వ్యాప్తంగా కరువును ఎదుర్కొనడానికి మనుషులకు ఆహార భద్రత కల్పిస్తున్నట్లే పశు వులకు దాణా భద్రత అందించాలని ముఖ్యమంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. కిలో 4 రూపాయలు చొప్పున పాడి రైతు అడిగినంత పశుదాణా సరపరా చేస్తున్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు పక్కా ఇళ్ళు నిర్మించాలన్నా కార్యక్రమాన్ని వేగవంతం చేస్తున్నారు. పేదలకు సొంత ఇళ్ళు ఉండాలన్న ఉద్దేశంతో చదరపు అడుగుకు రూ. 1000 చొప్పున 275 చదరపు అడుగులలో రూ. 2.75 లక్షలతో ఇల్లు కట్టి అందిస్తున్నారు. ఎస్.సి, ఎస్టీలకు రూ. 1.50 లక్షలు, ఇతరులకు రూ. 1.25 లక్షలు చొప్పున

రాయితీ అందిస్తున్నారు. డ్వాక్రా మహిళలకు పారిశుద్ధ్యంపై ప్రత్యేక శిక్షణ ఇప్పించి నిర్వహణ బాధ్యతను వీరికే అప్పగించాలని ముఖ్యమంత్రి అభిలషించారు. డ్వాక్రా సంఘాల ఆర్థిక స్వావలంబనకు ఒక్కరికి రూ. 10 వేలు చొప్పున సాయం చేస్తున్నారు.

లబ్ధిదారులకు పంపిణీ కార్యక్రమం

- కార్మికశాఖ తరుపున కుప్పం నియోజకవర్గంలో చనిపోయిన 8 మంది భవన నిర్మాణ కార్మికులకు ఒక్కరికి రూ. 30 వేల చెక్కులను వారి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి అందజేశారు. మైనార్టీ కార్పొరేషన్ తరుపున రూ. 1.04 కోట్లతో 92 మంది లబ్ధిదారులకు సబ్సిడీతో కూడిన రుణాలను, బి.సి కార్పొరేషన్ తరుపున 13 మంది లబ్ధిదారులకు రూ. 13 లక్షల అసెట్లను, ఎస్టీ కార్పొరేషన్ క్రింద కుప్పం నియోజకవర్గం పరిధిలో 19 మంది లబ్ధిదారులకు రూ. 15.30 లక్షల విలువగల అసెట్లను, ఎస్.సి కార్పొరేషన్ క్రింద 85 మంది లబ్ధిదారులకు రూ. 93.80 లక్షల అసెట్లను ఆయన పంపిణీ చేశారు.
- డిఆర్‌డిఏ ఆధ్వర్యంలో కుప్పం నియోజకవర్గ పరిధిలో 10 మంది వితంతు, వృద్ధాప్య లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ. 1000 చొప్పున, వికలాంగులు రూ. 1500 చొప్పున, 316 ఎస్.హెచ్ జిలకు రూ. 12.49 కోట్ల విలువగల చెక్కులను,కుప్పం కెనరాబ్యాంకు తరపున 114ఎస్.హెచ్ జిలకు రూ. 1 కోటి 24 లక్షల విలువగల చెక్కులను, కుప్పం నియోజకవగం పరిధిలో దీపం పథకం క్రింద 1433 మంది లబ్ధిదారులకు గ్యాస్ స్టౌవ్ లు, పొట్టేలు పిల్లల పెంపకం క్రింద పొట్టేలు పిల్లలను ముఖ్యమంత్రి మహిళా రైతులకు పంపిణీ చేశారు.
- వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కుప్పం మండల పరిధిలో 50 శాతం సబ్సిడీతో రూ. 8 లక్షల 71 వేల విలువతో కూడిన ట్రాక్టరు, విత్తనం విత్తుపరికరాలను 8 మంది సీఎం రైతులకు పంపిణీ చేశారు.
- పశుసంవర్ధక శాఖ నిర్వహించిన మనకోడి పథకం క్రింద 6 మంది మహిళా రైతులకు ఒక్కొక్క మహిళా, రైతుకు 25 కోడి పిల్లలను పంపిణీ చేశారు.
- ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో కుప్పం నియోజకవర్గం పరిధిలో 11 మంది లబ్దిదారులకు రక్షిత వ్యవసాయ పథకం క్రింద 23 వేల చదరపు మీటర్ల నిర్మాణమునకు 50 శాతం సబ్సిడీతో రూ. 97 లక్షల విలువగల మంజూరు పత్రాలను లబ్దిదారులకు ముఖ్యమంత్రి పంపిణీ చేశారు.
- తిరుపతి / శ్రీజా మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ నుండి రేషన్ బ్యాలెన్సింగ్ ప్రొగ్రామ్ ను ముఖ్యమంత్రి ప్రారంభించారు.
- వికలాంగసంక్షేమశాఖ తరపున కుప్పం నియోజకవర్గ పరిధిలో 50 మంది లబ్ధిదారులకు మూడుచక్రాల సైకిళ్లు, వినికిడి యంత్రాలు, చేతి కర్రలు ముఖ్యమంత్రి పంపిణీ చేశారు.



దళిత కుటుంబంతో సీఎం భోజనం

కుప్పం మండలం అనిమిగానిపల్లి ఎస్.సి కాలనీలోని మునికృష్ణ, జ్యోతి దంపతులతో కలిసి ముఖ్యమంత్రి భోజనం చేశారు. ప్రభుత్వ పథకాల అమలుపై మునికృష్ణను ఆరా తీయడంతో పాటు స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించాలని తక్షణమే జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. వర్షాలు కురవక గ్రామంలో వలసలు వెళుతున్నారని తెలుసుకుని ఆవేదనకు గురయిన ముఖ్యమంత్రి వెంటనే స్పందించి దళితలకు బోర్లు వేయిస్తామని, బిందు పరికారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకానికి, సి.సి రోడ్లకు ప్రారంభోత్సవాలు చేశారు. అంగన్ వాడీ కేంద్రంలో చిన్నారులకు పాలు త్రాగించి డ్రింక్ మిల్క్ కార్యక్రమాన్ని ఆరంభించారు. అంగన్ వాడీ కేంద్రాలను ప్రీస్కూలుగా మారుస్తామని ప్రకటించారు. తద్వారా స్థానిక పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య అందించటానికి ఆస్కారం ఏర్పడనుంది.

కుప్పం నియోజకవర్గంలో గర్భిణీల సామూహిక సీమంత కార్యక్రమంలో పాల్గొని ముఖ్యమంత్రి గర్భిణీలను ఆశీర్వదించారు. కుప్పం పర్యటనలో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఇచ్చిన అర్జీలను స్వీకరించిన ముఖ్యమంత్రి వాటిని తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కుప్పం పర్యటనలో భాగంగా జిల్లా స్థాయి అధికారులతో జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలను క్షేత్ర స్థాయిలో విజయవంతం చేయటంలో ప్రభుత్వ అధికారుల పాత్ర కీలకం అని ఆయన అభిప్రాయపడ్డారు. అధికారుల సమన్వయంతోనే పనులు వేగవంతంగా జరుగుతాయని ఆయన హితవుపలికారు.

పలు నిర్మాణాలకు శంకుస్థాపనలు

కుప్పం వ్యవసాయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామీణ మౌలిక సదుపాయాల సముదాయనిధి క్రింద 1000 మెట్రిక్ టన్నులు రూ. 60.00 లక్షలతో నిర్మించబోయే గోదాము, 40 మెట్రిక్ టన్నులు రూ. 50 లక్షలతో నిర్మించబోయే శీతల గిడ్డంగి నిర్మాణానికి... పంచాయితీ రాజ్ ఆధ్వర్యంలో వెనుకబడిన తరగతులు బిసి సంక్షేమ నిధులు రూ. 50 లక్షలతో కమ్యూనిటి భవన నిర్మాణ భవనానికి శంకుస్థాపన చేశారు.

- కుప్పం పర్యటనలో భాగంగా రెండవరోజు గుడిపల్లి మండలం, గుడిపంక గ్రామంలో విద్యా సంక్షేమ మౌలికవసతుల అభివృద్ధి సంస్థ ద్వారా కుప్పం నియోజకవర్గంలో రూ. 10.39 కోట్లతో చేపట్టే పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు.
- గుడిపల్లిలో రూ. 5.05కోట్లతో ప్రభుత్వ జూనియర్ కళాశాల అదనపు తరగతి గదులకు, కుప్పంలో రూ. 80 లక్షలతో వెనుకబడిన తరగతుల బాలికల వసతిగృహం, రూ. 80 లక్షలతో బాలుర వసతి గృహంలకు శంకుస్థాపన చేశారు.
- కుప్పంలో రూ. 78 లక్షలతో సాంఘీక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో నిర్మించిన ల్యాబరేటరీ, నీటి ట్యాంకును రామకుప్పంలో రూ. 2.96 కోట్లతో నిర్మించిన సాంఘీక సంక్షేమ బాలుర రెసిడెన్షియల్ కళాశాలలో అదనపు తరగతి భవనాలకు ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేశారు.



బసినాయని పద్మజ
అడిషనల్ పీఆర్వో, మదనపల్లి

అవార్డులు - రివార్డులు

- అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ నవలా రచయిత్రి యద్దనపూడి సులోచనారాణికి మాలతీచందూర్ స్మారక పురస్కారం ప్రకటించారు.
- చేనేతలో సృజన ప్రదర్శించి వస్త్రాలు అల్లిన నలుగురు తెలుగు నేత కార్మికులకు కేంద్ర ప్రభుత్వం సంత్ కబీర్, జాతీయ చేనేత పురస్కారాలను ప్రదానం చేసింది. 'జమ్దాని బృందావనం' చీరను కళాత్మకంగా నేసిన ఆంధ్ర ప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా వెంకటగిరికి చెందిన పట్నం మునీంద్రబాబు, 'ఇకత్ చీర'ను కనువిందుగా నేసిన తెలంగాణకు చెందిన నల్గండ జిల్లా పోచంపల్లి నివాసి రాపోలు రామలింగం సంత్ కబీర్ పురస్కారాలను అందుకున్నారు. 'గోకుల్ బృందావనం' దృశ్యాలతో అందమైన గోడకు వేలాడదీసే వస్త్రం ను రూపొందించిన వెంకటగిరి వాసి లక్కా శ్రీనివాసులు, డబుల్ ఇకత్ చీరను నేసిన నల్గొండ జిల్లా కొయ్యగూడెం వాసి జెల్లా శ్రీనివాస్ కు చేనేత జాతీయ పురస్కారాలను ప్రదానం చేశారు
- హిందీ చిత్రం 'క్యా' దర్శకుడు సంజీవ్ గుప్తా 2014 సంవత్సరానికి గాను గొల్లపూడి శ్రీనివాస్ అవార్డును అందుకున్నారు.
- డేవిస్ కప్ మాజీ కెప్టెన్, హైదరాబాదీ ఎస్‌పి మిశ్రాకు ఈ ఏడాది ధ్యాన్‌చంద్ పురస్కారం లభించింది. ఆయనతో పాటు వాలీబాల్ మాజీ కెప్టెన్ నాయర్, హాకీ జట్టు మాజీ గోల్‌కీపర్ రోమియో జేమ్స్‌లకు కూడా ఈ పురస్కారాన్ని ప్రకటించారు.
- అత్యున్నత క్రీడా పురస్కారం ఖేల్‌రత్నను టెన్నిస్ క్రీడాకారిణి సానియా మీర్జాకు ప్రకటించారు. అలాగే తెలుగు షట్లర్ కిదాంబి శ్రీకాంత్, హైదరాబాద్ స్కేటర్ అనూప్‌కుమార్ యామా, క్రికెటర్ రోహిత్ శర్మ సహా 17మంది క్రీడాకారులు అర్జున అవార్డుకు ఎంపికయ్యారు.

అంతర్జాతీయం

- దాదాపు ఏడు దశాబ్దాలుగా ఏ దేశానికి చెందని వ్యక్తులుగా కొనసాగిన 51 వేల మందికి తొలిసారిగా గుర్తింపు లభించింది. భారత్..బంగ్లాదేశ్ మధ్య నివసిస్తూ, ఏ దేశానికి చెందని వారిగా కనీస సౌకర్యాలకు నోచుకోకుండా అవమానాల పాలైన వీరు ప్రస్తుతం తమకు నచ్చిన దేశాన్ని ఎంచుకున్నారు. ఇరుదేశాల మధ్య ఇటీవల భూబదలాయింపు ఒప్పందం జరిగింది. ఇరుదేశాల మధ్య 162 ప్రాంతాల బదిలీ జరిగింది. వీటిలో 111 భారత్ కు, 51 బంగ్లాదేశ్‌కు చెందినవి. ఈ ప్రాంతాల్లో దశాబ్దాలుగా గుర్తింపు లేని జీవనం గడిపిన దాదాపు 51వేల మందిలో 14వేల మంది భారతీయ పౌరులయ్యారు. వీరు ఇప్పటి వరకూ నివసిస్తూ వచ్చిన 51 బంగ్లాదేశ్ ప్రాంతాలు ప్రస్తుతం భారత్‌లో విలీనమయ్యాయి.
- అరకొర ఆంగ్ల పరిజ్ఞానంతో బ్రిటన్ దేశపు సర్కారీ కొలువుల్లో చేరాలనుకునే విదేశీయులకు ఇక కష్టకాలమే. ప్రజలతో నేరుగా సంబంధాలు నెరిపే ఈ శాఖల్లో ఉద్యోగం చేయాలంటే ఖచ్చితంగా ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడే నైపుణ్యం ఉండి తీరాల్సిందేనని ఆ దేశం స్పష్టం చేసింది. సెప్టెంబరు నుంచి ఈ నిబంధన అమలులోకి వస్తుంది.
- పాక్ అతివాద ఇస్లాం నేత, ఐఎస్ఐ మాజీ అధిపతి జనరల్ హమీద్ గుల్ మెదడులో రక్తస్రావంతో మరణించారు. 1958లోనే పాక్ సైన్యంలో చేరిన హమీద్ 1965లో భారత్‌తో యుద్ధ సమయంలో చవిందా విభాగానికి ట్యాంక్ కమాండర్‌గా వ్యవహరించారు.
- అమెరికా, దాని మిత్ర దేశాల్లో దాడులకు పాల్పడాలని జిహాదీలకు అల్‌ఖైదా యువరాజు, ఒసామా బిన్ లాడెన్ కుమారుడు హమ్‌జాబిన్ లాడెన్ పిలుపునిచ్చారు.
- భారత్‌తో ఆర్థిక బంధాలను బలోపేతం చేసుకోవడంలో భాగంగా తమ పెట్టుబడులను 75 బిలియన్ డాలర్లకు పెంచడానికి యూఏఈ అంగీకరించింది. రాబోయే ఐదేళ్ళలో ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 60 శాతం మేర పెంచుకోవాలని ఇరు దేశాలూ నిర్ణయించాయి.
- థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లోని ప్రఖ్యాత బ్రహ్మ దేవాలయంలో బాంబు పేలుడు సంభవించి 27మంది అశువులు బాశారు.
- తమ శతఘ్ని దళంలోని రాకెట్లు ఏకంగా 150 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను తాకగలవని చైనా సైన్యం ప్రకటించింది. అవి అమెరికా, రష్యాల రాకెట్ల కన్నా శక్తిమంతమైనవని తెలిపింది.
- శ్రీలంక ప్రస్తుత ప్రధాని రణిల్ విక్రమసింఘే (66) నేతృత్వంలోని యునైటెడ్ నేషనల్ పార్టీ (యూఎన్‌పీ) పార్లమెంటు ఎన్నికల్లో 106 స్థానాలు గెలుచుకుంది.

జాతీయం

- భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం పేరిట ప్రత్యేక పురస్కారం నెలకొల్పుతున్నట్లు తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. శాస్త్ర, సాంకేతిక, సామాజికాభివృద్ధి తదితర రంగాల్లో విశేషమైన కృషి చేసిన తమిళనాడు రాష్ట్ర యువతకు ఏటా ఈ అవార్డును అందజేస్తారు.
- ఎస్సీ, ఎస్టీ బిల్లును లోక్‌సభ ఆమోదించింది. జంతువులు, మనుషుల మృతదేహాలు మోయమని, లేదా పాకీ పని చేయమని ఎస్సీ, ఎస్టీ వర్గ సభ్యులను బలవంతం పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు ఈ బిల్లు అవకాశం కల్పిస్తుంది.
- వైద్యవిద్యలో పీజీ సీట్ల కొరత సవాల్‌ను అధిగమించేందుకు డీఎన్‌బీ (డిప్లమేట్ నేషనల్ బోర్డు) సీట్ల సంఖ్యను పెంచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం ఈ సీట్ల సంఖ్య 5600 కాగా, వచ్చే ఐదేళ్ళలో 12 వేలకు పెంచాలని నిర్ణయించింది. ఇందుకోసం దేశ వ్యాప్తంగా 625 జిల్లాల్లోని జిల్లా ఆస్పత్రులు త్వరలో డీఎన్‌బీ కోర్సులను ప్రారంభించనున్నాయి.
- విశాఖ, రాయ్‌పూర్ రహదారి (ఎన్‌హెచ్26)ని నాలుగు లేన్లగా అభివృద్ధి పరచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం 84.12 కోట్లు కేటాయించింది. నియామకాలు;
- బిట్స్ పిలానీ డీమ్డ్ విశ్వ విద్యాలయ ఇన్‌ఛార్జి ఉపకులపతిగా ప్రొఫెసర్ వి.సాంబశివరావు బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన ప్రాక్టీస్ స్కూల్ డీన్‌గా, ఆఫ్ క్యాంపస్ ప్రోగ్రామ్స్ అదనపు సంచాలకుడిగా, బిట్స్ హైదరాబాద్ ప్రాంగణం సంచాలకునిగా పనిచేశారు.
- సైనిక దళ ఉపాధ్యక్షుడిగా లెఫ్టినెంట్ జనరల్ ఎంఎంఎస్ రాయ్ బాధ్యతలు స్వీకరించారు. కోల్‌కతా కేంద్రంగా పని చేస్తున్న సైనిక తూర్పు విభాగానికి అధిపతిగా లెఫ్టినెంట్ జనరల్ ప్రవీణ్ బక్షిని నియమించారు.
- రక్షణ మిశ్రధాతు పరిశోధన సంస్థ (డీఎంఆర్ఎల్) ఇన్‌ఛార్జ్ డైరెక్టర్‌గా రక్షణ పరిశోధన అభివృద్ధి ప్రయోగశాల డైరెక్టర్ డాక్టర్ కె.జయరామన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.
- సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ప్రత్యేక అధికారిగా డాక్టర్ చుక్కా కొండయ్యను ప్రభుత్వం నియమించింది.
- నూతన ఎన్నికల కమిషనర్‌గా ఓం ప్రకాశ్ రావత్ నియమితులయ్యారు. మధ్యప్రదేశ్ క్యాడర్‌కు చెందిన విశ్రాంత ఐఏఎస్ అధికారి అయిన ఓం ప్రకాశ్ ఇప్పటి వరకు కేంద్రంలో కార్యదర్శిగా పనిచేశారు.
- తపాల శాఖ ఏపీ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ సుధాకర్‌ను తపాల శాఖ బోర్డు సభ్యుడిగా కేంద్ర ప్రభుత్వం నియమించింది.
- సీనియర్ ఐపీఎస్ అధికారి అశోక్ ప్రసాద్ హోం మంత్రిత్వ శాఖలో కీలకమైన అంతర్గత భద్రతా విభాగానికి కార్యదర్శిగా నియమితులయ్యారు.
- పురపాలక శాఖ ఓఎస్డీగా పి.తిమ్మారెడ్డిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించింది.
- ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటి పారుదల ప్రాజెక్టు (ఏపీఎంఐపీ) పీడీగా స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ఎ.సూర్యప్రకాశ్ నియమితులయ్యారు.

రాష్ట్రీయం

- రాష్ట్రంలో భూముల విలువలకు రెక్కలు వచ్చాయి. మార్కెట్ విలువలను సవరిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.
- విద్యార్థులకు 75 శాతం హాజరు ఉంటేనే ఉపకార

వేతనాలు, రుసుముల వాపసు (ఫీజు రీఎంబర్స్‌మెంట్)కు అర్హత ఉంటుందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్పష్టం చేసింది. అలాగే పీజీ తరువాత వర్సిటీ లోనే రెండో కోర్సు చేసేవారికి రుసుము వాపసు వర్తింప చేయరాదని నిర్ణయించింది.

- ఆంధ్రప్రదేశ్‌లో చేనేత రంగాన్ని పురోభివృద్ధి బాటలో నడిపించడంలో భాగంగా దేశంలోనే తొలిసారిగా సహకార, సహకారేతర విభాగాల్లో ఉన్న సుమారు 2.47 లక్షల మంది కార్మికులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు జారీ చేసింది.
- ఆంధ్రప్రదేశ్ ప్రజలకు సంబందించిన సమగ్ర సమాచారం సేకరించేందుకు ప్రభుత్వం స్మార్ట్‌పల్స్ సర్వే నిర్వహించనుంది. ప్రభుత్వ పథకాలు, సమగ్ర సమాచారానికి ఆధార్‌తో అనుసంధానం చేస్తూ ఈ సర్వే చేపట్టనుంది.
- ఆంధ్రప్రదేశ్‌లోని లక్షలాది మంది నిర్మాణ రంగ కూలీలు, కార్మికులను 'కార్మిక రాజ్య బీమా (ఈఎస్ఐ) రక్షణ పరిధిలోకి తీసుకువస్తూ కేంద్రం ఆగస్టు 1 మార్గదర్శకాలు జారీ చేసింది. వీరంతా ఈఎస్ఐ పరిధిలోకి రావడంతో పలు రకాలుగా సామాజిక భద్రత లభిస్తుంది.
- ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన దేవాలయాలు ఉన్న కొండలపై అభివృద్ధి పేరుతో ఎలాంటి కొత్త కట్టడాలు నిర్మించకుండా రాష్ట్ర దేవాదాయ శాఖ నిషేధం విధించింది. అయితే వేద పాఠశాలలు, యాగశాలలు, వైదిక కార్యక్రమాలకు సంబందించిన భవనాలకు మాత్రం మినహాయింపు ఇచ్చింది.
- దేశంలోనే తొలి ఎల్ఈడీ నగరంగా విశాఖపట్నం గుర్తింపు పొందింది. ఈ ఎల్ఈడీ వీధి దీపాల వల్ల నెలకు 20.83 లక్షల యూనిట్ల విద్యుత్తు ఆదా కావడం బిల్లుల వ్యయం దాదాపు సగానికి తగ్గడంతో దేశ వ్యాప్తంగా దీనిని అమలు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.
- రైతుకు రవాణా ఖర్చు లేకుండా ఆన్‌లైన్‌లో వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించేలా తపాలా శాఖ ముందుకు రానుంది. దీంతో ఇన్నాళ్ళు ఉత్తరాలు, పార్శిళ్ళ బట్వాడాకు పరిమితిమైన తపాల శాఖ ఇకనుంచి విత్తనాలు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను బట్వాడా చేయనుంది.
- కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు కొత్తగా మంజూరు చేసిన 1500 మెగావాట్ల సౌర విద్యుత్ పార్కు నిర్మాణ బాధ్యతను నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్‌కు అప్పగించడానికి రంగం సిద్ధమైంది.
- కొల్లేరు అభయారణ్య ప్రాంతాన్ని 'ఎకో టూరిజం' కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.
- ఇంటింటికీ అంతర్జాలం సౌకర్యం కల్పించే లక్ష్యంలో భాగంగా చేపట్టబోతున్న ఆప్టిక్ ఫైబర్‌గ్రిడ్ కోసం ఆంధ్ర ప్రదేశ్ ఫైబర్ నెట్ లిమిటెడ్ అనే ప్రత్యేక వాహకం నెలకొల్ప బోతున్నారు. దీనిలో భాగంగా తొలిదశలో 22500 కిలోమీటర్ల మేర ఆప్టిక్ ఫైబర్ నెట్‌ను ఏర్పాటు చేస్తారు.
- ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ఇక ఏటా రాష్ట్ర ప్రభుత్వ ఉత్సవంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.
- ఆంధ్రప్రదేశ్‌లోని 3428 ఉన్నత పాఠశాలల్లో పూర్తిగా ఆంగ్ల బోధన జరిపేలా విడుదల చేసిన జీవో నెం. 53 అమలును విద్యాశాఖ నిలిపివేసింది.
- ఏపీ పోలీస్ అకాడెమిని గుంటూరు జిల్లా అచ్చెంపేటలో ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌ను కూడా తాత్కాలికంగా విజయవాడలో ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

వార్తలు.. విశేషాలు;

- రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ సతీమణి, ప్రముఖ రవీంద్ర సంగీత గాయని శుభ్రా ముఖర్జీ(74) అనారోగ్యంతో న్యూఢిల్లీలో కన్నుమూశారు. దేశ చరిత్రలో రాష్ట్రపతి పదవిలో ఉండగా ప్రథమ పౌరురాలు కన్నుమూయడం ఇదే తొలిసారి.
- ప్రముఖ నాస్తికోద్యమ నాయకుడు, సంఘ సంస్కర్త గోపరాజు లవణం(86) విజయవాడలో మరణించారు. నాస్తికోద్యమ నిర్మాత గోపరాజు రామచంద్రరావు (గోరా), సరస్వతి గోరా దంపతుల తొమ్మిది మంది సంతానంలో లవణం రెండోవారు.

మెన్సా ప్రజ్ఞాపరీక్ష(ఐక్యుటెస్ట్)లో ఏకంగా 162 స్కోరును సాధించిన 12ఏళ్ళ బాలిక నికోల్‌బార్ ప్రపంచంలోని అత్యంత ప్రతిభావంతుల జాబితాలో శిఖరాగ్రాన నిలిచింది. ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, స్టీఫెన్ హాకింగ్ వంటి మహామహుల కంటే కూడా అధిక మేధో సంపత్తి కలిగిన వ్యక్తిగా పేర్కొనగలిగిన ప్రతిభను ఈ లండన్ బాలిక కనబరచింది.

- జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని నరేంద్రమోడి భారత చేనేత గుర్తింపు చిహ్నాన్ని ఆవిష్కరించారు.

సెప్టెంబర్ నెలలో ముఖ్యమైన రోజులు

అలీన విధాన దినోత్సవం	– 1
ఉపాధ్యాయుల దినోత్సవం, సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి	– 5
ప్రపంచ అక్షరాస్యతా దినోత్సవం	– 8
హిందీ దినోత్సవం	– 14
ప్రపంచ ఓజోను దినోత్సవం	– 16
బధిరుల దినోత్సవం	– 26
ప్రపంచ పర్యాటక దినోత్సవం	– 27

- వందల ఏళ్ళ చరిత్ర కలిగిన కుతుబ్‌షాహీ సమాధుల్లో పురాతన సొరంగం బయట పడింది. గోల్కొండ కోట నుంచి సమాధుల వరకు ఈ సొరంగం ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. గోల్కొండ కోటను పాలించే కుతుబ్ షాహీల్లో ఎవరైనా మరణిస్తే సమాధుల వద్దకు తీసుకెళ్ళేందుకు దీన్ని నిర్మించి ఉంటారని భావిస్తున్నారు. సొరంగ మార్గంతో పాటు ఒక ఉద్యానం, సహాయకుల కోసం నిర్మించిన వేసవి భవంతి తవ్వకాల్లో బయటపడ్డాయి.
- మద్యపానం అలవాటు ఉన్నవారికి పెళ్ళి చేస్తే దారిలోకి వస్తారనే విషయం తాజా పరిశోధనలో తేలింది. మందు కొట్టే అలవాటును మాన్పించే శక్తి పెళ్ళికి ఉందని అమెరికా పరిశోధకులు చెబుతున్నారు. పెళ్ళైన తర్వాత 50 శాతం మంది మందు బాబులు మద్యం సేవించడం తగ్గించిన విషయం తమ పరిశోధనలో తేలిందని వారు చెబుతున్నారు.
- ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు ఎంఎస్ఆర్ ఆచారి (84) హైదరాబాద్‌లో కన్నుమూశారు. ఆయన కృష్ణా జిల్లా నందిగామ ప్రాంతాల్లో జరిగిన అనేక ప్రజా పోరాటాల్లో కీలక పాత్ర పోషించారు.
- న్యూఢిల్లీ, విశాఖ ఏపీ ఆంధ్రప్రదేశ్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించారు. ప్రస్తుతం న్యూఢిల్లీ , హైద్రాబాద్ ఏపీ ఎక్స్‌ప్రెస్‌ను తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌గా పేరు మార్పు చేశారు.
- సినీ నిర్మాత అడుసుమిల్లి వేంకటేశ్వర రావు కన్నుమూశారు. నెంబర్ వన్, శుభలగ్నం తదితర చిత్రాలను ఆయన నిర్మించారు.

క్రీడలు

- ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో సైనా నెహ్వాల్ రజత పతకం సాధించింది. దీంతో ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో రజతం సాధించిన తొలి భారత షట్లర్‌గా రికార్డు సాధించింది.
- ఆసియా కాంటినెంటల్ చెస్ చాంపియన్ షిప్ మహిళల ర్యాపిడ్ విభాగంలో ఆంధ్ర ప్రదేశ్ గ్రాండ్ మాస్టర్ ద్రోణవల్లి హారిక కాంస్య పతకాన్ని సాధించగా భారత్ కే చెందిన తానియా సచ్‌దేవ్ రజత పతకాన్ని దక్కించుకుంది.
- స్పెయిన్‌తో హాకీ టెస్టు సిరీస్‌ను భారత్ గెలుచుకుంది.
- భారత బాక్సర్ స్వీటీ బోరా ఆసియా మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో రజతం సాధించింది.
- ప్రపంచ జూనియర్ రెజ్లింగ్ ఛాంపియన్ షిప్‌లో భారత క్రీడాకారుడు రవికుమార్ 55 కిలోల ఫ్రీస్టైల్ విభాగంలో రజత పతకం సాధించాడు.



దాసరి దుర్గాప్రసాద్



లిపి లేని 'కంటి బాస'– ఛాయాచిత్రం!

పారదర్శకమైన గాజు పలక వెనక వార్నిష్ పూస్తే అది అద్దమై దృశ్యాన్ని అదృశ్యం చేస్తుంది; అప్పటి దాకా చూస్తున్న కన్నుకి తన బింబాన్నే చూపిస్తుంది, కుడి ఎడమగా. ఆ దృశ్యాదృశ్యాల... బింబాబింబాల.... కుడిఎడమల తారుమారుని అర్థం చేసుకునే వెలుగునీడల భాషే ఫొటోగ్రఫీ. ఒంటికన్ను మూసి చూస్తే, అది కచ్చితంగా లిపిలేని కంటి బాస! ఫొటోలు తీయడం– అంటే ఛాయాచిత్రగ్రహణ – చాలా మంది దృష్టిలో అతి సులువు; చూపుడు వేలితో క్లిక్ మనిపించడమే. మరీ ముఖ్యంగా, మొబైల్ ఫోనే బుల్లి కెమెరాగా అరిచేతిలో ఒదిగిపోయిన ఈ రోజుల్లో ఫొటో తీయడం అంటే కన్రెప్ప కొట్టినంత ఈజీ. కానీ, నీకు నచ్చిన దృశ్యాన్ని కెమెరాలో బంధించడం కాదు నిజమైన ఫొటోగ్రఫీ అంటే, ఒక గొప్ప దృశ్యం చేత నువ్వు బంధీవి కావడం. అసలైన ఫొటోగ్రఫీ అంటే– అపురూప జ్ఞాపకాల పొత్తిళ్లలో నిన్ను నీకు కాన్కనివ్వడం; ఎన్నో భావాల్ని, మరెన్నో బాధ్యతల్ని గుదిగుచ్చి ఒక్క నిశ్శబ్ద చిత్తరువులో తెలపడం.

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్ట్ 19న ఆంధ్రప్రదేశ్ సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో ఫొటోగ్రఫీలో పోటీలు నిర్వహించడం విశేషం. మూడు విభాగాలు, ఆరు అంశాలలో ఈ పోటీ జరిగింది. మొదటి విభాగంలో గోదావరి పుష్కరాలు, నీరు– చెట్టు, పట్టిసీమ ప్రాజెక్ట్; రెండో విభాగంలో ఎన్టీఆర్ భరోసా, 5రెట్లు, ఆంధ్రప్రదేశ్ లో దేవాలయాలు, ఓడరేవులు; మూడో విభాగంలో ఉత్తమ వార్తా చిత్రంపై ఫొటొలను ఎంపిక చేశారు. ఒక్కొక్క విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు 10 కన్సోలేషన్ బహుమతులు ఇచ్చారు. ప్రథమ బహుమతికి రూ.20,000. రెండో బహుమతికి రూ. 15,000, మూడో బహుమతి కి రూ.10,000, కన్సోలేషన్ బహుమతికి రూ.5,000 అందజేశారు.

బహుమతి గ్రహీతలు

1 గోదావరి మహా పుష్కరాలు విభాగంలో ప్రథమ బహుమతి సీహెచ్. నారాయణరావు (విజయవాడ)

2 ఏపీలో ఉత్తమ వార్తా చిత్రం విభాగంలో రెండవ బహుమతి వైవివి సత్యనారాయణ (విజయవాడ)

3 ఏపీలో ఉత్తమ వార్తా చిత్రం విభాగంలో మూడో బహుమతి టి వీరభగవాన్ (విజయవాడ)

4 నీరు చెట్టు విభాగంలో మూడొవ బహుమతి బి.జోగారావు (శ్రీకాకుళం)


5 ఎన్టీఆర్ భరోసా విభాగంలో కన్సోలేషన్ బహుమతి సిఎన్ రావు (విజయవాడ)

6 ఏపీలో ఓడరేవులు విభాగంలో ద్వితీయ బహుమతి మహ్మద్ నవాజ్ (విశాఖపట్నం)

7 ఏపీలో దేవాలయాలు విభాగంలో తృతీయ బహుమతి షేక్ బషీర్ బాబు (శ్రీకాకుళం)

8 ఎన్టీఆర్ భరోసా విభాగంలో కన్సోలేషన్ బహుమతి ఎన్. వెంకట సుబ్బయ్య (అనంతపురం)

9 గోదావరి మహా పుష్కరాలు విభాగంలో కన్సోలేషన్ బహుమతి గొట్టిపాటి వెంకటేష్ (గుంటూరు)












4

5

6

7

8

9

మద్యం నిల్వల పర్యవేక్షణ

వాహనాలకు జీపీఎస్ ట్రాకర్స్ - ఏపీ సీఎం చంద్రబాబు

మద్యం సరఫరాలో, మద్యం నిల్వలలో అక్రమాలకు కళ్లెం వేసేందుకుగాను, అన్ని వాహనాలకు జీపీఎస్ ట్రాకర్స్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఎక్సైజ్ అధికారులకు సూచించారు. విజయవాడ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు.

దీని ద్వారా రిటైల్ దుకాణాలకు మద్యం రవాణాలో స్టాక్ పక్కదారి పట్టకుండా చూడవచ్చన్నారు.ప్రభుత్వ దుకాణాలకు రవాణా చేసే మొత్తం స్టాక్ అంతటినీ కూడా ట్రాకింగ్ చేయాలన్నారు. మద్యం రవాణా మరింత సమర్థంగా జరిగేలా అధికారులు పర్యవేక్షణ కట్టుదిట్టంగా జరగాలన్నారు. రెండు నెలల్లో మొత్తం వ్యవస్థ అంతటినీ దారిలో పెట్టాలన్నారు. హోలోగ్రాం ట్రాకింగ్ పద్ధతిని, హెడోనిక్ పాత్ ఫైండర్ సిస్టంను అమలు చేయాలని ఆదేశించారు. అమ్మకాలు,నిల్వల సమాచారం వివరాలను రోజువారీగా ఎక్సైజ్ శాఖ పకడ్బందీగా పర్యవేక్షించాలన్నారు.

రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు డ్రైవర్లకు నియమాలు,నిబంధనలపై కోడ్ ఆఫ్ కాండక్ట్ ను ప్రభుత్వం రూపొందిస్తోందన్నారు. సురక్షిత డ్రైవింగ్ కోర్స్ లో శిక్షణ ఇచ్చేలా ఓపెన్ డ్రైవింగ్ స్కూల్ వ్యవస్థ ఏర్పాటుపై ఆలోచిస్తున్నామన్నారు. డ్రైవింగ్‌లో ప్రావీణ్యం పెంపుతో పాటు భద్రతకు కూడా ఇందులో ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు.

ఈ ఏడాది రెవెన్యూ వసూళ్ల లక్ష్యం రూ.47,250 కోట్లు కాగా, జులై నాటికి రూ.10,904 కోట్లు వసూలు కావాల్సి ఉండగా, రూ.9,689 కోట్లు మాత్రమే వచ్చిందని అధికారులు సీఎం కు వివరించారు. మొదటి క్వార్టర్ లో వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, రవాణా, స్టాంపులు,రిజిస్ట్రేషన్, గనులు, అటవీ శాఖ ద్వారా కలిపి,మొత్తం రూ. 8,211 కోట్లు రాబడి వచ్చిందన్నారు. ఈ ఏడాది వాణిజ్య పన్నుల ద్వారా రూ.33,856 కోట్లు రాబడికిగాను,జులైనాటికి రూ.9,819 కోట్లు వచ్చిందని వివరించారు.ఇన్ వాయిస్ ట్రాకింగ్ సిస్టం,ఈ బిల్లులను ప్రవేశపెట్టడం వల్ల పన్ను వసూళ్ల సామర్థ్యం పెరగడంతోపాటు, అక్రమాలకు అడ్డుకట్ట పడిందన్నారు.

ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టుల ఏర్పాటు ప్రతిపాదనపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ స్విస్ ఛాలెంజ్ పద్ధతి అనుసరించాలని సూచించారు.

2015 ఆగస్టు 15 నుంచి చేపట్టిన ఎక్కడనుంచైనా రిజిస్ట్రేషన్ విధానం వల్ల ప్రజలకు ఉన్న ఇబ్బందులు తొలగి పోవడంతో పాటు విలువైన కాలం ఆదా అవుతుందన్నారు. కృష్ణా,గుంటూరు,విశాఖపట్నం,శ్రీకాకుళం జిల్లాలలో రిజిస్ట్రేషన్లు మొదటి క్వార్టర్ లో గరిష్టంగా జరిగాయన్నారు. ఆధునీకరణ పనులను వేగవంతం చేయాలన్నారు.

గత ఏడాది బరైటీస్ ఉత్పత్తి ఒక మిలియన్ టన్నుల నుంచి 3 మిలియన్ టన్నులకు పెరిగిందన్నారు. గనుల ద్వారా రాబడిలో తూర్పు గోదావరి,పశ్చిమగోదావరి, కృష్ణ,గుంటూరు జిల్లాలు ముందంజలో ఉన్నట్లు చెప్పారు.

కొత్త మద్యం విధానంతో కల్తీలకు అడ్డుకట్ట

ప్రయోగాత్మకంగా మద్యం దుకాణాలను కొన్ని చోట్ల ప్రభుత్వమే నిర్వహించడం వల్ల కల్తీ మద్యం అమ్మకాలకు అడ్డుకట్ట పడిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. మద్యం దుకాణాలను ప్రభుత్వమే నిర్వహించడం వల్ల అధిక ధరలకు మద్యం అమ్మకాలను జరపకుండా చూశామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఔట్ లెట్స్ 428 ను విజయవంతం చేయాల్సిన బాధ్యత ఎక్సైజ్ శాఖ అధికారులదేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 428 దుకాణాలలో రోజుకు రూ.కోటి 29 లక్షల అమ్మకాలు సగటున జరుగుతున్నాయన్నారు.

రూ.1500 కోట్ల రుణంతో
ఏపీకి ప్రపంచ బ్యాంకు బాసట!

5 ఏళ్లలో 4 జిల్లాల్లో విపత్తు పునరుద్ధరణ పనులు

ఉత్తరాంధ్రలో మూడు జిల్లాలతోపాటు, తూర్పు గోదావరి జిల్లాలో విపత్తుల పునరుద్ధరణ పనులను రాష్ట్ర ప్రభుత్వం సమర్థంగా చేపట్టడంలో సాయం అందించేందుకు ప్రపంచ బ్యాంకు చేయూతనందించనుంది. హుద్ హుద్ తుపానుకు ఘోరంగా దెబ్బతిన్న ప్రాంతాల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్రప్రభుత్వ యంత్రాంగం అహర్నిశలు శ్రమించి, స్వల్పకాలంలోనే పరిస్థితులను చక్కదిద్దింది. హుద్ హూద్ తుపాన్ బీభత్సాన్ని సమర్థంగా ఎదుర్కోవడంలో చంద్రబాబు నాయుడు చేసిన కృషి ప్రపంచ దేశ నేతల దృష్టిని సైతం ఆకర్షించింది.

విపత్తు పునరుద్ధరణ పనులకుగాను ప్రపంచ బ్యాంకు సుమారు 250 మిలియన్ డాలర్లు (రూ.1500 కోట్లకుపైగా) రుణంగా ఇవ్వనుంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం, ప్రపంచ బ్యాంకు మధ్య ఆర్థిక ఒప్పందం కుదిరింది. కేంద్రం తరఫున ఆర్థిక శాఖ సంయుక్త కార్యదర్శి ఎస్ సెల్వకుమార్, ప్రపంచబ్యాంకు తరఫున భారతదేశ డైరెక్టర్ ఒన్నో రుల్ ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు.

ఏపీ తరఫున భూ, విపత్తు నిర్వహణ శాఖ ముఖ్య కార్యదర్శి జగదీశ్ చందర్ శర్మ సంతకం చేశారు. ఏపీలో ఏర్పడే విపత్తుల్ని తట్టుకునే శక్తి సామర్థ్యాల పెంపునకు, ఆయా ప్రాంతాల్లోని ప్రజల జీవన ప్రమాణాలను పెంచేందుకు ఈ నిధుల్ని వినియోగించనున్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల ప్రజలు నేరుగా ఈ పథకంతో లబ్ధి పొందనున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా.. విద్యుత్తు సరఫరా వ్యవస్థను బలోపేతం చేయటం, రహదారుల పునరుద్ధరణ, మొదలైన కార్యక్రమాలను అమలు చేయనున్నారు. ఐదేళ్ల కాలంలో ఏపీ సర్కార్ ఈ పనులు చేపట్టాల్సి ఉంటుంది.

ప్రకాశం స్వగ్రామంలో స్మారక చిహ్నం

ఆంధ్రకేసరి జయంతి సభలో ప్రభుత్వ సలహాదారు డా.పరకాల

టంగుటూరి ప్రకాశం జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించిన ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడుకు ప్రభుత్వ సలహాదారు డా.పరకాల ప్రభాకర్ కృతజ్ఞతలు తెలిపారు. విజయవాడ సత్యనారాయణపురం సంగీత కళాశాలలో జరిగిన ప్రకాశం జయంతి ఉత్సవంలో పాల్గొని ప్రసంగించారు. సభకు ఎమ్మెల్యే శ్రీ బొండా ఉమామహేశ్వర రావు అధ్యక్షత వహించారు. ప్రకాశం గారి స్వగ్రామం వినోదరాయపాలెంలో జాతి గర్వపడే స్మారక చిహ్నాన్ని వచ్చే జయంతి నాటికి ఏర్పాటు చేద్దామని సూచించగా అందుకు సభ యావత్తూ సానుకూలంగా స్పందించింది. అప్పటి ప్రకాశం పంతులు గారికి, ఇప్పటి సీఎం చంద్రబాబుకు మధ్య సారూప్యాన్ని డా. పరకాల వివరించారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రానికి, విడిపోయాక ఆంధ్ర రాష్ట్రానికి టంగుటూరి ప్రకాశం సీఎంగా పనిచేశారని, అదేవిధంగా చంద్రబాబు కూడా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నవ్యాంధ్రప్రదేశ్ కు సీఎంగా పనిచేస్తున్నారని ఆయన గుర్తు చేశారు. ప్రకాశం పంతులు గారు రెండు రాజధానుల నుంచి (మద్రాసు, కర్నూలు) పరిపాలన చేయగా, చంద్రబాబు కూడా రెండు రాజధానుల నుంచి (హైదరాబాద్, అమరావతి) పరిపాలన చేస్తున్నారని డా.పరకాల తెలిపారు. రైతుల కోసం ప్రకాశం గారు రెవెన్యూ సంస్కరణలు తెచ్చారని జమిందారీ భూములపై రైతులకు హక్కులు కల్పించారని, నీటిపారుదల వ్యవస్థను పటిష్టం చేశారని గుర్తు చేశారు. అలాగే చంద్రబాబు కూడా మీభూమి మీఇంటికి ద్వారా రెవెన్యూ సంస్కరణలు అమలు చేస్తున్నారని, రూ.24 వేల కోట్ల రుణ ఉపశమనం చేసి రైతులను అప్పుల ఊబి నుంచి గట్టెక్కించారని, పట్టిసీమ ప్రాజెక్టు, పోలవరం ద్వారా జలవనరుల అభివృద్ధికి కృషి చేస్తున్నారని చెప్పారు. అప్పుడూ, ఇప్పుడూ లోటు బడ్జెట్టు, రాజధాని నిర్మాణం, ఉపాధి సవాళ్లు వున్నాయంటూ ప్రజల సహకారంతో వాటిని పరిష్కరించగలమనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. దార్శనికత, సాహసం విశ్వసనీయత, స్పష్టత వున్న నాయకత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇప్పుడు వుందన్నారు. విభజన బిల్లులో అంశాలను రాజ్యసభలో అప్పటి ప్రధాని ప్రకటించిన 6 సూత్రాలను అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం పై వుందన్నారు.

శాసన సభ ఉప సభాపతి మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ ధైర్యశాలురు, త్యాగశీలురు చరిత్రలో మిగిలిపోతారని, ఆ రెండూ వున్న వ్యక్తి టంగుటూరి ప్రకాశం అని అభివర్ణించారు. అప్పటి నాయకుల త్యాగాల ఫలితంగానే తాను ప్రస్తుతం ప్రజా ప్రతినిధులుగా పదవులలో వున్నామని చెప్పారు. దేశంకోసం, స్వాతంత్ర్యం కోసం కోట్లాది రూపాయల ఆస్తులను తృణప్రాయంగా త్యజించిన టంగుటూరి ప్రకాశం పంతులును ధన్యజీవిగా పేర్కొన్నారు. సీనియర్ జర్నలిస్టు పద్మశ్రీ తుర్లపాటి కుటుంబరావు మాట్లాడుతూ తాము ప్రకాశం పంతులు గారికి కార్యదర్శిగా పనిచేసిన అనుభవాలను, సైమన్ గోబ్యాక్ ఉద్యమంలో తుపాకులకు తన గుండె ఎక్కుపెట్టిన ప్రకాశం ధైర్య సాహసాలను వివరించారు.

స్మగ్లింగ్ నిరోధానికి డ్రోన్ కెమెరాలు

రెడ్ శాండల్ స్మగ్లింగ్ ను అరికట్టేందుకు డ్రోన్ కెమెరాలను, స్టాటిక్ బెలూన్ కెమెరాలను వినియోగించే అంశం పరిశీలించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. టీవీ వైట్ స్పేసెస్ ప్రాజెక్ట్ లో వినియోగించుకోని స్పెక్ట్రమ్ ను రెడ్ శాండల్ అక్రమ రవాణాపై విజిలెన్స్ కు ఉపయోగించు కోవచ్చన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతల సమీక్షా సమావేశంలో మాట్లాడారు. కళాశాలలో ర్యాగింగ్ పై కఠిన చర్యలలో భాగంగా పోలీసుశాఖ రూపొందించిన అభయం (ఆండ్రాయిడ్) యాప్‌లో విద్యార్థినులు ఫిర్యాదులను పంపేలా అప్‌డేట్ చేయాలన్నారు.

డ్రైవర్లు, అసంఘటిత కార్మికుల

సంక్షేమంలో జాప్యం సహించను

డ్రైవర్ల కుటుంబాలలో పిల్లలకు స్కాలర్ షిప్‌లు అందించేందుకు వారి వివరాల సేకరణకు వెంటనే కాల్ సెంటర్లు ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.

రాష్ట్రంలో ప్రతి కార్మికుడికి అంతర్జాతీయ స్థాయిలో నైపుణ్యం పెంపొందాలన్నారు. సంక్షేమ కార్యక్రమాల అమలులో జాప్యాన్ని సహించేది లేదన్నారు. డ్రైవర్లకు ప్రమాదబీమా పథకం అమలులో జాప్యంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ధవళేశ్వరం ప్రమాదంలో మృతి చెందిన డ్రైవర్ల కుటుంబాలకు వారం రోజుల్లో బీమా పరిహారం అందించినట్లే రాష్ట్ర వ్యాప్తంగా అదే చొరవ, స్పందన చూపాలన్నారు.

డ్రైవర్లు, అసంఘటిత రంగంలో కార్మికుల సంక్షేమం కోసం ఒక కంట్రోల్ రూమ్, కాల్ సెంటర్లను వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. ఏడాదిలో ఎన్ని రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి , ఎంతమంది చనిపోతున్నారు అనే వివరాలను అధ్యయనం చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈనెలలో ఇప్పటికే 92% పింఛన్లు పంపిణీ చేశామంటూ, చౌక డిపోల ద్వారా ఈ పాస్ అనుసంధానం వల్ల అక్రమాలు అరికట్టామని, ఆ వేగాన్ని కార్మిక శాఖ కూడా అంది పుచ్చుకోవాలన్నారు. సంఘటిత రంగం, అసంఘటిత రంగంలో కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వ నిధులు వినియోగించాలని, పరిశ్రమల యాజమాన్యాలను సంక్షేమ కార్యక్రమాల అమలులో భాగస్వాములను చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. వారికి పక్కాగృహాల నిర్మాణం, ప్రత్యేకంగా టౌన్ షిప్‌ల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు.

రాష్ట్రవ్యాప్తంగా లైసెన్స్ ఉన్న ట్రాన్స్ పోర్టు డ్రైవర్ల సంఖ్య 5,41,000 కాగా అందులో ఇప్పటివరకు 3,77,000 మంది వివరాలను రిజిస్టర్ చేసినట్లుగా కార్మికశాఖ మంత్రి అచ్చెన్నాయుడు వివరించారు. ప్రమాదబీమాకు సంబంధించి 28 క్లెయిమ్స్ వచ్చాయని, వీటిలో 22 పరిష్కరించామని, మిగిలినవి ప్రాసెస్‌లో ఉన్నాయని తెలిపారు.

భూ బాధితుల తలుపు తట్టిన

మీ ఇంటికి – మీ భూమి



చల్లని కంటితో చూస్తే, మనిషికీ– భూమికి ఉన్న సంబంధం, చెట్టుకి– మట్టికీ ఉన్న బంధంలాంటిది. అది ఆదర్శం. కానీ, వాస్తవంలో భూమి ఎప్పుడూ బల్లపరుపుగానే కనిపిస్తుంది, గొడవలకి సిద్ధం చేసిన గోదా మాదిరిగా. అందుకే, నేరాలు, ఘోరాలు, గోప్యాలు, గొడవలు.... అన్నీ భూమి చుట్టే తిరుగుతుంటాయి. సరిహద్దు గట్లు చెరిగిపోతుంటాయి... పట్టాదారు పత్రాలు చిరిగిపోతుంటాయి.... అడంగళ్లు చెదిరిపోతుంటాయి...

ఈ మొత్తం అవ్యవస్థ కీలెరిగి వాత పెట్టాలనీ, రెవెన్యూ భూ మాయాజాలానికి చరమగీతం పాడాలనీ సంకల్పించారు నవ్యాంధ్ర సారథి నారా చంద్రబాబు నాయుడు. ఆయన నేతృత్వంలో మోసాలకు తావులేని ఒక పారదర్శక విధానం రూపుదిద్దుకుంది. ఆ విధానాన్ని అమలు చేస్తూ ఏర్పాటైన కార్యక్రమం వల్ల దశాబ్దాలుగా రెవెన్యూ శాఖ రికార్డుల్లో నక్కి, ముక్కిపోయిన భూముల వివరాలు ప్రజల ముందు ప్రత్యక్షం అవుతున్నాయి. వ్యవసాయ భూములకు సంబంధించి ప్రభుత్వ రికార్డుల్లో దశాబ్దాలుగా పేరుకుపోయిన అనేక తప్పులు సరిదిద్ది, ప్రజానీకాన్ని ముప్పతిప్పలు పెడుతున్న రెవెన్యూ రికార్డులను ప్రక్షాళించడమే లక్ష్యంగా సుపరిపాలనలో భాగంగా 'మీ ఇంటికి మీ భూమి' కార్యక్రమానికి ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారు. రెవెన్యూ రికార్డుల్లోని తప్పులను ఎలా సవరించుకోవాలో తెలియక కార్యాలయాలు, అధికారులు చుట్టూ ఎన్ని సార్లు తిరిగినా ఫలితం లేక నీరసించిన భూ బాధితుల తలుపు తట్టింది మీ భూమి కార్యక్రమం.

మీ ఇంటికి – మీ భూమి

విశాఖపట్నం జిల్లా అనకాపల్లి సమీపంలో శంకరం గ్రామంలో ముఖ్యమంత్రి ప్రారంభించిన ఈ కార్యక్రమం ఆగష్టు 31 వరకు 20 రోజులపాటు కొనసాగింది. భూముల క్రయ విక్రయాల్లోను వివాదాలు చోటు చేసుకుంటున్నాయి, కొన్ని గ్రామాల్లో ఒకరి భూమి వేరొకరి పేరిట పట్టాలివ్వడం వంటి అక్రమాలు జరుగుతున్నాయి. అయితే, 'మీ ఇంటికి – మీ భూమి ' కార్యక్రమం ఫలితంగా నకిలీ పాస్ పుస్తకాలు ఉండబోవని, రైతులు పట్టాదారు పాస్ పుస్తకాల కోసం, రిజిస్ట్రేషన్స్, బ్యాంకు రుణాలు వంటి విషయంలో కాళ్ళు అరిగిపోయేలా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం ఉండదని ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సందర్భంగా చంద్రబాబు అన్నారు. మీ భూమి మీ పేరుతో ఉందో,

లేదో చూసుకుని తప్పులు, లోపాలు ఉంటే అధికారుల దృష్టికి తెచ్చి సవరించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఏపి సర్వే నెంబర్లలో వారి భూముల వివరాలు తెలుసుకోవాలంటే, www.meebhoomi.ap.gov.in పై ఒక క్లిక్ చేస్తే చాలు వారి పొలాల సమస్త సమాచారం వారి ముందు ప్రత్యక్షమయ్యే అవకాశం కల్పించింది ఏపి ప్రభుత్వం. స్మార్ట్ విలేజ్ పథకంలో భాగంగా రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులు చోటు చేసుకుంటున్నాయి.ఏ సర్వే నెంబరు ఎవరి పేరుతో పట్టా ఉంది? ఎవరు సాగు చేస్తున్నారు ? ఏ సంవత్సరం ఏ సర్వే నెంబర్లో ఏ తరహా పంటలు వేశారు ? ఏ తరహా భూమి ? నీటి వసతులు ఏమిటి ? సదరు భూమి మాగాణా?మెట్టా? వంటి అనేక వివరాలు ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకున్నారు. రెవెన్యూ వ్యవస్థను సమస్తం డిజిటలైజేషన్ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వెబ్ ల్యాండ్ ద్వారా నకిలీ పట్టాదారు పాస్ పుస్తకాలను ఏరివెయ్యాలని నిర్ణయించారు చంద్రబాబు.

ప్రజలు... ప్రతినిధులు సమష్టిగా...

తహశీల్దార్, ఆర్.ఐ, సర్వేయర్ సంబంధిత గ్రామ అధికారి, అటవి, దేవాదాయ, వక్ఫ్ ప్రతినిధులతో కూడిన బృందం గ్రామ సభల అండతో చేసిన ఈ కృషి ప్రత్యక్షంగా రైతులకు మేలు చేకూర్చింది. రెవెన్యూ విభాగాన్ని సంస్కరించి నిబంధనల్ని సరళీకరించే లక్ష్యంతో మాజీ ఐఏఎస్ అధికారి చక్రపాణి సంచాలకులుగా ఉన్న ప్రజా సేవల సృజన కేంద్రానికి అధ్యయన బాధ్యతలు అప్పగించింది రాష్ట్ర ప్రభుత్వం.

ప్రతి ముప్పై ఏళ్లకొకసారి భూ రికార్డులు ప్రక్షాళన దిశగా సమగ్ర సర్వే జరపాలని బ్రిటిష్ వారి హయాంలో నిర్దేశించినా ఆ దిశగా అడుగులు పడలేదు. వాస్తవంగా ఆంధ్రప్రదేశ్ భూ రికార్డుల సర్వే ఏనాడో 1920 లో జరిగింది. అప్పటి టిప్పన్లలో సగం నేటికి బాగానే ఉన్నా మిగిలినవి చినిగిపోయి ఉన్నాయి. ఏ భూమి ఏదశలో ఎవరెవరు హక్కు దారులన్న కీలక సమాచార నిధి సేకరణలో అలసత్వం కారణంగా ఆస్తి వివాదాలు పెరిగిపోయాయి. అడంగల్ కాపీలో తన పేరు నమోదు కాలేదని, భూ విస్తీర్ణంలో తప్పులు దొర్లాయని, జిరాయితీ భూమిని సర్కారు భూమిగా చూపారని ఇలా ఎన్నో అర్జీలు మీ భూమి కార్యక్రమంలో పెద్ద ఎత్తున వచ్చాయి. ఇటువంటి సమస్యల పరిష్కార మార్గానికి వేదికైంది 'మీ భూమి' కార్యక్రమం.

ఏనాడో పాదుకొన్న ఆలోచన

తమ భూముల రికార్డుల కోసం రైతులు, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగకుండా 2003 లోనే 'మీ భూమి – మీ పట్టా' కార్యక్రమం చేపట్టింది ఆనాటి చంద్రబాబు ప్రభుత్వం. కానీ, ఆ కార్యక్రమం అర్థాంతరంగా ఆగిపోయింది. తిరిగి అధికార పగ్గాలు చేపట్టాక, ఆనాటి ఆలోచనని మరింత పదును పెట్టి, రెండు నెలల క్రితం 'మీ భూమి' పోర్టల్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. రెవెన్యూ కార్యాలయాల్లో ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ కాగిత రహితంగా కంప్యూటర్ పైనే సాగేలా ఈ పరిపాలన దిశగా చర్యలు చేపట్టింది. ఇందు కోసం గ్రామాల వారీగా భూముల వివరాలన్నీ పారదర్శకంగా ఉంచాలని నిర్ణయించి వెబ్ ల్యాండ్ ఏర్పాటు చేసి రెవెన్యూ శాఖ వద్ద ఉన్న రికార్డుల ప్రకారం అందులో ఉంచారు. భూములకు సంబంధించి 64 ధృవ పత్రాలున్నాయి. వీటి సంఖ్యను తగ్గించి రికార్డులను సులభతరం చేయనున్నారు.

రాష్ట్రంలో 2 కోట్ల 24 లక్షల సర్వే నెంబర్లు ఉండగా 72 లక్షల మంది పట్టాదారులు ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నివశించే 73 శాతం ప్రజలు భూముల పైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఆ భూముల వివరాలుపై స్పష్టత కోసం త్వరలో వివరాలు తెలుసుకునేందుకు ప్రత్యేక టోల్ ఫ్రీ నెంబర్ ను కూడా ప్రారంభించబోతున్నారు. భూముల రికార్డులు బ్రిటీష్ కాలం నుంచి కొనసాగుతున్నాయి. గత పద్దతిని మార్చి శాశ్వత విధానం ప్రవేశపెట్టి ప్రతి గ్రామంలో ప్రతి రైతుకు 1బి అడంగల్ కాపీ ఇవ్వనున్నారు.

రెవెన్యూ రికార్డుల్లో ఎటువంటి పొరపాట్లు దొర్లాయో మీ భూమి గ్రామ సభల ద్వారా వెలుగులోకి వస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమం మొదలుపెట్టిన వారం రోజుల్లోనే 3,700 గ్రామాల్లో లక్ష మందికి పైగా తప్పులు సరిదిద్దమని దరఖాస్తులు అందాయి. ఈ సభల ద్వారా వెలుగు చూస్తున్న ప్రధాన సమస్య రికార్డులో ఉన్న భూ విస్తీర్ణానికి వాస్తవ విస్తీర్ణానికి కొలతల్లో తేడాలుంటున్నాయి. వీటిని సరి చెయ్యాలంటూ ధరఖాస్తులు భారీగా వచ్చాయి. ఈ తరహా దరఖాస్తులను సెప్టెంబర్ నెలాఖరులోగా పరిష్కారించాలని రెవెన్యూ శాఖ నిర్ణయించింది.

ఏళ్ళ తరబడి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగిన పరిష్కారం కాని భూ సమస్యలు మీ భూమి కార్యక్రమం ద్వారా పరిష్కారం అవుతున్నందుకు భూ బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

❖

మతాలవారీ జనాభా గణాంకాలు

ఏపీలో పెరిగిన హిందువుల సంఖ్య

ఆంధ్రప్రదేశ్‌లో మతాలవారీగా సేకరించిన జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలోని 13 జిల్లాల్లో హిందువుల జనాభా 90.87 శాతానికి పెరిగింది. ముస్లింల జనాభా 7.32 శాతం ఉంది. రాష్ట్రంలో మొత్తం జనాభా 4.93 కోట్లు ఉండగా, ఇందులో 4.48కోట్ల మంది హిందువులు, 36.17 లక్షల మంది ముస్లింలు, 6.82 లక్షల మంది క్రైస్తవులు, 9,904మంది సిక్కులు, 4,139మంది బౌద్ధులు, 27,159మంది జైన్లు, 4,125మంది ఇతరులు ఉండగా, 1.65లక్షల మంది మతం పేరు వెల్లడించేందుకు నిరాకరించారు. రాష్ట్రంలో హిందువుల జనాభా తరువాత స్థానంలో వరుసగా ముస్లిం, క్రైస్తవ, జైన్, సిక్కు, బౌద్ధులు ఉన్నారు.

ముస్లిం జనాభాలో 6.70 లక్షల మందితో (16.54%) కర్నూలు జిల్లా రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచింది. ముస్లిం జనసంఖ్య శ్రీకాకుళం నుంచి పశ్చిమ గోదావరి వరకు అయిదు జిల్లాల్లో వేలల్లో, మిగిలిన ఎనిమిది జిల్లాల్లో లక్షల్లో ఉంది. ఐతే, 9,025 మంది ముస్లిం జనాభాతో శ్రీకాకుళం జిల్లా చివరి స్థానంలో నిలిచింది. క్రైస్తవుల జనసంఖ్యలో కృష్ణా జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. ఇక్కడ అత్యధికంగా 1.45 లక్షల మంది ఉండగా, విజయనగరం జిల్లాలో అత్యల్పంగా 17,853 మంది ఉన్నారని తాజా గణాంకాలు చెబుతున్నాయి. పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల్లో క్రైస్తవుల జన సంఖ్య లక్షల్లో కనిపించింది. సిక్కుల జనాభా విశాఖపట్నంలో, జైనుల సంఖ్య కృష్ణాలో చెప్పుకోదగ్గ స్థాయిలో ఉంది. ఇతర మత ధర్మాలను ఆచరిస్తున్న వారు, ఏ మతమో చెప్పని వారు కృష్ణాలో అధికంగా ఉన్నట్లు తేలింది. క్రైస్తవుల్లో పురుషుల కంటే మహిళల జనాభా అత్యధికంగా ఉండగా, సిక్కుల్లో ఇది అతి తక్కువగా కనిపించింది. రాష్ట్రంలో వందమంది పురుషులకు 99.63 మంది మహిళలు ఉన్నారు. లింగ నిష్పత్తి హిందువుల్లో 99.57 శాతం, ముస్లింల్లో 98.95 శాతంగా ఉంది. క్రైస్తవుల్లో 107.60 శాతం ఉన్నట్లు ఈ జనాభా లెక్కలు చెబుతున్నాయి.



పర్యాటకం మరియు సాంస్కృతిక శాఖ

ఐదేళ్లలో పర్యాటక హబ్‌గా నవ్యాంధ్రప్రదేశ్

పర్యాటక , ఆతిథ్య రంగాలలో నవ్యాంధ్రప్రదేశ్ , దేశంలోనే ప్రధానభూమిక వహించనున్నది. దేశ, విదేశీ యాత్రికులను పెద్ద ఎత్తున ఆకర్షించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది. అందుకే పర్యాటక రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తూ అనేక కార్యాచరణ ప్రణాళికలతో ముందడుగు వేస్తున్నది. రాబోయే ఐదేళ్లలో నవ్యాంధ్రప్రదేశ్ దేశంలో ప్రధానమైన పర్యాటక హబ్‌గా రూపాంతరం చెందబోతోంది.

పర్యాటకులను ఆహ్లాద తీరాలకు చేర్చే ఆనందలోకాలు మన రాష్ట్రంలో చాల ఉన్నాయి. భక్తులను అలరించే పుణ్యక్షేత్రాలకు ఆధ్యాత్మిక ధామాలకు కొదవేలేదు. ప్రకృతి అందాలకు ధీటుగా చారిత్రక, సంస్కృతిక వారసత్వం మనకు ఉన్నది. రాష్ట్రంలో ఉన్న 54ప్రధానమైన పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలతో ప్రణాళికలు రూపొందించింది. వీటిలో తొమ్మిది ప్రధానమైన ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.

- సాగరతీరాలు, జలాధార పర్యాటకం
- ఎకో టూరిజం
- బౌద్ధ పర్యాటకం
- మత పర్యాటకం
- వారసత్వ పర్యాటకం
- ఎంఐసిఇ టూరిజం, మౌలిక పర్యాటకం
- వినోదం, సాహస పర్యాటకం
- ఆధ్యాత్మిక పర్యాటకం, ఆరోగ్య పర్యాటకం
- వైద్య పర్యాటకం

'పర్యాటకం'లో పెట్టుబడుల లక్ష్యం

2020నాటికి పర్యాటక అభివృద్ధిలో మొత్తం రూ.10వేల కోట్లు పెట్టుబడులు
2029నాటికి పర్యాటక అభివృద్ధిలో మొత్తం రూ.20వేల కోట్లు పెట్టుబడులు

- పెట్టుబడుల ఆకర్షణ కోసం అనేక ప్రోత్సాహకాలతో కూడిన పారిశ్రామిక, మిత్ర పర్యాటక విధానం
- ఔత్సాహికులను ప్రోత్సహించేందుకు ఏక గవాక్షవిధానం
- మత పర్యాటక అభివృద్ధికోసం ఏడు ప్రాంతాలు గుర్తించి, ఆయా ప్రాంతాలను ప్రధాన పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయటం.
- విశాఖపట్నం నగరం లోని మధురవాడ వద్ద అంతర్జాతీయ వినోద నగరం ఏర్పాటుకు ప్రతిపాదన
- తిరుపతిలో గ్రీన్‌ఫీల్డ్ పార్కు ఏర్పాటుకు ప్రతిపాదన
- విజయవాడకు సమీపంలోని భవానీ ఐలాండ్ వద్ద మెగా పార్క్ ప్రతిపాదన
- కెపాసిటీ బిల్డింగ్‌కోసం అనేక ప్రోత్సాహకాలందించడం. వీటిలో....
  - తిరుపతిలో పాకశాస్త్ర విద్యాసంస్థ ఏర్పాటు
  - తిరుపతి, కాకినాడల్లో ఆతిథ్యనిర్వాహణా సంస్థల ఏర్పాటు
- సంస్కృతిక రంగాన్ని ప్రోత్సహించేందుకు మూడు అకాడమీలు ఏర్పాటు
  - విశాఖపట్నంలో సాహిత్య అకాడమీ
  - విజయవాడలో సంగీత అకాడమీ
  - తిరుపతిలో లలిత కళా అకాడమీ

విద్యాసుగంధాల నవ్యాంధ్రలో

మరో జ్ఞానప్రసూనం!

తాడేపల్లిగూడెంలో ఎన్ఐటీకి అంకురార్పణ



ఊహించని వేగంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ ను ఒక ఎడ్యుకేషనల్ హబ్ గా తీర్చిదిద్దుతున్నారు. ఇందుకు తాజా నిదర్శనం పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఇటీవల ప్రారంభమైన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్).

నిట్ శాశ్వత భవన నిర్మాణాలకు కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి స్మృతి ఇరానీ శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన చేసిన ఆ చేతులతోనే నిట్ తరగతులకు అవసరమైన క్యాంపస్‌ను తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లిలోని వాసవీ ఇంజినీరింగ్ కళాశాలలో లాంఛనంగా ప్రారంభించారు. నిబంధనల ప్రకారం, తాడేపల్లిగూడెం నిట్‌కు కేటాయించిన మొత్తం 540 సీట్లలో 480 సీట్లను తాడేపల్లిగూడెంలో నిట్ ద్వారా భర్తీ చేయాల్సి ఉండగా, మిగిలిన 60 సీట్లు వరంగల్ నిట్‌లో భర్తీ చేయాల్సి ఉంది. వీరంతా ఆంధ్ర నిట్ ద్వారా అభ్యసిస్తున్నట్లుగా పరిగణనలోకి తీసుకుంటారు. తాడేపల్లి నిట్ లోనే కౌన్సిలింగ్ జరిగి, నిట్ తరగతులు ఈ విద్యా సంవత్సరం నుంచి ఇటీవలే మొదలు కావటం అన్నింటి కంటే విశేషం. ప్రభుత్వాలు మారుతున్నా, శంకుస్థాపన శిలాఫలకాలు మాత్రం నాయకుల శుష్క వాగ్దానాలకీ, నిష్క్రియాపరత్వాలకీ మొండిసాక్ష్యాలుగా మిగిలిపోతున్న సంఘటనలు కోకొల్లలు. కానీ, చంద్రబాబు ప్రభుత్వం చేతలదనీ, చేవగలదనీ మరోసారి ఋజువుకావడం, ఈ విద్యాసంవత్సరంలోనే తరగతులు కూడా మొదలైపోవడం విద్యార్థుల్లో గొప్ప భరోసాని, ఉత్సాహాన్నీ నింపుతోంది.

సీఎం చంద్రబాబు, కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రి వెంకయ్యనాయుడు, మరో కేంద్ర మంత్రి సుజనా చౌదరి, దేవాదాయ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు, ఏపీ మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు తదితరులు హాజరైన ఈ కార్యక్రమంలో స్మృతి ఇరానీ మాట్లాడుతూ, తిరుపతి ఐఐటీకి రూ. 700 కోట్లు, తాడేపల్లిగూడెంలో నిట్‌కు రూ. 300 కోట్లు, విశాఖ ఐఐఎంకు రూ. 680 కోట్లు ఖర్చు చేయనున్నట్లు చెప్పారు.

విద్యాభివృద్ధిలో పరుగులు పెడుతున్న రాష్ట్రం

సమైక్యాంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో భాగంగా మనకు వచ్చిన 11 ప్రతిష్ఠాకరమైన సంస్థలలో ఐదు సంస్థలను ఇప్పటికే ప్రారంభించుకోవడమైంది. వీటిలో ట్రిపుల్ ఐటీ, ఐఐఎం, ఐసర్, ఎన్ఐవోటీ(నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ), ఎన్ఏసీఈఎన్(నేషనల్, అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఎక్సైజ్ అండ్ నార్కోటిక్స్) తదితర సంస్థలు ఉన్నాయి. ఇందుకోసం కేంద్రప్రభుత్వం ఇప్పటివరకు రూ. 3030కోట్లు కేటాయించింది. ఐఐఎం, ట్రిబుల్ ఐటీ, నిట్ మొదలైన సంస్థల ఆవిర్భావంతో మన విద్యార్థుల భవిష్యత్ సమూలంగా మారిపోనున్నది. నవ్యాంధ్రప్రదేశ్ విద్యాలయాలకు ప్రధాన భూమిక వహించే సమయం సమీపిస్తున్నది. ఇందుకోసం ముఖ్యమంత్రి చంద్రబాబు తనదైన శైలిలో కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి పెంచి, దశల వారీగా విద్యాసంస్థలను మంజూరు చేయించుకోగలుగుతున్నారు.

కొత్తగా మరో ఆరు యూనివర్శిటీలు

ఇదిలావుండగా, రాష్ట్రంలో కొత్తగా మరో ఆరు విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఎనర్జీ, వాటర్, స్పోర్ట్స్, టూరిజం, ఆక్వా, లాజిస్టిక్ యూనివర్సిటీలను నెలకొల్పేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. వీటికి అతిత్వరలోనే అంకురార్పణ చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలో మంత్రి గంటా శ్రీనివాసరావు తన వంతు కృషి చేస్తున్నారు. కొత్తగా ఏర్పాటు కాబోయే ఈ యూనివర్సీటీలన్నింటిలోనూ 'వైఫై' సౌకర్యం కల్పించనున్నారు.

ఈ వర్సిటీలకు తోడు విజయనగరంలో కొత్తగా ట్రైబల్ యూనివర్సిటీ, అనంతపురంలో సెంట్రల్ యూనివర్సిటీల ఏర్పాటుకు అవసరమైన భూమిని కూడ సేకరించారు. త్వరలో ఈ వర్సిటీల్లో క్లాసులు కూడ ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇవికాక అగ్రికల్చరల్, పెట్రో యూనివర్సిటీలతోపాటు ప్రతిష్ఠాకరమైన ఎయిమ్స్(ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్)వంటి సంస్థలు కూడ రాబోతున్నాయి.

పరిశ్రమల్లో విద్యాసంస్థలను అనుసంధానం చేసి, చదువు పూర్తికాగానే ఉపాధి లభించేలా, ఉపాధికి తగిన శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. యువతకు వివిధ అంశాలలో శిక్షణ ఇప్పించేందుకు వారిని ఔత్సాహికులను తయారు చేసేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఇప్పటికే ఏర్పాటు చేశారు. ఈ సంస్థ ద్వారా 2019 నాటికి మొత్తం 16 లక్షలమందికి నైపుణ్యంలో నాణ్యత పెంచేందుకు ప్రత్యేక శిక్షణ ఇస్తారు. వచ్చే సంవత్సరంలో రెండులక్షల మంది యువతీ యువకులకు నైపుణ్యతపై ఈ సంస్థ ద్వారా శిక్షణ ఇస్తారు. ఇందుకోసం విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, నెల్లూరు, చిత్తూరు జిల్లాలలో ఆరు క్లష్టర్లను ఏర్పాటు చేయడానికి ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి.



పెరుమాళ్ళ నాగరాజు
మీడియా లైజన్ అధికారి

రాష్ట్రాభివృద్ధికి రతన్ టాటా చేయూత



విజయవాడ నియోజకవర్గానికి టాటా ట్రస్టు సహకారం

నవ్యాంధ్రప్రదేశ్‌కు అండగా ఉండేందుకు టాటా కంపెనీ ఎమిరిటసస్ చైర్మన్ రతన్ టాటా ముందుకు వచ్చారు. రాజధాని అమరావతి నిర్మాణానికి సన్నాహాలు చేసుకుంటున్న తరుణంలో రాష్ట్రాభివృద్ధికి రతన్ టాటా ముందుకు రావటం శుభారంభమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఇది నవ్యాంధ్ర అభివృద్ధికి కీలక మలుపు కాగలదని, ఈ కృషి ఎప్పటికీ కొనసాగాలని చెప్పారు. రాష్ట్రాభివృద్ధికి ఆయన చేయూతనివ్వాలని విజ్ఞప్తి చేశారు.

ఏపీకి టాటా వస్తే పారిశ్రామికీకరణకు, పెట్టుబడుల ప్రవాహానికి అనుకూల వాతావరణం ఏర్పడినట్లేనని చెప్పారు.

ఆయన ఆధ్వర్యంలోని టాటా ట్రస్టులు, రాష్ట్రప్రభుత్వంతో ప్రాథమిక అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఎంఓయూలో భాగంగా విజయవాడ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని 264 గ్రామాలలో టాటా ట్రస్టులు వెదురు సాగు, మత్స్య పరిశ్రమ, ఆరోగ్యం, పౌష్టికాహారం, గ్రామీణాభివృద్ధిలో సహకారం అందజేస్తాయి.

దేశ చరిత్రలోనే తొలిసారిగా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) కింద టాటా ట్రస్టులు ఒక పార్లమెంటు నియోజకవర్గాన్ని దత్తత తీసుకోవటం, అదీ విజయవాడ నుంచి నాంది పలకటం చరిత్రాత్మకమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ సందర్భంగా విజయవాడలో ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ సదస్సులో జరిగిన సభలో అన్నారు. నియోజకవర్గంలోని 264 గ్రామాలను పూర్తిగా దత్తత తీసుకుని అభివృద్ధి కార్యక్రమాలు తలపెట్టడం ద్వారా రతన్ టాటా దేశంలోని పారిశ్రామికవేత్తలకు సరికొత్త దిశానిర్దేశం చేశారని చెప్పారు. ఆయన విశ్వసనీయత, నిరాడంబరత, నిబద్ధత ఈ కార్యక్రమానికి వన్నె తెచ్చాయన్నారు. ఈ గ్రామాలను దత్తత తీసుకునేముందు టాటా ట్రస్టులు చేసిన అధ్యయనం, పరిశోధన తనను ముగ్ధుడ్ని చేశాయని ముఖ్యమంత్రి చెప్పారు.

విజయవాడకు రతన్ టాటా వచ్చినందుకు తమకెంతో సంతోషంగా వుందని, విశాఖ, చిత్తూరు, నెల్లూరు, నెల్లూరుల అభివృద్ధికి రతన్ టాటా సహకరించాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ఆక్వా, మాన్యుఫ్యాక్చరింగ్, ఆటోమొబైల్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో రతన్ టాటా ప్రోత్సాహం ఇవ్వాలని కోరారు.

ప్రతి ఇంటినుంచి ఒక కంప్యూటర్ లిటరేట్, ఒక పారిశ్రామికవేత్తను తయారు చేసేందుకు తాను కృషి చేస్తున్నట్లు చంద్రబాబు తెలిపారు.

ఆంధ్రప్రదేశ్‌లో సహజ వనరులకు లోటు లేదని, బెరైటిస్, బాక్సైట్, ఐరన్ ఓర్, లైమ్ స్టోన్, గ్రానైట్ సహా అనేక ఖనిజాలు అపారంగా వున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు.

పారిశ్రామికాభివృద్ధికి అగ్రప్రాధాన్యమిస్తున్నామని, ఇందులో భాగంగా 24 గంటల విద్యుత్, సింగిల్ డెస్కు పాలసీ ద్వారా 21 రోజుల్లో అనుమతులు ఇస్తున్నామని వివరించారు. మౌలిక సదు-పాయాలైన భూమి, నీరు, విద్యుత్‌కు కొదవ లేదని, తమ రాష్ట్రంలో ఇవన్నీ పారిశ్రామికవేత్తలకు ఆకర్షించే అంశాలని తెలిపారు.

వ్యవసాయంలో, ఖనిజ సంపదలో దేశంలోనే ఏపీ నెంబర్ వన్‌గా వుందని, ఖనిజాధారిత పరిశ్రమల ఏర్పాటుకు రతన్ టాటా ముందుకు రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రంలో స్మార్టు విలేజి-స్మార్టు వార్డు కార్యక్రమం కింద మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సెలబ్రిటీలు ఇప్పటికే 10 వేల గ్రామాలు దత్తత చేసుకున్నారని ముఖ్యమంత్రి తెలిపారు. ఇంకా 6 వేల గ్రామాలు దత్తత చేసుకోవాల్సి వుందని, త్వరలో ప్రవాసాంధ్రులతో ఈ అంశంపై సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో నాడు తన 9 ఏళ్ల పాలనలో జాతీయ సంస్థలను నెలకొల్పడానికి,

హైదరాబాద్ అభివృద్ధికి టాటా గ్రూప్ ఎంతో సహకారం అందించిన విషయాన్ని మరచిపోలేనని చంద్రబాబు చెప్పారు. ఇప్పుడు నవ్యాంధ్ర అభివృద్ధికి కూడా అదే సహకారం ఆశిస్తున్నామని చంద్రబాబు అన్నారు. ఇటువంటి పారిశ్రామికవేత్తల సహకారంతో ఏపీని ప్రపంచంలోనే అత్యుత్తమ రాష్ట్రంగా తీర్చిదిద్దుతానని స్పష్టంచేశారు. మంగళవారం ప్రధాని నరేంద్రమోడీతో భేటీ జరగనుందని, ఇది రాష్ట్రాభివృద్ధికి నాంది కాబోతోందన్నారు. వైజాగ్, కాకినాడ, గంగవరం, కృష్ణపట్నం పోర్టులు, అలే అంతర్గత జలరవాణా, చెన్నయ్-బెంగళూరు కారిడార్, కోల్‌కతా-చెన్నయ్ కారిడార్ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని ఖాయం చేస్తున్నాయని ముఖ్యమంత్రి చెప్పారు. దేశ

సముద్ర తీర రాష్ట్రాలలో గుజరాత్ తర్వాత ఆంధ్రప్రదేశ్ పెద్దదని, ఈ ప్రత్యేకతతో అద్భుతాలు విలువలను పాటించి పారిశ్రామిక సామ్రాజ్యాన్ని విస్తరించారని ప్రశంసించారు. రతన్ టాటా నేతృత్వంలో టాటా గ్రూప్ ఎంతో ప్రగతి సాధించి కొత్తపుంతలు తొక్కిందన్నారు. దేశంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ, స్టార్టప్ లకు ప్రోత్సాహక వాతావరణం సృష్టించారని, తద్వారా దేశ పారిశ్రామికాభివృద్ధికి దిశానిర్దేశం చేస్తున్నారని అభినందించారు. రతన్ టాటా త్వరలో ఆంధ్రప్రదేశ్‌ను సందర్శించి కార్పోరేట్ సామాజిక బాధ్యత, పారిశ్రామికాభివృద్ధి, ఆరోగ్యం, పారిశుధ్యం తదితర అంశాలలో ఆలోచనలు పంచుకోవాలని, పారిశ్రామికవేత్తలకు మార్గదర్శనం చేయాలని ముఖ్యమంత్రి కోరారు.

చంద్రబాబు తపన అందరికీ ప్రేరణ

టాటా గ్రూప్ ఎమిరిటస్ చైర్మన్ రతన్ టాటా ప్రసంగిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో టాటా ట్రస్టులు సాంఘిక, సేవా రంగాలలో సహకారానికి కొనియాడారు. చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నెంబర్ వన్ గా ఎదుగుతుందనటంలో తనకెలాంటి సందేహాలు లేవని రతన్ టాటా చెప్పారు.

ఒక యువ పారిశ్రామికవేత్త ప్రశ్నకు సమాధానమిస్తూ..దేశంలో తాను స్టార్టప్స్ ను ఎలా అభివృద్ధి చేసిందీ వివరించారు. 'మన శక్తిని, సత్తాను నమ్ముకుని ముందుకు వెళ్లేవాళ్లు నాకు ఆదర్శం. అమెరికా స్టార్టప్స్ కానీ, ప్రపంచంలో మరెక్కడ సార్టప్స్‌ను కానీ అనుకరించటం నాకేమీ ఇష్టం కాదు. దేశీయ పారిశ్రామికవేత్తలు, లేదా విదేశాల్లో పరిశ్రమలు నెలకొల్పే మనవాళ్లయినా ముందుగా తమమీద తమకు విశ్వాసం, ఆత్మవిశ్వాసం కలిగి వుండాలి' అని రతన్ టాటా అన్నారు. మనదేశ సమస్యల పరిష్కారానికి ఎటువంటి సాంకేతిక పరిజ్ఞానం అవసరం, ఏఏ రంగాలకు అనువర్తింపజేయాలి? అని ఒక



సృష్టించవచ్చని తెలిపారు. పరిశ్రమల అభివృద్ధికి తీర ప్రాంతం, జలరవాణా కీలకం కానున్నదన్నారు.

అమరావతి నిర్మాణానికి సింగపూర్ ఉచితంగా బృహత్తర ప్రణాళిక అందించిందని, సీడ్ క్యాపిటల్, క్యాపిటల్ సిటీ, క్యాపిటల్ రీజియన్ అనే 3 భాగాలుగా సింగపూర్ మాస్టర్ ప్లాన్ ఇచ్చిందని గుర్తు చేశారు. క్యాపిటల్ రీజియన్‌లో 3 వేల ఎకరాల విస్తీర్ణంలో ఐలాండ్స్ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. కోనసీమ, విశాఖ ప్రాంతాలలో ఐలాండ్స్ ను అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు.

రతన్ టాటా భారత దేశ పారిశ్రామిక కలిమికి, బలిమికి చిహ్నమని సీఎం కొనియాడారు. టాటా చేసుకున్న అవగాహనా ఒప్పందం కోసం ఇక్కడికి వచ్చానని, రాష్ట్రాభివృద్ధికి ఎంతో కృషిచేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు తమ సహకారం వుంటుందన్నారు. కొత్త ఆలోచనలతో కొత్త పరిశ్రమలు తీసుకురావాలని భేటీలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు సూచించానని వెల్లడించారు. కేవలం డబ్బుతో అన్నీ సాధించలేమని, తన జీవన చరమాంకంలో గుర్తించానన్నారు. రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబు పడుతున్న తపన తనకు ఒక ప్రేరేపణగా వుందని ప్రశంసించారు. నవ్యాంధ్ర అభివృద్ధికి వ్యక్తిగతంగా కూడా తాను చేయగలిగిందంతా చేస్తానని రతన్ టాటా స్పష్టం చేశారు. చంద్రబాబు స్వయంకృషితో దేన్నయినా సాధించగల సమర్థుడు అని మహిళా పారిశ్రామికవేత్త అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. 'ఇంధన రంగంలో సవాళ్లను అధిగమించే సాంకేతిక పరిజ్ఞానం మనకు కావాలి. పారిశుధ్యం, రక్షిత మంచినీరు, ఆరోగ్యం తదితర అంశాల్లో సమస్యలకు అది పరిష్కారాలు సూచించగలిగేది అయి వుండాలి' అన్నారు.


ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో 264 గ్రామాల దత్తత అంశాన్ని రతన్ టాటాకు ప్రతిపాదించిన విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) మాట్లాడుతూ .. విజయవాడలో 2.5 లక్షల గృహాలలో 10 లక్షల మంది వివరాలతో డేటా బ్యాంక్ తయారు చేసినట్లు తెలిపారు.

❖



అకా, కేక కా!

- నామిని



చావూ దినమూ రెండూ జరిగిపొయ్‌నాయి చిలకాయనకి. చావైతే దేముణ్ణి మెరవణ జేస్తారే, అంతకు మించే జరిగింది. ఇంక దినమైతే గంగజాతరా, దర్మరాజుల తిర్నాలా యాడబోవాల. యీ రెండు కార్నాలు గూడా చెడ్డ కార్నాలే. కడుపుక్కూడు దినే వోళ్లెవురూ యీ కార్నాలు జరిగేటప్పుడు పకపకమంటా నవ్వరు. ఆ నవ్వింది గూడా యేడిక జూసి గాదు, కడుపు కాలి. అదీ ఎట్ట నవ్వినారంటే - మూతికడ్డంగా గుడ్డ బెట్టుకోని మూడో కంటికి కనిపించకుండా సైగసైగ్గా గాదు. పైకే, పబ్బిలిగ్గానే, చెప్పుకోని చెప్పుకోని నవ్వుకున్నారు. జరిగుండే కతలు అట్టాంటివి మ్మరి! ఎంతిచ్చిత్రమంటే అంతిచ్చిత్రం. మంచి ఎండ పూటన వొక పక్క మిడిమేలంగా ఎండ కాస్తుంటే ఇంగొక పక్క ఇన్నోవా కారొచ్చింది నడూళ్లోకి, గంగమ్మ మిట్ట కాడికి. యిప్పుడు పొగులు పొద్దలగూకునా రెయ్యి తెల్లవాదులూ కరంటొగటి వుండాది గదా. ఆ ఎండలో టీవీలొాదిలి సిమెంటు యేసుండే యీదల్లోకి ఎవురొాస్తారు! ఒక్క పిట్టికోడి కనిపించలా. ఇన్నోవాలో వుండే వోళ్లు కారు దిగి, వొకింట్లోకి తొంగిచూసి, "మునీంద్ర వాళ్లిల్లు ఎక్కడ పెద్దాయనా?" అనడిగిరి. మునీంద్ర ఎవురబ్బా అని ఆ పెద్దాయనకు కతక్కన తెలవక తల గీరుకోని, "మా వూళ్లో మునీంద్ర ఎవురబ్బా?" అని వాళ్లతోనే అన్నాడు. ఈ మాట ఆ యింట్లో వుండే ఆయన కూతురు - పుత్తూరు సిద్దార్తాలో యింజినీరు కోర్సు రెండో సమ్మచ్చరం చదివే - రజిని యినేసి, "డాడీ మునీంద్రంకులంటే సుమతక్కోళ్ళ హజ్బెండు." అంటా యీదిలోకొచ్చింది. వాళ్ల నాయిన, "సుమతక్క ఎవురమ్మా మనూళ్లో?" అనడిగినాడు కూతుర్ని. అప్పుడు రజిని, "సుమతక్కంటే వూళ్లో అందురూ తాటాకు చేప అనంటారే. ఆ అక్క!" అనేసి చెప్పింది. "ఓ తాటాకు చేపామె యిల్లు గావాల్నా మీకు? పొయ్ చూపించేసి రాబోమ్మా!" అని కూతుర్తో ఆయనంటుండాడో లేదో బజినగుడి దిగవ నుండే యింటికల్లా పరుగున నడస్తా కారుకి దోవ చూపించింది రజిని.

యీ పదేండ్లుగా దొబ్బుమాలినన్ని కార్లు జీరంగుల మాదిరిగా వూళ్లోకొచ్చి నాలుగీదులూ గుంయ్యంటా తిరిగేసి పోతుండేది మామూలే గాబట్టి పిల్లపిలకాయలు గూడా కారుకల్లా తొంగి చూళ్లా. అయితే కారులో నుంచి చిలకాయన పీనిగిని దించి రేకులింట్లోకి నలుగురూ నాలుగు పక్కల ఎత్తకపోతుంటే వూరువూరంతా చేరిపొయ్యింది. చిలకాయనోళ్లింట్లో పీనిగిని పండేసే దానికి బెంచీ వున్నట్టు లేదు. నిమిసాలల్లో వూళ్లో ఎవురో తెచ్చి రేకులింటి ముందరుండే పందిట్లో బెంచీ వాల్చి పీనిగిని పండబెట్టినారు. నిజ్జంగా ముక్కులో వూపిరి గాల్లో కలిసిపొయ్యేదానికి ఎంతసేపు గావాల అనిపిచ్చింది. చిలకాయన బెంచీ మింద పొనుకోని

మంచి నిద్రలో వుండినట్టుండాడుగాని చచ్చినోడున్నట్టు యాడుండాడు! ఆయన గద్దొచ్చి ఆయన్ను తన్నక పొయ్యేటట్టుగా యెల్లాలకల పదుండాడు, కేళీవిలాసంతో. ఎంత నాణ్ణిగోడు చిలకాయన! తిరప్తిలో సావాసకోపులకు మునీంద్ర గాని వూళ్లోవోళ్లకు చిలకోడు గదా. మనిసి నున్నంగా గడ్డం గీస్కోనుండాడు. తలకు రంగేసి పది పదైద్దినాలు గూడా అయినట్టు లేదు. తలెంటికలు గానీ, కోడికత్తుల మాదిరిగా వుండే మీసాలు గానీ సవాలేసి మాట్లాడుకున్నట్టుండాయి. చిలకాయనేమన్నా ముసిలోడా, మొన్నమొన్నటోడే గదా. యాపై యాపై అయిదు గూడా వుండవు. గుండె



బొమ్మ: వై. శేషుబ్రహ్మం

ఆటఫెయిల్ అయిపొయ్‌నట్టుండాది. ఇన్నోవాలో పీనిగిని తెచ్చినోళ్లు ఆ మాటే చెప్పినారు. తిరప్తి కుమ్మరమిట్ట కాడుండే టవును క్లబ్బులో మద్దేనం పూట కడుపులో ఏందో దగగా వుండాదన్జెప్పి వొక కిన్‌లే సోడాను గొంతులో పోసుకోని అట్టనే కుర్చీలో వాలిపొయ్‌నాడంట. చావేమో మంచి చావే! కానీ బూమ్మింద ఆ చిన్న రేకులింట్లో యిద్దురు మిగిలి పొయ్‌నారే. వాళ్ల గతి! వెనకాన లిబ్బి గూడ ఏం లేదే! వుండే నాలుగ్గుంటల కయ్యా యిరైయ్యేండ్లకు ముందర్నే పదివేలకు నీగేసుకున్నాడు. పైన పటారం లోన లొటారం మాదిరిగానే బతికిపొయ్‌నాడే. ఆ పెళ్లాం గానీ, ఆ కొడుగ్గానీ నోరు తెరిచే రకాలు గాదే, వాళ్ల స్తితిమంతం ఏమాత్రమో చెప్పేదానికి.

ఇన్నోవా కార్లో వొచ్చిన తిరప్తోళ్లు పీనిగిని బెంచీ మింద పండేసేసి 'మా పనింకై పొయ్యిందనేసి' బుర్రమంటా కారెక్కి తిరప్తికి పూడవలేదు. వొకందాన వాళ్లే మేలు. మాటిమాటికీ యాదిలో నుంచి పందిట్లోకొచ్చి, చిలకాయన కాళ్లకాడ నిలబడుకోని వాళ్లల్లో వాళ్లే మొకానికడ్డంగా చేతిగుడ్డలడ్డం బెట్టుకోని ఎగదీసుకుంటుండారు. వాళ్ల సావాసం అట్టాంటిదేమో! మొదుటసలికి చిలకాయన వూళ్లో వుండిందెప్పుడు! నిద్దర పడక లెయ్యంగానే, అది వాన గానీ వొంగుడు గానీ తెల్లంగా పంచ – అదీ ఎనిమిది మూర పంచ – గట్టుకోని, దాని మిందికి పక్క జేబీలుండే జుబ్బా యేస్కోని చేతులూ గించుకుంటా తిరప్తికి పయానమై పోతాడు. అదే మాదిర్తో నూరు ఆరుగానీ, ఆరు నూరుగానీ రేత్రి ఎనిమిదిన్నరా తొమ్మిదిన్నరకంతా వొంటిమింద గుడ్డలు అట్ట నలక్కుండా చేతిలో ఏదో వొక ప్లాస్టీకు కవరుతో తిరిగి వూళ్లేకొచ్చేస్తాడు. అది వూరంటక పోతున్నా స్సరే యింట్లేకి పొయ్‌నాయన మళ్ల యాదిలోకి గూడా తొంగి చూడడు. ఒక్క నరమానుడితో మాట్లాడి ఎరగడు. సరి వొయిసోళ్లు గూడా 'ఏమిరా చిలకా!' అని అన్న పాపాన పోలా. ఆ మనిసి తెల్లంగా తోమిన గుడ్డలేస్కోని పోతా వుంటే యాదిలో ఎవురు ఎదురు పడినా దోవ తొలిగి పోవాల్సిందే మంత్రమేసినట్టు. బస్సులో గూడా అంతే. ఆ మనిసి పుట్టున్జూసి ఎవురో ఒకరు లేచి సీటిచ్చేస్తారు. అప్పుడే బేంకీలో ముద్దరగొట్టిన అయిదునూరు రూపాయల నోటుకంటె గూడా పెళపెళమంటా వుంటాయి వొంటి మింద గుడ్డలు. బోడింబాయిలో పిల్లను తీసిన దినానికి ముందు నుంచి గూడా చిలకోడికి వూళ్లో కాలు నిలిచేది గాదు. పెండ్లయిన కొత్త కొత్తల్లో వొక యిస్త్రీ పెట్టి – మంచి ఇనపది – కొనక్కొచ్చి యింట్లో పెట్టేసినాడంట. దాన్ని వూరంతా అప్పుట్లో వొక కతగా జెప్పుకున్నారు గూడా. చిలకోడి గొంతన్నా చిన్నప్పుడెప్పుడో వూళ్లోవోళ్లు యిన్నారేమోగానీ ఆయన పెళ్లాం కూత యిన్నోళ్లు అది ఆడగానీ, మగగానీ లేరు. చిలకోడు ఏమి తెచ్చిస్తాడో, ఆ ఆడమనిసి ఏమి కాంచి కొడుక్కంత పోసి, ఆమె అంత గొంతులో పోసుకుంటాదో దేముడికి దా తెలవాల. కొంతమంది చెప్పుకునేది ఏమంటే, యీ యిరైయ్యేండ్లల్లో మూటలు మూటలుగా యిస్త్రీ పెట్టి బొగ్గులకే పది వేలు చలవ జేసుంటారని. తిరప్తిలో యింతమంది యిన్ని రకాలుగా తిరగతానే వుంటారు గదా. యాడగానీ చిలకాయన్ని చూసినోళ్లు గూడా లేరు. టవును క్లబ్బులో పెద్దపెద్దోళ్లతో సావాసమని అంటారు. కొందరు చెప్పేదేమంటే క్లబ్బులో చీట్లపేకాట ఆడేవోళ్లకు కోర్టర్లు కోర్టర్లుగా మొందు బాటళ్లు తెచ్చిస్తా పడతా వుంటాడని గూడా. అయితే అది జవాను జేసే పని. ఒక జవాను అంత వొగలైన గుడ్డలు కడతాడా! యింకొకటేమంటే యీరోజు కట్టిన పంచ రేపు కట్టడనీ యీ రోజేసిన జుబ్బా మరసట్రోజు యెయ్యడనీ! అయినా ఆ యింట్లో వోళ్ల కత చెప్పేదానికి– వోళ్లెవురే గానీ నోరు తెరిచి మాట్లాడితే, వాళ్లల్లో వుండే సూక్షాన్ని చెప్పచ్చు. ఈడ అది లేకనే అగోరిచ్చాల్సొస్తా వుండాది. ఒకటి మాత్రం నిజ్జం. కొత్త కరుకు మాయకుండా గుడ్డలేస్కోని జమ్మంగా తిరిగినాడే గానీ రూక చేతిలో ఆడేది నిజమే అయితే కయ్య అమ్మిన డబ్బు వొడ్డీల మింద తిరిగేది నిజమే అయితే పెళ్లాం తాటాకు చేపామె – యీ పొద్దనంగా ఆమె పేరు సుమతి అని గూడా కొత్తగా రజనీ చెప్పంగా యినబడింది – అగో ఆ తాటాకు దాని చెవల్లో గానీ ముక్కల్లో గానీ గురుగింజంత బంగారం వుండుండాల గదా. మ్మరి,

పొరకపుల్లలే పెట్టుకోనుంటాదే! కొడుకు కత గూడా అట్టనే వుండాది. పెండ్లయిన పది పన్నెండేండ్లకు ఆ బిడ్డ కలిగినాడు. అప్పటిదాకా అందురూ అనుకొనిందేమంటే తాటాకామె మంచినీళ్లిచ్చినా చిలకాయన తాగడనేసి. ఏడేడు పద్నాలుగు జల్మలు పుణ్ణెం జేస్కుంటే గానీ అట్టాంటి నాణ్ణెగోడి చేత ఏ ఆడది గానీ బొటనేలు తొక్కించుకోని బొట్టు కట్టించుకోలేదు! చిలకాయనెంత నాణ్ణెగోడో తాటాకామెది అంత యికారం. కన్నొంకరా కాలొంకరా అంటే అదేం లేదు. పొడుక్కేమీ తక్కవలా. ఆ మొగోడెంత పొడుగో యీ ఆడదీ అంతే పొడుగు. ఎముకుల గూడు మింద తోలు గప్పినట్టుంటాది. మనిసి వూసూసు. గాలొస్తే కొట్టకపొయ్యే అంత సన్నం. మొగోడికున్నట్టు ఎద. రైక లోపల దేముడి సత్యానికన్నట్టు జిల్లేడు కాయల మాదిర్తో రెండు రొమ్ములు వొక్కొక్కుగా వుంటే వుండుండొచ్చు. అంత కట్టొరస మనిసిని యీ పాయకట్టులో చూడలేము. తాటాకు చేపాల వొరటక పొయ్యుంటాది గాబట్టే వూళ్లో తాటాకు చేప అని అంటా వుంటారు. పిలవర్లే – పిలిస్తే పలికితే గదా. పోలేరమ్మకూ, మూలస్తానమ్మకూ వున్నట్టు యింతేసి కనుగుడ్లు. కనుబొమ్మలూ కన్రెప్పలూ ఎంత వొత్తుగా వుంటాయో చెప్పలేము. ఆ మొకానికి కళ అదే. అయితే మాత్రం పెండ్లయిన రోజు బోడుంబాయిలో అన్నా చిలకోడు తాటాకామె పక్కలో పొనుకోనుంటాడా, సగించి! అందుకనే పదిపన్నెండేండ్లు పిలకాయలు కలగలేదేమో అనుకుంటా వుంటే యీ యిన్నేండ్లు యాడుండినాడో ఆ పిలగోడు పుట్టినాడు. అమ్మ పోలిక రూంత లేదు. అయ్య నోట్లో నుంచి అట్టనే వూడి పడినట్టుంటాడు. యిప్పుడు ఏడో ఎనిమిదో చదవతా వుండాడు వూళ్లో యిస్కూల్లోనే. తెలుగు మీడియమే. చిలకాయన యెనకాన అంతో యింతో సంపాదన వుండే వుంటే వూళ్లోకి తిరప్తి నుంచి నేరుగా ఎన్ని యింగిలీసు మీడియం స్కూళ్ల బస్సులు రావాటం లేదు, పోవాటం లేదు! పదో పన్నెండో వేలు పోసి పీజులు కట్టే వొగే వుంటే లేకలేక పుట్టినోణ్ణి చిలకాయన తిరప్తికి బస్సెక్కించి వుండడా! ఆ పిలగోడూ అంతే. సిగ్గుసిగ్గుగా దోవనబడి యిస్కూలికి పోతా వుంటాడు, వస్తా వుంటాడు. ఇంక ఆ రేకులింట్లోకి పోవునా, అమ్మను కరుసుకోని కరుసుకోని వుంటాడే తప్ప వూళ్లోకే రాడు, మంచీ చెడ్డా మాట్లాడదామంటే! ఇంక తాటాకామెని కలబెడదామంటే అది జరిగేది గాదు. తెల్ల కార్దెత్తుకోని రేసిని బియ్యం కాడికొచ్చినప్పుడన్నా ఏ ఆడమనిసో ఒక ఆడమనిసి, "బాల చెంద్రుడి మాదిర్తో వొక బిడ్డిని గన్నావమ్మే లేక లేక! నీ మొగుడేమో గవునీరు మాదిర్తో వూళ్లో వుంటే గబ్బుగొడతాదన్జెప్పి దినామూ తిరప్తికి పోతావొస్తా వుంటే సరిపోతాదంటనా! రేపు నీ కొడుక్కి వొకమ్మగన్న బిడ్డిని తేవద్దా! యిప్పుట్లో ఆడపిలకాయ లకు ఎంత డిమాండుండాదో తెలుసుకుంటుండావా!" అనేసి మాట కలపాలని చూస్తే యీ చెవల్లో యినేసి ఆ చెవల్లో వొదిలేస్తాది. మఖా అయితే నవ్వి గమ్మనుంటాది. ఏమాటకామాటే చెప్పుకోవాల గదా. పచ్చి బియ్యం మాదిర్తో మంచి పలువరస. ఆ మాట్లాడిన మనిసికి అదే ప్రాప్తం. అది తిక్కవాటం అనాలో, మదం అనాలో అర్తంగాదు.

యిప్పుటికిప్పుడు చూడండేమి! మొగుణ్ణి – అదే చిలకోడి పీనిగిని తెచ్చి – బెంచీమింద పండబెట్టి గెంటవతా వుండాది. కొత్త కరుకు మాయకుండా గుడ్డలేస్కోని పొయ్‌నోడు పీనిగైపొయ్ యిల్లు జేర్తే కుయ్యాం కయ్యాం అనడంలా. చిలకాయన జేబీలో ఇర్వై రూపాయల కాతికమొగటీ, పది రూపాయల కాతికమొగటీ వీటితో పాటు జుబ్బా పక్క జేబీలో నోకియా సెల్లు వుంటే అవి తీసి ఎత్తకపొయ్ ఎవురో చేతికిస్తే ఎడం చేత్తో తీస్కోని పక్కన బెట్టేసి, గోడకానుకోని పూడుబాము మాదిర్తో గమ్మన్నే వుండాది, గొంతుకుచ్చోని. యిదేమి చట్టం? వూళ్లో ఆడోళ్లల్లో ఆ కొంపకు బాగా కావాల్సినామె పేరొచ్చి చెంగమ్మ. ఎవురంటే చిలకాయనకు మేనత్త. "నా నాయినా, నా చిలకా, తూరుబ్బరంట దెలవని నీ పెళ్లాన్నీ, వనమొలక మాదిరిగా వుండే నీ కొడుకునీ ఏ గంప కింద మూసి పెట్టమంటావురా నా చక్రొర్తి కొడుకా!" అని చెంగమ్మ ఎదుర్రొమ్ము కొట్టుకోని ఏడస్తా వుంటే యింక వూళ్లో ఆడోళ్లకు గూడా ఏడుపు ఆగలా. చెంగమ్మ చెప్పినట్లు అంత తూరుబ్బరంట తెలవని ఆడదే అవితే చిలకాయన పెళ్లాం 'యిదేమి గోరం, యిదేమి అన్నాయం, మైనీరు పిలగోడి మాదిరిగా తిరప్తికి పొయ్‌నోడివి యిట్టనా రావటం?' అని లబలబా నోరు కొట్టుకుంటా, ఎదుర్రొమ్ములు గుద్దుకుంటా పీనిగి మింద బడి ఏడ్చి ఏడ్చి అక్కు ఎండుకు పొయ్ వొళ్లు సోదీనం దప్పి పడిపోవద్దా! అదేం లేదు. కూత బైటికి రావడమే లేదు. యెట్టికో తేరకో అన్నట్టు ఎరగనోచ్ అని గమ్మనుండాది. ఆమె మొగుడు జచ్చి బెంచీమింద యెల్లాలకల పొనుకోనుంటే ఎవురికేం బట్టింది గెంటల కొద్దీ ఏడస్తా వుండేదానికి! ఏ ఆడదో ఒకాడది ఆ మనిసిని కావిలించుకోని ఏడవాలని చూసింది గానీ ఆ మనిసి పైకి లేస్తే గదా. వున్నట్టుండి జరగరానిది జరిగిపొయ్‌నప్పుడు వొక్కొక్కసారి దుక్కం పెరుక్కోని రాదు. కడుపులో గంపడంత అగ్గి గబీమని పడిపొయ్‌నప్పుడు కండ్లల్లో నీళ్లు కాలవలు కట్టవు. అమ్మలక్కలందురూ గూడా గెంటనుకున్నారు. రొండు గంటలనుకున్నారు– "పాపం తాటాకమ్మికి ఎదగుండె పడిపొయ్యిందీ" అనేసి. మళ్ల అనుకోలేక పొయ్‌నారు. ఒక్కసారంటే వొక్కసారి బెంచీకాడికొచ్చి మొగుడితో, "లెయ్ రా పంగమాలిన మొగోడా! నీ పాటికి నువ్వు చస్తే ఎట్టనుకున్నావు! నీ కొడుకుని ఎవుడు సాకతాడనుకున్నావు? యింట్లో నువ్వు పోసి పెట్టుండే కుప్పును చూపించేసి మళ్ల పొనుకుందువురా!" అని అక్కునునంతా యెల్ల బోసుకోవచ్చును గదా. అచ్చిరమంటే కదలడం లేదే! పోనీ నీకు పేడ కారిపోతా వుంటే పీనిగి మింద పడి, "రేపుట్నించి నేనింగెవురి గుడ్డలు వుతకబోతాను! నేను గెంజి బెట్టి యిస్త్రీ చేస్తే గాని నీ వొంటిమింద గుడ్డ పెట్టకుంటివే! ఇంక నేను యిస్త్రీ పెట్టితో గుడ్డలు తోమబోతానా, గుడ్డలుతికి గెంజి పెట్టబోతానా! తెల్లంగా నీ గుడ్డలుతికి పెట్టేదాన్నే! దీనికన్నా నువ్వు నన్ను అయ్యోమన్నావా?" అని అంటా మొగుణ్ణి జాడించి వొదిలి పెట్టొచ్చు గదా.

ఇన్నోవా కారులో వొచ్చిన తిరప్తోళ్లకు చేతులెత్తి దండం బెట్టుకోవచ్చు. సందేళ నాలుగ్గెంటల కంతా ఎన్ని కార్లొచ్చేసినాయో చెప్పలేము వూళ్లోకి. ఎగవీదీ, దిగవీదీ అంతా కార్లూ, బండ్లే. మామూలుగా వూళ్లో ఎవురు చచ్చిపొయ్‌నా మూడో దరువు పూర్తయ్యే సరికంతా వొచ్చేది దిగూరోళ్లూ, గెరిప్పల్లోళ్లూ, గంగిరెడ్డి పల్లోళ్లూ. చిలకోడి చావుకొచ్చింది ముక్కాలు బాగం తిరప్తోళ్లే. మంచి మంచి యాపారస్తుళ్లు. పీనిగి మింద పడిన పూలారాలు వొక లోడ్డు అయ్యుంటాయి. అప్పుటికప్పుడు సెల్లు మిందనే పాడె గట్టేదానికి యెదు–రుతో సఖా చావు సామానం యావత్తూ తిరప్తి నుంచే తెప్పించినారు. ఎన్ని చివ్వలు కాల్చినారో, ఎన్ని సరాల టపాసులు కాల్చినారో చెప్పలేము. బోడింబాయి నుంచి తాటాకు చేపామె అందమ్ముడూ అమ్మా గూడా వొచ్చేసినారు. బోడింబాయి నుంచి వొచ్చిన ఆయమ్మ గూడా సరైనదే. వొచ్చీ రాంగానే, పీనిగ మింద బడి, "నా కూతుర్ని కిల్లా ముంచేసి పోతుండావా చిలకాయనా? నా అల్లుడా, ఇంటికీ తిరప్తికీ తెల్లంగా గుడ్డలేస్కోని తిరగతా వుంటివే ఎల్లంచీ ఏమాత్రం కట్టినావు నాయినా? నీ పెళ్లానికి చెప్పినావా! పది లచ్చిల కన్నా కట్టినావా?" అని చిలకాయన్ని వూగించి వూగించి అడగతా వుంటే కడుపుమంట పొయ్ నవ్వు వొస్తిందా రాదా! ఆ తల్లి తాటాకామె కొడుకునైనా తండ్రి దగ్గిరికి తొడకొచ్చి పీనిగి మింద పడెయ్యాలా. వూళ్లో అమ్మలక్కలు చుట్టూ పక్క వూళ్లల్లో వోళ్లూ తిరప్తోళ్లూ నవ్వుకుంటారన్జెప్పి – తాటాకు చేపది గొంతు కుచ్చోనుంటే జవురుకోనొచ్చి పాడి మిందికి తోస్తే మొగుడి కల్లా కడచూపు గూడా చూడకుండా కండ్లకడ్డంగా చేతులు పెట్టుకునేసింది. మామూలుగా అయితే బొరోమని ఏడస్తా యీది దాటుకునే దాకా పెళ్లామైంది పాడెనకాన్నే వొస్తాది పడతా లేస్తా. తాటాకామె యించి కదల్లా. కొడుక్కి తలగొరివి పెట్టక తప్పదు గాబట్టి కొడుకును మాత్రం కావిలించుకోని వోడి నొష్టన ముద్దుబెట్టి 'తలగొరివి పెట్టేసి బయపడకుండా యింటికొచ్చి నన్ను చేరుకో కొడకా!' అంటా ఏమో పాడెనకాన సాగనంపినట్టుండాది. చిలకాయన అత్త మాత్రం 'ఎల్లంచి ఎంత కట్టినావు నా యల్లుడా!' అంటా వూరి గెమిని దాటేదాకా పాడెనకాన బడి ఏడస్తా వొస్తా వుంటే వూళ్లో ఆడా మగా అందరూ కసిరి పారేసినారు, "ఎల్లయిసీ వోళ్లు పది లచ్చిల రూపాయల చెక్కెత్తుకోని నీ కూతురికీ నీకూ యిచ్చేదానికి తిరప్తిలో ఎలబారి కార్లో వస్తుండార్లే పదపద" అంటా. చావుకొచ్చిన తాటాకామె అందమ్ముడేమో చావుకర్చు నేను పెట్టుకుంటా నంటే తిరప్తోళ్లు మూతిమింద కొట్టినారంట. తిరప్తిలో చిలకాయనకింత మతింపుండాదని వూళ్లో ఎవురికీ తెల్దు. గుంతలో పెట్టి పూడ్చేదాకా తిరప్తోళ్లెవురు గానీ

జీవితం బ్లాక్ అండ్ వైట్ గా ఉండదని, మంచి–చెడు, వెలుగు–నీడ, ఎత్తుపల్లాల ద్వంద్వాలు గీతకు చెరోవైపూ కనబడేలా సులభ సుభోదకం కానేకాదని మనందరి ఎంత తెలుసో అంత తెలీదు. ఎంత విశాలమో, అంతే సంకుచితమూ ఐన జీవితం వంటి, అచ్చంగా ఆ గజిబిజి పీటముడి లాంటి ప్రతిబింబం, ప్రతిరూపం ఎదురయ్యేంత దాకా ఆ తెలిసీతెలియనితనం కూడా స్ఫురణకి రాదు. మన ప్రతిబింబాల్నీ, ప్రతిరూపాల్నీ మన కళ్లకు కట్టి, 'మనదీ ఒక బతుకేనా....' అని ఏ కవో, కళాకారుడో గుర్తుచేయడం వల్ల ప్రయోజనం ఏమిటి? ఏ సృజనకారుడు 'గుర్తు'చేయడు, గాయాన్ని రేపినట్టుగా;అనుభవాన్నిస్తాడు, ఆ సంక్లిష్టతతో పోరాడే బలానిస్తాడు, ఆ చిక్కుముడి విప్పే తెలివిడినిస్తాడు.

ఆ విధంగా చూస్తే, గొప్ప సృజనశీలి ఐన ఈ కథా రచయిత నామిని సుబ్రమణ్యం నాయుడు తన మూడుదశాబ్దాల రచనా ప్రయాణంలో చేస్తున్నదదే. కానీ, 'కైగట్టిన కతలు' రాసిన ఈ తాజా దశ, ఆయన మరో ప్రయాణమని అభివర్ణిస్తున్నారు కొందరు సీరియస్ సాహిత్యకారులు.

తాను ముందు దర్శించి, తర్వాత తాను ప్రదర్శించాలనుకున్న అంశాల మీద టార్చిలైటు వేసి పాఠకుడికి చూపించడం నామిని మొదటి దశ. అయితే ఇప్పుడు, చదువరితో పాటే తాను కూడా. తన ఇష్టాయిష్టాలు, తన రాగద్వేషాలు.... వంటి ఏ సైన్ పోస్టులతో పాఠకుడికి తనకి తోచిన తోవలు చూపించే ప్రయత్నం చేయని విస్తృత, పరిణిత ప్రజాస్వామిక దశ! ఒక్కొక్కటిగా కూర్చి, బహువచనంగా పేర్చి, మొత్తం కలిపి ఓ గొప్ప అనుభవమై నిల్చిన ఆ 11 కైగట్టిన కతలలో ఇదొకటి!

కార్లెక్క లేదు. ఇంక చిలకాయన దినానికి గూడా అన్ని కార్లూ అన్ని బండ్లూ వొచ్చినాయి. తాటాకామె ఏమీ గాడిపొయ్యి తొవ్వి దినం కూడొండలేదు. కర్జంతా తిరప్తి టౌన్ క్లబ్బోళ్లదే. ఒక ట్రక్కులో తిరప్తి నుంచే దొబ్బుమాలినంత బిర్యానీ, కోడికూరా కేటరింగోళ్లచేత చెయ్యించి తెచ్చేసినారు. యెంటికతో సమానంగా కర్జు బెట్టినారు. కనీసం యెయ్యి మందంటే యెయ్యి మంది సామియానా కింద చేతులు కడిగుంటారు. తాటాకామె కతయితే దినుం రోజు యింగా అనర్దం. మంచి నలపై నలపై అయిదేండ్ల ప్రాయంలో వొక ఆడమనిసి తెంపతా వుండాదంటే చూద్దారనేసి పది గెంటల కాడ వొస్తే – పొద్దు మొలవక ముందే ఆమే తెంపేసుండాది. ఆమె అంతట ఆమే పసుపుగుంకాలు తుడుపుకునేసిందంట. అంత కర్జు బెట్టి దినం చేసిన తిరప్తోళ్లతో 'ఏమిరా పాపాత్ముళ్లారా!' అని వొక్క మాట మాట్లాడ లేదంట ఆ వొకీలు. బోదుంబాయి నుంచి వొచ్చిన వాళ్లమ్మ గూడా కూతుర్తో, "పదో తరగతి పస్టుగా పాసయినావు. ఇదా నువ్వు చిదిగిన చిదుగు. చావు రోజా దినుం రోజా గూడా అందురి మొకాన మసిబూస్తివి గదే!" అనేసి పొయ్యిందంట. తెల్లారక ముందర్నే తలకు బోసుకోని ఆశీదీరా మొకానికి పసుబ్బూసుకోనీ, కుంకం బెట్టుకోనీ, తలనిండా దొబ్బుమాలినన్ని పూలు బెట్టుకోని మొగుడి సెల్లులో నుంచి ఇంజినీరు కోర్సు చదివే రజినీకి ఫోను జేసిందంట. ఆ చిదగరి అంత పొద్దనట్టే వొచ్చి వొగటికి పది రకాలుగా సెల్లులో నుంచి ఫోటోలు తీసిందంట యీ నాణ్ణిగత్తెని. దాని ముసిముసి నవ్వులన్నీ రజినీ సెల్లులో బద్రంగా వుండాయి. రేపో ఎల్లుండో ఆ పోటోలన్నిట్నీ ప్రింటు గొడతాదో ఏమి కరమ్మో. 'దానికంటే సిగ్గులేదు, నీకన్నా లేదా?' అని రజనీవాళ్లమ్మ రజనీతో అంటే ఆ రజనీ వాళ్ల సుమతక్క మింద మాట పడనీలా. రజనీ అనేగాదు మూడో తరగతి నుంచి వూళ్లో కాలోజీ చదువులు చదివే ఆడపిలకాయలందరికీ తెల్లార్తైతే వందనంగా జడలేసేది ఆ మనిసే మ్మరి... అందుకని ఆ సపోరట. పోటోలు తియ్యించుకున్నాక మళ్ల బొట్టు తీసి పక్కన పెట్టినట్టుండాది. అది గూడా సాంగానికే. ఆ మరసట్రోజు నుంచే కలరు కోకల్నే కట్టింది. మొగుడు జచ్చినాక యిప్పుడు తెల్లకోకలెవురూ గూడ కట్టడం లేదులే. దానికేమీ పాటింపు లేదు గానీ తల్లో మందార పువ్వూ మామూలే, నొష్టన బొట్టు బిళ్లా మామూలే. మిగల నేర్చిన కాలం అంటే యిదిగాక!

దినం దీరినాక, యింక గదా అసలు తిర్నాల వుండబొయ్యేది అని అనుకున్నోళ్లూ, పాపం ఆ బిడ్డిని ఎట్ట సాకి సంతరించబోతాదని అయ్యోమన్నోళ్లూ – ఎవురూ నమిలి పెట్టబొయ్యేది లేదు గదా. ఆ ఆడమనిసికి ఎట్టుండాదో గానీ చుట్టం చూపుగా తెల్లారీ రాత్రీ తెల్లంగా మల్లెపువ్వాల కనిపించే చిలకాయన చచ్చిపొయ్యేసరికి యీ యింత మందీ వుండి బిసు–రోమంటుండాది వూరు. మొగుడన్నా వుంటే వుతికిందే వుతకతా, తోమిందే తోమతా వుండేది తాటాకామె. యిప్పుడు తెల్లారి యింటికొచ్చే పిల్లపిలకాయలకు జడలేసేది తప్ప యింగొక పనున్నట్టు లా. మనిసి యీదిలోకి రాలా గానీ కొంచెం తేటగా కనిపిస్తున్నట్టుండాది. అమ్మాగొడుకు ఒకర్ని కరుసుకోనొకరు యింట్లోనే గుడ్లు పెడతున్నట్టుండాది.

మొన్నటికి మొన్న యింగా పూరా గూడా తెల్లార్లా. తెల్లగుడ్డలేస్కోని తెల్లారక ముందర్నే చిలకాయన తిరప్తికి ఎలబారి పోతాడే అదే టయానికి కొడుకు చెయ్యి పట్టుకోని మంచి టెంపరుగా రోడ్డుమిందికి పొయ్ బస్సేమో ఎక్కినట్టుండాది. ఆ పొయ్యిన మనిసి రేత్రిపూట వొక ప్లాస్టీకు కవరుతో మొగుడు ఏ టయానికి వూళ్లో అడుగు పెడతాడో అదే టయానికి కొడుకుతో పాటుగా వూళ్లేకి దిగబడింది. ఏమి, ఎక్కడ అనడిగితే అడిగినోళ్లు నోరు కదుక్కోవాల్సిందే గాని ఎందుకొచ్చిన మద్దిస్తం!

ఆ రేత్రి వూళ్లో ఏమి యినకడయ్యిందంటే – కొడుకుని వూళ్లో యిస్కూలు మానిపించేసి గౌతమ్ టాలెంటు స్కూల్లో ఎనిమిదో తరగతిలో యింగిలీసు మీడియంలో చేర్పించినట్టు యినకడయ్యింది. అమ్మాగొడుకిద్దరూ దినామూ బొయ్ యిస్కూల్లో చేరతుంటారా! అట్ట నాలుగు దినాలుగా పోతుండారు, వొస్తుండారు. అదే టయానికి పోవాటం, అదే టయానికి రావాటం!

వూళ్లో యింగేమి యినకడయ్యిందంటే – బైరాగి పట్టిడ ఆర్చికాడ నెలకు మూడు వేలు బాడిగతో వొక షట్టరుండే రూమును తీసినట్టూ, దాంట్లో మూడు పూటలా వొక వోటలు నడిపేటట్టూ యినకడయ్యింది.

అయిద్దినాలైంది, పద్దినాలైంది. అమ్మా గొడుకూ అదే పోవాటంగా, అదే రావాటంగా వుండారు.

మళ్లొక దినం తిరప్తికి పొయ్ సన్నజాజి పట్టీలమ్మే సరళా గుండా యింగొక మాట యినకడయ్యింది: 'చిలకాయన గుంత మింద యింగా గెరిక మొలిచిందో లేదో గానీ తాటాకక్క మాత్రం బాగ చిగిరించేసింది. నా తాగుబోతు మొగుడు గూడా ఎగిరిపడి చస్తే నేం గూడా తాటాకక్క మాదిర్తో మేలుపడిపోతా'. అంటే వోటలు జమ్మంగా జరగతుండాదన్న మాట. అట్టయితే తిరప్తిలోనే వొక రేకులిల్లు దీస్కోని కాపరం పెట్టి కొడుకుని ఆడనే చదివించుకోవచ్చు గదా. ఈ రావాటం పోవాటం ఏంది అనే మాటొగటి అడ్డం పడతుండాది. తిరప్తిలో జలం మలం వొగిటి. ఆ నాశినంలో నేనుండలేను. నా మొగుడు దినామూ యిల్లు జేరలేదా! నేనూ అంతే. నా యింట్లో నా మొగుడు దొల్లిన మంచం మింద తప్ప నాకు మరొక తావన కంటిమింద రెప్ప పడదూ అని తాటాకామె మనసులో వుండొచ్చునో ఏమి కరమ్మో ఎవురికి దెలుసూ!

ఈ పొద్దే, అగో యిప్పుడే, యీ మద్దేనం పూటే రజిని, సిద్దార్తాలో ఇంజనీరు కోర్సు చదివే రజినీనే, తిరప్తి నుంచి స్కూటీలో వొచ్చి దిగీ దిగంగానే, యింట్లోకొస్తా వొస్తా వాళ్ల సుమతక్క సెల్లుకు ఫోను జేసి, "అకా, పది గెంటలకాడ స్కూటీలో హోటలు కాడికి వొచ్చినానక్కా. నువ్వు మసీదు కాడికి గెటక్కాళ్లు తెచ్చే దానికి మటను మార్కెట్టుకు పొయ్యినావంట గదా. అకా, కేక కా, కేక! నిజ్జంగా కేకే! ఆర్టిస్టు చేత హోర్డింగు బలే రాయించినావకా! హోటలుకు బలే పేరు పెట్టినావు సుమతక్కా – మునీంద్రా ఫుడ్ కోర్టు!" అని మాట్లాడిన మాటలు అచ్చులు పచ్చుల్తో సఖా వూరికంతా యినకడయినాయి.

❖

కథ



అరుణ గోగులమండ

అసింటా జరుగు

- అరుణ గోగులమండ

రీసెర్చ్ సబ్మిషన్ విషయమై నా సూపర్వైజర్ తో మాట్లాడదామని క్యాంపస్ కి వచ్చి, ఇంకా చాలా టైమ్ ఉంది కదా అని హాస్టల్లో ఉండే జూనియర్ మాధవికి కాల్ చేసాను. ఓ పది నిముషాల్లో వస్తానంటే, ఇక మెల్లగా బండి గోప్స్ వైపు పోనిచ్చాను.

గోప్స్- మా ప్రియమైన క్యాంటీన్. పేద్ద చింత చెట్టుకింద, కనీ కనిపించని పాకలో సంగయ్య నడిపేవాడు. ఇష్టాన్ని బట్టి అక్కడ ఉన్న సిమెంటు బెంచీలపైనా, లేకపోతే రోడ్డు వారగానో, ఇంకా కాదంటే కాస్త దూరంగా ఉన్న పెద్ద పెద్ద బండల మీదా ఆసీనులమై, సంగయ్య చేతి అద్భుతమైన టీతో బాటూ తన మార్కు మిర్చి బజ్జీలూ, ముఖేష్, కిషోర్ కుమార్ వేదనా భరిత గీతాల సంగమంతో మా సాయంత్రాలు హాయిగా సాగిపోయేవి, సెమినార్లూ, ప్రెజెంటేషన్స్ ... ఆ కాస్సేపూ మరిపించేసేవి.

కానీ అది ఒకప్పటి సంగతి. ఇప్పుడక్కడ అవేవీలేవు. వ్యాపార సంస్కృతి గోప్స్ వరకూ పాకి, ఆ పల్లెటూరి అందమైన వాతావరణాన్ని మాయంచేసి, ఇదిగో ఇలా కాంక్రీటు పరం చేసేసింది. నా లాగా ఆ పరిసరాల్లో మనసు పారేసుకున్న పాత స్టూడెంట్స్ కి ఇదిగో ఈ చింతచెట్టును మాత్రం మిగిల్చింది. అక్కడే కూలబడ్డాను, గతం అలా గుర్తుకురాగా. అలా చెట్టుకింద కూర్చోగానే బాల గుర్తొచ్చాడు. బాల - వన్ ఆఫ్ మై బెస్ట్ ఫ్రెండ్స్ ఆన్ క్యాంపస్. నా క్లాస్మేట్! అతనితో పాటే మేమిక్కడ కూర్చున్నప్పుడు మాట్లాడుకున్న కొన్ని సంభాషణలూ మనసులో మెదిలాయ్..

❖ ❖ ❖ ❖

ఓ ఆరేళ్ళ క్రితం సంగతి! నా యూనివర్సిటీ క్యాంపస్ క్యాంటీన్లో టీ తాగుతూ ఉండగా, మా పక్కనే క్యాంపస్ స్కూలు పిల్లలు కొంతమంది మా పక్క బెంచీపై కూర్చున్నారు. వాళ్ళతా గోల గోలగా వచ్చీ రాని తెలుగులో మాట్లాడుకోవడం నా చెవిన పడింది. అసలే తెలుగంటే అమితమైన గౌరవాభిమానాలున్న నేను, ఆ కర్ణ కఠోరమైన భాషాహింసను తట్టుకోలేకపోయాను.

"తెలుగు చూడు యెంత ఘోరంగా తయారయ్యిందో...." అంటూ నా పక్కన ఉన్న బాలతో నా గోడు వెళ్ళబోసుకునేసరికి, "మరీ అంత బాధపడకు..తెలుగు నీకేమిచ్చింది..? యేం గౌరవం తెలుగు భాషద్వారా, తెలుగమ్మాయిగా నీకు దక్కింది?"అని అడిగాడు.

ఆశ్చర్యపోవడం నావంతైంది. ఆలోచనలో పడ్డ నాతో

> హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ- సెంటర్ ఫర్ కంపేరిటివ్ లిటరేచర్ విభాగంలో ఇంగ్లీషు సాహిత్యం మీద డాక్టరేటు చేస్తున్న అరుణ గోగులమండకి రచన అంటే, కంసాలి దాగలిపట్టెడ మీద ఒక అస్త్రం కావడానికి తనకు తాను సిద్ధం కావడం వంటిది (దీనినే to be on the anvilఅనే ఇంగ్లీషు జాతీయంగా చెప్పొచ్చు). కవిత్వం ఆమె ప్రధాన కార్యక్షేత్రం.
>
> విదళిత కసిత్వాన్ని దళిత కవిత్వంగా రాస్తున్నారు, స్త్రీవాదాన్నీ వినిపిస్తున్నారు అరుణ. అక్షరం- ఆచరణ వేర్వేరు కావని ఏ జెండాల ప్రమేయం లేని కార్యకర్తలా దళిత అజెండాతో వెలివాడలు తిరిగారు. పదాల పల్లేరుగాయల దారిలో నడిచే తెగువతో పాటు, ఉద్యమస్ఫూర్తి కూడా నింపుకున్న అరుణ వంటి ఎవరి రచన అయినా దళితమే కాదు, కందళితం కూడా అవుతుందేమో!

అతనన్నాడు- "నీ సంగతి నాకు తెలియదు కానీ, తెలుగు భాష నన్ను తెలుగువాడిగా చూడలేదు; నేనెంత బాగా తెలుగు నేర్చుకున్నా, యెంతబాగా మార్కులు తెచ్చుకున్నా, నా ఊరి చివరి బ్రతుకుని అదేమాత్రం మార్చలేదు. నేనెంతగా 'మీలో ఒకణ్ణే' అంటూ కలిసిపోదామన్నా అది నన్ను దూరంగా, ఊరి చివరే ఉండమంది."

సాలోచనగా, యేదో కొత్తవిషయం వింటున్నట్టు ఉడిపోయిన నాకు, సడన్ గా నాకు మా ట్రాన్స్లేషన్ క్లాసు గుర్తొచ్చింది. నేనూ పోటీపడి ట్రాన్స్లేట్ చేసేదాన్ని. తెలుగు, ఇంగ్లీష్ రెండు భాషలపైనా మంచి పట్టుండడంతో క్లాసు భలే సరదాగా ఉండేది. కానీ అందరికీ నా ఈ ప్రతిభ నచ్చేది కాదనే చెప్పాలి. నా తీరు చూసి మొహాలు చూసుకుంటూ ఉడిపోయే భమిడిపాటి లక్ష్మిలూ, యెల్లాప్రగడ.... ఇంకేదో ప్రగడో శర్మలూ "అసలు తెలుగుకు మేం వారసులమైతే నువ్వేంటి మధ్యలో..?" అన్నట్టు చూసిన చూపులు గుర్తొచ్చాయ్ నాకు. వారితో పాటే "సీగాన పెసూనాంబ' ను నేనూ అంతే సొంతం చేసుకున్నాను.

మా నాన్నగారు కమ్యూనిస్టు. నాకీ పుస్తకాలూ, సంగీతమూ ఆయనే నాకు పరిచయం చేశారు. బుడుగన్నా, బాపు బొమ్మలన్నా, ఘంటసాల, జానకమ్మ, వాణీజయరాంల పాటలన్నా, తెలుగు సాహిత్యమన్నా, ఎక్కల్లేని అభిమానం నాకు. మన సంస్కృతిలోని చీకటివెలుగులు అర్థంకావాలని పురాణాలన్నీ నాచేత ఔపోసన పట్టించారు నాన్నగారు. టీవీలో టెలికాస్ట్ అయ్యే విశ్వనాథవారి వేయిపడగలు ధారావాహికను కన్నార్పకుండా చూసే దాన్ని, అన్నీ తెలుసుకోవాలి అనే ఆతృతతో. కానీ ఇక్కడికొచ్చాక, "తెలుగమ్మాయిని, ఈ సంస్కృతి నాది కూడా.." అంటే, "నీకేమైనా పిచ్చా..." అన్నట్టు చూసేవారు కొంతమంది అమ్మాయిలు, అది వారి సొంతమే ఐనట్టు.

అన్ని విధాలా అగ్రకులాలని పిలవబడే వారితో సమానంగా పెరిగినా కూడా వివక్షని ఎదుర్కుంటూనే ఉన్నాను. చక్కటి నా పాటను మెచ్చుకుంటూనే నాకు సంగీతం రాదన్న ఒంకతో నన్ను పక్కన పెట్టేశారు పిలకా, నుదుట బొట్టూ పెట్టుకున్న జడ్జీ గారు. డిగ్రీ చదువుతున్నప్పుడు, స్వాతంత్ర్య దిన స్వర్ణోత్సవ వేడుకలకు నేను యేకంగా ఐదు పాటల్ని,(ఒక్కదానికైనా ప్రైజు కొట్టాలనే పట్టుదలతో) నాకున్న సంగీత పరిజ్ఞానంతో ట్యూన్లు కట్టి, పాడినప్పుడు స్టేజీ దద్దరిల్లి, ప్రేక్షకులు చప్పట్లతో నాకు బ్రహ్మరథం పట్టినా కూడా, లలితా మూర్తి గారనే మా కాలేజీ సంగీతం లెక్చరర్ కి కనీసం కాన్సొలేషన్ ప్రైజ్ కూడా ఇవ్వాలనిపించలేదు. హతాశురాలిగా నిలబడటం నావంతైంది.

చక్కగా పాడే నేను...యెన్ని సార్లు లలిత సంగీతం

పోటీల్లో పాల్గొన్నా కూడా మ్యాథ్స్ డిపార్ట్మెంట్ హెడ్డూ కూడా ఐన లలితా మూర్తిగారు నన్ను మెచ్చుకుంటూనే తన స్టూడెంట్ లావణ్యా శాస్త్రికే - ఆమె పాట యెవ్వరికీ నచ్చకపోయినా– పట్టం కట్టేశారు. నాకిష్టమైన కృష్ణశాస్త్రి గారి– రాష్ట్రమంతా నాకు యెన్నో ప్రైజులు తెచ్చిపెట్టిన– "ఆకులో ఆకునై.." కి సైతం ఆవిడ– 'ఇది సినిమా పాట'ని చెప్పి, లలిత సంగీతం కాదని బహుమతి తిరస్కరించారు. అదే ప్యానెల్ లో ఉన్న నా తెలుగు లెక్చరర్ ఊటుకూరు సుహాసిని గారు "ఆ పాట మొదట లలితగీతాల్లో ఒకట"ని చెప్పినా వినిపించుకోలేదు. లయన్స్ క్లబ్ వారి పోటీల్లోనూ, కల్చరల్ ఫెస్టుల్లో కూడా ఆ పాటకు బహుమతి తెచ్చుకున్నాను గానీ, మూడేళ్ళపాటు లలితా మూర్తి గారిని మెప్పించలేక పోయాను. నన్ను పాటల పోటీల్లో బహుమతికి ఆమె దూరంగానే వుంచారు. ఐతే, గురువంటే, పెద్దలంటే గౌరవించడం మాత్రమే నేర్పిన మా నాన్నగారి పెంపకం వల్ల నేనెప్పుడూ ఆమెను అనుమానించలేదు, ఆ తిరస్కారం వెనక కారణాలూ వెతకలేదు. జస్ట్.."ప్రైజు రాలేదెందుకో ..!" అనుకున్నానంతే. ఐతే అందరూ ఇలానే ఉన్నారని నేను చెప్పడంలేదు. ఊటుకూరు సుహాసిని గారికి ప్రియ శిష్యురాల్ని; తెలుగులో, ఇంగ్లీష్ లోనూ నేనే మూడేళ్ళూ టాపర్. సుహాసిని గారు మాత్రం నేనంటే అంతులేని ఆపేక్ష చూపించే వారు. అలాటి వారూ ఉండబట్టే ఈ రోజు ఈమాత్రం ధీమాగా నిలబడ గలిగాను.

ఐతే, ఇంగ్లీషు నాకో ఐడెంటిటీ నిచ్చింది, నేను చక్కటి యాక్సెంట్ తో ఇంగ్లీషు మాట్లాడుతుంటే నన్ను అన్నిచోట్లా యాంకర్ని చేసారు మా పమెలా థామస్ మేడమ్. నన్ను ఇంగ్లీషు డెపార్ట్మెంటు ఓ యెస్సెట్ లా చూసింది. అక్కడి బ్రాహ్మణవాదం నా యెదుగుదల చూసి అసూయపడ్డా కూడా, పమెలా గారూ హెడ్ కావడం వల్ల నాకు ఆత్మ విశ్వాసంతో గర్వంగా నిలబడే స్థితి కేవలం ఇంగ్లీషే ఇచ్చింది.

నిజమే! తమ ఊరిలో అందరికన్నా గొప్పగా చదువుకుని, ఇంజనీరింగు చదివి కూడా కనీస మర్యాదకు నోచుకోని మా పిన్ని కొడుక్కి అమెరికాలో ఆ ఇంగ్లీషే ఉద్యోగమిచ్చింది. ఆ ఇంటికో గొప్ప స్థాయిని ఈ రోజు తెచ్చిపెట్టింది. అమెరికాలో ఐనా ఆ ఊరి అగ్రకుల పెద్దలు ఇంకా వారింటి పెళ్ళిళ్ళకు కూడా రారు, "పేటలో కాకుండా పెళ్ళి బైటెక్కడన్న ఐతే వచ్చేవాళ్ళం ప్రసాదూ," అంటూ సాగతీసేవాళ్ళు. మా నాన్న వాళ్లనే వెలేసారు. మా బాబాయి పెళ్ళికి సలివిడి పంచడానికి వారి ఇళ్ళకు వెళ్ళబోతే, అప్పుడే బస్సు దిగిన నాన్న వారించారు, "వాళ్ళ ఇంటికి మన ఇల్లు ఎంత దూరమో మనింటికి వాళ్ళిల్లూ అంతే దూరం," అని ఉన్న ఫళాన వెనక్కి లాక్కెళ్ళారు.

నాలుగేళ్ళ ప్రాయంలో కర్వేపాకుకి పక్కింటికెళితే, ఆ ఇంట్లో అమ్మాయి వల్లి అడిగింది– "మీరేవుట్లూ?"అని. మా నాన్నగారు మంచి ఉద్యోగంలో ఉండి, కమ్యూనిస్టు వుద్యమాల్లో చురుకుగా పాల్గొనేవారు. కులాల గురించి మాకెన్నడూ



చెప్పనేలేదు. వెలివాడలో బ్రతుకంటే యెరగని నేనే ఇన్ని అవమానాలు యెదుర్కొంటే, బాల– చాలా పేదవాడు, ఈసడింపులే అన్నపానాలుగా పెరిగినవాడు; దళితవాడలో మురికి నుండి, ఆకలి నుండీ పైకొచ్చి చదువుకున్న వాడు. తన ప్రశ్నల వెనక ఆవేదన నాకు ఎటువంటి పెద్ద ఆలోచన లేకుండానే అర్థమైంది. మా అమ్మమ్మ వాళ్ళ ఊరి కామందు ఇంటికి మమ్మల్ని తీసుకెళ్ళినప్పుడు "పిల్లలు కడిగిన ముత్యాల్లా ఉన్నా"రంటూనే... ఆ మామ్మగారు, మాకు దూరంగా ఓ గోనెసంచి పరిచి కూర్చోమన్న జ్ఞాపకం లీలగా మనసులో కదలాడింది.

ఒక్కసారిగా బాల మాటలకు ఇవన్నీ గుర్తుకొచ్చాయ్."ఔను, నాదేశం నా భాష.."అని వెంపర్లాడిన నాకు, "మాలమాదిగోళ్ళ"న్న బిరుదు తప్ప ఈ దేశం యేమిచ్చింది? నా తాతలూ తండ్రులూ గొడ్లలా పనిచేసి పొలాల్లో రక్తాన్ని ధారపోస్తే, నాలుగు సోలల వొడ్లు కొలవడానికేడ్చిన ఈ నిచ్చెన మెట్ల సమాజం నాకేమిచ్చింది? యే గొడవ వల్లో భర్తతో విడిగా ఒంటరిగా ఉంటున్న మా పిన్నిని "యేంటి కుమారీ.. ఖాళీనా ..." అంటూ చెయ్యి పట్టుకున్న కామందు, తను ఎదురు తిరిగిందన్న కసితో "మాకు శీలాల్లేవని" ప్రచారం చేసినప్పుడు, ఊరుజనం మాకేం తీర్పిచ్చారు? మాల మాదిగ ఆడవాళ్ళు చీరలకీ, రైకలకీ శీలాలు అమ్ముకుంటారని కాకుల్లా పొడవడం తప్ప యెవరు అక్కున చేర్చుకున్నారు?

"...నాకు ఇంగ్లీషు గర్వాన్నిచ్చింది..గౌరవాన్నిచ్చింది, ఓ స్థితినీ, దర్పాన్నీ ఇచ్చింది, బస్సులోనూ, ఊరులోనూ చదువుకున్నవాడిగా నన్ను గొప్పగా చూపింది, ఉన్న ఊర్లో వాడుకుని ఊరుచివర పారేసిన నన్ను, అమెరికాలో పేద్ద ఆఫీసులో, అందరి మధ్యలో కూర్చోబెట్టింది. మంచి ఉద్యోగాన్నిచ్చింది, నా పిల్లలు ఈ దేశంలో ఉన్నప్పుడు కలలో కూడా కట్టలేని, బట్టలనూ, అవి వేసుకుంటే నున్నగా మెరిసిపోయే ఛాయనూ ఆ దేశమే ఇచ్చింది. ఔను ఈ దేశంలో యెన్నటికీ "అసుంటా జరుగు.." అని ఈసడింపులే తాగి బ్రతికిన నాకు కడుపు నిండా తిండినిచ్చింది, వాడి జేజెమ్మలా బ్రతికే బ్రతుకునిచ్చింది. మా పిన్నీ బాబాయిలు నోటి నిండా నవ్వడం చూసే అదృష్టమిచ్చింది. ఔను! నన్నెప్పుడూ అవమానించడానికే పుస్తకాలన్నీ రాసేసిన నా సొంత దేశం కంటే పరాయి దేశమే నన్ను హత్తుకుంది..." ఆవేశంగా అన్నాడు బాల. అతని వైపే అలా కొత్తగా చూస్తుండిపోయాను నేను.

❖ ❖ ❖ ❖

తన ఆక్రోశం నిజమే కదా అనుకుంటూ ఆలోచనల్లోంచి బైటికొచ్చాను. మనసంతా వికలమయ్యింది. యూనివర్సిటీలో సెలెక్టెడ్ లిస్టులో మెరిట్లో సీటు తెచ్చుకున్నా కూడా మా కులాల్ని తేలిగ్గా పట్టించటానికి వీలుగా యాజమాన్యం ఇచ్చే స్టార్ మార్క్ గుర్తొచ్చింది. బాల మాటల్లో అంతరార్థం అర్థమై సందేహాలన్నీ మబ్బుల్లా విడిపోయాయ్...


❖

‘వాక’ భావనలు



ఎండాకాలం డాబా మీది
నీటి ముంతల్లోని ఆకాశ పుంతల్లో
పక్షుల జలకాలు...
ఈ హృదయ సంబరాన్ని
ఇంతకాలం ఎలా వదులుకున్నానో

కుక్కపిల్ల
చనిపోయిన రోజు –
ఆ తల్లి కుక్క, ఆ పిల్లవాడి
మూగ కళ్ళల్లో
సుడులు తిరిగే బాధ వొక్కటే–



పొద్దున పఠించిన కవితలు
ఎద లోపల
కనలి ముంచెత్తుతుండగా
మళ్ళీ నా ఏకాంతంలో
మునిగిపోయాను.

ఎక్కడో లోయలోంచి
కూస్తోంది
ఓ కోయిల –
నా హృదయలోయలో నుంచీ
ఒక దిగులు కోయిల...



ఒక దు:ఖవీచిక నుంచి
మరొక దానికి
కలలోనూ
కొట్టుకుపోతున్నాను
ఎండుటాకులా

నవ్వులు కురుస్తున్న
మా ఇంట్లో
నా మృత కుమారుడు వుండుంటే
మరిన్ని
నవ్వులు విరిసేవి....



మిత్రుల
సమాధుల పండుగలో
ముభావినై మసలాను...
నా మాతాపితరుల సమాధుల స్థానంలో
నివాస గృహాలు



ఎప్పటికీ
నీ గురించి
ఆలోచించకూడదనుకున్నాను.
కానీ, నా గుండెగొంతును
నొక్కలేకపోతున్నాను.




ప్రేయసి
సమాధి మీద
పూవులా రాలిపోకూడదు.
చెంతనే.. చెట్టునై
వికసిస్తుండాలి.

(వాక (WAKA / TANKA) జపనీయ ప్రాచీన పద్యం. 5–7–5–7–7 మాత్రా చందస్సులో వుంటుంది. ఆధునిక కవులెవరూ ఈ చందస్సును అనుసరించడం లేదు. ప్రణవేశాలు, వ్యక్తిగతానుభూతులు ఎక్కువగా ‘వాక’లో ఒదుగుతాయి.)



పి.శ్రీనివాస్ గౌడ్

నాలుగు మంచి వాక్యాల కోసం



ఎక్కెడైనా ఎప్పుడైనా వెతుక్కోవాల్సిందే
నాలుగు మంచి వాక్యాలకోసం --
ఏనాడైనా అన్వేషించాల్సిందే
నాలుగు మధుర మంజుల నాదాల కోసం.

వివాదాలు లేని వర్తమానాలూ లేవు
ప్రశాంతంగా గడిచిన శతాబ్దాలూ లేవు.

ప్రతి వాదానికీ ప్రారంభ దశలో
గొప్ప గొప్ప శబ్దాలూ శంఖ నాదాలూ వెంటాడతాయి
కొంపలేవో మున్చుకొచ్చినట్లు
ప్రతి కోతీ మీద మీదికి దూకుతుంది --

నిలువెల్లా ఆశ్చర్యపరుస్తూ
తెలీని ఆందోళనలకి గురి చేస్తుంది.

ఎక్కడైనా వెతుక్కోవాల్సిందే
కాస్తంత మనశ్శాంతి కోసం --
అంతటా మృత్యు ఘోష విన్పిస్తున్నా
మనం మాత్రం నిశ్శబ్దంగా
యోగనిద్ర లోకి జారి పోవడమే
ఇప్పుడిక ఉత్తమ మార్గమనుకుంటా !



డాక్టర్ సుమనశ్రీ

మట్టి పాట



చిన్నప్పుడు తాతబడిలో
చదివేటప్పుడు
ఒళ్లంతా ఎర్రమట్టి

పొలానికి అన్నం పట్టికెళ్లినప్పుడు
సైకిలెప్పుడూ ఒండ్రు మట్టే
అక్కడంతా బంక మట్టి

పత్తి మూటల బజార్లో
నల్ల రేగడి నిలువుటద్దం

గొప్పుతవ్వి కుండీలొ పువ్వు పరిమళం కోసం
తెచ్చిపోసిన పచ్చమట్టి

సవాలక్ష రంధ్రాలతో
మట్టిచప్పుళ్ల చలివేంద్రం

ఎడారి ఇసుకలో
మట్టి పాట
జ్ఞాపకాల
తలపోత




ఇంద్రప్రసాద్
(దోహ, ఖతార్)

బహుముఖ ప్రజ్ఞకి చిరునామా

ఇంగ్లీషు చదువులేక దర్శకత్వం మీద, స్క్రీన్‌ప్లే మీద రాసిన పుస్తకాలు చదవకపోయినా, ఎక్కువగా ఇంగ్లీషు సినిమాలు చూడకపోయినా, కేవలం తమ ఊహాశక్తితో ఆలోచనలు చేసి, ఉత్తమ దర్శకులు అనిపించుకున్న వాళ్లున్నారు. వాళ్ళల్లో ఎల్.వి ప్రసాద్ ప్రముఖంగా కనిపిస్తారు. చిన్న వయసులోనే, సినిమాకి మాట తెలియని రోజుల్లోనే అక్కినేని లక్ష్మీవరప్రసాద్ బొంబాయి పారిపోయి అష్ట కష్టాలూ పడి, సినిమాల్లో చేరి, ఎక్స్‌ట్రావేషాలు వేసి, లైట్లు మోసి, కెమెరాలు తుడిచి, చెప్పిన పనీ చెప్పని పనీ చేస్తూ – సినిమా దర్శకత్వం మీద అవగాహన పెంచుకున్నారు. తాను ఎందులో రాణిస్తానో తెలియక, నటుడిగా, క్లాప్ బాయ్‌గా కెమెరా అసిస్టెంటుగా, ఎడిటింగ్ అసిస్టెంటుగా అన్ని శాఖల్లోనూ పనిచేశారు. తొలి హిందీ చిత్రం 'ఆలం ఆరా' (1931) లో రెండు మూడు వేషాలు వేసినట్టే, తొలి తెలుగు సినిమా 'భక్తప్రహ్లాద' (1932) లోనూ, తొలి తమిళ సినిమా 'కాళిదాసు" (1932) లోనూ వేషాలు వేశారు. హెచ్.ఎమ్. రెడ్డి దగ్గర సహాయకుడిగా, నటుడిగా పనిచేసి, ఆయన ప్రశంసలు పొందారు. ప్రసాద్ గారిని రెడ్డిగారు ఆప్యాయంగా 'మైబోయ్' అని పిలిచేవారట. హెచ్.ఎమ్.రెడ్డి తీసిన 'బొండాంపెళ్లి', 'తెనాలి రామకృష్ణ', 'సత్యమేజయం' మొదలైన సినిమాల్లో ముఖ్య పాత్రలు వేస్తూనే సహాయ దర్శకుడిగా కూడా పనిచేసి, దర్శకత్వం మీద అవగాహన పెంచుకున్నారు. దర్శకుడై 'గృహప్రవేశం' (1946) తీశారు. అందులో నాయక పాత్ర కూడా ధరించారు. సినిమా కథ మీద, దాన్ని నడిపించే విధానం మీద శ్రద్ధ వున్న దర్శకుడని నిర్మాతలు ప్రసాద్‌కి చిత్రాలు అప్పజెప్పారు. 'పల్నాటి యుద్ధం' 'ద్రోహి' వంటి చిత్రాలు ఆయన్ని ఉన్నత స్థానంలో నిలబెట్టాయి. విజయ సంస్థ ఆహ్వానం మీద షావుకారు, పెళ్లిచూసిచూడు, మిస్సమ్మ, అప్పుచేసి పప్పుకూడు చిత్రాలు తీశారు. హిట్స్ చేశారు. మనదేశం, పరదేశి, సంసారం, తమిళంలో మనోహర లాంటి భిన్నమైన చిత్రాలు తీశారు.

ప్రసాద్ గారు నటుడుగనక, పాత్రను తాను నటించి చూపించేవారు. 'షావుకారు' లోని సహజమైన సంభాషణలని, అంత సహజంగానూ పాత్రధారులచేత పలికించిన ఘనత ప్రసాద్ గారిది. అక్కినేని చెప్పినట్టు – 'పల్నాటియుద్ధం'లో తాను చేసిన బాలచంద్రుడి పాత్ర "ప్రసాద్ గారు చెప్పినట్టే చేశాను". అందులో బాల చంద్రుడికి 'నువ్వెప్పుడు ఇంతే నాన్నా' అనే ఊత పదం ఉంది. "అది ప్రసాద్ గారు కలిపినదే" అని చెప్పారు నాగేశ్వరరావు, శివాజి గణేశన్, కన్నాంబలతో తమిళంలో తీసిన 'మనోహర' ఘనమైన విజయం సాధించింది. 'పెంపుడు కొడుకు'కి దర్శకత్వం వహిస్తూ – అందులో పాత్ర కూడా ధరించిన తర్వాత చాలాకాలం పాత్రధారణ చెయ్యలేదు. మళ్లీ 'అమావాస్యచంద్రుడు' (తెలుగు, తమిళం) లో అత్యంత సహజంగా నటించి – నటుడిగా కూడా తానెంత ఉన్నతుడో నిరూపించుకున్నారు ప్రసాద్.



ఎల్.వి ప్రసాద్

ఏ హిందీ చిత్రరంగంలో నానా అవస్థలు పడ్డారో, అదే హిందీ చిత్ర రంగంలో జయ పతాకం ఎగరవేశారు. ఎన్నో హిందీ సినిమాలతో విజయఢంకా మోగించారు.

ప్రసాద్ గారికి ట్రీట్‌మెంట్‌లో మంచి అవగాహన వుండేది. ఏదైనా మంచికథతో నచ్చిన సినిమా – జయం సాధించలేకపోతే దాన్ని తీసుకుని లోపం కనిపెట్టి, ఆ లోపాన్ని సరిచేసి కొత్త విధానంతో రూపొందించి, జయం సాధించేవారు ప్రసాద్. తెలుగులో వచ్చిన 'పునర్జన్మ'ని 'ఖిలోనా' గా హిందీలో తీసి, విజయం పొందినట్టే, ఎప్పుడో వచ్చిన 'బ్రతుకుతెరువు'ను కూడా హిందీలో తీసి ఘనత సాధించారు. దర్శకుడిగా తన పేరులేకపోయినా, 'ఇలవేలుపు' 'అమ్మలక్కలు' చిత్రాల విజయంలో ఆయన ప్రమేయం బాగా ఉంది.

ఆయనకి ఎక్కువగా శోకంచూపడం, హింసించడం ఇష్టం ఉండేది కాదు. దృశ్యంలోని గాంభీర్యాన్ని, మెలోడ్రామానీ ఎలా పండించే శక్తి ఉందో – అంత శక్తీ హాస్య దృశ్యాలు పండించడంలో కూడా ఉంది. 'పెంపుడు కొడుకు'లో తన కొడుకు (చిన్నవాడు) తప్పు చేశాడని, కొట్టే దృశ్యం వుంది (ఆ పాత్రని ఆయనే ధరించారు). కొట్టడం డైరెక్టుగా చూపించకుండా, కొట్టినట్టు కేకలు, ఏడుస్తున్న కేకలూ వస్తువుండగా, కెమెరాని వేరే చోటుకి పాన్ చేశారు. 'మిస్సమ్మ'లో సావిత్రి క్లోజప్‌తో – ప్రేక్షకుల కళ్లు చెమర్చేలా చేశారు. ప్రతిపాత్ర నిండుగా కనిపించాలి. బాగా నటించాలి, డైలాగ్ చెప్పాలి. సంభాషణ ఎలా చెప్పాలో – ఆయనే చెప్పి నటులచేత పలికించేవారు. 'మిస్సమ్మ'లో రంగారావుకి 'అదే' అనే చిన్న ఊత పదం పెట్టి హాస్యం పలికించారు.

ప్రేక్షకుల నాడి, విజయానికి సోపానాలూ తెలుసుకోగలిగిన ఎల్.వి ప్రసాద్ – తానే నిర్మాతగా చిత్రాలు తీశారు. కొత్తనటుల్ని, దర్శకుల్ని పరిచయం చేశారు. ఎన్.టి. రామారావు లాంటి గొప్పనటుడిని 'మనదేశం' ద్వారా పరిచయం చేయడం, అక్కినేని వంటి మహానటుడిని సాంఘిక పాత్రలో 'సంసారం'లో పరిచయం చెయ్యడం – ఒక ఘనతయితే, రంగారావు చేత భిన్నమైన పాత్రలు చేయించడం ఇంకోఘనత.

కథా గమనం మీద పట్టు, దృశ్య నిర్మాణం మీద శ్రద్ధా ప్రసాద్ గారి చిత్రాల్లో కనిపిస్తాయి. క్లుప్తమైన సంభాషణలు, భావం పలికించడంలోనే సంభాషణ ఉన్న తీరు – ఆయన సినిమాలు చూపిస్తాయి. ఒక సినిమాలో షూటింగ్ రమణారెడ్డి నటిస్తూ – అవతలి పాత్ర వేపు ఆశ్చర్యంగా చూసి, "ఏమిటీ? అలాగా!" అంటే –"ఏమిటీ" అని ఆశ్చర్యంగా చూశావు – అలాగా అని మళ్లీ అనాలా?" అని చెప్పి, 'అలాగా' అన్నది పునరుక్తి దోషంగా తీసేశారు – దర్శకుడు. కష్టాల కడలిని మథించి, అమృత భాండం లాంటి చిత్రాలు అందించి – 'స్టూడియో అధిపతి'గా నిలబడగలిగిన ప్రసాద్ గారు ఆదర్శవంతుడు; స్ఫూర్తిదాత.

సినిమాలు చూసేది నేత్రాలు. అధికంగా చూడడం – నేత్రాలకు అనారోగ్యం. నేత్రం అన్ని అవయవాల్లోనూ అతిముఖ్యమైనది – అని నేత్ర వైద్యశాల నెలకొల్పి – ఎందరికో చూపు ఇస్తున్న ఘనత కూడా ఎల్.వి ప్రసాద్ గారికి ఉంది. మొత్తం భారతదేశ సినిమా పరిశ్రమ – ప్రసాద్ గారిని – నిరంతరం గుర్తుపెట్టుకుంటుంది.



రావి కొండలరావు

చక్కిలిగిత మోహన్

నేమ్ డ్రాపింగ్ గేమ్

స్టార్ డాన్సర్ ఇసడోరా డంకన్‌ని చేసుకున్నందుకు సెర్గీ ఎసెనిన్,
ఊరూ పేరూ లేని అలెగ్జాండ్రోవ్నా చేసుకోనందుకు మయకోవ్ స్కీ ఇద్దరూ
ఆత్మహత్య చేసుకోవడం ట్వంటీయత్ సెంచరీ పోయిట్రీలో గ్రిమ్
ట్రాజడీ. ఆనా అత్మతోవా బతుకూ విషాదమే. ఐజాక్ బెర్లిన్ని
కలిసిన పాపానికి ఆమె జీవితం మరీదుర్భరమయింది.



లెవ్ తోల్‌స్తోయ్ రాసిన వార్ అండ్ పీస్, రిసరెక్షన్- కోసాక్స్ జారిస్టు
అరిస్టోక్రాటిక్ లైఫ్‌ను చిత్రిస్తే,దోస్తయేవ్ స్కీ- క్రైమ్ అండ్ పనిష్ మెంట్,
బ్రదర్స్ కరమజోవ్ అధోజగ త్ సహోదరుల బతుకుని అద్దం
పడతాయి. అదే వెరైటీ. వైవిధ్యం.



గోర్కీ మదర్ చూస్తే మదర్ ఆఫ్ ఆల్ నావెల్స్ అనిపించదూ.
చెహూవ్ కద లు అబ్బో, ప్రిన్స్ ఆఫ్ షార్ట్ స్టోరీస్. మొపాసా,
ఓహెన్రీ లేరని కాదు. అదోవరస, కాఫ్కా, మిలాన్ కుందేరా,
జీన్ జెనే టోటల్లీ డిఫరెంట్ యార్.



మ్యూజిక్కూ అంతే. యూరప్ కి ఆ పక్క బాక్, బీథోవెన్, మొజార్ట్,
ఈపక్క చైకోవ్ స్కీ, ముసగోర్ స్కీ, స్ట్రావిన్ స్కీ సింఫనీలు ఈస్ట్ ఈజ్
వెస్ట్ అండ్ దే కెన్ మీట్ అనిపిస్తాయి. అదే సెర్గీ ఐసెన్ స్టీన్ సినిమాలు
బేటిల్ షిప్ పొటెమ్కిన్, టెన్ డేస్ దట్ షుక్ ది వరల్డ్, స్ట్రైక్ లకు
ద్మిత్రీషస్తకొవిచ్ బాక్ గ్రౌండ్ స్కోర్ భయపెడుతుంది



ప్రకృతితో మానవుడి పోరు అని ఎర్నెస్ట్ హెమింగ్వే రాసిన "ఓల్డ్ మేన్ అండ్ ది సీ" కి
నొబెల్ ప్రైజ్ ఇచ్చారు. మరి మోబీడిక్ ఏంటి? జాక్ లండన్ -కాల్ ఆఫ్ వైల్డ్ అది కాదా?
ఆ మాటకొస్తే కేశవరెడ్డి 'అతడు అడవిని జయించాడు', మైఖేల్ షోలకో వ్" ఫేట్ ఆఫ్ ఎ మేన్",
"అండ్ క్వయట్ ఫ్లోస్ ది డాన్" అవి కావా ? అర్థం కాదు డిస్కస్ చేయాలి.



సోమర్ సెట్ మామ్ "ఆఫ్ హ్యూమన్ బాండేజ్" నుండి "సమ్మింగ్ అప్" వరకూ ఆడాళ్ల మీద
పడేడుస్తాడెందుకు. మాగాళ్లేదో పత్తిత్తులైనట్టు. ఐ డోంట్ డైజెస్ట్ సచ్ థింగ్స్



అద్భుతం అన్నా గ్రేట్. పొయిట్రీ, ప్రోజ్, నవల, కద , సినిమా,
మ్యూజిక్ మీద నీ అథారిటీ వండర్ ఫుల్.
ఆ విడ్త్, బ్రెడ్త్, వెరీవెరీ డీప్ స్టడీ అండ్ అండర్
స్టాండింగ్ సుపర్బ్. వస్తా




స్టడీ, అండర్ స్టాండింగ్, అథారిటీయా నా బొంద! అక్కడిక్కడ విని
నేమ్ డ్రాపింగ్ తో వీడి నోరుతెరిపించేశా గానీ,
వాళ్లెవరో రాసినవీ,చేసినవీ, చదవడానికీ, చూడ్డానికీ,
వింటానికీ టైమెక్కడ.రాయడానికే తీరికలేక చస్తుంటే, చదివేదెక్కడ






పుష్పించే రాళ్లు

ఈ నల్లని రాళ్లలొ ఏ కన్నులు దాగెనొ... ఈ బండల మాటున ఏ గుండెలు మ్రోగెనో... అంటూ పాత తెలుగు సినిమా పాటొకటి ఉంది తెలుసా పిల్లలూ. మీరు చూస్తున్న ఈ రాళ్లలో మొక్కలు దాగి ఉన్నాయని మీకు తెలుసా? అలాగని మొక్కలేమీ మరీ రాళ్ల చాటున నక్కి లేవు. ఏవి మొక్కలో ఏవి రాళ్లో చెప్పడం కొంచెం కష్టంగా ఉంది కదూ. లివింగ్ స్టోన్స్, లేదా పెబ్బెల్ ప్లాంట్స్ అని పిలవబడే ఈ సజీవ రాళ్ళు సౌత్ ఆఫ్రికాలో కనబడే ఈ చిట్టిపొట్టి మొక్కలు. రాతి నేల మీద మెలిచే ఈ మొక్కలు రంగులోను, ఆకారంలోను రాళ్ళను పోలి వుంటాయి. మొక్కలు ఎందుకిలా రాళ్ళ లాగా మారువేషంలో ఉన్నాయో మీకు తెలుసా? మొక్కలను తినే జంతువులు బారి నుండి ఆత్మరక్షణ కోసం. ఈ సజీవ రాళ్ళు పుష్పించినపుడు మాత్రం వాటి అసలు రూపం బయటపడుతుంది. కాని అడవిలోని మొక్కలన్నీ అదే సమయంలో పుష్పించడం వల్ల ఇవి కనిపించవు. అంతే కాదు, జంతువులకు సుష్టుగా తిండి దొరకడం వల్ల కూడా వీటి జోలికి రావు.



దారి కనుక్కోండి

చిన్నారి 'చిత్రం'







కె. దేవి ప్రసన్న
ఐదవ తరగతి, డిఎవి పబ్లిక్ స్కూల్,
ఇబ్రహీంపట్నం, కృష్ణా జిల్లా.


చిన్నారుల పెయింటింగ్స్‌ను
apchiefeditor@gmail.com కు
ఈ మెయిల్ చేస్తే ప్రచురిస్తాం.

రంగులు వేయండి





చుక్కలు కలపండి



లక్ష్యం... సాధనలే జీవనగమ్యాలు!

మన జీవన గమనాన్ని నిర్దేశించేది ఎవరు? మన కుటుంబ సభ్యులా? మన చుట్టూ ఉన్న సమాజమా? లేక మనంతట మనమేనా? ఈ ప్రశ్నలు యవ్వన ప్రాయంలో ఉదయించితే, తమ ఇష్టాయిష్టాలను క్రోడీకరించుకొని, ఒక లక్ష్యాన్ని ఎంచుకొని తమ జీవనగమనాన్ని తామే నిర్దేశించుకోవడానికి అత్యధిక శాతం మంది సిద్ధపడతారు. తామేం చదుకోవాలో పెద్దలే నిర్ణయించుతారు. ఎటువంటి ఉద్యోగం లభిస్తుందో, లేక ఏయే వ్యాపార అవకాశాలు అందుబాటులో ఉన్నాయో చుట్టూ ఉన్న సమాజమే నిర్ణయిస్తుంది. అందుకే తమ అభిరుచులేమిటో, తమ లక్ష్యం ఏమిటో నిర్ణయించుకోగల అవకాశం తమకుందన్న అంశాన్నే చాలమంది గుర్తించరు. ఫలితంగా యాంత్రిక నిర్ణయాలు తీసుకుంటూ యాంత్రిక జీవితాన్ని గడపడానికి చాలా మంది అలవాటుపడిపోతారు. అసలు యాంత్రిక జీవనం గడుపుతున్నామన్న అంశాన్నే వారు గుర్తించరు, అంగీకరించరు.

సత్యమూర్తి ఒక పల్లెటూరిలో ఉపాధ్యాయునిగా పనిచేసేవాడు. ఒక్కడే కొడుకు. అతన్ని బాగా చదివించాడు. వివాహమైన తరువాత కొడుకు, కోడలు అమెరికాలో స్థిరపడ్డారు. పదవీ విరమణ చేసిన తరువాత సత్యమూర్తికి తన జీవితం అయోమయంగా అనిపించసాగింది. ఈ పల్లెటూరిలో చేసే పనేమో లేదు. ఇతరులతో కలిస్తే పనికిమాలిన కబుర్లతో కాలక్షేపం చేయడమే తప్ప మరేమీ ప్రయోజనం లేదని అతనికనిపించి, ఇంట్లోనే ఒంటరిగా కాలం గడిపేవాడు. రెండు సార్లు భార్యతో కలిసి అమెరికా వెళ్ళాడు. ఒక్కోసారి రెండు నెలలు ఉన్నాడు. కొడుకు, కోడలు తమ అవసరాలు గుర్తించి తమపట్ల ఎంతో ప్రేమను కనపరుస్తారు. కాని వారికి తమ అవసరం ఎంత మాత్రం లేదని, తన అవసరాలు తీర్చుకోవడానికి తాను అమెరికాలో ఉండాల్సిన అవసరం ఏ మాత్రం లేదని, తన గ్రామంలో తానుంటేనే తనకు సంతృప్తికరంగా ఉంటుందని సత్యమూర్తి గుర్తించాడు. ఇకపై అమెరికా వెళ్ళాలన్న ఆలోచనను విరమించుకొని తన గ్రామంలోనే మిగిలిన జీవితం గడపాలన్న నిర్ణయానికి వచ్చాడు. ఇప్పుడే అతన్ని ఒంటరితనపు భావన వేధించసాగింది. తన జీవితమంతా యాంత్రికంగా గడచిపోయిందని, ఫలితంగా తన జీవితం అర్థరహితంగా మిగిలిపోయిందన్న భావన నుండి అతను బయటపడలేకపోతున్నాడు. చుట్టూ ఉన్న వాళ్ళ అభినందనలు ఇతనికి ఉల్లాసాన్ని కలిగించలేకపోతున్నాయి. జీవితంలో చీకూ చింతలేదు. ఒక్కడే కొడుకు ఉన్నతస్థితిలో ఉన్నాడు. ఆర్థిక ఇబ్బందులు లేవు. "ఎవ్వరితోను విరోధం లేదు. అందరితో స్నేహంగా ఉంటాడు" ఇటువంటి వ్యాఖ్యానాలు అతనికెంతమాత్రం సంతోషాన్ని కలిగించలేకపోతున్నాయి. జీవితంలో తాను సాధించే దేమిటి ? అసలు ఈ జీవితం నుండి తాను కోరుకొన్నదేమిటి ? అనే ప్రశ్నలు నిరంతరం అతన్ని కలవరపరచసాగాయి. చివరకు అతను ఒక నిర్ణయం గైకొని, తాను పనిచేసిన హైస్కూలుకు వెళ్ళాడు. అక్కడ ప్రధానోపాధ్యాయునితో మాట్లాడి, తొమ్మిది, పది తరగతుల్లో అందరికంటే వెనుకబడిన పది మంది విద్యార్థులను ఎంచుకొని, మరుసటి రోజు నుండి వారికి తన ఇంట్లోనే ఉచితంగా ప్రత్యేక విద్యాబోధన చేయడానికి ఉపక్రమించాడు. మొదటి రెండు మూడు నెలలు ఎటువంటి ప్రయోజనం కనిపించలేదు. సత్యమూర్తికి ఎంతో నిర్వేదం కలిగేది. ఆ విద్యార్థుల్లో బాగా చదుకోవాలన్న ప్రేరణ కలిగిన తరువాత, వారిలో అద్భుతమైన మార్పు వచ్చింది. ఆయా క్లాసుల్లో వారిలో కన్పిస్తున్న మార్పు చూచి, అక్కడి ఉపాధ్యాయులు కూడా ఆశ్చర్యపోసాగారు. ఆగ్రామంలో చదువులో వెనుకబడిన విద్యార్థులకు సత్యమూర్తి ఒక వరంలా లభించాడని గ్రామస్తులు అనుకోవడం ప్రారంభించారు.

తన జీవితపు చరమాంకంలో సత్యమూర్తి ఒక లక్ష్యాన్ని ఎంచుకొన్నాడు. ఫలితంగా తన జీవితానికినొక అర్థం, ప్రయోజనం సమకూరాయని అతనికి అమిత సంతోషంగా ఉంది. తన చొరవతో కొందరు విద్యార్థుల విద్యాభ్యాసంలో గణనీయమైన మార్పు కనిపించేలా చేయడం ద్వారా తన జీవితం అర్థవంతమయ్యిందని సత్యమూర్తి నిర్ణయించుకున్నాడు. తన కొడుకు అమెరికాలో స్థిరపడడం కంటే, ఇదే సంతృప్తికరమైన అంశంగా అతను పరిగణించసాగాడు. ఎప్పుడు, ఏ పరిస్థితిలోనైనా జీవితానికి ఒక లక్ష్యాన్ని ఎంచుకోగలిగితే, ఆ లక్ష్యమే జీవితానికొక ప్రయోజాన్ని అందిస్తుంది.

మరొక గ్రామంలో ఉన్న ఒక సంపన్నరైతు నారాయణరావుకు కూడా దాదాపు ఇటువంటి సమస్యే ఎదురయ్యింది. తన పొలమంతా కౌలుకు ఇచ్చాడు. పిల్లలందరూ దూరాన ఉన్న నగరాల్లో స్థిరపడ్డారు. తాను, తన భార్య ఎంతో ఆరోగ్యంగా ఉన్నా చేయడానికి పనిలేదు. ఆ గ్రామంలోని పెద్దలు అప్పుడప్పుడు నారాయణరావు దగ్గరకు వచ్చి ఆ గ్రామ సమస్యలు చర్చిస్తుండేవారు. ఆగ్రామంలో వ్యవసాయ కూలీలుగా పనిచేసి, పనుల్లేక, ఉన్న చేయగల శక్తి లేని మూడువందల మందికి ప్రభుత్వం నెలకు వెయ్యి రూపాయిల పించను అందిజేస్తోంది. అలాగే అతి తక్కువ ధరకు భియ్యం కూడా అందిస్తోంది. అయినా అక్కడి పేదల సమస్యలు తీరలేదు. వాళ్ళెవరికీ గ్యాస్ పొయ్యిలు లేవు. పొయ్యి రాజేయడానికి కట్టెలు దొరకడం గగనమైపోయింది. కొన్ని చోట్ల భార్య, భర్తలు ఇద్దరూ ఉంటారు. ఎక్కువ మంది ఒంటరిగా ఉన్నారు. అందులో కొందరిది ఎక్కడకూ కదల్లేని పరిస్థితి. కొందరైతే వంటచేసుకోనే ఓపిక లేక, ఆకలితోనే నిద్రిస్తుంటారు. ఈ విషయం విన్న తరువాత నారాయణరావు చలించిపోయాడు. వారికోసం తక్షణమే ఏదో ఒకటి చేయాలన్న పట్టుదల ఆయనలో నెలకొంది.

తన దగ్గర రెండు పెద్ద షెడ్డులు ఖాళీగా ఉన్నాయి. మనుషులను పురమాయించి అందులో పెద్దవంటశాలను నిర్మించాడు. గ్రామ పెద్దలతో ఒక కమిటీ ఏర్పాటు చేసి, ఇక్కడ చేసే వంటలను సరిచూసే బాధ్యతను వారికి అప్పగించాడు. ఆ గ్రామంలోని పేదలంతా నిర్ణీత సమయానికి అక్కడకు చేరుకొని భోజనం చేయవచ్చు. అయినా కొంతమంది వచ్చే వారుకాదు. అందుకు వారేవో సమస్యలను కారణంగా చూపారు. వెంటనే నారాయణరావు ఒక నిర్ణయం తీసుకొన్నాడు. వృద్ధులకు, ఇక్కడకు రాలేని వారికి క్యారేజీలు కొని, తన మనుషులతో వారి ఇంటికే భోజనం పంపే ఏర్పాటు చేశాడు. ఈ కార్యక్రమం ఆ గ్రామంలోనే కాదు, ఆ జిల్లాలోనే పెద్ద సంచలనం సృష్టించింది. స్థానిక పత్రికలు ఫోటోలతో సహా ఈ వార్తలను ప్రచురించసాగాయి. ఆగ్రామానికే చెంది ఇతర ప్రాంతాలలో, ఇతర దేశాలలో స్థిరపడి విపరీతంగా సంపాదించిన కంట్రాక్టర్లు, పారిశ్రామికవేత్తలు, ఈ కార్యక్రమం కోసం కొన్ని కోట్లు విరాళంగా పంపారు. ఆడబ్బు బ్యాంకుల్లో డిపాజిట్ చేసి దాన్నుండి వచ్చిన వడ్డీతో రోజుకు వెయ్యి మందికి ఉచితంగా భోజనం పెట్టగలుగుతున్నారు. "ఎవ్వరూ విరాళాలు పంపవద్దు ఇప్పటికివి చాలని" నారాయణరావు పత్రిక ముఖంగా ప్రకటించాడు. "నేను ప్రారంభించినప్పుడు ఇదొక మంచి కార్యక్రమం అనుకున్నానే తప్ప ఇదెంత కాలం కొనసాగించగలనన్న ఆలోచనే నాకు రాలేదు. ఇదింత పెద్ద కార్యక్రమం, ఆదర్శప్రాయంగా రూపొందుతుందని నేను ఊహించలేదు. నేను, నా భార్య కూడా రోజూ అక్కడ వండిన వంటలనే తినడం మాకెంతో సంతోషంగా ఉంది. నా జీవితానికొక ప్రయోజనం కలిగిందనిపిస్తోంది" అని ఆయన చెబుతారు.

ఒక లక్ష్యమే జీవితానికి ఒక ప్రయోజనం కలిగిస్తుంది. జీవితాన్ని అర్థవంతం చేస్తుంది.



సి నరసింహారావు
మనోవైజ్ఞానిక విశ్లేషకులు

లేవండి.. భోజనాలకు!



దండకారణ్యం – ఆంధ్రప్రదేశ్, ఒడిసా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దులు కలిసే ప్రాంతంలో ఉంది. ఈ అడవుల్లో కొట్టొచ్చినట్టు కనబడేది 'గుగ్గిలం చెట్టు'. దీన్నే పండితులు 'శాల వృక్షం' అంటారు. గిరిజనులు కూడ 'సాల్' అనే పిలుస్తారు. బస్తర్ ప్రాంతం వారు మాత్రం 'సర్గీ మర' అంటారు. ఈ చెట్టులో ఉన్న విశేషమేమిటంటే– దీని కాండం నిటారుగా 20–30 మీటర్ల ఎత్తు పెరిగి, అటుపై శాఖలు విస్తరిస్తాయి. వంద పెన్సిళ్ళను ఒకదానికొకటి కొద్దిపాటి యెడంలో (దూరంలో) ఉండేలా– పక్క పక్కన పది వరుసల్లో నిలబెట్టి చూస్తే ఎలా అనిపిస్తుందో అలాంటి అనుభూతి కలుగుతుంది అటవీశాఖవారి అధీనంలో పెరిగే గుగ్గిలం తోపులను చూస్తే! ఈ చెట్టు మానుని గొడ్డలితో గాటు పెడితే ఒక విధమైన సారం (Rasin) కారి, గడ్డ కడుతుంది. దాన్నే 'గుగ్గిలం' అంటారు. వాసన బాగుంటుంది. గిరిజనులు గ్రామ దేవతలకు గుగ్గిలంతో ధూపం వేస్తారు. ఆదిలో రైల్వే లైన్ పట్టాలు జోడించడానికి వాడే 'స్లీపర్ల'ను ఈ చెట్టు మానుతో చేసేవారు.

అది మే నెల 25. ఎండ దంచేస్తోంది. మధ్యాహ్నం మూడు గంటల సమయం. మా వాహనం 'స్టేట్ హై వే'లో ఒడిశా రాష్ట్రానికి చెందిన ఫూల్బని జిల్లా నుండి బౌధ్ అనే పట్టణం వేపు దూసుకుపోతోంది. దారికి అటూ ఇటూ అటవీశాఖవారి శాల వృక్షాల తోపులు మొదలయ్యాయి. మరి కాస్త దూరం వెళ్ళేసరికి రోడ్డుమీద దాదాపు 50 మీటర్ల పొడవున గుగ్గిలం కాయలు 'ఆరబెట్టినట్టు' పడి ఉన్నాయి. ఒక్కో కాయకు శనగకాయంత విత్తనం, దానికి తగిలించినట్టు అయిదు రెక్కలు ఉన్నాయి. అవి చెట్టునుండి ఎగిరివచ్చి తారు రోడ్డుమీద పడ్డాయి. సాధారణంగా ఎగిరివచ్చి పడినవి రోడ్డు పక్కకు కొట్టుకుపోవాలి. కాని అలా జరగలేదు! దానికి కారణం రోడ్డుకి అడ్డంగా మూడు గజాల వెదురుకర్ర పెట్టి ఉండడమే. అలా పెట్టడం వల్ల రోడ్డుమీద పడిన కాయలు– వీచే గాలితోబాటు తుప్పల్లోకి ఈడ్చుకుపోకుండా అడ్డుపడి ఎన్ని కాయలు పడినా అక్కడే ఆగిపోయి.. పదీ, ఇరవై.. అలా చాలా మీటర్ల పొడవున పోగవుతున్నాయి. ఇంతకీ అడ్డుగా వెదురు కర్ర పెట్టినవారెవరై ఉంటారు? ఇంకెవరు? ఆ కాయలను బుట్టల్లోకి నింపుకుంటున్న గిరిజనుడే! ఓర్నీ! అవసరం మనిషిచేత ఎన్ని సులభతర మార్గాలనైనా కనిపెట్టేలా చేస్తుందనడానికి ఇంతకన్న నిదర్శనమేంకావాలి? గిరిపుత్రా! నీ తెలివి అమోఘం! నీకు నా అభినందనలు.

పోతే, నా సంగతి తెలుసు కదా మీకు! గిరిజనులు కనిపిస్తే మాట్లాడకుండా ఉండలేను! అంచేత పక్కన బండి ఆపించి, ఈ కాయల్ని ఎందుకు సేకరిస్తున్నావు? అని అడిగితే గోండ్ తెగకు చెందిన ఆ యువకుడు చాలా విషయాలు చెప్పాడు. వాటి సారాంశమేమిటంటే– కాయలకు మంట పెడితే వాటి రెక్కలు పూర్తిగా కాలిపోయి, చక్కగా వేగిన గింజలు మిగులుతాయి. వేగిన ఆ గింజల్ని మెత్తగా దంచి ముద్దచేసి, వెడల్పాటి మూతి ఉన్న నీళ్ళ బాండిలో వేసి ఉడికిస్తే దానిలో ఉన్న నూనె (సర్గీ తేల్) నీళ్ళపై తేలుతుంది. అలా తేలిన నూనెను మరో పాత్రలోకి తీసి, ఏమయినా నీరు మిగిలిపోతే, ఆవిరైపోయే దాకా మరగబెట్టి, వంటల్లో వాడుకోడానికి దాచుకుంటారు. అదీ సంగతి!

ఐతే, బస్తరు (ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం) అడవుల్లో నివసించే హల్బా గిరిజనులు సర్గీ బీజ్ (సాల విత్తనాలు) నుండి నూనె రాబట్టే విధానం మరోలా ఉంటుంది! వారు గింజల్ని మెత్తగా దంచి మూటకట్టి, దానిమీద అతి బరువైన రాయి పెడతారు. అలా ఏర్పాటు చేసిన పీడనశక్తి వల్ల ఆ మూటలోంచి కారిన నూనెను మరో పాత్రలోకి పట్టి, దాన్ని వాడుకుంటారు. అవసరం మేరకు దాచుకుని మిగతాది సంతలో 'వస్తుమార్పిడి' పద్ధతిలో అమ్ముకుంటారు. కొందరైతే గింజల్నే అమ్మేస్తారు. ఆ రోజుల్లో (1979లో) ఇలా అడవిలో సేకరించి సంతలో అమ్ముకునే సరుకును 'మైనర్ ఫారెస్ట్ ప్రొడ్యూస్' అనేవారు. దానిమీద సర్వహక్కులు గిరిజనులవే.

మరో ముచ్చట!

కొత్తగూడెం దగ్గర్లో సీతాయ్‌గూడ అనే కోయగూడెం ఉంది. ఆ గూడేనికి వెళ్ళే దారిలో అటూ ఇటూ ఉన్న పొదలమీద పొట్లకాయ తీగలు పెరుగుతున్నాయి. కాని కాయలు మాత్రం పిచ్చుకంతయినాలేవు! ఆ దారిన పోతున్న ఓ కోయ తల్లిని ఆపి, అడిగితే దాన్ని 'పిచ్చికి పొట్ల' అంటారంది. కొన్ని పాదుల కాయలు చేదుగాను, మరికొన్ని కాయలు కమ్మగాను ఉంటాయని చెబుతూ, ఒక కాయను నోట్లో పెట్టుకుని– 'ఈ కాయకు చేందు లేదు, తినొచ్చు' అని కరకరా నమిలేసింది. 'కూర కూడ వండుకోచ్చు' అంటూనే నడక కొనసాగించింది.

పిచ్చుక పొట్ల చూడ్డానికి చిన్నదన్నమాటేగాని, మిగత విషయాల్లో ముమ్మూర్తులా మామూలు పొట్లకాయ లాగే ఉంది! అక్కడ ఉన్న తీగల్ని జాగ్రత్తగా పరిశీలిస్తే, కొన్ని కాయలు 10–20 సెంటిమీటర్ల పొడవు కూడ పెరిగినవి కనబడ్డాయి! ఇదే విధంగా, విశాలాంధ్ర అంతటా– అటవీప్రాంత శివార్లలోను, గ్రామ పొలిమేరల్లోను మనకు బీర, దొండ, ఆనబ – ఇత్యాది తీగలూ; మునగ వంటి వృక్షాలూ కనబడతాయి. అంటే– చేదు రకాలూ, కమ్మని రకాలూ కలసి మెలసి వృద్ధి చెందుతాయన్నమాట!


ఇప్పుడు అసలు విషయంలోకి వద్దాం. ఆదిలో దొరికిందల్లా కచ్చా పచ్చాగా కతికి బతికిన మానవుడు తరువాత్తరువాత, రుచులు మరిగాడు. అతగాడికి చేదు అంటే అంతగా ఇష్టం ఉండదు! తీపి అంటే అతి ఇష్టం. తేనె అంటే మహా మహా ఇష్టం! 'మనవాడు' దొండతీగ ఎదురైనా, పొట్లతీగ కనబడినా– వాటి కాయలు చేదుగా ఉన్నాయా లేక కమ్మగా (తియ్యగా) ఉన్నాయా? అని రుచి చూచేవాడు. సార్థక నామధేయుడు (బుద్ధిజీవి: Thinking man) కదా! నానాపాట్లూ పడుతూ, మళ్ళీ మళ్ళీ ఎక్కడెక్కడో తిరిగి, సేకరించేకన్నా తన నివాసం చుట్టూ ఉన్న జాగాలోనే వాటిని పెంచడం ఎలాగో 'బుర్ర' ఉపయోగించి తెలుసుకున్నాడు. తనకు నచ్చిన, తాను మెచ్చిన అనేక రకాల మొక్కల్ని కూడ అందుబాటులోకి తెచ్చుకున్నాడు. ఆర్థిక శాస్త్రవేత్తలు చెప్పే 'డొమెస్టికేషన్' (domestication) అంటే ఇదే మరి! పనిలో పనిగా– ఒక తీగకు, ఒక మొక్కకు లేక ఒక చెట్టుకు కాసిన కాయల్లో అతి పెద్దదానినీ, అతి రుచికరమైనవాటినీ– వాటి విత్తనాలకోసం దాచుకుని, అభివృద్ధి బాటలో పయనించాడు. ఈ పద్ధతుల్నేఇప్పటి మన వృక్షశాస్త్రవేత్తలు "డొమెస్టికేషన్ బై సెలెక్షన్" అంటున్నారు.

ఇంతకూ చెప్పవచ్చేదేమిటంటే... మానవుడికే సొంతమైన 'ఆలోచించి అమలు పరచే శక్తి' వలనే గుప్పెడైనా ఉండని 'పిచ్చుక పొట్ల' ఇప్పుడు రెండు మీటర్ల పొడవైన పొట్లకాయగా రైతు బజారులో అవతరించింది. చేదు సొర (ఆనబ) కాయల్లోంచే కమ్మని సొరకాయలు వేరుపడి, వివిధ ఆకారాలలో, పొడవూ లావూ కూడా అనూహ్యంగా పెంచుకుని మనకిప్పుడు లభ్యమవుతున్నాయి. చేదుదొండ కాయల్లోంచే తియ్యదొండ విడివడి వంట ఇంట్లోకి చేరింది. పిడికెడంత చేదు బీరకాయ సంతతే ఇప్పుడు మనం అనుభవిస్తున్న అర్థ మీటర్ దాకా పొడవు ఎదిగిన కమ్మనైన బీరకాయ! పోతే.. చేదు మునగ కాయల్లోంచి ఉద్భవించిన చేదులేని మునగకాయలు సైతం– విపరీతంగా తమ పొడవును పెంచుకుని, వడ్డించిన విస్తరిలో మనకోసం రకరకాల కూరల రూపంలో, ఊరగాయల రూపంలో యెదురు చూస్తున్నాయి! మరిక లేవండి.. భోజనాలకు!



కొప్పుల హేమాద్రి

ప్రజ్ఞా ప్రవాహమ్!



సనాతన ధర్మ విచారణలో పునర్జన్మ ప్రధానాంశం.

మళ్లీ మళ్లీ జన్మ ఎత్తటం ఉన్నదన్న సంప్రదాయక, ఆధ్యాత్మిక భావన పునర్జన్మ.

మరణ సమయంలో స్థిరమైన ఆలోచన మరు జన్మకు పునాది అనీ, కర్మ, ప్రారబ్ధాలు పూర్తికాకుండా మరణిస్తే, వాటిని అనుభవించటానికి మళ్లీ జన్మ వస్తుందనీ, ముక్తి లభించే దాకా జన్మలు వస్తూనే ఉంటాయని, రకరకాల వ్యాఖ్యానాలు వింటుంటాం. కాస్త లోతుగా విచారిస్తే, తల్లి గర్భం నుంచి సమాధిగతమయే వరకు శరీరం మార్పు చెంది మరణస్థితికి చేరుకుంటున్నది. కనుక మరణిస్తున్నది దేహమని అర్థమవుతున్నది. పంచభూతాత్మకం కనుక తిరిగి పంచభూతాల్లో కలుస్తున్నది కనుక, మరణం దేహానికే పరిమితమైన ఒక మహాద్భుత సృష్టి రహస్యం. ఒక అధివాస్తవిక పరిణామం. జీవులందరికీ అనివార్య యోగం.

నీట నానని, నిప్పున కాలని. గాలికి చెదరని, మంటి నుండి మింటి వరకు వ్యాపించిన ఆత్మకు పుట్టుకా లేదు, మరణమూ లేదని వేదాంత విచారణ. ఆత్మ సర్వవ్యాపకమని, సర్వశక్తివంతమని, నిజానికి ఉన్నదంతా ఆత్మేనని పూర్ణాద్వైత భావన. శంకర భగవత్పాదులు 'ఆత్' అంటే ఏమీ, 'మా' అంటే లేదని అన్నారు. ఆత్మ అంటూ ప్రత్యేకంగా లేదని భగవత్పాద హృదయం. మరణం తప్పని దేహం, మరణమెరుగని ఆత్మ కలిసి ఉండటం ఒక విచిత్ర స్థితి. అయినా అది ఒక యదార్థ స్థితి. ఇంతకీ పునర్జన్మ ఎవరికి? దేహానికా, ఆత్మకా?

శ్వేతకేతువుకు ఉద్దాలకుడు పరిచయం చేసిన 'నేను',

సనత్కుమారుడు నారద మహర్షికి బోధించిన 'నేను',

అష్టావక్రుడు జనకుడు విచారించిన 'నేను',

'నేను'ను తెలుసుకోగలిగితే, అన్నిటినీ తెలుసుకున్నట్లు అంటూ నిరంతరం బోధించి ఆ స్థితిలోనే నిలచిన రమణ మహర్షి స్పృశించిన 'నేను',

'నేను నేనైన నేను' అంటూ అవస్థాత్రయాతీత స్థితిని ఆవిష్కరించిన అమ్మ ప్రతిపాదించిన 'నేను'....

'నేను' మేనును భరిస్తున్నదా?

'మేను' నేనును ధరిస్తున్నదా? ఈ రెంటిలో పునర్జన్మ లేనిది దేని పరం?

ఇచ్ఛా, క్రియా జ్ఞాన సమ్మేళనమై, విజ్ఞాన పరిపూర్ణమై, మనోబుద్ధి చిత్యహంకారవలకు అతీతమైన అహంస్ఫురణే, 'నేను'! సర్వేంద్రియాలకు, మనసుకు అధిష్ఠానమైన, మూలమైన ప్రేరకమైన 'నేను', ఆత్మకు పర్యాయపదం.

ఒకటి నడిచేది, రెండోది నడిపించేది. నడిచేదానికి, ఆగటం తప్పదు, నడిపించే దానికి నడక లేదు కనుక దానికి ఆగటం అంటూ లేదు.

కర్మలు, వాటికి సంబంధించిన అనుభవాలు ఎప్పటికప్పుడే! ఎక్కడికక్కడే!

అనుభవించటానికే జన్మ అనుకుంటున్నాం కనుక,

గతించినవన్నీ గుర్తులే కనుక,

ఆనందం, భయం, బాధ వంటి వాటినన్నిటినీ సమన్వయం చేసుకోవటం కనుక, గతం మిగిలి ఉన్నట్లే ఉంటుంది.

శరీరపరంగా కొన్ని లక్షల కణాలు పుడుతూ, గిడుతూ ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. శ్వాసకు శ్వాసకు మధ్య ఏమాత్రం వ్యవధి ఏర్పడినా మరణం తథ్యం.

ఆలోచనకు ఆలోచనకు మధ్యన ఉండే విరామం మరణమే. ఆ స్థితిలో దాని పేరు మరపు. జీవితంలో ఏర్పడే దశలు, ఆయా దశలలో ఏర్పడే పరిచయాలు, వ్యక్తులు అన్నీ మరుగున పడేవే. స్మృతిగా మిగిలేవే. ఇంతటి అవ్యవస్థ మధ్యా, సంస్థితమైన 'నేను' ఏ మార్పుకూ లోను కాకుండా, స్థిమితంగా ఉంటున్నది. ఈ వితర్కానికి తెరదించుతూ, నిరాకార పర బ్రహ్మతత్త్వమే సాకార, సగుణ, స్వభావంగా, మూర్తిమత్వంగా వచ్చి, ఆత్మ ఒక దేహాన్ని ధరించినపుడు ఎట్లా జీవిస్తుందో బోధిస్తుంది. దాన్ని అవతారమని, భగవదంశ అని భావిస్తాం.

“సంభవామి యుగే యుగే” అన్నా, “ఆత్మానం సృజామ్యహం” అన్నా, అది పరమాత్మ భాషే.

స్మృతులెన్ని ఉన్నా, వర్తమానంలో జీవించటమే సత్యం.

రామకృష్ణాది అవతారాలన్నీ 'పురా'స్థితి నుంచి 'పునా' స్థితిలోకి ప్రవేశించినవే. పురా, అంటే పాత, పునా, అంటే కొత్త!

ఉన్నదదే! స్థితులు వేరు.

జన్మలన్నీ ప్రవాహాలు. ఉన్నవన్నీ మలుపులు.

సాగర సంగమం వరకు జన్మంతా ఆగని చైతన్యధార.


నేను నేనైన నేనుకు పునర్జన్మ ఉన్నదా?




వి.యస్.ఆర్. మూర్తి
ఆధ్యాత్మిక శాస్త్రవేత్త

ధాన్యకటక - అమరావతి శాసనాలు
(క్రీ.పూ. 1 - క్రీ.శ. 1, 2 శతాబ్దాలు)

గుంటూరుకు 35 కి.మీ. దూరంలో కృష్ణానది కుడిగట్టునున్న అమరావతి వద్ద క్రీ.పూ. 4 - క్రీ.శ 14 వరకూ విలసిల్లిన ధాన్యకటకమనే బౌద్ధక్షేత్రం ఉంది. మౌర్య, శాతవాహన, ఇక్ష్వాకుల కాలంలో నిర్మాణం, మరమ్మతులకు నోచుకున్న ఇక్కడి మహాచైత్యం వద్ద 1797 నుంచి 1990 వరకూ జరిపిన తవ్వకాల్లో అనేక నాణేలు, బౌద్ధ శిలాఫలకాలు, కట్టడ భాగాలు, శిల్పాలు, శిలాఫలకాలపైన శాసనాలు లభించాయి. అశోకుని శాసనం కూడా ఒకటి దొరికింది. శాతవాహన, ఇక్ష్వాకుల కాలపు అనేక బ్రాహ్మీ శాసనాలు, ఈ మహాచైత్య నిర్మాణంలో పాలుపంచుకున్న ఉపాసక, ఉపాసికలు, భిక్షు, భిక్షుణీలతో పాటు అనేక వృత్తి పనివారు, సామాన్య ప్రజల వివరాలనందిస్తున్నాయి. ఎక్కువ శాసనాలు క్రీ.పూ. 1 - క్రీ.శ. 3 శతాబ్దాలకు చెందుతాయి. (ఆర్పీ చందా, 'సం అన్‌పబ్లిష్డ్ అమరావతీ ఇన్‌స్క్రిప్షన్స్, ఎపిగ్రాఫియా ఇండికా, వా. 15, పే. 258 - 278)




ధఞకటకస నిగమస
ధాన్యకటక నిగమం (నగరం) యొక్క...(దానం)



రాజ లెఖకస బల
స జాయాయా సొమ దతా
రాజాలేఖకుడైన బలుని భార్య సొమ (ఇచ్చిన దానం)



ధ న గి రి వ త వ నా గ బు ది వ ని య పు తొ న క సి రి బ హి ని య పు సె...
ధనగిరి వాస్తవ్యుడైన నాగబుద్ధి అనే వర్తకుని కొడుకు నకసిరి....



సిధం జడింకి యన సిధ తగహప
తిస భరియాయఖదయ సధుత కాయ
సపుతి కాయ సమతుకాయ సభ తుకాస
సఘర సునాయ సహజనతి హి
భగవతో మహా చేతియ పదమలె
అపన ధర్మధాన దివఖంభో పతిధావితో

జపికియ వంశానికి చెందిన గహపతి సిధతు (సిద్ధార్థ) ని భార్య ఖద, తన కూతుళ్లతోనూ, కొడుకుల తోనూ, సోదరులతోనూ రక్తసంబంధీకులతోనూ (ధాన్యకటకంలోని) భగవంతుడైన బుద్ధుని మహా (స్థూప) చైత్యానికి గౌరవాభివందనాలతో పాదమూలము వద్ద ధమ్మదానంగా దీపస్థంభాన్ని ప్రతిష్ఠించింది.



డా ఈమని శివనాగిరెడ్డి - స్థపతి

వెండితెర వెనుక

ము...ము...ముద్దంటే చేదా?

అసలే అది తొలిచిత్రం...అందులో తనకిచ్చింది వ్యాంప్ పాత్ర...పైగా ఓ ముద్దు దృశ్యంలో నటించమంటున్నారు...అటువంటి పరిస్థితిలో ఓ నూతన నటి మనోభావాలు ఎలా ఉంటాయి? ప్రసిద్ధనటి అంజలీదేవికి 1947లో తన తొలి చిత్రం 'గొల్లభామ'లో నటిస్తున్నప్పుడు -అటువంటి పరిస్థితే ఎదురైంది! ఆ చిత్రంలో నాయికానాయకులు కృష్ణవేణి, కె.రఘురామయ్య. అంజలీదేవి – మోహినిగా వ్యాంప్ పాత్రలో ఆ చిత్రం ద్వారానే ప్రేక్షకులకు పరిచయమయ్యారు. ఆ చిత్రంలో మోహిని తన మాయాజాలంతో కథానాయిక రూపంలోకి వచ్చి, నాయకుణ్ణి కౌగలించుకుని, మళ్లీ తన అసలు రూపంలోకి మారి, అతన్ని ముద్దు పెట్టుకునే సన్నివేశం ఉంది. నిజంగా ముద్దు పెట్టుకోకుండా, ప్రేక్షకులకు అటువంటి 'భ్రమ' కలిగేలా ఆ సన్నివేశం తీయాలని దర్శకులు సి.పుల్లయ్యగారి ఉద్దేశం. మొదటి చిత్రం..



అందులోనూ ముద్దు సన్నివేశం అనగానే కంగారుపడిపోతుందని, అంజలీదేవిని పిలిచి, దగ్గర కూర్చోబెట్టుకుని, ఆ సన్నివేశాన్ని స్పష్టంగా వివరించి, హీరో ఆ దృశ్యంలో ఎలా నటిస్తాడో, అందుకు 'రియాక్షన్'ఎలా ఇవ్వాలో చెప్పి, ఆమెలోని కలవరాన్ని పోగొట్టారు పుల్లయ్యగారు. 'గొల్లభామ'లో ఆ ముద్దు సన్నివేశం ఎంత సహజంగా వచ్చిందంటే అప్పటి ప్రేక్షకులు 'థ్రిల్' అయిపోయి 'తెలుగు సినిమాలో కిస్సింగ్ సీన్' అని ఆశ్చర్యంగా చెప్పుకోవడం జరిగింది!

సినిమా ప్రేమల ముగింపు?

సినిమా ప్రేమ కథల ముగింపు ఎలా ఉండాలి? సుఖాంతాలైతే 'హిట్' అవుతాయా లేక విషాదాంతాలు మేలా? ఇలాంటి సందిగ్ధావస్థ చాలా మంది దర్శకులకు ఎదురవుతుంది. కొన్ని సినిమాలను ట్రాజెడీలుగా తీస్తే, ప్రేక్షకులకు నచ్చకపోవడం, అప్పుడు సుఖాంతం సీన్లు సినిమాకు కలిపి, ఇప్పుడు కామెడీగా మార్చాం..రండహో అని ప్రకటనలు వేయడం కూడా జరిగేది. ఉదాహరణకు అప్పుడెప్పుడో వచ్చిన 'బొమ్మలపెళ్లి' చిత్రం (నాయికానాయకులు జమున, శివాజీగణేశన్). అక్కినేని, వాణిశ్రీ నటించిన 'ప్రేమనగర్' చిత్రానికి ముగింపు విషయంలో అలాంటి సందేహమే వచ్చి – ఎందుకైనా మంచిదని రెండు రకాల వెర్షన్‌ను తీశారు. గమ్మత్తేమిటంటే సుఖాంతం వెర్షన్‌ను ఆంధ్రప్రదేశ్‌లోను, విషాదాంతాన్ని కేరళలోను విడుదల చేస్తే, ఆ చిత్రం రెండు ప్రాంతాల్లోనూ ఘనవిజయం సాధించి – ప్రేక్షక అభిరుచులకు ఓ



'మిస్టరీ'గా నిలిచింది. డా. రమానాథ్ నిర్మాతగా, డా. ఎ. రఘురామిరెడ్డి దర్శకత్వంలో రూపొందిన 'హృదయాంజలి' చిత్రంలో గిరిజ (మణిరత్నం 'గీతాంజలి' ఫేమ్) కథానాయిక. నాలుగు నంది అవార్డులు గెల్చుకున్న ఈ ప్రేమ కథా చిత్రం ముగింపును కూడా రెండు రకాలుగా తీసి, విషాదాంత చిత్రంగానే విడుదల చేస్తే, అది విజయవంతమైంది.

కమలహాసన్ నటించిన కె.బాలచందర్ హిందీ చిత్రం 'ఏక్ దూజేకేలియే' ('మరోచరిత్ర' హిందీ వెర్షన్)ను ఆ చిత్ర నిర్మాత ఎల్.వి ప్రసాద్ గారు – ప్రసిద్ధ దర్శక నిర్మాత రాజ్ కపూర్‌కు చూపిస్తే, ఆయన ఆ విషాదాంతం వద్దనీ తన 'బాబీ' లాగే సుఖాంతం చేయమనీ సూచించారు. ఐతే దర్శక నిర్మాతలు అలా మార్చలేదు. 'మరోచరిత్ర' లాగే ఆ ట్రాజెడీ చిత్రం హిందీలో కూడా ఘన విజయం సాధించింది!

సినిమా అంటే కేవలం వినోదమేనా?

'భారతీయుడు', 'రోబో' లాంటి కథావస్తువుల్ని ఎంత భారీగా తీసినా, అంతర్లీనంగా ఏదో ఒక సామాజిక సమస్య తన చిత్రాల్లో ప్రతిబింబించేలా శ్రద్ధ తీసుకుంటారు ప్రముఖ దర్శకుడు శంకర్. అలాంటి ధోరణి ఎలా అలవడిందని అడిగితే, ఆయన తన గతాన్ని గుర్తుచేసుకున్నారు.

"నేను డిఎమ్ఇ ఫస్ట్ క్లాస్ లో పాసయ్యాను. కానీ బిఇ చదవాలనుకుంటే, నాకు సీటు దొరకలేదు. చదువుల తల్లిని డబ్బులిచ్చి కొనుక్కునే దుస్థితికి లోనవ్వడం నాకు




ఇష్టం లేదు. అందుకనే నా ధ్యేయాన్ని మార్చుకుని, చిత్ర రంగంలోకి సహాయ దర్శకుడిగా అడుగుపెట్టాను. అప్పట్లోనే ఒక వార్త పేపర్లో వచ్చింది. ఓ విద్యార్థికి మామూలు కోటాలో సీటు దొరక్కపోతే, వికలాంగుల కోటాలో దొరకవచ్చని తెలిసింది. దాంతో ఆ విద్యార్థి తన చేతి వేలిని తానే నరుక్కుని, వికలాంగుడిగా దరఖాస్తు చేసుకున్నాడు! ఆ వార్త నన్నెంతగానో కలిచివేసింది. అలాంటి చేదు అనుభవాల నేపథ్యంలోంచే (అర్జున్ నటించిన) 'జెంటిల్‌మేన్' కథను తయారు చేసుకున్నాను. ఆ చిత్రానికి విశేష ప్రజాదరణ లభించింది. వినోదాన్ని సినిమా ద్వారా ఎలాగూ అందించాలి. ఆ వినోదంతో పాటు సాంఘిక సమస్యలను కూడా జనం ఆలోచించాలనేది నా ఉద్దేశం," అన్నారు శంకర్.

ఆనందో బ్రహ్మ

బ్రహ్మానందం – సినిమాలో ఉన్నా సందడే. సెట్లో ఉన్నా సందడే. కాలేజ్‌లో లెక్చరర్‌గా పనిచేస్తున్నప్పుడు కూడా – పాఠాల మధ్యలో నవ్వుల వర్షం కురిపించేవారని పాత విద్యార్థులు అంటూ ఉంటారు. మరి అందరినీ నవ్వించే బ్రహ్మానందం గారిని బాగా నవ్వించిన జోకేమిటి? అంటే, తన ఫేవరేట్ జోక్స్ లో ఒకటి చెప్పి – మళ్లీ నవ్వించారు.

"పబ్లిక్ పరీక్షలు జరుగుతున్నాయి. విద్యార్థులు అందరూ బుర్రలు బాదుకుంటూ ప్రశ్నలకు జవాబులు రాస్తున్నారు. ఇన్విజిలేటర్ బసవేశ్వర్ విద్యార్థులను



తీవ్రంగా గమనిస్తూ, అటూ ఇటూ గస్తీ తిరుగుతున్నాడు. ఇంతలో ఓ విద్యార్థి తన దగ్గరకు వచ్చిన బసవేశ్వర్‌ను ఇంకా దగ్గరకు రమ్మని "ఈ ప్రశ్నకు సమాధానం ఏమిటో కొంచెం 'క్లూ' ఇవ్వండి సారు" అని అడిగాడు. ఆ ప్రశ్న ఏమిటో చూసి, ఆ స్టూడెంట్ వంక తీక్షణంగా తన దృష్టిని సారించాడు బసవేశ్వర్.

"చూడు బాబూ...సమాధానం తెలిస్తే రాయ్, తెలియకపోతే వదిలెయ్...అంతేకాని నువ్విలా అడక్కుడదు. నేను చెప్పకూడదు. తెలిసిందా? "అని గదమాయించే సరికి ఆ స్టూడెంట్ తోకతొక్కిన తాచులా లేచాడు. జేబులో దాచుకున్న చాకు తీసి, పొట్టలో ఒక్కపోటు పొడిచాడు. బసవేశ్వర్ 'అమ్మో' అంటూ నేలకూలాడు. కట్ చేస్తే ఆస్పత్రి సీను. భార్య బసవేశ్వర్‌కు మందులిస్తూ, ఒంటిమీద ఆ కట్లు, అతని స్థితి చూసి, బరువుగా నిట్టూర్చింది. "ఏమండీ...ఆ కుర్ర వెధవ అడిగన ప్రశ్నకు జవాబు చెప్పేస్తే, ఈ బాధంతా తప్పేది కదండీ" అంది. బసవేశ్వర్ ఆమె వంక నిస్సహాయంగా చూశాడు. "నాకు తెలిసి ఏడిస్తే కదే చెప్పడానికి "అని బావురుమన్నాడు.



బి.కె. ఈశ్వర్



మాతృభాష మరుగున పడ్డా, సందర్భం వచ్చినప్పుడు ఒక్కసారి పురివిప్పుతుంది. ఇటీవల గోదావరికి వచ్చిన పుష్కరాలు ఇందుకు ఒక ఉదాహరణ. అసలు "పుష్కరం" అన్నమాటే అతి పాతదైన కొత్తమాట. అది ఎందుకు వస్తుందో, ఎన్నేళ్లకోసారి సంభవిస్తుందో మళ్ళీ తెలుసుకున్నాం. నిత్యకృత్యంలో ఏ మాత్రం వాడుకలో ఉండని చాలా మాటల్ని పుష్కర తరుణంలో తెగవిన్నాం, తెగ అన్నాం...

పుణ్యవిధులు, తర్పణలు, తర్పణాలు, పిండ ప్రదానం లాంటి శ్రోత్రీయ భావజాలం అందరి నోళ్లలోనూ భక్తిగా నానింది. వూరికే అనడం కాదు, అర్థాలు తెలుసుకున్నారు. స్నాన ఘట్టాలు, సచేల స్నానం, షోడశదానాలు వంటి అనేక మాటలు జనసామాన్యం, పుష్కర తీర్థంలో వాడడం విన్నాం. తంతు జరిపే వేళ పురోహితులు అనేక చిన్న చిన్నమాటలు పలికిస్తారు. చాలా మంది వాటి అర్థాలు తెలుసుకున్నారు. గోదావరిని "దక్షిణగంగ"గా వ్యవహరిస్తారని చాలా మందికి తెలిసింది. తీర్థంతో పాటు తీర ఆలయాలను లక్షలాది మంది దర్శించుకున్నారు. అక్కడ వినిపించే ఆగమ పరిభాష, వైదిక సంప్రదాయ భాష సందర్శకులకు మనశ్శాంతిని కలిగించాయి. గుడి గంటలు, మంత్రోచ్చారణలు, అర్చకస్వాముల ఆశీర్వచనాలు నూతనోత్సాహాన్నిచ్చాయని భక్తులు చెప్పారు. ఏడాదిలో కృష్ణపుష్కరాలు వస్తాయి. మళ్లీ సంప్రదాయ పరిభాష పుష్కర స్నాన ఘట్టాలలో గలగలలాడుతుంది. మన తెలుగు మరుగున పడలేదన్న విశ్వాసం కొండంత ధైర్యాన్నిస్తుంది.

– సంపాదకుడు

అపభ్రంశాలు

- భారతరత్న అబ్దుల్ కలాం భౌతికకాయానికి ప్రముఖుల నివాళి– కలాంకే గాని పార్థివ దేహానికి కాదు. భౌతికకాయం వద్ద పూలగుచ్ఛం ఉంచి నివాళులర్పించారనడం పర్వాలేదు.
- వట్టిపోయిన వానచినుకులు –అని ఒక వార్తా శీర్షిక వచ్చింది. ప్రాస కుదిరింది కాని అన్వయం కుదరలేదు. వట్టిపోవడం అంటే ఎండి పోవడం. అది కూడా ఆవు, గేదె పాలివ్వడం మానేసినపుడు ఆవు వట్టి పోయిందంటారు. ఇది సరైన ప్రయోగం. అయితే బావులు, బోర్లు కూడ ఎండిపోవడం సహజం. కనుక ఆ సందర్భంలో కూడా వట్టిపోయిన బావులు అనడం పర్వాలేదు. "ఖజాన వట్టిపోయింది" – ఇది కూడా అర్థవంతంగానే స్ఫురిస్తుంది. ఒక స్కూల్లో పిల్లల సంఖ్య తక్కువగా ఉందని చెప్పడానికి "వట్టిపోయిన బడి" అన్నారు. కొన్ని విశేషణాలను తగిన చోట్ల వాడితేనే సరి.
- భాష విషయంలో అశ్రద్ధ పనికిరాదు, అట్లాగని అతిశ్రద్ధా పనికిరాదు. చాలా సంస్కృత పదాలను సరళంగా వాడినప్పుడు చివర దీర్ఘం ఉండాలి. సామాన్య పాఠకులకు వ్యాకరణ విశేషాలు తెలియక అచ్చుతప్పు అనుకునే ప్రమాదం ఉంది. ఉదాహరణకి కమండలం అనే మాట తప్పు. దాని సాధురూపం కమండలువు. ఇలా రాస్తే అచ్చుతప్పు అనుకోరూ?
- మరీ చాదస్తం అనుకోకపోతే, కూరగాయలకు, కాయగూరలకు చాలా తేడా ఉంది. మొదటి దాంట్లో కూరకుపనికొచ్చే కూరలన్నీ చేరతాయి. ఆకుకూరలు, దుంపలు వగైరా కాయగూరంటే మరి కాయగూరలే ! ఈ మాట చెబితే, అయితే ములక్కాడలని ఎక్కడ చేర్చాలన్నాడో మిత్రుడు. ఆమాట కొస్తే ఉల్లిపాయల్ని కూడా.

చిన్ననాటి మాటలు



అవి చచ్చినా మరుపుకురావు. అ...ఆ లు దిద్దుకునే రోజుల్లో ఆడుకున్న ఆటల్ని, పాడుకున్న పాటల్ని, అనుకున్న మాటల్ని, ఆ మిత్రుల్ని మర్చిపోలేం. పిల్లలు చిరుతిండి జేబులో వేసుకురావడం పరిపాటి. దాని పేరు "తాయిలం" చేగోడీలు, జంతికలు, నువ్వుజీడి, పప్పుండ, అటుకులు బెల్లం వాసిగల తాయిలాల్లో కొన్ని. తరగతిలో వీటిపై బోలెడు పరటా వ్యాపారం నడిచేది. బలపాలకు, పెన్సిళ్లకు, తాయిలాలకు మారకాలు జరిగేవి. ఈ సందర్భంలోదే "కాకి ఎంగిలి". ఇది చక్కని తెలుగుపిల్లల పరిభాష. ఏదైనా తాయిలంలో భాగం పెట్టాల్సివచ్చినప్పుడు, దాన్ని తుంచడానికి సాధ్యం కానప్పుడు కాకెంగిలి రంగంలోకి వస్తుంది. తాయిలం మీద చొక్కాకొసని కప్పి, నోటితో కొరికి ముక్కుకొట్టే పద్ధతిని కాకెంగిలి అంటారు. పచ్చిగా ఏ ఆచ్చాదనా లేకుండా నోటితో కొరకడం ఎంగిలి. ఇదేమో కాకి ఎంగిలి అవుతుంది. దీనికి సరిసమానమైన మాట ప్రపంచ భాషల్లో మరెక్కడైనా ఉంటుందా అనేది సందేహమే. "తూచ్" యిప్పటికీ వాడుకలో ఉంది. రకరకాల ఒట్లు ఉ ండేవి. నిజంగానే – అబద్ధాన్ని ఒట్టేసి చెప్పడానికి భయం వేసేది. ఒట్టు తీసి గట్టున పెట్టడం కూడా ఉండేది. అప్పుడింకా భయంలేదు. కొంత మందికి కోపం తెప్పించే మాటలు కొన్ని ఉండేవి. శీనయ్‌కి అప్పచ్చి అంటే కోపం, రామతులసికి గోలికాయంటే కోపం. వాటివెనుక ఏవో కథలుంటాయి. ఆ మాటనగానే గేలిచేసినట్టుగా పిచ్చి కోపం వచ్చేది. ఇక మారుపేర్లయితే సరేసరి. సాహసగాళ్ల మధ్య ఎన్నెన్ని అందమైన తెలుగుమాటలు దొర్లేవో!

సామెతల భాష

"గుర్రం చవలం, జీను ముచ్చవలం" అని సామెత. ఆనాటి వాడుక భాష తెలియని వారికి ఏమి అర్థం కాదు. చవలం అంటే నాలుగోవంతు నాణెం పావలా. గుర్రం వెల పావలా, దాని జీను ముప్పావలా అని, అంటే సమతూకం లేదని అర్థం. "ఇరదాళ్ల లేని గంగమ్మ జాతరవలె" – ఇరతాళ్లంటే వీరతాళ్లు. జాతరలో పోతరాజులు లావుపాటి కొరడాలను ఝూళిపిస్తూ, చుట్టూ తిప్పి కొట్టుకుంటూ వీరంగం చేస్తారు. ఇరతాళ్లు లేకపోతే జాతర రక్తి కట్టదని భావం. "చల్లయు పాలును గలిసిన చల్లకు తోడంటినట్లు" – తోడంటం అంటే తోడుపెట్టడం అని. చేమిరి వేయడమని కూడా అంటారు. కుండెడు

పాలు అయినా ఒక్క చుక్క చల్లతో తోడుకుని పెరుగు అవుతుంది. కుండెడు పాలను ఒక్క ఉప్పురాయి విరిచేస్తుంది. ప్రతినిత్యం వీటి నించి ఒక సందేశం మనకు అందుతోంది. "జీలుగ బెండ్లు చెవుల



పెంచుతాయిగాని కుండలాలిస్తాయా?" – నేపథ్యం తెలిస్తే గాని యీ సామెత బోధపడదు. చెవులకు రంధ్రాలు వేసుకున్నాక వాటిలో జీలుగబెండ్లను పెట్టుకుంటారు. లేకుంటే అక్కడ తిరిగి చర్మం పూడుతుంది. చెవుల పెంచడమంటే చెవి కన్నాలను కాపడటమని భావం. కుండలాలంటే చెవులకు ధరించే చిన్న ఆభరణాలు. చాలా పెళుసుగా ఉండే జీలుగకొమ్మలోపల మెత్తని పదార్థమే బెండు. గోగు చువ్వలోపల కూడా బెండు వుంటుంది.

కొన్ని సామెతలు మాటలు మూలపడ్డా సజీవంగానే చెలామణీలో ఉన్నాయి. కొన్నింటి వాడుక తగ్గిపోయింది.

స్వీయ చరిత్రలు

గొప్పవారి స్వీయ చరిత్రలు తప్పక చదవాలి. ఆ నాటి ఆర్థిక రాజకీయ సాంఘిక విశేషాలు చెబుతాయి. వారి సమకాలికులైన మహనీయుల ముచ్చట్లు వినచ్చు. భాషలో వచ్చిన మార్పులు అవగతం అవుతుంది. డా. వుప్పల లక్ష్మణరావు జీవిత కథ "బతుకు పుస్తకం" లో ఎన్నో చిత్రమైన పలుకుబడులు. ఆయన నాటి బరంపురం వాసి. ప్రపంచాన్ని చూసినవారు. ఆయన జ్ఞాపకాన్ని గ్యాపకంగా, జ్ఞానాన్ని గ్యానంగా రాయడం గమనిస్తాం. క్రుష్ణుడు, క్రుష్ణారావు, స్రుతి లాంటి పదాలు కోకొల్లలు. అనుజ్ఞయివ్వండికి అనుగ్యయివ్వండని కనిపిస్తుంది. బతుకు పుస్తకంలో ఒక చోట – "అప్పట్లో (అంటే సుమారు 110 సంవత్సరాల క్రితం) బరంపురం రైల్వేస్టేషను యిప్పటి చత్రపురం స్టేషనులా ఉండేది. సరిగ్గా సాయంకాలం నాలుగ్గంటలకి మద్రాసు అబ్జర్వేటరీ నుంచి టైమ్ సిగ్నల్ అన్ని స్టేషన్లకీ అన్ని టెలిగ్రాఫు ఆఫీసులకీ వచ్చేది. ఆ సిగ్నల్ ప్రకారం గడియారాలు దిద్దుకొనేవారు. దాన్ని ఇండియన్ స్టాండర్డ్ టైమ్ అనేవారు. పెద్దపట్టణాల్లో లోకల్ టైమ్ కూడా ఉండేది. ఆ రోజుల్లో మా కుటుంబంలో పరీక్ష పాసైన వారికి మా తాతయ్య వొక రూపాయి బహుమతి యిచ్చేవారు. ప్రతినెలా మొదటి తారీఖున ప్రతి వారికీ వొక దమ్మిడీ అంటే అణాలో పన్నెండో వంతు యిచ్చేవారు. ఒక దమ్మిడీకి రెండు మిఠాయి కిళ్లీలు, గుడియావాడు ఒక చక్రకడ్డీ, మూడు పాకం గోళీలు యిచ్చేవాడు. బియ్యం – అంటే బయాహుండాలు, రత్నచూడిలు రూపాయికి పదిశేర్లు యివ్వడం నాకు బాగా గ్యాపకం. అప్పట్లో బరంపురానికి బర్మానుంచి బియ్యం పుష్కలంగా దిగుమతి అయ్యేవి."

ఇలా సాగే బతుకుపుస్తకంలో ఎన్నో ఆసక్తికర అంశాలు. బయాహుండా, రత్నచూడి సన్నబియ్యంలో రకాలు. చక్రకడ్డీ అంటే చక్కెర కడ్డీ. పాకం గోళీలంటే పంచదారతో చేసే ఉసిరికాయలు. పదిశేర్లు అంటే దాదాపు పన్నెండు కిలోలు. ఇటు ప్రాంతంలో చిన్నపిల్లలు మిఠాయి కిళ్లీలు తినే అలవాటు లేదు. గంజాం ప్రాంతం కిళ్లీ చిన్నప్పటి నుంచి నమిలే అలవాటు ఉందని తెలుస్తుంది. ఒక్క పది వాక్యాలలోనే ఇంతటి కొత్త సమాచారం ఉంటే, యిక పుస్తకమంతా చదివితే...!

వినాయకవ్రత కథ!

ఎన్నో ఏళ్లుగా శ్రద్ధగా చదువుతాం కాబట్టి వినాయక వ్రతకథ నోటికి వచ్చేస్తుంది. పౌరాణిక శైలిలో చాలా సరళంగా కథ నడుస్తుంది. అయితే, యి మధ్య ఒక పాత్రికేయుడు ఆ శైలిని నవీనీకరించి తన పద్ధతిలో తిరగరాశాడు. చదువరులకు చమత్కారంగా ధ్వనిస్తుంది.

"....మణిని దొంగిలించినట్టు శ్రీకృష్ణునిపై అభియోగం మోపబడింది. అయితే, అందుకు శ్రీకృష్ణుడు అతిగా స్పందించలేదు. చవితి చంద్రుని చూసినదానికి ప్రతిస్పందనగా గుర్తించాడు. అడవిలో తగిన ఆచూకీ దొరికింది..." ఇలా సాగింది. నిజానికి "నీలాపనింద" అనే చక్కని మాట ఆ కథలోంచి వచ్చి ప్రాచుర్యం పొందింది. చాలా ప్రాచీన గాథగా చెప్పబడుతున్న కథలో – చిరుగంటలు, సన్నాయి వాద్యాలలో నందీశ్వరుడు గంగిరెద్దుగా, విష్ణుమూర్తి దాని నాడించే దాసుగా కనిపిస్తారు. మన జానపద కళారీతికి ఎంతో గౌరవాన్ని యిస్తోంది. త్వరలో రానున్న వినాయక చవితి రోజు యింకా ఎన్నో సత్యాలను గ్రహించి తరిద్దాం. విఘ్నదేవుడు అందరినీ కాచి రక్షించాలని కోరుకుందాం.



ఏకవింశతి అంటే 21 రకాల పత్రితో గణపతిని అర్చిస్తాం. ఆ పత్రిలోని ఆకులన్నింటికీ ఔషధ గుణాలున్నాయి. ఆకుల పేర్లను వైనంగా పిల్లలకు చెప్పండి. వాటి గుణాలు చెప్పండి. వీలైతే వారి బొటానికల్ పేర్లు తెలియచెప్పండి. మన సంప్రదాయంలో పూజల వెనుక ఉత్సవాల వెనుక ఎంతటి శాస్త్రీయ భావాలు దాగివున్నాయో నవతరానికి యెరుకపరచండి. అదే నిజమైన పూజ అవుతుంది.

పొడుపు – విడుపు

పొడుపు :

అమ్మకి సోదరుడు కాదు, పిల్లనిచ్చింది లేదు రక్త సంబంధం లేదు, కాని లోకానికి మామగారు.



విడుపు : చందమామ


– శ్రీరమణ

మనవి

అనేక చిరు ప్రయత్నాలతో మన భాషను సంస్మరించుకునే శీర్షిక యిది. ఎన్నో యాసలు, రీతులు, తీరులు ఉన్న అపురూపమైంది. మన తెలుగు భాష. దయచేసి ఈ శీర్షికలో పాల్గొని సుసంపన్నం చేయండి.

– సంపాదకులు
ఆంధ్రప్రదేశ్ మాస పత్రిక

అమరావతి నవ్యాంధ్ర ఆవశ్యకత



అదృష్టమేమిటంటే కొంచెం ఆలస్యమైనా తెలుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్– తెలంగాణా, నవ్యాంధ్రప్రదేశ్‌లుగా విడిపోవడం, ఎన్నికలు జరగడం, నవ్యాంధ్ర సారథ్యాన్ని నారా చంద్రబాబు నాయుడు స్వీకరించడం, మంచి అనుభవం, కార్యదీక్ష కలిగిన క్యాబినేట్‌ను ఆయన ఎంచుకోవడం. వీటన్నింటినీ మించి, చరిత్ర, వాస్తు, ప్రాచీన మంచి నాగరికత, సంస్కృతులతో మిళితమైన తుళ్ళూరు మండలము, అమరావతి మండలము, మంగళగిరి మండలము, విజయవాడ – గుంటూరు పట్టణాలను కలిపి అమరావతి రాజధాని నగరంగా తీర్చిదిద్దాలని సంకల్పించడం.

అమరావతి చారిత్రక ప్రాశస్త్యం

చారిత్రకంగా ఆంధ్ర దేశానికి అమరావతికి చాలా అనుబంధం ఉంది. ప్రసిద్ధ చరిత్రకారులైన రోమిలా థాఫర్ రాసిన "యానిసెంట్ ఇండియా", "ఎ హిస్టరీ ఆఫ్ ఇండియా"; ఇంకా చరిత్రకారులైన సుశోభన్ సర్కార్, డి.డి కోశాంబి, బిపిన్‌చంద్ర వ్రాసిన గ్రంథాలు, విశాలాంధ్ర మాజీ సంపాదకులు ఏటుకూరి బలరామమూర్తి రచించిన "ఆంధ్రుల సంక్షిప్త చరిత్ర", కంభంపాటి సత్యనారాయణ రాసిన "ఆంధ్రుల సంస్కృతి చరిత్ర" అనే గ్రంథాలను విశ్లేషించినట్లయితే అమరావతికి – ఆంధ్రులకున్న అనుబంధం తేటతెల్లమవుతుంది.

విశ్వామిత్ర మహర్షి తన కుమారులలో 50 మందిని, వారి సంతతిని ఆర్య ప్రాంతాల సరిహద్దులలో నివసించవలసిందని శపించాడని ఐతరేయ బ్రాహ్మణం తెలుపుతోంది. అనార్య ప్రాంతాల సమీపంలో నివాసాలు ఏర్పరచుకున్న వారిలో ఆంధ్రులు, పుంధ్రులు, శబరులు, పులీందులు, ముతుబులు ఉన్నారు. వీరంతా విశ్వామిత్ర సంతతివారే; వీరంతా దస్యులే.

పాండవ సోదరులలో చిన్నవాడైన సహదేవుడు పాండ్యులను, ద్రావిడులను, ఉదరులను, ఆంధ్రులను జయించినట్లు మహాభారతం చెబుతుంది. వింధ్య పర్వతాలను దాటిన కొందరు ఆర్యులు స్థానిక వనితలను పెళ్లాడి, దక్షిణాపథంలో స్థిరపడినట్లు కనిపిస్తుంది. అలా ఆర్య – అనార్య జాతుల సంఘర్షణ, సంపర్కము కొంగ్రొత్త జాతుల అవతరణ జరిగిందని ఇది క్రీస్తుపూర్వం సుమారు వెయ్యేళ్ల నాటి విషయమని తెలుగు అకాడమి వారి ఆంధ్రదేశ చరిత్ర సంస్కృతి చెబుతుంది.

బౌద్ధ జాతక కథలు, ఆంధ్ర పథాన్ని అంధకపురమని పేర్కొన్నాయి. విదేశీ రచయితలలో మెగస్తనీస్ (క్రీ.పూ. 300) పెద్దప్లినీ (క్రీ.పూ. 77) ఆంధ్రులు చాలా బలవంతులని, కందకాలు, కోటగోడలు, బురుజులతో రక్షితమైన 30 పట్టణాలు ఉన్నాయని, రాజ్యానికి లక్ష కాల్బలము, 2000 అశ్విక దళము, సహస్ర గజదళము ఉందని వ్రాశారు. దక్షిణాపథంలో కొంకణానికి – కుంతలానికి తూర్పుగా ఉన్నదే ఆంధ్రదేశమని బ్రహ్మాండ పురాణం చెబుతున్నది. వాత్సాయణుడు ఆంధ్రులను ఒక విశిష్ఠ జాతిగా పేర్కొన్నాడు. దక్షిణాపథంలో విదర్భ, విదేహి మరియు బేధి దేశాలకు దక్షిణాన ఆంధ్రదేశమున్నదని ఖగోళ శాస్త్రజ్ఞుడు వరాహమిహురుడు తెలిపాడు.

మొదటి బౌద్ధ యుగమున గ్రీకు వ్యాపారులకు, భౌగోళికులకు కృష్ణానది ముఖద్వార ప్రదేశాన్ని మైసోలియా (మచిలీపట్నం) అని పిలిచినారు. ఏడో శతాబ్ధంలో ఆంధ్రదేశాన్ని దర్శించిన చైనా యాత్రికుడు హ్యుయాన్‌త్సాంగ్ "ఆన్ –తొ–లో" (ఆంధ్ర) కు (తె–న–క–చె–క) ధాన్యకటకమును మహా ఆంధ్రగా చెప్పి ఉన్నాడు. అదేవిధంగా పింగ్–కి–లో (వేంగిపురం) రాజధాని అని పేర్కొన్నారు. Periplus of the Erythoraean అనే గ్రంథాన్ని బట్టి మన ధాన్యకటకపు వ్యాపారం సముద్ర రేవు పట్టణాలైన కోరంగి (తూ.గో. జిల్లా), ఘంటసాల (కృష్ణాజిల్లా), మైసోలియా (మచిలీపట్నం), మోటుపల్లి (కృష్ణాజిల్లా) ప్రసిద్ధమైనవి.

క్రీ.పూ. ఆశ్రమాలు స్థాపించిన ఋషులు సహనంతో, పట్టుదలతో ప్రచారం సాగించి స్థానికులలో వైదిక సంస్కృతి పట్ల ఆదరము కలిగించినారు. చాలా సందర్భాల్లో స్థానిక మత విశ్వాసాలతో, ఆచార వ్యవహారాలతో వైదిక మతం సమాధాన పడింది. దాని కారణంగా జాతి సమ్మేళనం, సాంస్కృతిక సమన్వయం ద్వారా విస్తరణ జరిగింది. జాతక కథల వల్ల వైదిక క్రతువుల పట్ల స్థానిక ప్రజలకు ఆసక్తి కలిగిన విధంగానే దక్షిణ దేశంలో వర్ణవ్యవస్థ ఏర్పడింది. స్థానిక ప్రభువులు క్షత్రియులైనారు, పూజారులంతా బ్రాహ్మణులైనారు. వారికి మహర్షి గోత్ర –ప్రవరలలో స్థానమేర్పడింది. క్రీ.పూ. 500 ప్రాంతాలలో అపస్తంభుడు గోదావరి ముఖ ద్వారాన నివసిస్తూ సాంఘిక –సమాజ – సంబంధాల మనుగడకై ఆచరణ సూత్రాలను రూపొందించి, వాటిని అదర్వణ వేదంలో చేర్చి వాటికి ఉన్నత ప్రతిపత్తిని చేకూర్చాడని బూలర్ – కాణే మొదలగు పండితులు నిర్ణయించారు. కాత్యాయనుడు, కౌటిల్యుడు కూడా దక్షిణాత్యులేననే

సంప్రదాయం ఉందని "ఆంధ్రుల చరిత్ర" (డా. బి.యస్.ఎల్ హనుమంతరావు)గ్రంథం తెలుపుతోంది.

గౌతమబుద్ధుడే స్వయంగా ధాన్యకటకము దగ్గర "కాలచక్ర తంత్రము" ప్రవర్తింపజేసినాడని, "ధారుణల" నాతడు నిక్షేపం చేశాడు కాబట్టి ధరణికోట అయింది. బౌద్ధ గ్రంథాలలోని "బావరి", "మహాకాత్యాయన" వృత్తాంతాలను బట్టి బుద్ధుని కాలంలోనే బౌద్ధం ఆంధ్రంలో ప్రవేశించించీంది. భట్టిప్రోలు శాసనలిపి అశోకుని కాలంనాటి దక్షిణాది బ్రాహ్మి అని బలమైన అభిప్రాయం. ధాన్యకటకంలో అశోకుని స్తంభ శాసన శకలం దొరికింది. భట్టిప్రోలు మరియు ధాన్యకటకాలలో లభించిన సాక్ష్యం వల్ల అశోకుని కాలానికన్నా ముందే ఆంధ్రప్రదేశంలో బౌద్ధం వ్యాప్తి చెందనదని చెప్పవచ్చు.

సింహళంలో ప్రచారంలో ఉన్న బుద్ధుని దంతగాథల వల్ల ఉత్తరదేశం నుండి సింహళానికి వెళ్ళే నౌకా మార్గంలో ఆంధ్రదేశం బుద్ధుని మజిలీ స్థలంగా తెలుస్తుంది. మూడవ బౌద్ధ సంగీతికి క్రీ.పూ. 251 పూర్వమే ఆంధ్రదేశంలో బౌద్ధం జనాదరణ పొందినట్లు ధాన్యకటకంలో ఇటీవలి త్రవ్వకాలలో లభించిన పురావస్తు సాక్ష్యం లభిస్తుంది. అశోకుని 13వ శిలాశాసనం ఆంధ్రుల నాటికే "ధర్మాన్ని" అనుసరిస్తున్నట్లు చెబుతుంది. ధాన్యకటకంలో ఇటీవల బయల్పడిన శాసనాన్ని బట్టి అచట బౌద్ధ బిక్షవులు "వందనామ గోష్టి" ఏర్పడ్డారని తెలుస్తున్నది. అదే శిలపై శిల్పాన్ని విమర్శిస్తూ ఘూష్ సర్కారుల వంటి చరిత్రకారులు "సాంచీ" మరియు "బార్హుత్" శిల్పాలకంటే ప్రాచీనమైనవని అభిప్రాయబడ్డారు.

"కథావత్తు" ను బట్టి మూడవ చౌద్ధ సంగీతలో అంధకులు (ఆంధ్రులు) ప్రముఖ పాత్ర నిర్వహించారని తెలుస్తున్నది. భట్టిప్రోలు శాసనాలను బట్టి అచ్చటి బౌద్ధులు "సింహగోష్టి" నేర్పరచారని తెలుస్తున్నది. "దీపకర్ణి" కథలో శాతవాహనుల జన్మస్థలాన్ని గూర్చి, కులాన్ని గూర్చి చారిత్రక అంశాలు ఉన్నాయి. శివమక సద శాసనం అమరావతిలోను, నాణేలు, చేబ్రోలు (గుంటూరు నుండి 5 కి.మీ)లోను, వడ్డమాను (తుళ్ళూరు నుండి 4 కి.మీ)లోను ముద్రిక రామతీర్థంలోను దొరికాయి. శ్రీసద శాసనం గుంటుపల్లి (విజయవాడ నుండి 8 కి.మీ)లో బయల్పడింది. హారతి పుత్ర మానసద శాసనం వేల్పూరులో ఉంది. మానసద మరియు మహాసద నాణేలు వడ్డమానులో లభించాయి. దీపకర్ణి కథలోని సాతుడే శాతవాహన రాజులకు మూలపురుషుడు. కృష్ణా ముఖ ద్వారా భూమి వీరి జన్మస్థలం. ఆంధ్ర శాతవాహన రాజులలో శ్రీమఖుడు ఆద్యుడు. శ్రీ యజ్ఞశాతకర్ణి శాతవాహనులలో చివరివాడు. ఈతని కాలంలో నాగార్జునుడు ధాన్యకటక మహాస్థూపానికి శిలా ప్రాకారం నిర్మించాడని, టిబెట్ మరియు చైనా చరిత్రకారులు రచనలను బట్టి తెలుస్తుంది.

మొదటి శాతకర్ణి తరువాత శాతహహనుల కాలంలో పౌరాణిక మతానికి ఆదరణ ఎక్కువైంది. ఉన్నత గోత్రజులైన బ్రాహ్మణులు శాతహవానులతో వివాహ సంబంధాలు చేసినట్లు కనిపిస్తున్నది. ఈ మతానికి చతుర్విధ పురుషార్థాలు (ధర్మ, అర్థ, కామ, మోక్ష), కర్మ సిద్ధాంతంలో విశ్వాసం, వర్ణ వ్యవస్థ, వ్రతతీర్థాటనులు, భక్తి అంటే శివుని గాని, విష్ణువుని గాని పూజించడం ముఖ్య లక్షణం. ఈ వైదిక మతానికి ఆగమ పురాణాలు ప్రామాణికలైనాయి. గుడిమల్లం శివలింగం (చిత్తూరు జిల్లా) క్రీస్తుపూర్వానిదని, సప్తశతి శివ ప్రార్థనతో ప్రారంభమవుతుందని పౌరాణిక వాఙ్మయం పెరగటానికి తార్కాణం. శాతవాహన చక్రవర్తులు బౌద్ధాన్ని ఆదరించపోయినప్పటికీ బాలశ్రీమినహాయించి శాతవాహన రాణులు కూడా బౌద్ధాన్ని పోషించలేదు. వాస్తవానికి ఆంధ్రదేశంలో బౌద్ధం ప్రజా ఉద్యమంగా విస్తరిల్లింది. నాటి శాసనాల వల్ల వర్తకులు, పాఠక జనం స్త్రీజనం బౌద్ధాన్ని పోషించినట్లు మరియు స్థూప, చైత్య విహారాదులు నిర్మించినట్లు తెలుస్తున్నది. శ్రీయజ్ఞశ్రీ శాతకర్ణి నాగార్జునుని పోషించాడని ఇతిహ్యం.

బౌద్ధం భౌగోళికంగా విస్తరిస్తూ స్థానిక ఆచారాలతో సమాధానపడినందున బౌద్ధులలో విభేదాలు ఏర్పడి సంఘం విడిపోవడానికి కారణం అయ్యింది. రెండో సంగీతిలోనే విభేదాలు బలపడి సంఘం "థేరవాద" మరియు "మహా సాంఘిక" శాఖలుగా విడిపోయాయి. దేవరవాదులు సనాతులు అని చెప్పవచ్చు. ధాన్యకటకం ప్రథమం నుండి మహాసాంఘిక కేంద్రమయ్యింది. అమరావతి శాసనాలలో చైత్యకుల ప్రస్తావన ఎక్కువ, మహా సాంఘికులనే చైత్యకులంటారు. బుద్ధునికి మొదటగా "లోకోత్తర" గుణాలను ఆపాదించిన వారు చైత్యకులే. ఈ నూతన భావం ఫలితంగానే "బోధివృక్షం", "ధర్మచక్రం", "సింహాసనం", "త్రిరత్నం" మరియు "చైత్యము" మొదలైన బౌద్ధ చిహ్నాలను ఆరాధించడం మొదలయ్యింది. చైత్యాలంకరణ, చైత్యపూజ, చైత్యకవాదుల ముఖ్య లక్షణాలు. చైత్యకులలో "పూర్వశైల" (ధాన్యకటక), "అపరశైల" (శ్రీపర్వతం), "ఉత్తరశైల" (జగ్గయ్యపేట), రాజగిరిక (గుంటుపల్లి) మరియు సిద్ధార్థక (గుడివాడ) శాఖలేర్పడినాయి. ఒక్క అపరశైల తప్పించి అన్నీ ఇప్పటి అమరావతి లోనివే.

నాగార్జునుని బోధనలు ఫలించిన చోట...

కొంతకాలం తరువాత మహాసాంఘిక చైత్యక సిద్ధాంతాలే క్రమంగా "మహాయానానికి" దారితీశాయి. మహాయానానికి ప్రామాణికమైన "ప్రజ్ఞాపారమితాశాస్త్రం" ఆంధ్ర బౌద్ధుల కృతమే. మహాయానాన్ని నిర్దిష్టమైన దర్శనంగా రూపొందించినది నాగార్జునాచార్యుడే. చైనా ప్రచారం ప్రకారం నాగార్జునుడు శ్రీ పర్వత –ధాన్యకటకాలకు మధ్య నున్న గ్రామంలో జన్మించాడు. వేద వేదంగాల విద్యలనభ్యసించిన తరువాత నాగార్జునుడు బౌద్ధం స్వీకరించాడు. దేశాటనం చేసి నలంద మొదలగు విద్యా కేంద్రాలలో అపార విజ్ఞానం సాధించి, శ్రీ పర్వతంలో స్థిరపడినాడు. తార్కిక శక్తితో మాధ్యమిక వాదము మరియు శూన్యవాదము ప్రతిపాదించి మహాయానాన్ని స్వయం సంపూర్ణమైన సిద్ధాంతంగా రూపొందించాడు. ప్రజ్ఞాపారమిత శాస్త్ర టీకా, మధ్యమిక కారికా, రత్నావళి, సుహృల్లేఖాది గ్రంథాలను నాగార్జునుడు వ్రాశాడు. ధ్యాన్యకటక మహా చైత్యానికి శిలాప్రాకారాన్ని నాగార్జునుడు నిర్మించినట్లు టిబిటెన్ ఐతిహ్యాల వల్ల తెలుస్తున్నది. భారతీయ తత్వ శాస్త్రానికి నాగార్జునుడే పితామహుడనవచ్చు. నాగార్జునుని శూన్యవాదము శంకరుని మాయావాదానికి మార్గదర్శి.

శాతవాహన యుగంలో విద్యల్లో, భాషల్లో విశేష పరిశ్రమ జగిగింది. శబ్ద, అర్థ, గణక, న్యాయవ్యవహార, విధి, లేఖ, రూప మరియు గాంధర్వ విద్యలలో శాతవాహనులు ప్రవీణులు. బ్రాహ్మణ గృహాలే గురుకులాలయ్యాయి. కంఠస్థం చేయడమే విద్యార్జన విధానం. ఇక ప్రతి బౌద్ధ విహారము ఒక పెద్ద విద్యాలయము అయ్యింది. ధాన్యకటక శ్రీ పర్వతాలలో విశ్వవిద్యాలయాలుండేవని ధాన్యకటక విశ్వవిద్యాలయం నమూనాగానే "లాసా" (టిబెట్) లోని విద్యాలయం నిర్మాణమయ్యిందని టిబెట్‌లో ప్రచారంలో ఉన్న సంప్రదాయం. అమరావతి బౌద్ధ విహారంలో మత విద్యలతో పాటు తర్కం, శబ్దం, జ్యోతిష, సాముద్రిక శాస్త్రాలలో కూడా పరిశ్రమ జరిపేవారు. ఆంధ్రదేశంలో జాతక, అవదాన కథలు బహుళ ప్రచారం పొందినట్లు అమరావతి శిల్పాలు చాటుతున్నాయి.

వాసిరెడ్డి రాజావెంకటాద్రి నాయుడు పరిపాలనలో ఆయన బౌద్ధానికన్నా వైదిక మతం వైపు ఎక్కువ మక్కువ చూపించినట్లు తెలుస్తుంది. అమరావతి అమరాలయం శివాలయం అని బ్రాహ్మణులు, కాదు బౌద్ధ స్థూపాన్ని శివలింగంగా మార్చారని బౌద్ధులు వివాదంలో పడినప్పుడు బ్రాహ్మణులు ప్రక్క రాజావెంకటాద్రి నాయుడు మొగ్గు చూపగా బౌద్ధ బిక్షవులు కొన్నిసంవత్సరాలకు ఒక్కరొక్కరుగా అమరావతిని విడిచిపోయినట్లు ఏటుకూరి బలరామమూర్తి గారు వ్రాసిన ఆంధ్రుల సంక్షిప్త చరిత్ర ద్వారా తెలుస్తుంది.

శాతవాహనులు, బౌద్ధుల మధ్య సైద్ధాంతిక విభేదాలు ఉన్నప్పటికీ, వారు చేసిన విద్యాభివృద్ధి కారణంగా గుంటూరు జిల్లా విద్యల్లో ముందుండేది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ 1956లో జరిగినప్పుడు గుంటూరు జిల్లాలో ఎన్ని విద్యాలయాలు ఉన్నవో దానికి సమానంగా హైదరాబాద్‌తో కూడుకున్న తెలంగాణా మొత్తంలో కూడా అన్ని పాఠశాలలు లేవన్నది సత్యం.

అమరావతి, తుళ్ళూరు, తాడికొండ, మంగళగిరి, గుంటూరు, సంగం జాగర్లమూడి, తెనాలి, సత్తెనపల్లి, విజయవాడ మొదలగు జిల్లా పరిషత్ పాఠశాలల్లో చదువు అద్భుతంగా ఉండేది. ఆర్థిక అసమానతలు ఉన్నప్పటికీ బౌద్ధమత ప్రచార పుణ్యమా అని ఆ ప్రదేశాలలో చాలా వరకు కమ్యూనిస్టులే ఉన్నారు. అప్పట్లో తుళ్ళూరు, అమరావతి, సత్తెనపల్లి, మంగళగిరి, తాడికొండ, పెదకూరపాడు, తెనాలి, విజయవాడ, గన్నవరం, ఉయ్యూరు , పామర్రు కమ్యూనిస్టులకు ఆయువుపట్టుగా ఉండేది.


చారిత్రాత్మకంగా చూసుకున్నా, వాస్తుపరంగా చూసుకున్నా, నవ్యాంధ్రకు నడిబొడ్డున ఉన్న ప్రాంతాన్ని మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వర్ణాంధ్రప్రదేశ్‌కు ముఖ్యపట్టణంగా నిర్ణయించడం, దానికి అమరావతి అన్న పేరును ఎన్నుకోవడం శ్లాఘనీయం.

– డా.తాళ్ళూరి మనవాళ్ళ సూరి

తుళ్ళూరు జిల్లా పరిషత్ హైస్కూల్ మాజీ విద్యార్థి

(1963 –1969)

చిన్ని పుస్తకం–పెద్ద ప్రయోజనం!



చాసో కథలూసాంస్కృతిక పదకోశం, కూర్పు: డా. చాగంటి తులసి, 106 పేజీలు, వెల: రూ.80., చాసో స్ఫూర్తి ప్రచురణ, విజయనగరం.

దాదాపు అర్ధ శతాబ్దం పాటు తెలుగులో చిన్న కథకి పెద్ద దిక్కుగా ఉండి, రెండు దశాబ్దాల కిందట వెళ్లిపోయిన చాగంటి సోమయాజులు మహాశిల్పి. ఆయన అక్షరాలను అక్షరాలా చెక్కుతారు. కథలో సన్నివేశాల క్రమాన్ని నిర్దేశించడంలో ఆయనది అంతా దాపుడు శిల్పం. ఆయన కోరుకున్నప్పుడే, ఆయన కోరుకున్న రీతిలోనే కథ మన కళ్లముందు ఆవిష్కృతమవుతుంది. పాత్రల మానసిక వ్యాపారాన్ని చిత్రించడం, నిజానికి చిత్రిక పట్టడంలానే సాగుతుంది. ఇక, భాష ఆయన చెప్పుచేతల్లో ఒద్దికగా, ఒళ్లు దగ్గిరెట్టుకుని మరీ ప్రవర్తిస్తుంది. 'ఆమెత'లాంటి అరుదయిన శీర్షికలు పెట్టడం మొదలుకుని 'చెప్పకు చెప్పకు'లో మాదిరిగా కథను అబ్రప్ట్‌గా –మన దృష్టిలో– స్నాప్ చెయ్యడం వరకూ బాహ్య శక్తుల ప్రమేయాన్ని ఏమాత్రం సహించని నిరంకుశ రచయిత చాసో. నిజానికి మన రచయితల్లో మూడుమ్ముప్పావు వంతుల మంది నిరంకుశులే. ఎటొచ్చీ, వాళ్లల్లో ఎవరూ చాసో మాదిరిగా మహాశిల్పులు కారనేది వేరే కథ!

